# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 13 సంచిక : 9 హైదరాబాద్ 170 సెప్టెంబర్ 2015 పేజీలు : 68 రు. 20

- 'బంగారు తెలంగాణ'లో దళితులు
- ఆంధ్రప్రదేశ్ పాలనలో కులం - రాజకీయం
- అడుగంటుతున్న గ్రామీణ భారతం
- యాకూబ్ మెమన్ ఉరిపై వ్యాసాలు
- డా. రామనాథం హత్య - ముప్పై ఏళ్లు
- అదనపు విలువ గురించి మార్క్స్
- టర్కీ పరిణామాల్లో కుర్దుల భవిష్యత్తు

# ఆంధ్రప్రదేశ్ వీక్షణం రచయితల సమావేశం


**సెప్టెంబర్ 6, ఆదివారం, డిటిఎఫ్ ఆఫీస్, 1/12, బ్రాడీపేట, గుంటూరు.**

ప్రాంతీయ, దేశీయ, అంతర్దేశీయ పరిణామాలపై అవగాహనలను, తెలుగు సమాజం తనతో తాను జరుపుతున్న సంభాషణను పదమూడు సంవత్సరాలుగా అక్షరబద్ధం చేస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం ప్రతి సంవత్సరం తన రచయితలతో, అభిమానులతో సంభాషణకు కూడ వేదిక కల్పిస్తున్నది. వీక్షణం ఎనిమిది సంవత్సరాల కింద ఈ వార్షిక రచయితల సమావేశం ప్రారంభించింది. వీక్షణం రచయితలు, పాఠకులు, అభిమానులు, సిబ్బంది కలిసి కూచుని వీక్షణంలో అచ్చవుతున్న రచనల గురించీ, అచ్చు కావలసిన అంశాల గురించీ చర్చించుకోవడానికి, పత్రిక వెలువడుతున్న తీరు గురించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు పంచుకోవడానికి, గతాన్ని సమీక్షించుకుని భవిష్యత్తుకు మార్గాలు వేసుకోవడానికి ఈ సమావేశాలు జరుగుతున్నాయి. రాష్ట్ర విభజన తరువాత ఈ వార్షిక సమావేశం తెలంగాణలో మార్చ్ 8న హైదరాబాద్‌లో జరిగింది. అదే వరుసలో ఆంధ్రప్రదేశ్ సమావేశం సెప్టెంబర్ 6, ఆదివారం గుంటూరులో జరుగుతుంది. డిటిఎఫ్ ఆఫీస్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుంది.

ఇప్పటికే వీక్షణంలో రచనలు చేసినవారు, రచనలు చేయదలచుకున్నవారు, పాఠకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు - మొత్తంగా తెలుగు సమాజ జీవితం గురించి, ప్రజల గురించి ఆలోచించే ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి ఆహ్వానితులే.

పాల్గొనదలచినవారు అదనపు సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి ఫోన్ చేయగలరు.
ఫోన్ నం. 040-66843495, 9949391028

## చలసాని ప్రసాద్ రచనల పునర్ముద్రణ




**చలసాని ప్రసాద్**
**సాహిత్య వ్యాసాలు**

**పేజీలు 196** **వెల 100**




**చలసాని ప్రసాద్**
**రచనలు**

**పేజీలు 228** **వెల 100**

ప్రతులకు:
**డి.వి. రామకృష్ణారావు**, ఎంఐజి - 14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ - 500 040.
**వీక్షణం**, 301, 3-6-394, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29. ఫోన్: 040-66843495

170 ISSN 2231-6892

# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2015
సంపుటి : 13
సంచిక : 9

ఎడిటోరియల్ కలెక్టివ్ : బి.ఎస్. రాజు, ఎ. నర్సింహారెడ్డి, బి. రామకృష్ణ, ఎం. నర్సింహ, వై. భాస్కర్, కె. బాల్‌రెడ్డి, ఎ. రాజేంద్రబాబు, బైరెడ్డి సతీష్, పి. అరవింద, వై. రామచంద్రం, ఎన్. వేణుగోపాల్

| వ్యవస్థాపక సంపాదకులు: | సంపాదకులు: | కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్: | కంపోజింగ్: | అసిస్టెంట్: |
|---|---|---|---|---|
| **వి. హనుమంతరావు** | **ఎన్. వేణుగోపాల్** | **వై. రామచంద్రం** | **సి. రాజశేఖర్** | **ఎస్. వెంకటేష్** |



**అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు**

**తెలంగాణ :** ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎస్.తిరుపతి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య

**ఆంధ్రప్రదేశ్ :** అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని వరంగల్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్న వారు ఎస్. వెంకటేశ్)

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

**వీక్షణం**

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

**వీక్షణం చందా వివరాలు**

| | సంస్థలకు / లైబ్రరీలకు | వ్యక్తులకు |
|---|---|---|
| విడి ప్రతి | రు. 20 | రు. 20 |
| సంవత్సరం | రు. 240 | రు. 200 |
| మూడు సంవత్సరాలు | రు. 600 | రు. 540 |
| ఐదు సంవత్సరాలు | రు. 1000 | రు. 900 |
| పది సంవత్సరాలు | రు. 2000 | రు. 1700 |

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌పై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

**వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2015 జూలై నెలలో వచ్చిన విరాళాలు - ఉప్పల గోపాలరావు, కూకట్‌పల్లి, హైదరాబాద్ - రు. 1000, డా. జి. ఆర్. చంద్రశేఖర్, సత్తెనపల్లి, గుంటూరు - రు. 600. మిత్రులందరికీ కృతజ్ఞతలు. - సం.**

ట్రాట్స్కీ 'ద్రోహం' గురించి నేను రాసిన లేఖకు రచయిత వద్ద నుండి వివరణ వస్తుందని ఆశించాను. గూడ శ్రీరాములు రాసిన సుదీర్ఘమైన సమాధానంలో నేను చేయని ఆరోపణలు చేసినట్లు రాశారు. సాహిత్యం, కవిత్వం ఇత్యాది విషయాల ప్రస్తావన ఇందులో ఎందుకో కూడ తెలియదు.

లెనిన్ శాశ్వత విప్లవాన్ని కేవలం ఒకసారి వ్యతిరేకించాడు అని నేను రాయలేదు. లేఖను మరొకసారి చూడవచ్చు. డ్యుశ్చేర్ జీవిత చరిత్ర రాయడం వల్ల ఆయన రచనలు అబద్ధాలు కావు. కేవలం సంఘటనలు చెప్పుకుంటూ పోతే డ్యుశ్చేర్‌కు వ్యతిరేకంగా అదే ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో యూరప్ / యుఎస్‌ఎకు వెన్నుదన్నుగా ఉన్న ఇసయా బెర్లిన్ వంటి మేధావులు చేసిన కుట్రలు చెప్పవచ్చు. దానివల్ల ఈ వివాదంలో నిరూపించేది ఏమి ఉండదు.

నేను లెనిన్ అంతిమ లేఖ అని రాశాను. 'లేఖలు' అని రాయలేదు, గమనించ గలరు. వీరు సుదీర్ఘంగా ప్రస్తావించిన సోర్సెస్‌కు ధన్యవాదాలు. వాటిని చదివి సమాధానం చెప్పవచ్చు. కాని అవి డ్యుశ్చేర్‌కు ఎలా సమాధానమో మచ్చుకి వివరిస్తే సరిపోతుంది. చివరగా స్టాలిన్ షో ట్రయల్స్ గురించి ప్రస్తావిస్తే, స్టాలిన్ వల్లే సోవియట్ యూనియన్ బలంగా నిలిచింది అని రాశారు. అది, దాని చుట్టూ ఉన్న సమాజాలు, స్టాలిన్‌ను చివరి వరకు సమర్థించి, కృశ్చేవ్‌ను వ్యతిరేకించిన అల్బేనియా వంటి దేశాలతో పాటు కూలిపోయిన విషయం తెలియదు. నేను లేఖలు అని రాయకపోయినా లెనిన్ స్టేట్‌మెంట్ ఒకేసారి రాసింది కాదు కాబట్టి 'లేఖలు' అనడంలో అభ్యంతరం లేదు. అదే స్టేట్‌మెంట్‌లో, స్టాలిన్ గురించి రాసింది పక్కన బెడితే, ట్రాట్స్కీ గురించి లెనిన్ రాసింది '*on the other hand Com. Trotsky, as was proved by his exceptional abilities. Personally, he is to be sure the most able man in the present Central Committee. But also by his too far reaching self-confidence and a disposition to be much attracted by the purely administrative side of affairs.*' స్టాలిన్ అధికారాన్ని కుదించాలని, కేంద్ర కమిటీని విస్తరించాలని లెనిన్ చేసిన ప్రతిపాదనలు పార్టీ కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా, లెనిన్ స్టేట్‌మెంట్‌ను బహిరంగ చర్చకు పెట్టకుండా అడ్డుకుంది స్టాలిన్ నాయకత్వం కాని ట్రాట్స్కీ కాదు.

ఇక చరిత్ర మురుగును కెలకడం, మార్క్సిస్ట్ ఇంటర్‌నెట్ ఆర్కైవ్స్‌లో చూడడం లాంటి విషయాలకు వస్తే నేను కేవలం వాటి మీదే ఆధారపడలేదు, యుకె, యుఎస్‌ఎ, ఫిలిప్పీన్స్, పాకిస్థాన్ దేశాలలో కార్యకర్తల నుండి స్వీకరించింది కూడా ఉంది. ఏకధృవ ప్రపంచంలో విప్లవం ముందుకు సాగాలంటే స్టాలిన్ = ట్రాట్స్కీ వివాదాన్ని ముగించాలన్నదే నేను వాదిస్తున్నది. స్టాలినిస్ట్ ప్రభావంతో నడవాలా, ట్రాట్స్కీయిస్ట్ మార్గమా అన్నది ప్రశ్న. వీటిలో గుణ దోష విచికిత్స చేసి ఇరవై ఒకటవ శతాబ్దపు విప్లవ సంస్థను నిర్మించాలంటే ఆ వివాదాన్ని పరిష్కరించకుండా సాధ్యం కాదు.

ఇక లెనిన్ ట్రాట్స్కీని నిందించిన లేఖల కాలం బోల్షివిక్, మెన్షివిక్ ఫంక్షనల్ నడుమ ఘర్షణ లోతులు గ్రహించని కాలంలో ట్రాట్స్కీ సాధ్యం కాని ఐక్యతకోసం ప్రయత్నించి అన్ని గ్రూపుల చుట్టూ తిరిగాడు. తాను ఆ విషయంలో పొరపడ్డానని ఆ విషయంలో ట్రాట్స్కీ అంగీకరించాడు. ఇక సి. అలెన్ పుస్తక సమీక్ష కూడా చూశాను. మరి ఆ సమీక్ష ఆధారంగానైనా డ్యుశ్చేర్ వాదనలు, వివరాలలో పొరపాటు వాదనను తిరస్కరించడానికి ఆధారం కాకుండా, తప్పని వారు నిరూపిస్తే సంతోషం.

ఇండియాలో ఉన్నవారికి అనుభవంలోకి రాకపోవచ్చు గాని, పశ్చిమ సమాజాల్లో వామపక్ష ఉద్యమాలు స్టాలిన్ సమస్యను అనునిత్యం ఎదుర్కోవలసి ఉంటుంది. స్టాలినిస్ట్ రాజ్యాల నుండి శరణార్థులుగా వచ్చిన వారు, వారి సంతతి కార్యకర్తలకు నిత్యం ఎదురవుతూ ఉంటారు. రష్యన్ విప్లవం వైఫల్యం, దాని కారణాలు, పశ్చిమ సమాజాల్లో కేవలం డ్యుశ్చేర్‌ను చదివి తెలుసుకునేవి కావు. నిత్యం చర్చల్లో, పాలిమిక్స్‌లో ముందుకు వచ్చే విషయాలు.

ఆఖరికి సుత్తి కొడవలి గుర్తు ఉన్న జెండాను కూడా వామపక్ష సంస్థలు ప్రదర్శించకపోవడానికి కారణం, ఆ జెండా చాలా మంది మనసుల్లో స్టాలిన్ పాలనతో ముడిపడి ఉండటమే.

**– నరేంద్రమోహన్**
ఆస్ట్రేలియా

వీక్షణం గత సంచికలో జనాన్ని పుష్కరాల్లో ముంచిన వ్యాసంలో పుక్కిటి పురాణాల డొల్లతనాన్ని, అశాస్త్రీయ భావాలను చాలా వివరంగా చెప్పారు. ఇది వరకు అడవులలో అనేక ఔషధ మొక్కలు ఉండడం వల్ల వాటి గుణాలు కలుపుకొని నది నీళ్లు ఒక మెడిసిన్‌గా పనిచేస్తాయి, ఆరోగ్యానికి మంచిదని ఒక మోస్తరుగా అంగీకరించవలసిందేనని, రక్తశుద్ధి జరుగుతుందని అనేది పాక్షికంగానైనా నిజమే అని రచయిత రాశారు. ఇది సరికాదు. రక్త శుద్ధి జరగడం పాక్షికంగా కూడా నిజం కాదు. నీటిని భక్తికీ, పుణ్యానికీ, పాపాలు పోవడానికీ పనికొస్తుందని ముడిపెట్టారు. మతం, ఆయుధం, మత విమర్శ అన్ని విమర్శలకు నాంది అంటారు కారల్‌మార్క్స్. కాని మన దేశంలో మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించేటపుడు; ఈ అంశాన్ని కమ్యూనిస్టులు తమ ఎజెండాలో చేర్చలేదు. మతం కమ్యూనిజం ఒకే తానులో ముక్కలుగా కలిసిపోయాయి. పాత భావాల పునాది మీద నూతన సమాజాన్ని నిర్మించలేమన్న అంబేద్కర్‌ను అర్థం చేసుకోవాలి. పుష్కరాల నిర్వహణ వలన రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు విజయం సాధించారు. భక్తి మాఫియా రాజ్యమేలింది. ఈ మాఫియాలో ప్రధాన భాగస్వాములు పీఠాధిపతులు, ప్రవచనకారులు, మీడియా, ప్రభుత్వం. భక్తి పేరిట ప్రజలను ఒక రకంగా మానసిక రోగులుగా మార్చి వేశాయి. రెండు రాష్ట్రాలు ప్రజల సొమ్ము రు. 2,300 కోట్లు హాయిగా ఖర్చు చేశారు. సైంటిస్టులు, కమ్యూనిస్టులు మౌనంగా మద్దతు తెలిపారు. బ్రాహ్మనిజం ముందు అందరూ తలవంచవలసిందే. ఇది అప్రకటిత రాజ్యాంగం. దీని అమలుకు ఆయుధం అక్కరలేదు. ఇది సెక్యులర్ రాజ్యాంగం పేరుతో అమలు జరుగుతున్నదే. భారత రాజ్యాంగ అధికరణ 51 ఎ (ఎచ్) ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని, మానవత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ కర్తవ్యం. కాని ఇది కాగితాలకే పరిమితమైంది.

**– తుంపాల శ్రీరామమూర్తి,**
విశాఖపట్నం

(ఆగస్టు సంచిక 'లెనిన్ – ట్రాట్స్కీ వివాదంపై వివరణ' వ్యాసంలో ఎస్‌విఎస్ నాగభూషణం అని పొరపాటుగా అచ్చయింది. ఎన్‌విఎస్ నాగభూషణ్‌గా చదువుకోవాలి. జూన్ సంచికలో నరేంద్రమోహన్ రాసిన ఉత్తరంపై స్పందిస్తూ గూడ శ్రీరాములు రాసిన ఉత్తరంలో పొరపాటుగా ఆరు లేఖలు అని రాశారు. ఆఖరు లేఖ అని చదువుకోవాలి. – సం.)

**రచయితలకు సూచన :** తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు.

మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు.

– సం.

# అబద్ధాల, అతిశయోక్తుల ఆగస్ట్ 15 ప్రసంగం

వీక్షణం

దేశ ప్రధానమంత్రి ప్రతి ఆగస్ట్ 15న ఢిల్లీలో ఎర్రకోటపై జెండా ఎగరేసి, దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం అనే మొక్కుబడి తతంగం ఒకటి ఉంది. ఆ రోజున బ్రిటిష్ పాలన అంతమై, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే అబద్ధం పునాది మీద ఈ తంతు అరవై ఎనిమిది సంవత్సరాలుగా జరుగుతున్నది. ఒక్క బ్రిటన్ పాలన కనబడకుండా పోయిందేమో గాని, కనీసం అరడజను సామ్రాజ్యవాద ప్రభుత్వాలు, వాటన్నిటికీ పెద్దన్నగా అమెరికా ప్రభుత్వం, కొంతకాలం సోవియట్ యూనియన్ ప్రభుత్వం, కనుసన్నల్లో కాకుండా భారత పాలకవర్గాలు స్వతంత్రంగా ప్రవర్తించిన సందర్భం ఈ అరవై ఎనిమిది ఏళ్లలో ఉన్నదా అనుమానమే. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రత్యక్ష పాలన కనబడకుండా పోయినా, రవి అస్తమించని బహుళ జాతి సంస్థల కింద సామంతులుగా కొనసాగుతున్న పాలకవర్గాలు ప్రజలను భ్రమల్లో ముంచడానికి ఇటువంటి అబద్ధపు పండుగలు చేయడం నేర్చుకున్నాయి.

ఇది మొక్కుబడి తతంగమే అయినప్పటికీ ఈసారి ప్రసంగంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆడిన అబద్ధాలు, చెప్పుకున్న అతిశయోక్తులు, చేసుకున్న ఆత్మస్తుతి, పరనింద హాస్యాస్పద స్థాయిలో ఉన్నాయి. తమ పార్టీకి చెందిన కేంద్ర మంత్రుల, రాష్ట్ర ముఖ్యమంత్రుల అవినీతి అక్రమాల కుంభకోణాలు ఒకటొకటిగా బైటపడుతుంటే ఆయన ఎర్రకోట మీది నుంచి వల్లించిన నీతి భాష్యాలు వినడం అసహ్యకరంగా ఉంది. పద్నాలుగు నెలల కాలంలోనే ఆబగా, పోతే దొరకదన్నట్టుగా ఒక్కొక్క పాలనా వ్యవస్థనూ బలహీనపరుస్తూ, విధ్వంసం చేస్తూ వచ్చి ఎర్రకోట మీద నిలబడి ప్రకటించిన ధర్మపన్నాలు వింటుంటే ఆ నవరస నటనకు ఆశ్చర్యం కలుగుతున్నది.

దేశంలోని నూట ఇరవై ఐదు కోట్ల మంది ఐక్యంగా ఉన్నారట. ఇది టీం ఇండియా అట. ఈ టీం ఇండియా బలం ఐక్యత, నిరాడంబరత్వం, సోదరత్వం, సామరస్యం అట. ఆ బలాన్ని కులతత్వ విషం, మత ఛాందసవాద విషం చెడగొడతాయట. అందువల్ల కులతత్వాన్ని, మతవిద్వేషాన్ని ఎప్పుడూ దరి జేరనీయగూడదట. కులతత్వాన్ని సమర్థించే హైందవ బ్రాహ్మణ్య పాలకవర్గాల ప్రతినిధి, మనుధర్మ ప్రచారక సంఘపరివార్ నాయకుడు, మత విద్వేషంతో వేలాది మందిని ఊచకోత కోసిన మారణహోమానికి పురోహితుడు ఇలా మాట్లాడితే భాషకే అవమానం. కులతత్వ, మతతత్వ విషాలకు విరుగుడుగా తాను అభివృద్ధి అనే అమృతాన్ని తెస్తున్నాడట. ఆ రెండు విషాల తయారీదారే ఇవాళ అభివృద్ధి పేరిట మరొక విషాన్ని తీసుకువస్తూ అది ఆ రెంటికీ విరుగుడు అనడం ఎంత హాస్యాస్పదం. ఎంత విషాదం.

మోడీ చెపుతున్న టీం ఇండియాలో ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, స్త్రీలు, వెనుకబడిన కులాలు, భిన్నాభిప్రాయాలు గలవాళ్లు ఉండడానికి అవకాశం లేదు. నిజానికి ఆ వర్గాలన్నిటిమీద ఈ పదిహేను నెలల్లో ప్రత్యక్ష పరోక్ష దాడులు సాగిస్తున్న పాలనావ్యవస్థ అగ్రాసనాధిపతిగా మోడీ భారత ప్రజల ఐక్యత గురించి మాట్లాడడం హాస్యాస్పదం.

తన టీం ఇండియాలో పాల్గొనే భారతీయ పౌరుల గురించి చెపుతూ మోడీ వాళ్లు తాను సృష్టించిన వెబ్ సైట్ లో, తనకు రాస్తున్న లక్షలాది ఉత్తరాలలో, తాను సంభాషిస్తున్న మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో రోజురోజుకూ పెరిగిపోతున్నారని అన్నాడు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈ మూడు మార్గాలు - ఎలక్ట్రానిక్ పరికరాలలో వెబ్ సైట్ల వాడకం, ఉత్తరాలు రాయడానికి కావలసినంత అక్షరాస్యత, రేడియో - దేశ జనాభాలో సగానికి కూడ అందుబాటులో లేవు. అంటే సగం జనాభా తన టీం ఇండియాలో లేదని మోడీ చెప్పకనే చెపుతున్నాడన్నమాట.

టీం ఇండియా గొప్పలు అయిపోయాక మోడీ ఈ పదిహేను నెలల్లో తాను సాధించిన విజయాల ఆత్మస్తుతి మొదలుపెట్టాడు. వాటిలో ప్రధానమైనది తాను ఏడాదికింద ప్రారంభించిన ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన కింద ఇన్నాళ్లూ బ్యాంకుల గడప తొక్కనివాళ్లు దేశ జనాభాలో 40 శాతం ఉండేవాళ్లని, వాళ్లకు బ్యాంకు ఖాతాలు తెరుచుకునే అవకాశం వచ్చిందని అన్నాడు. పైసా కూడ జమ చేయకుండానే ఖాతా తెరవడానికి తాను మొదటిసారి అవకాశం ఇచ్చానని, అందువల్ల 17 కోట్ల మంది కొత్త ఖాతాలు తెరిచారని అన్నాడు. పైసా కూడ లేకుండా ఖాతా తెరవవచ్చునని తాను అన్నప్పటికీ ఈ ఖాతాలలో ఇరవైవేల కోట్లరూపాయలు జమ అయ్యాయని అసలు విషయం తన ఘనతగా చెప్పుకున్నాడు. అలా ఇంతవరకూ బ్యాంకు చూడనివాళ్ల దగ్గరినుంచి ఇరవైవేల కోట్ల రూపాయలు లాగి, అవన్నీ పారిశ్రామిక, వ్యాపారవేత్తలు అని చెప్పుకునేవాళ్లకు అప్పుగా ఇచ్చి, వాళ్లు వాటిని ఎగ్గొట్టడానికి వీలు కల్పించాడన్నమాట. ఎంత గొప్ప ప్రజానుకూల పథకం ఇది!

ఆ ఆత్మస్తుతిలో భాగంగానే ఇన్నాళ్లూ పాలించినవారు ఏమీ చేయలేదనే పరనింద కూడ చేశాడు. ప్రజల కోసం ఎవరూ ఏమీ చేయలేదనే వాస్తవం చెప్పాడన్నమాట. ప్రతి ప్రభుత్వమూ పథకాలు ప్రకటిస్తుందని, జ్యోతి ప్రజ్వలనాలు చేస్తుందని, రిబ్బన్లు కత్తిరిస్తుందని కాని అవి అమలులోకి వస్తాయా అనేదే అసలు విషయమని, తన ప్రభుత్వం మాత్రమే అమలులోకి తెస్తున్నదని గొప్పలు చెప్పుకున్నాడు. దేశానికి చెదల లాగ పట్టిన అవినీతి, కుంభకోణాలను నిర్మూలించాలని, తన ప్రభుత్వం ఈ పదిహేను నెలల్లో ఒక్క పైసా అవినీతికి పాల్పడిందనే ఆరోపణ కూడ లేకుండా పాలించిందని అన్నాడు. అంతకుముందు రోజుల తరబడి పార్లమెంటు సమావేశాలు జరగని కారణమే భారతీయ జనతా పార్టీ నాయకులపై అవినీతి ఆరోపణలు. ఆ మర్నాడే నా ప్రభుత్వం మీద ఒక్క ఆరోపణ కూడ లేదు అని మోడీ అన్నాడంటే చెప్పనలవి కానంత దుస్సాహసమూ తెంపరితనమూ దుర్మార్గమూ ఉండాలి. అవన్నీ తన సహజ లక్షణాలని గుజరాత్ పాలనలో మోడీ చేతులకంటిన నెత్తురు ఇంకా చెపుతూనే ఉంది. వీ

# తాగబోయించి తప్పించుకుంటున్న పాలకులు

పదిహేను నెలలు తిరగకుండానే దాదాపుగా అన్ని ప్రజా సమూహాలనూ దూరం చేసుకోవడంలో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం విజయం సాధించింది. బహుశా ఈ పాలనలో సంపూర్ణ సంతృప్తి దొరికినది పోలీసులకు, బహుళ జాతి సంస్థలకు, సంపన్నులకు మాత్రమే కాగా, ఉద్యోగవర్గాలకూ కొంతవరకు కోరికలు నెరవేరాయి. పాలకపక్ష కార్యకర్తలకు ఎక్కడో ఒకచోట ఏవో ప్రయోజనాలు దక్కి ఉంటాయి, లేదా భవిష్యత్తులో దక్కుతాయనే ఆశ ఉంటుంది. స్పష్టంగా ప్రభుత్వ తప్పులూ, ప్రజావ్యతిరేక విధానాలూ కనబడుతున్నప్పటికీ, 'ఇన్నాళ్లుగా మనం కోరుకున్న ప్రభుత్వం', 'మన ప్రభుత్వం'. 'అన్ని గడపల్లోన మా గడప మేలు' వంటి భావోద్వేగాలతో మధ్యతరగతి విద్యావంతులు ప్రభుత్వంతో ప్రయోజనాలు దక్కి కొందరు, దక్కుతాయనే ఆశతో కొందరు సమర్థిస్తున్నారు. అలా ఈ పాలన బాగుందనుకునేవారు ఐదు శాతమో పది శాతమో కాగా, రైతాంగం, కాంట్రాక్టు కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగ యువజనులు, స్త్రీలు, పురపాలక సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది, దళితులు, ఆదివాసులు వంటి ఎన్నో సమూహాలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగమైనప్పటికీ తమ న్యాయమైన కోర్కెలు కూడ నెరవేరడం లేదని అసంతృప్తిలో ఉన్నారు. ఆ అసంతృప్తులను తీర్చడం ఇవాళ కొనసాగుతున్న పాలనా వ్యవస్థలో, ఈ అభివృద్ధి నమూనాతో ఎంతమాత్రమూ సాధ్యం కాదు. అందువల్ల ఈ ప్రభుత్వానికైనా, ఏ ప్రభుత్వాలకైనా మిగిలిన ఏకైక మార్గం అసంతృప్తిని అణచివేసే నిర్బంధ సాధనాలను సమకూర్చుకోవడం. లేదా ప్రజలు ఆ అసంతృప్తిని మర్చిపోయేలా చేసేందుకు వాళ్లకు సర్కస్ లాంటి వినోదమో, మత్తులో జోగే మాదకద్రవ్యాలో సరఫరా చేయడం. చరిత్ర ఎన్నోసార్లు చూపిన ఈ విషయాన్ని తెరాస ప్రభుత్వం మరొకసారి రుజువు చేస్తున్నది. పోలీసులకు గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల కన్న ఎక్కువ అధికారాలు, నిర్బంధ, నిరంకుశ ప్రవర్తనకు అనుమతులు ఇవ్వడం ఒక ఎత్తు. లాఠీచార్జిలు, పోలీసు స్టేషన్లలో చిత్రహింసలు, లాకప్ మరణాలు, వాక్సభా స్వాతంత్ర్యాల మీద ఆంక్షలు, బూటకపు ఎన్‌కౌంటర్లు అన్నిటికన్నీ గత పాలనలకన్న పైస్థాయిలో జరుగుతున్నాయి. అణచివేత ద్వారా కూడ ప్రజా అసంతృప్తిని, ఆగ్రహాన్ని పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదు గనుక ఉద్యమకాలంలో ప్రజలను ఉర్రూత లూగించిన కళాకారులచేత ప్రభుత్వానుకూల ప్రచారాలు చేపట్టారు. అది కూడ అనుకున్న స్థాయిలో ప్రయోజనకరం కాలేదు గనుక ఆరుదశాబ్దాల చరిత్రలో ఎన్నడూ లేనంత దుర్మార్గమైన, ప్రజా వ్యతిరేకమైన, విచ్చలవిడి మద్యం విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రజలందరికీ చౌక మద్యం అందించి, వ్యసనానికి మప్పి, ప్రశ్నలను ఆపగలమను కుంటున్నారు. కాని ప్రజల నిత్య జీవిత సమస్యలకు అర్థవంతమైన శాశ్వతమైన పరిష్కారాలు దొరికితే తప్ప అసంతృప్తి పోదనీ, ఎన్ని చిట్కా వైద్యాలయినా ఆ అసంతృప్తిని తగ్గించజాలవనీ కూడ చరిత్ర అనేకసార్లు రుజువు చేసింది. వీ



# ముసుగు అవసరం కూడ పోయిందా?


గతంలో చంద్రబాబు నాయుడు తొమ్మిది సంవత్సరాల పాలన చూసినవారికి ఈసారి పాలన ఎలా ఉండబోతుందో అనుమానమే లేదు. అయినా తాను మారాననీ, గతంలో చేసిన పొరపాట్లు మళ్లీ చేయననీ ఆయనే బహిరంగంగా చెప్పుకున్నారు గనుక విభక్త ఆంధ్రప్రదేశ్ పాలనలో ఏమైనా మార్పులు ఉంటాయేమోనని ఆశించినవారికి ఆశాభంగం కలుగుతున్నది. బహుళ జాతి కార్పొరేట్ సంస్థల సేవ, సంపన్నుల సేవ, ప్రపంచీకరణ అభివృద్ధి నమూనా వంటి విషయాలలో ఆయన మారడం అసాధ్యం. కాని కనీసం ప్రజలందరికీ కనబడే పాలనా విధానాలలో, ప్రవర్తనలలో కూడ ఆయన ఏ ముసుగులూ వేసుకోదలచుకోలేదని ఇటీవలి ఘటనలు చూపెడుతున్నాయి. మామూలు సందర్భాలలోనైతే ప్రభుత్వ ఆదాయాన్ని హరిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఇసుక మాఫియా జరుపుతున్న అక్రమాలను ఎవరైనా అధికారి అడ్డుకుంటే, ఆ అధికారికి పురస్కారాలు, ప్రశంసలు దక్కాలి. చట్టప్రకారం కళాశాలల్లో రాగింగ్ నిషేధం గనుక రాగింగ్ విషయంలో ఉదాసీనంగా ఉన్నా, స్వయంగా రాగింగ్ ను ప్రోత్సహించినా కళాశాల అధికారుల మీద విచారణ జరిగి, శిక్షలు పడాలి. చదువు పేరుమీద సాగుతున్న ఒత్తిడి భరించలేక లేలేత పసిమొగ్గలు ఆత్మహత్య చేసుకుంటే ఆ కళాశాల యాజమాన్యం మీద విచారణ జరిపి శిక్షలు విధించాలి. కాని అవన్నీ మామూలు సందర్భాలలో మాత్రమే. చంద్రబాబు నాయుడు తేదలచుకున్న నవ్యాంధ్రప్రదేశ్ మామూలు రాష్ట్రంకాదు. ఆయన పాలనాశైలి మామూలు పాలనాశైలి కాదు. ఇసుక మాఫియా నడుపుతున్నదే అధికారపక్ష శాసనసభ్యుడు గనుక అడ్డుకున్న అధికారి మీదనే ముఖ్యమంత్రి కళ్లురుముతారు. అక్రమం మీద విచారణా లేదు, శిక్షా లేదు. విధినిర్వహణ సక్రమంగా జరిపి, అక్రమాన్ని అక్రమం అన్నందుకు అధికారి బోనెక్కవలసివస్తుంది. రాగింగ్ ను నిరోధించని, ప్రోత్సహించిన, అంటే చట్టవ్యతిరేక ప్రవర్తన కనబరచిన కళాశాలాధిపతుల మీద విచారణ జరపడానికి పెద్ద ఉద్యమం అవసరమవుతుంది. చివరికి అంతా తూతూ మంత్రమైపోతుంది. ఆత్మహత్యల్లో పోయినవి ఇద్దరు పదహారేళ్ల చిన్నారి పిల్లల ప్రాణాలే గదా, ఆ ఆత్మహత్యలకు పురికొల్పిన వాతావరణాన్ని తయారు చేసినవారు రాష్ట్రాన్ని కొనగలిగిన, ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రిలా పాలనాచక్రం తిప్పుతున్న విద్యావ్యాపార దిగ్గజం గదా. అటువంటివారి మీద విచారణ జరపడమా? బోనెక్కించడమా? ఇది కేవలం చంద్రబాబు పాలనాశైలి మాత్రమే కాదు, దేశంలోని అన్ని ప్రభుత్వాలూ, పాలకవర్గ ముఠాలూ కూడ కనీస మానవ మర్యాదలు పాటించని స్థితికి దిగజారాయి. తామే రాసుకున్న చట్టాలను పాటించని స్థితికి చేరాయి. తమవారైతే బారాఖూన్ మాఫ్ అనే స్థితికి చేరాయి. ఇటువంటి పాలనాశైలికి స్పందిస్తూనే మాజీ న్యాయమూర్తి మార్కండేయ కట్జూ 'భారతదేశం అనివార్యంగా ఫ్రెంచి విప్లవం వైపు ప్రయాణిస్తున్నట్టున్నది' అన్నారు. ఔనేమో... వీ


# టర్కీ పరిణామాల్లో కుర్దుల భవిష్యత్తు

'ఇస్లాం పరిరక్షణ-పశ్చిమ ఐరోపా తరహా అభివృద్ధి' అనే ప్రచారంతో 2002 తుర్కీ దేశ ఎన్నికల్లో పూర్తి సంఖ్యా బలంతో గెలిచి జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (ఎ.కె.పి) ప్రధానమంత్రిగా యిసిప్ తయ్యిప్ ఇర్డొగాన్ నిరంకుశ పాలనకు 2015 జూన్‌లో ఎన్నికల్లో అడ్డుకట్ట పడింది. దేశ ప్రజల్లో, ముఖ్యంగా కుర్దులు, కార్మికుల్లో ఒక విభాగం, మార్పును కోరుకుంటున్న మేధావులు, ఉద్యోగులు ఇర్డొగాన్ నిరంకుశ పాలనకు విసుగు చెంది అసంతృప్తితో ఇతర రాజకీయ పార్టీలకు ఓటువేశారు. ఏకపక్షంగా ఎవరి సహాయం లేకుండా నాలుగో పర్యాయం అధికారం చేజిక్కించుకుని అధ్యక్ష పాలనను స్థాపించాలనే ఇర్డొగాన్ ఆలోచనకు విఘాతం కల్గింది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి, ముందుగా రిపబ్లికన్ ప్రజా పార్టీ (సిహెచ్‌పి)తోను, తరువాత మితవాద జాతీయ పార్టీ తోనూ బేరసారాలకు దిగినప్పటికీ వాటి వేటి తోనూ పొత్తు కుదరలేదు. ఎకె పార్టీని తిరిగి అధికారంలో ప్రతిష్టించాలంటే 276 సీట్లు కావాలి. 330 సీట్లు తమ ఖాతాలో ఉంటె రాజ్యాంగాన్ని తిరగ రాసి తను తిరుగులేని అధ్యక్షుడుగా, తన పార్టీ ఫాసిస్ట్ పరిపాలన నిరంతరంగా కొనసాగించవచ్చుననే మహా ప్రణాళికకు కుర్దు ప్రజలు, అభ్యుదయ వాదులు, ఎచ్‌డిపి పార్టీ, ఇరాక్-టర్కీ సరిహద్దులో ఉన్న కుర్దులు, వారిని ప్రజా యుద్ధంలో నడిపిస్తున్న పికెకె తదితర వామపక్ష, శాంతి కాముక ప్రజలు పెద్ద అడ్డుగోడై నిలిచారు. కుర్దులు స్వతంత్ర మనుగడకోసం ఎన్నో దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఎందరో వీర వనితలు ఎక్కడికక్కడ ప్రాంతీయ గెరిల్లా పోరాట దళాలను ఏర్పరచుకుని తమ తమ ప్రాంతాలను శత్రు మూకల దాడుల నుండి ప్రాణాలొడ్డి కాపాడుకుంటున్నారు. ఎప్పుడైతే తన పన్నాగం పారలేదో, పారే అవకాశం సన్నగిల్లి పోయిందో ఇక ఇర్డొగన్ అన్ని ముసుగులు తొలగించుకుని నియంత స్వరూపాన్ని బయట పెట్టాడు. ఎచ్‌డిపి పార్టీ పై టెర్రరిస్టుల ముద్రవేసి, కేసుల్లో ఇరికించి జైళ్లలో తోశాడు. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ఐఎస్) టెర్రరిస్ట్ దాడులను ఎదుర్కొంటున్నామనే నెపంతో కుర్దు ప్రాంతాలపై ఎడతెరిపిలేని బాంబుల వర్షం కురిపించి కుర్ద్ జాతిని తుడిచిపెట్టి వేయాలని విరుచుకు పడుతున్నాడు.


ఇటువంటి అత్యంత భయానక పరిస్థితుల్లో, కోరలు చాసిన ఫాసిజాన్ని, అది పెంచి పోషిస్తున్న ఇస్లామిక్ తీవ్రవాద దాడులను ఎదుర్కోవడానికి యావత్ కుర్దిష్ ప్రజలు ఎక్కడి కక్కడ ప్రతిఘటన ద్వారా ఆత్మరక్షణ, గెరిల్లా యుద్ధ తంత్రం ద్వారా విముక్తి, స్వేచ్ఛా స్వాతంత్ర సాధన లక్ష్యంగా ప్రాంతాల వారీగా పోరాడుతూనే విస్తృత ప్రజా ఐక్య సంఘటనను నిర్మించుకుని యుద్ధంలో నిలబడుతున్నారు. ఈ ప్రతిఘటనా పోరాటంలో కుర్దు స్త్రీలు, పికెకె పోరాట శక్తులు, మావోయిస్ట్ శక్తులు, ఇతర ఫాసిస్ట్ వ్యతిరేక అభ్యుదయ శక్తులు ఐక్యమై పోరాడడం తప్ప ఇర్డొగాన్ వంటి నియంతలను మట్టి కరిపించడానికి వేరే మార్గమంటూ ఏమీ లేదు.

**- బి.ఎస్.రాజు** వీ








❖ **అన్వేషణ** – కథలు – కరణం శేషపిళ్లై – శేషేంద్ర సాయి ప్రచురణలు – 70 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: శేషేంద్రసాయి ప్రచురణలు – 1, 1-67, కెవిఎస్ స్ట్రీట్, పాతపేట, పలమనేరు-517 408, చిత్తూరు జిల్లా; మొబైల్: 9703555652, ఈమెయిల్: chaituksp@gmail.com





❖ **బాలగోపాల్ తాత్విక గందరగోళం** – సమీర్ – శ్రామికవర్గ ప్రచురణలు – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: శ్రామికవర్గ ప్రచురణలు, 203, లక్ష్మీ అపార్ట్‌మెంట్స్, నలగొండ చౌరస్తా, మలక్‌పేట, హైదరాబాద్ – 500036; నవచేతన బుక్‌హౌస్; ప్రజాశక్తి; నవోదయ; సహచర; మైత్రి బుక్‌హౌస్



❖ **లంకపల్లి అమరులకు విప్లవ జోహార్లు** – దిక్సూచి ప్రచురణలు – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 10,





❖ **జాతుల సమస్య రిజర్వేషన్లు** – కార్మికవర్గ దృక్పథం – దిక్సూచి ప్రచురణలు – 63 పేజీలు, 1/8 డెమీ, రు. 25





❖ **అజ్ఞాత విప్లవ యోధుడు అమరుడు కొండన్న** – దిక్సూచి ప్రచురణలు – 75 పేజీలు, 1/8 డెమీ, రు. 50


పై మూడు పుస్తకాల ప్రతులకు: దిక్సూచి ప్రచురణలు, గ్రా. జింకి భద్ర, మం. సోంపేట, శ్రీకాకుళం జిల్లా; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **ఉస్మానియా నుంచి మానుకోట వరకు – ఆరు నెలల ఉద్యమ ప్రస్థానం** – 'ప్రజాతంత్ర' సంపాదకీయాలు – ప్రణవ పబ్లికేషన్స్ – 210 పేజీలు, 1/4 క్రౌన్, రు. 200, ప్రతులకు: దేవులపల్లి అజయ్, ప్లాట్ నం. 15/16, విజయ గార్డెన్స్, బండ్లగూడ, నాగోల్, రంగారెడ్డి – 500 068; ఫోన్: 9885557406




❖ **భారత విప్లవ పంథాను చూపిన తెలంగాణ సాయుధ పోరాటం** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 2, రెండవ ముద్రణ – స్టాలిన్‌తో తెలంగాణ పోరాటం గురించి సంభాషణ అనుబంధంగా – పోరునేల ప్రచురణ – 175 పేజీలు, 1/8 డెమీ, రు. 100





❖ **విప్లవ ప్రజాపంథా అమలు కోసం పోరాటం** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 9 – పోరునేల ప్రచురణ – 326 పేజీలు, 1/8 డెమీ, రు. 150





❖ **కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతా సమస్యలు** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 10 – పోరునేల ప్రచురణ – 271 పేజీలు, 1/8 డెమీ, రు. 140

పై పుస్తకాల ప్రతులకు: పోరునేల, హైదరాబాద్; సెల్: 7702888998, 9573547005; ఈమెయిల్: porunelapublications2014@gmail.com అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో





❖ **తత్వశాస్త్రం మాయాజాలం కాదు** (రైతాంగం తమ అధ్యయనాన్ని ఆచరణకు వినియోగిస్తారు ) ఇంగ్లిష్ మూలం: విదేశీ భాషా ప్రచురణ, పీకింగ్, 1972 – అనువాదం: చలసాని ప్రసాద్ – విప్లవ రచయితల సంఘం – 55 పేజీలు, 1/8 డెమీ, రు. 20




❖ **వైరుధ్యాలు** – మావో – విప్లవ రచయితల సంఘం – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 20

పై రెండు పుస్తకాల ప్రతులకు: సిఎస్ఆర్ ప్రసాద్, సి-132, ఎస్‌విఎన్ కాలనీ, గుంటూరు – 522 006; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో



❖ **మన రాష్ట్రంలో భూసంస్కరణల కథ** – ఎస్.ఆర్. శంకరన్ – స్నేహ ప్రచురణలు – 18 పేజీలు, 1/8 డెమీ, రు. 6, ప్రతులకు: స్నేహ ప్రచురణలు, 502 – గంగా హైట్స్, గంగాస్థాన్ ఫేజ్-2, గూపన్‌పల్లి, ముబారక్‌నగర్, నిజామాబాద్ జిల్లా – 503 003; సెల్: 98666 30739

# దేశం గతి ఏమిటో చూపిన సర్వే

భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ 2011లో జరిపిన సామాజిక ఆర్థిక కుల జనగణన గణాంకాలను, వివరాలను గత నెల ప్రకటించింది. ఈ వివరాలన్నీ దేశంలోని మొత్తం 678 జిల్లాలలో పట్టణ జిల్లాలు వదిలేసి, 640 గ్రామీణ జిల్లాలకు సంబంధించినవి మాత్రమే. ఈ వివరాలు భారత గ్రామీణ జీవనం గురించి కొంతవరకు విశ్వసనీయమైన చిత్రపటాన్ని ప్రదర్శిస్తాయి. ఈ గణాంకాలలో పొరపాట్లు, ఉద్దేశపూర్వకంగా చెప్పకుండా వదిలేసినవీ, సగం చెప్పినవీ, ప్రాధాన్యత మార్చి చెప్పినవీ ఉండవచ్చు గాని వాటిని పరిశీలించి స్థూలంగానైనా గ్రామీణ భారత సమాజ స్థితిగతుల మీద కొన్ని నిర్ధారణలు ప్రకటించవచ్చు.

ఈ జనగణనలో వెల్లడైన గణాంకాల మీద, వివరాల మీద ఇప్పటికే చాల మంది వ్యాఖ్యాతలు తమ తమ కోణాల నుంచి విశ్లేషించి, నిర్ధారణలు చేశారు. ఆ గణాంకాలను మరొకవైపు నుంచి చూస్తే ఈ సమాజ స్వభావం గురించీ, గ్రామీణ ప్రాంతాల గురించీ, పాలకవర్గాల గురించీ నక్సల్బరీ యాభై సంవత్సరాల కింద చేసిన నిర్ధారణలు ఆనాటికి మాత్రమే కాక ఇవాళ్టికీ సరైనవేనని మరొకసారి రుజువవుతుంది.

మొట్టమొదటిది, ఈ దేశం ప్రధానంగా వ్యవసాయ, గ్రామీణ సమాజం అని ఈ గణాంకాలు మళ్లీ రుజువు చేస్తున్నాయి. ఇటీవల వ్యవసాయానికి కాలం చెల్లిపోయిందనీ, గ్రామాలన్నీ రద్దయిపోయి పట్టణాలకు వలస వెళ్లడమే అభివృద్ధి అనీ, ఇదంతా భారతదేశం పెట్టుబడిదారీ దేశంగా మారిందనడానికో, మారుతున్నదనడానికో సూచన అనీ కొందరు వాదిస్తున్నారు. ఈ వాదనలు చేస్తున్నవారిలో పట్టణాభివృద్ధిలో ప్రయోజనాలు ఇమిడి ఉన్న పాలకవర్గ మేధావులు మాత్రమే కాక, కొందరు ప్రగతిశీల, ప్రజానుకూల మేధావులు కూడ ఉన్నారు. అటువంటి వాదనల నేపథ్యంలో ఈ గణాంకాలు ఆసక్తికరమైనవి. ఈ గణాంకాలు దేశంలోని 678 జిల్లాలలో 640 జిల్లాలను, అంటే 94 శాతాన్ని గ్రామీణ ప్రాంతాలుగా గుర్తించాయి. జిల్లాను గ్రామీణ జిల్లాగా గుర్తించినప్పటికీ, జిల్లాలలో పట్టణాలున్నాయి గదా అని కూడ ప్రశించవచ్చు గాని, దేశంలో ఉన్న మొత్తం 24 కోట్ల 45 లక్షల కుటుంబాలలో 17 కోట్ల 94 లక్షల కుటుంబాలు, అంటే 74 శాతం, గ్రామీణ కుటుంబాలేనని ఈ జనగణన చెపుతున్నది. అంటే, ఇతర కారణాలెలా ఉన్నా, కనీసం అత్యధిక జనాభా నివసిస్తున్న స్థలంగా గ్రామీణ భారతం భారత విప్లవ మార్గానికి ప్రధానం కాకతప్పదు.

రెండోది, మన గ్రామీణ ప్రాంతాల్లో భూయాజమాన్య అసమానతలు భయంకరమైన స్థితిలో ఉన్నాయని విప్లవోద్యమం ప్రకటించిన అంశాన్ని ఈ గణాంకాలు మరొకసారి చెపుతున్నాయి. దేశవ్యాప్తంగా 17 కోట్ల 94 లక్షల గ్రామీణ కుటుంబాలలో ఎంత మాత్రమూ భూమిలేని నిరుపేద కుటుంబాలు ఆరు కోట్ల 87 లక్షలు (38.3 శాతం). అలాగే దేశవ్యాప్తంగా ఉన్న 3.30 కోట్ల దళిత కుటుంబాలలో 1.80 కోట్ల కుటుంబాలు (54.6 శాతం) భూమిలేని నిరుపేదలు. ఈ అంకెలను కూడ మళ్లీ విప్పి చూడాలి. మొత్తం కుటుంబాలలో భూమి ఉందని చెపుతున్న 61.7 శాతం కుటుంబాలను గాని, దళిత కుటుంబాలలో భూమి ఉందని చెపుతున్న 55.4 శాతం కుటుంబాలను గాని ఏకమొత్తంగా చూడడానికి వీలులేదు. వారిలో పెద్ద, మధ్య, చిన్న, సన్నకారు కమతాలు కూడ కలిసి ఉన్నాయి. వందల ఎకరాల భూస్వాములు, పది గుంటలో, ఇరవై గుంటలో ఉన్న సన్నకారు భూయజమానులు అందరినీ ఈ సగటు అంకెలో కలిపివేశారు. వ్యవసాయయోగ్యం కాని భూములు, చిన్న కమతాలు, వ్యవసాయం చేయడానికి తగిన పెట్టుబడి, వనరులు లేని కుటుంబాల వివరాలు ఈ జనగణన సేకరించలేదు. కాని గతంలోని జాతీయ నమూనా సర్వే ఫలితాలను, ఇతర సామాజిక ఆర్థిక సర్వేలను ప్రస్తుత గణాంకాలలోని భూమి ఉన్నదంటున్న కుటుంబాల లెక్కతో పోల్చి చూస్తే, మొత్తం మీద ఈ భూమి ఉన్న కుటుంబాలలో సగానికి పైగా గిట్టుబాటు వ్యవసాయం చేయగలిగే స్థితి లేదని అర్థమవుతుంది. అంటే యాజమాన్యం రీత్యాగాని, వనరుల రీత్యాగాని దేశంలోని గ్రామీణ కుటుంబాలలో కనీసం 60 శాతం కుటుంబాలు వ్యవసాయానికి దూరంగా ఉండే స్థితి ఉంది. ఇది ఈ దేశంలో అత్యవసరంగా భూమి సమస్యను పరిష్కరించే వ్యవసాయ విప్లవం జరగవలసి ఉన్నదని, ఈ దేశంలో భూమిలేని నిరుపేదలే ప్రధాన విప్లవ చోదక శక్తులలో ఒకటనే నిర్ధారణలకు రాక తప్పదనడానికి సూచన.

మూడోది, భూయాజమాన్య స్థితి ఎలా ఉన్నా, ఈ జనగణన ప్రకారం వ్యవసాయదారులుగా పరిగణనలోకి వచ్చిన జనాభా 30.1 శాతం కుటుంబాలు మాత్రమే. మొత్తం 17.94 కోట్ల కుటుబాలలో ఐదు కోట్ల 40 లక్షల కుటుంబాలు మాత్రమే సాగుదార్లు అని, 9 కోట్ల 18 లక్షల కుటుంబాలు (51.1) శాతం రోజువారీ శారీరక శ్రమ ద్వారా పొట్ట పోసుకుంటున్నారని ఈ గణాంకాలు చెపుతున్నాయి. ఈ రోజుకూలీలలో ఎంతమందికి వ్యవసాయ రంగం పని కల్పించగలుగుతున్నదో ఈ గణాంకాలలో స్పష్టంగా లేదు గాని, దీని నుంచి అర్థమయ్యేది గ్రామీణ కుటుంబాలలో, అంటే వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తులు తెలిసిన జనాభాలో సగానికి పైగా వ్యవసాయదారులుగా లేని దుస్థితి ఉంది. దేశంలోని 82 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో కనీసం 39 కోట్ల ఎకరాల భూమి సాగులోనో, సాగుకు యోగ్యంగానో ఉందని ఇతర గణాంకాలు చెపుతుండగా, సక్రమమమైన భూమి పంపిణీ జరిగితే, మొత్తానికి మొత్తంగా గ్రామీణ కుటుంబాలన్నిటికీ పంపిణీ చేసినా కుటుంబానికి కనీసం రెండు ఎకరాల పైన వస్తుంది. గ్రామీణ కుటుంబాలలో వృత్తులలో, ఉద్యోగాలలో, వ్యాపారాలలో ఉండే జనాభాను మినహాయిస్తే కుటుంబానికి మూడు ఎకరాల పైనే వస్తుంది. ఆ భూమిని కుటుంబాలకు విడివిడిగా కాక, సహకార పద్ధతిలో గ్రామాలకు పంచితే మరింత ఉత్పాదకమైన, అర్థవంతమైన పంపిణీ జరపవచ్చు. అయినా

వ్యవసాయ తెలిసిన గ్రామీణ కుటుంబాలలో మూడో వంతుకన్న తక్కువ మాత్రమే వ్యవసాయదారులుగా నమోదయ్యారనే చేదు వాస్తవాన్ని ఈ గణాంకాలు ప్రకటిస్తున్నాయి. అంటే గ్రామీణ వ్యవసాయ రంగంలో తక్షణమే జరగవలసిన సమగ్ర భూ, వ్యవసాయ సంస్కరణల గురించి ఈ గణాంకాలు చెప్పకనే చెపుతున్నాయి.

నాలుగోది, గ్రామీణ ప్రాంతాలలో సౌకర్యాల అసమానతలు గణనీయమైన స్థాయిలో ఉన్నాయని ఈ గణాంకాలు మరొకసారి చెపుతున్నాయి. 17 కోట్ల 94 లక్షల గ్రామీణ కుటుంబాలలో 7 కోట్ల 6 లక్షల కుటుంబాలను, అంటే 39.36 శాతాన్ని, పరిశీలన నుంచి మినహాయించామని, అందుకు కారణం వారి దగ్గర తాము నిర్ణయించిన 14 సౌకర్యాలలో ఏదో ఒకటైనా ఉండడమేనని ఈ నివేదిక అంటున్నది. ఏదో ఒక మోటర్ ప్రయాణ వాహనం (ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కారు), వ్యవసాయానికి ఉపకరించే వాహనం (ట్రాక్టర్, టిల్లర్, వగైరా), యాభై వేల రూపాయల కన్న ఎక్కువ పరపతి సౌకర్యం ఉన్న కిసాన్ క్రెడిట్ కార్డ్, కుటుంబంలో ఎవరో ఒకరు ప్రభుత్వోద్యోగి కావడం, ప్రభుత్వం దగ్గర నమోదైన వ్యవసాయేతర వ్యాపారం ఉండడం, కుటుంబంలో ఎవరో ఒకరు రు. 10,000 నెలసరి ఆదాయాన్ని కలిగి ఉండడం, ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఉండడం, వృత్తి పన్ను చెల్లిస్తూ ఉండడం, మూడు లేదా అంతకన్న ఎక్కువ గదులున్న పక్కా ఇల్లు, రిఫ్రిజిరేటర్, లాండ్ లైన్ ఫోన్, సాగునీటి యంత్రాలతో సహా రెండున్నర ఎకరాల నీటి పారుదల సౌకర్యం ఉన్న భూమి, రెండు లేదా అంతకన్న ఎక్కువ పంటలు పండే ఐదు ఎకరాల సాగునీటి సౌకర్యం ఉన్న భూమి, కనీసం ఒక సాగునీటి యంత్రంతో ఏడున్నర ఎకరాల భూమి. వీటిలో ఏ ఒక్కటైనా లేని జనాభా గ్రామీణ ప్రాంతంలో పది కోట్ల 71 లక్షల కుటుంబాలు. దేశంలో దారిద్ర్యం గురించి గతంలో ఎవరు ఎటువంటి అంచనాలు ప్రకటించి ఉన్నప్పటికీ, ఇప్పుడు స్వయంగా ప్రభుత్వమే అంగీకరిస్తున్న ప్రకారం, అరవై శాతం గ్రామీణ కుటుంబాలు ఈ పద్నాలుగు వసతులలో ఏ ఒక్కటైనా లేని లేమిని అనుభవిస్తున్నారు. ఈ పద్నాలుగు సౌకర్యాలలో కొన్ని చాల మామూలువి. పట్టణ ప్రాంతాలలో అత్యవసరంగా కూడ కనబడుతున్నవి. కాని గ్రామీణ ప్రాంతాలలో 60 శాతం మందికి వాటిలో ఏ ఒక్కటి కూడ లేదు. ఆ సౌకర్యాలు ఉండడమే గొప్ప అనీ, అవి లేకపోవడం లేమి అనీ సూత్రీకరించనవసరం లేదు గాని, అవి ఉండడమే అభివృద్ధికి సూచికగా, ప్రమాణంగా ప్రచారం జరుగుతున్నప్పుడు, అవి లేని జనాభా అరవై శాతం ఉందని గుర్తించవలసి ఉంది. ప్రస్తుత అభివృద్ధి నమూనా గ్రామానికీ పట్టణానికీ మధ్య, గ్రామంలో సంపన్నులకూ పేదలకూ మధ్య అంతరాలు పెంచి పోషించే నమూనా అని ఈ గణాంకాలు మరొకసారి చెపుతున్నాయి.

ఐదోది, గ్రామీణ నిరుద్యోగ స్థితి గురించి ఈ గణాంకాలు చెప్పకనే చెప్పాయి. జనాభాలో సగం రోజువారీ శారీరక శ్రమలో ఉన్నారని ఈ గణాంకాలు తేల్చాయని పైన చూశాం. మిగిలిన సగంలో కూడ 44 లక్షల కుటుంబాలు (2.4 శాతం) పూర్తికాలం గాని, ఎప్పుడో ఒకప్పుడు గాని ఇళ్లలో పనిమనుషులుగా పనిచేస్తున్నారని, రెండున్నర కోట్ల కుటుంబాలలో ఎవరో ఒకరు (13.9 శాతం) ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా ఉన్నారని, నాలుగు లక్షల కుటుంబాలు (0.23 శాతం) చెత్తకుప్పలు వెతికి దొరికిన వస్తువులు అమ్మి పొట్టపోసుకునేవారిగా ఉన్నారని, ఆరు లక్షల కుటుంబాలు (0.37 శాతం) బిచ్చగాళ్లుగా ఉన్నారని, 29 లక్షల కుటుంబాలు (1.61 శాతం) వ్యవసాయేతర స్వయం ఉపాధి, వ్యాపారాలలో ఉన్నారని ఈ గణాంకాలు చెపుతున్నాయి. అంటే సాగుదార్లుగా నమోదైన 30.1 శాతం, ఉద్యోగులుగా నమోదైన 13.9 శాతం, స్వయం ఉపాధిలో ఉన్న 1.61 శాతం, మొత్తం 45.61 శాతం కుటుంబాలకు మాత్రమే నమ్మకమైన, స్థిరమైన ఆదాయ వనరులున్నాయని, మిగిలిన 54.39 శాతానికి ఏ పూటకు ఆ పూట గడవడమే గగనమని ఈ గణాంకాలు చెపుతున్నాయి. దిక్కుమొక్కులేని జనం అనీ, ఏ చెరో గిరో పడి చద్దామన్నా ఎట్లాగీ కాపురాలు అని సుబ్బారావు పాణిగ్రాహి నక్సల్బరీ ప్రారంభ సమయంలో, భోగాలు ఆనందయోగాలు కొందరివి, రోగాలు నొప్పులూ కోట్లాది ప్రజలవి అని ఆ సమయంలోనే చెరబండరాజు ప్రకటించిన దేశ స్థితి యాభై సంవత్సరాల తర్వాత యథాతథంగా, బహుశా మరింత దారుణంగా ఉన్నదని ఈ గణాంకాలు ప్రకటిస్తున్నాయి.

ఆరోది, గ్రామీణ సమాజం అంటే వైరుధ్యాలు లేని ఏకశిలా సదృశమైన సమాజమేమీ కాదు. ఈ గణాంకాలే చెపుతున్నట్టుగా భూమి ఉన్న కుటుంబాలు, సౌకర్యాలున్న కుటుంబాలు, పన్ను చెల్లించే కుటుంబాలు, పరపతి పొందుతున్న కుటుంబాలు ఉన్నాయి. సంపద పెరిగిన కొద్దీ పన్నుభారం పెంచడమనేది ఎక్కడైనా ఒక అవసరమైన పన్నుల విధానమని ప్రజాపాలనా అర్థశాస్త్ర పాఠ్యపుస్తకాలు చెపుతాయి. కాని గ్రామీణ కుటుంబాలలో ఆదాయపు పన్ను చెల్లిస్తున్న కుటుంబాలు 4.58 శాతం మాత్రమేనని ఈ గణాంకాలు చెపుతున్నాయి. అంటే గ్రామీణ ప్రాంతంలో పోగుపడుతున్న సంపద మీద ఎటువంటి పన్ను చెల్లించనక్కరలేని స్థితి ఉందన్నమాట. దేశంలో భూస్వామ్యం ఎప్పుడో అంతరించిందనీ, పాలకవర్గాలు పూర్తిగా పెట్టుబడిదారీ శక్తులేనని వాదించేవారు భూస్వామ్యం పట్లా, భూస్వామ్య సంపద పట్లా ఇంత సానుకూల వైఖరి ఎందుకు తీసుకుంటున్నాయో వివరించాలి. ఈ దేశ పాలకవర్గాలు భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ, దళారీ పెట్టుబడిదారీ వర్గాల మిలాఖత్తు అనడానికి గ్రామీణ సంపన్న వర్గాలతో కుమ్మక్కే నిదర్శనం.

ఏడోది, ఈ దేశంలో నిజమైన ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి అవసరమైన ప్రజాస్వామిక విప్లవం కూడ జరగలేదని, ఈ సమాజం ఇంకా అర్ధ భూస్వామ్య అర్ధవలస స్థితిలోనే ఉందని, గ్రామీణ ప్రాంతాల ఉత్పత్తిశక్తుల అభివృద్ధి గురించి ఈ గణాంకాలు మరొక నిదర్శనం చూపుతున్నాయి. ఈ దేశంలో వ్యవసాయం ఇంకా ప్రధానంగా మనుగడ కోసం వ్యవసాయంగా, ఉత్పాదకత పెరుగుదలలో మందకొండితనంతో, కనీస ఉత్పత్తి సాధనాలలో కూడ వెనుకబాటుతనంతో ఉన్నదని ఈ గణాంకాలు చెపుతున్నాయి. అక్కడొకటి ఇక్కడొకటి ట్రాక్టర్లు తాము చూడదలచినచోట చూపి అదే వ్యవసాయ యాంత్రీకరణకు, పెట్టుబడిదారీ విధానానికి నిదర్శనంగా చెప్పేవారికి, ఈ గణాంకాలు ఈ దేశంలో ఇంకా మూడు చక్రాల, నాలుగు చక్రాల వ్యవసాయ పరికరాలు ఉన్న కుటుంబాలు 4.11 శాతం మాత్రమే అనే వాస్తవాన్ని చెపుతున్నాయి. వీ

# 'బంగారు తెలంగాణ'లో దళితులు

***పోరాడి సాధించుకున్న తెలంగాణలో కూడా దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందనీ, పాతపల్లి సంఘటనే దీనికి నిదర్శనమనీ అంటున్నారు సుజాత సూరేపల్లి***

మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలం పాతపల్లి కుల వివక్షతకి, హింసకి వ్యతిరేకంగా తిరగబడ్డది. దశాబ్దాలుగా మాదిగలపై బోయల ఆధిపత్య, కుల అహంకారానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎగరేసింది. ఎటువంటి అభివృద్ధికి నోచుకోక అటు ఫ్యాక్షన్ రాజకీయాలకి, ఇటు కుల రాజకీయాలకి మధ్య నలుగుతూ, తరతరాలుగా వలస కూలీల కేంద్రంగా ఉన్న పాలమూరు జిల్లా ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. తెలంగాణ ఉద్యమాన్ని తలపిస్తూ పోలీసు, పారా మిలిటరీ బలగాల మధ్య వేలాది మందితో ధర్నా, ఎనిమిది కిలోమీటర్ల రాలీ నిర్వహించి తెలంగాణ వస్తే ఇంక ధర్నాలు, రాస్తా రోకోలు ఉండవన్న ముఖ్యమంత్రి ఊకదంపుడు డైలాగులకి చెంపపెట్టుగా పాతపల్లిలో అతి పెద్ద బహిరంగసభ నిర్వహించి తెలంగాణలో మొట్టమొదటి దళితుల ఆత్మగౌరవ పోరాటంగా నమోదు చేసుకుంది. న్యాయం కోసం దాదాపు మూడు నెలలు నిర్విరామంగా అనేక నిరసన రూపాలు తీసుకుని అన్ని ప్రజా సంఘాలని కదిలించి, జిల్లా యంత్రాంగాన్ని, ఆనంద్ తేల్తుంబ్డే వంటి మేధావులని రప్పించి జాతీయ మీడియాలో కూడా తమ పోరాటానికి చోటు కల్పించుకుంది. దీనికి కుల నిర్మూలన పోరాట సమితి, దళిత బాధితుల పోరాట న్యాయ పోరాట కమిటీ అండగా ఉన్నాయి.

నిలువెత్తు దోపిడీకి గురవుతూ పాలమూరు జిల్లా వెనకబడి ఉన్నా పోరాటంలో ఎప్పుడూ ముందే ఉంటుంది. పోలేపల్లి సెజ్ పోరాటంలో అక్కడి దళితులు, మాదిగలు భూమికోసం చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఎటువంటి రాజీ లేకుండా సెజ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని అలుపెరగని పోరాటం చేసింది పోలేపల్లి దళితులు. తెలంగాణ వస్తే పోలేపల్లి భూములు వెనక్కి ఇప్పిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి పోలేపల్లిలో చేసిన వాగ్దానాన్ని ఎప్పుడు అమలు చేస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఇక రాజకీయ ముసుగులో ఉన్న కుల భూతాన్ని నగ్నంగా ప్రజలముందు నిలబెట్టింది పాతపల్లి.

పాతపల్లి మాదిగల ఆత్మగౌరవ పోరాటం వివరాల్లోకి పోతే, ఆధునిక భావాలు గల మాదిగ యువకుడు రఘురామ్, ఆర్‌టిసి కండక్టర్‌గా పనిచేస్తూ, మేడే నాడు సరస్వతిని పెళ్లి చేసుకుని ఊరి మధ్యలో ఉన్న గుడిలో అడుగు పెట్టాడు. తరాలుగా అక్కడ మాదిగలకి గుడిలోకి ప్రవేశం లేదు. గుడి లోపలికి పోవడానికి స్థానిక ఎంఎల్ఏ చిన్నారెడ్డి మద్దతు ఉంటుందనుకుంటే ఆయన చాకచక్యంగా తప్పించుకున్నాడు. తమదైన తెలంగాణలో మాకు అన్యాయం జరుగదు అనుకున్నారో ఏమో మాదిగలు ధైర్యం చేసి గుడిలోకి ప్రవేశించారు. కాని అక్కడినుంచి జరిగిన సంఘటనలన్నీ వారు ఊహించనివి. ఆ ఒక్క సంఘటనే బ్రాహ్మణీయ మనువాద మూలాలను కదిలించింది. మేము బోయలము, ఇక్కడ మాకు తిరుగు లేదు అని ఎన్నో సంవత్సరాలుగా అనేక రకాలుగా మాదిగలని అవమానపరుస్తూ, అణచివేస్తున్నవారి అహంకారం దెబ్బతిన్నది. గుడిని నిరవధికంగా మూసివేసినారు. ఇంతకుముందు చంద్రబాబు హయాంలో కూడా ఒకసారి ఆలయ ప్రవేశం చేస్తే అదే విధంగా చేశారని కార్యకర్తలు చెపుతున్నారు.

ఈ దేశంలో గాలిని, భూమిని, మానవజాతిని మనువాదంతో, మతం పేరుతో కలుషితం చేసిన బ్రాహ్మణ జాతే పాతపల్లి గుడి పూజారి కృష్ణమాచారి రూపంలో గుడి మైలపడింది అనే విషబీజాన్ని నాటింది. ఇప్పుడు మాదిగలు గుడిలోకి వచ్చారంటే అన్ని చోట్లకి వస్తారని బోయలు అక్కడి పెద్దమనుషులతో ఏకమై ఇంక ఇక్కడ మరొక కారంచేడు, చుండూరులను చూస్తారని, తమ కాళ్లదగ్గర ఉండాల్సిన మాదిగలు తమతో సమానంగా ఎట్లా ఉంటారని అగ్గిమీద గుగ్గిలమై ఎంతటి అరాచకానికైనా సిద్ధపడ్డారు. రఘురాం తల్లిని అవమానపరిచారు. ఊళ్లో నుండి వచ్చిపోయే మాదిగలని తిడుతూ, ఆడవాళ్లని అవమానపరుస్తూ, అక్కడ సరుకులు ఎవరికీ అమ్మకుండా, చివరికి నీళ్లు ఇవ్వకుండా గ్రామ బహిష్కరణ చేశారు. దీనికి నిరసనగా చిన్న రాలీ నిర్వహిస్తున్న వారిమీద పడి, తిడుతూ, దాడికి దిగారు. ఈ విషయాన్ని ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా తహసీల్దారు, ఎస్సై ఊరిని సందర్శించి మాదిగలతో ఆలయప్రవేశం చేయించారు. అది జీర్ణించుకోలేని బోయలు ఇంక దాడులు మొదలు పెట్టి, కొడుతూ, తిడుతూ తమ అసహనాన్ని, అసంతృప్తిని, కోపాన్ని వివిధ రూపాల్లో వెళ్లగక్కారు.

మొదట, స్థానిక మాదిగ దండోరా కార్యకర్త ఎనుముల హుస్సేన్, తదితర కార్యకర్తలు నిరసన తెలిపారు. ఫిర్యాదులు ఇచ్చారు. ఎంఆర్‌పిఎస్ నాయకుడు మంద కృష్ణను, నడుస్తున్న తెలంగాణ సంపాదకుడు కాశీంని పిలిచి ఊళ్లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాదిగలకి న్యాయం జరిగేటట్టుగా చూడాలని మంద కృష్ణ అధికారులని కోరారు. ఆ తరువాత కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. ప్రతిరోజు ఏదో ఒకరకమైన దాడి, మోటారుసైకిళ్లతోని గుద్దడం వంటివి జరిగాయి. బోయల ఇండ్ల మీదుగా ఒక కిలోమీటరు నడిస్తే గాని మాదిగల ఇండ్లు రావు. చివరికి మాదిగలు ఇండ్లలోంచి రావడానికే భయపడే పరిస్థితి వచ్చింది. అయినా వెనక్కి తగ్గకుండా ఏదో ఒక రూపంలో నిరసన తెలుపుతూనే ఉన్నారు. పోలీసులు మాత్రం ఎటువంటి స్పందన లేకుండా,

వాళ్ల కళ్లముందే బూతులు తిడుతున్నా ఏమాత్రం కదలకుండా ఉన్నారు. నామమాత్రంగా రెండు మూడు ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల కేసులు పెట్టారు కాని వాటిని ఇప్పటివరకు ముట్టుకోలేదు.

బోయల ఇండ్లను దాటుకుంటూ వస్తూ పోతూ ఉండడం కష్టం అని మాదిగలు ఊరికి మొదట్లో తమకి ప్రభుత్వం కేటాయించిన స్థలంలోకి రావాలని జూన్ 1 వ తేదిన నిర్ణయించుకున్నారు. అక్కడ 2001లో ప్రభుత్వం సర్వే నం. 4లో మాదిగలకి పట్టాలు పంపిణీ చేసింది. పాతపల్లిలో దాదాపు 40 మాదిగ ఇండ్లు, 400 పైగా బోయ ఇండ్లు ఉన్నాయి. గుడి నుండి మొదలైన రభస ఆ రోజునుంచి భూమివైపు మళ్లింది.

జూన్ 1 నుండి భూమి పోరాటంగా మారింది. జూన్ 3 న వందలాది బోయలు ఊరేగింపుగా వచ్చి బోయ చిన సాయన్న, కావలి గట్టన్న అనే ఇద్దరు బోయల మృతదేహాలను మాదిగల గుడిసెల మధ్య ఖననం చేశారు. బోయలు అంత పెద్ద సంఖ్యలో రావడం చూసిన మాదిగలు భయపడి పోలీసు సహాయం కోరగా పోలీసులు బోయలని అడ్డుకోలేదు సరికదా, దగ్గర ఉండి ఆ కార్యక్రమాన్ని అధికారిక లాంఛనాలతో చేసినట్టు నిర్వహించారు. అక్కడితో ఆగక సమాధులు కూడా కట్టి, మాదిగ గుడిసెల్లోని వస్తువులని మాయం చేశారు.

ఇదీ సహించలేని మాదిగలు రాస్తారోకో చేస్తే ఎస్సై జితేందర్ రెడ్డి, ఇతర పోలీసులు లాఠిచార్జి చేసి, 20 మందికి పైగా మాదిగలని స్టేషన్‌కి తీసుకపోయి గొడ్డుని బాదినట్టు బాదారు. ఇక జిల్లా రెవెన్యూ అధికారులు అసలు ఆ భూమి మాదిగలది కాదని రిపోర్ట్ ఇవ్వడం కొసమెరుపు. నిజానికి ఆ భూమిలో మాదిగ నారాయణకి ప్రభుత్వం ఒక ఎకరా 18 గుంటలు ఇచ్చింది. ఆయన వారసులు కూడా అందులో వ్యవసాయం చేశారు. కాని 2007-08 నుండి బోయలు అక్కడ శవాలను పాతిపెడుతూ అడిగినప్పుడల్లా గొడవపడి, సరిహద్దులు చెరిపేస్తూ వచ్చారు. చివరికి అది వాళ్లకి చెందదని కూడా చెప్పారు. రెవెన్యూవాళ్లు తలచుకుంటే ఏ భూమి అయినా ఎవరినుంచి ఎవరికైనా మార్చగలరు. అందులో చదువు ఎక్కువగా లేని, అమాయకపు మాదిగల భూములని మాయం చేయడం ఎంతసేపు? ఈ పరిస్థితిలో కుల నిర్మూలనా పోరాట సమితి ఇతర ప్రజా సంఘాలతో కలిసి పాతపల్లి దళిత బాధితుల న్యాయ పోరాట కమిటీని ఏర్పాటు చేసింది.

పోలీసు, రెవెన్యూ శాఖల తీరు ఇట్లా ఉంటే రాజకీయ నాయకులు ఏం చేశారు? దళితులూ, బిసి ఎమ్మెల్యేలూ మహబూబ్‌నగర్‌లో లేరా? అసలు ఇది కేవలం రెండు కులాల మధ్య పోరాటంగానే చూస్తారా? అణచివేతకు గురైన దళితుల గోడు వినపడదా? అసలు బోయలు తమను ఎస్‌టి జాబితాలో చేర్చాలని పోరాటం చేస్తున్న తరుణంలో ఇలా జరగడం సబబు కాదనే వాదనలు కూడా వినపడుతున్నాయి. మరి ప్రజల కాలికి ముల్లు గుచ్చుకున్నా పంటికొనతో తీస్తానన్న ముఖ్యమంత్రి ఏమైనట్టు? కళ్లముందే కులరక్కసి నగ్నంగా కనపడుతుంటే ఒక్కరూ నోరెత్తడానికి ఎందుకు భయపడుతున్నట్టు?

రాజకీయ నాయకులు పరామర్శకు వచ్చినా కంటితుడుపు చర్యగా మాత్రమే. తప్పుచేసి కూడా బోయలు అంత ధీమాగా ఉండడానికి కారణం, అగ్రకులాలకి వీరు పెద్ద ఆప్తులు ఏమీ కాదు, బోయలకి, రెవెన్యూకి, పోలీసులకి ఉన్న సంబంధం ఒకే ఒక్కటి వోటు బ్యాంక్! బోయలు ఆ ఊళ్లోనేకాక ఆ ప్రాంతమంతా ఎక్కువ కాబట్టి ఏ రాజకీయ నాయకులూ అందులో తల దూర్చదలచుకోలేదు. అందులో దళితులని తమతో సమానంగా చూడాలని ఏ కులం కూడా అనుకోవట్లేదు, అనుకోదు కూడా.

నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఉన్న కిటుకు ఇదే. కులానికి కులానికి మధ్య పెద్ద అగాథం. అది బిసిలలో కావచ్చు. దళితులలో కూడా. గుడి, బడి, ఊరి దాకా అందరికి వీరు అంటరానివారే.

ఈ మధ్యలో బాబా సాహెబ్ అంబేద్కర్ మనుమడు ప్రొఫెసర్ ఆనంద్ తేల్తుంబ్డే రావడంతో పాతపల్లి జాతీయ మీడియాకి కూడా పాకింది. ప్రభుత్వ యంత్రాంగం ఖంగు తిని మళ్లీ చర్చలకి ఆహ్వానించడం, మధ్యలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి మాదిగలని విడగొట్టాలని ప్రయత్నించడం వంటి అనేక ఘటనలు జరిగినా, కెవిన్‌పిఎస్ పోరాట కమిటీ అప్రమత్తంగా ఉండడంతో ఫలించలేదు. నెల రోజులు నిరసన శిబిరం నడిపి అందులో అనేక ప్రజా సంఘాలని, విద్యార్థి, మహిళా, హక్కుల నాయకులని ఆహ్వానించి పోరాటాన్ని కాపాడారు.

న్యాయ పోరాట కమిటీ ఆగస్ట్ 6న చుండూరు మృతవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఆనంద్ తేల్తుంబ్డే ఆధ్వర్యంలో పెబ్బేరు నుంచి పాతపల్లి వరకు ర్యాలీ, బహిరంగ సభలకి పిలుపునిచ్చింది. అన్ని సంఘాలని ఆహ్వానించారు. ముందుగా అనుమతి ఇచ్చి కూడా ఎక్కడ శవాలను బొందలనుండి తీస్తారో అని 144 సెక్షన్ విధించారు. రాలీకి వచ్చేవారిని ఆపేసినా, పోలీసు బలగాలని దింపి సమాధులకి కాపలా పెట్టినా, వేల సంఖ్యలో ప్రజలు, అనేక సంఘాల కార్యకర్తలు, విద్యార్థులు, ప్రొఫెసర్లు, రచయితలు పాల్గొనడం, అక్కడి మాదిగలకి ప్రజల మద్దతుగా భావించవచ్చు. రాలీలో తొమ్మిది డిమాండ్లని ప్రభుత్వం ముందుంచింది పోరాట కమిటీ.

అవి: 1. దేవాలయ ప్రవేశానికి అడ్డుపడిన బోయలకి మద్దతు ఇచ్చిన వనపర్తి ఎంఎల్ఎ చిన్నారెడ్డిని తొలగించాలి. 2. ఎస్‌సి, ఎస్‌టి కేసులు నమోదైన బోయలను, గుడి పూజారి క్రిష్ణమాచారిని అరెస్ట్ చేయాలి. 3. దళిత సంఘాల మధ్య విభేదాలు సృష్టించి, పోరాట కమిటీ శిబిరంపై దళితులతో దాడులని ప్రోత్సహించిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని ప్రణాళికా సంఘ ఉపాధ్యక్ష పదవి నుండి తొలగించాలి. 4. మాదిగ మహిళపై దాడిచేసిన ఎస్సై జితేందర్ రెడ్డిపై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి వెంటనే అరెస్ట్ చేయాలి. 5. తప్పుడు రిపోర్ట్ పంపించిన పెబ్బేరు ఎంఆర్‌ఓ పాండు నాయక్‌ను, బోయల శవాలను దళితుల గుడిసెల మధ్య పాతిపెట్టించిన ఆర్‌డిఓ రామచంద్రు నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి. 6. మాదిగ నారాయణ పట్టా భూమిలో పాతిపెట్టిన బోయల శవాలని వెంటనే తీసివేయాలి. 7. మాదిగలకి ఎస్‌సి, ఎస్‌టి చట్ట ప్రకారం వెంటనే నష్టపరిహారం చెల్లించాలి. 8. పాతపల్లి మాదిగలపై పాల్పడిన 14 దాడులలో బాధ్యులైన బోయలపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలి. 9. ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని నీరుకార్చి బోయలని కాపాడుతున్న వనపర్తి డిఎస్‌పి జోగుల చెన్నయ్యని సస్పెండ్ చేయాలి.

ఆగస్ట్ 6 న ర్యాలీ జరుగుతున్నప్పుడే ఆనంద్ తేల్తుంబ్డేతో పోరాట కమిటీ సభ్యులతో జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ గంటల తరబడి చర్చలు జరిపి చివరికి కొన్ని డిమాండ్లకి ఒప్పుకున్నారు. కేసులు పెడతామని, సమాధుల వరకు భూమిని వదిలేసి మిగిలిన స్థలంలో మాదిగలకి ఇండ్లు కూడా కట్టిస్తామని, ఊరికి చివర మునిగిపోయిన వ్యవసాయ భూమిని మాదిగలకి వచ్చేవిధంగా చూస్తామని, ఇవన్నీ కూడా మూడు నెలల్లో చేస్తామని రాతపూర్వకంగా ఇచ్చారు. ఈ చర్చలు జరుగుతుండగానే మాదిగ మహిళలని బోయలు తిట్టారు. ర్యాలీ జరుగుతున్నప్పుడు మాదిగలు తమ ఇండ్ల మీద రాళ్లు వేశారని, బోయ అమ్మాయిపై అఘాయిత్య ప్రయత్నం చేశారని ఆ మర్నాడు బోయలు 23 మంది మీద కేసులు పెట్టారు.

ఇంతకీ కారంచేడులు, చుండూరులు తెలంగాణలో లేవు అని మురిసిపోయేవారి కోసం పాతపల్లి కొన్ని చేదు అనుభవాలని, పచ్చి నిజాలని ముందుకు తీసుకొచ్చింది. తెలంగాణలో దళితులు చంపబడలేదా? చెరచబడలేదా? అదే మహబూబ్‌నగర్‌లో ఎంతమందిని చంపలేదు కులం పేరుతో? లెక్కలు తీస్తే ప్రతి జిల్లాలో నిత్యం ఎక్కడో ఒక దగ్గర గ్రామ బహిష్కరణ. అసలు తెలంగాణ పల్లెలలో ఏ గుడి దగ్గర నిలబడ్డా అక్కడి దళితుల పరిస్థితి తెలిసిపోతుంది. అనేకచోట్ల దళితులని గుడిలోకి రానీయరని, రానిచ్చినా గర్భగుడిలోకి అనుమతి ఉండదని, అన్ని అగ్రకులాలవారు వెళ్లిన తరువాతనే దళితులూ పోవాలని అనేక రకాలుగా వివక్షత కొనసాగుతుంది.

అయినా రక్తం చింది, ఏరులై పారి, తెగ నరికి, గోనెసంచులలో కుట్టి పడేస్తే గాని మనకి కులహింస అని స్పృహకి రాదా? మారణకాండలకి , హింసకి అంత అలవాటుపడ్డామా? ఇక్కడ పుట్టుకనే ఒక అవమానం, జీవితమంతా ప్రతిరోజు, ప్రతినిత్యం నిందలు, అవమానాలు, కష్టాలు అనుభవించే దళితులు, అంటరానితనం అసలు లెక్కలోకి రావా? ఈ దేశంలో కులం పోనిదే నిజమైన ప్రజాస్వామ్యం, సమానత్వం రాదని చెప్పిన అంబేద్కర్ ని కేవలం దళిత నాయకుడిగానే చూడాలా? ఎంతో కష్టపడి తెచ్చుకున్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి చట్టాన్ని నిర్వీర్యం చేసి, కేవలం కక్ష సాధింపులకి కుదించి వేసి నిజమైన బాధితులకి న్యాయం జరగకుండా చేసేది ఎవరు? అసలు ప్రజాస్వామ్యం ఎవరికి వచ్చింది? స్వేచ్ఛ, సమానత్వం ఎక్కడ ఉంది? ఇవి ఇప్పుడు మళ్లీ అంటరాని సమాజం ఆలోచించాల్సి ఉంది.

ఇప్పుడు ఇంకా భయంకర వాతావరణంలోకి భారతదేశం నెట్టివేయబడుతుంది. మోడీ మాయలో పడ్డ ప్రజలకు కులం గురించి అర్థం చేసుకునే అవకాశం లేదు. అటు రాజ్యం కుల నిర్మూలన పోరాటాలని సంక్షేమ పథకాలకి కుదించివేస్తే, ఇటు కులసంఘాలు అంబేద్కర్‌ని విగ్రహాలకి, జయంతులకి, వర్ధంతులకి, వోటు రాజకీయాలకి పరిమితం చేసి దళారీ పాత్ర పోషిస్తున్నాయని కష్టంగా అయినా చెప్పక తప్పడం లేదు. రాజ్య స్వభావాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక, తమ పోరాటాలు ఎవరిమీదో తేల్చుకోలేక, మిత్రులెవరో, శత్రువులెవరో గుర్తించక ఉద్యమం అక్కడక్కడ పట్టణ ప్రాంతాల్లో, ఇంటర్నెట్‌లో కనపడుతున్నప్పటికీ, అత్యాచారాలను, హత్యలని, అవమానాలని నిరోధించే స్థితికి చేరలేదు.

కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి బండారు లక్ష్మయ్య ఆటుపోట్లకి తట్టుకొని నిలబడి పాతపల్లి ఉద్యమానికి సంఘంగా, వ్యక్తిగా కూడా అండగా ఉన్నాడు. ఆయన మాటల్లో 'రాజ్యం పూర్తిగా మనువాద, బ్రాహ్మణ భావజాలంతోనే ఉంది. కులపోరాటం ఆత్మగౌరవ పోరాటంగా అర్థం చేసుకోవట్లేదు. వర్గపోరాటం దశలవారీగా కొనసాగుతుంది కాని కులపోరాటంలో అత్యవసరంగా పరిష్కరించాల్సిన డిమాండ్లు ఉంటాయి. వాటితో ప్రజలకి ముఖ్యంగా బాధితులకి నమ్మకం, ఉత్సాహం వస్తుంది. అవసరం కూడా. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఒక కులం, ఇంకో కులం మధ్య దూరం వారి ప్రవర్తనని, సంబంధాలని బట్టి ఉంటుంది కాని దూరంగా ఉండి చూస్తే అర్థం కాదు. పాతపల్లి బోయల మీద కేసులు పెట్టడం అంటే మొత్తం బిసిలను దళితులకి దూరం చేస్తున్నారని మాట్లాడడం సరయినది కాదు. ఆ సమస్య అక్కడి కోణం లోంచే చూడాలి. రాజ్యం బోయలకి కొమ్ముకాయడంలోనే వాళ్ల కుల ధోరణి స్పష్టంగా కనపడుతున్నది.'

'ఎనుముల హుస్సేన్ పాతపల్లి వాసి. ఇరవై సంవత్సరాలుగా దండోరా కార్యకర్త. మొదటినుంచి పోరాటం నడిపిస్తున్న వాడు. "మేము ఆకలితో బతుకుతాం కాని అవమానాలతో బతకలేం. మేం ఎవరి భూములు అడగట్లేదు, మా భూములు మాకే కావాలంటున్నాం. అన్ని ప్రభుత్వ అంగాలు అమ్ముడుపోయినాయి. కులసంఘాలు మోసం చేస్తున్నాయి. చివరి వరకు ఉండి పోరాటం చేయాలనుకుంటున్నాము. ప్రభుత్వ అధికారులు మమ్మల్ని మా జాగా నుండి దూరంగా పోవడానికి, మామధ్యలో చిచ్చు పెడుతున్నారు. వాటిని మేము ఎదిరిస్తాము. మాలోనే కొందరు వ్యక్తుల తప్పిదాలవల్ల అవతలి వారికి భయం లేకుండా పోతుంది' అన్నాడు.

అది భూమి వివాదమే కావచ్చు. విద్య, వివాహం, ఉద్యోగం, స్నేహం, ఉద్యమాలు కూడా కులం కోణంలో చూస్తేగాని ఈ దేశంలోని కుల వివక్షతకి కారణాలు అర్థం కావు. జనాభా దామాషా ప్రకారం ఎన్నికలలో, ఆర్థిక రంగాలలో చోటు అడగడం తప్పుకాదు కాని అక్కడే ఆగిపోవడం, మనువాద రాజ్యానికి లొంగి పనిచేయడం కుల ఉద్యమాన్ని పూర్తిగా పక్క దారి పట్టిస్తున్నాయి. ఈ దేశంలో బహుజనులు అందరు ఏకమైతే మాకు మనుగడ సాధ్యం కాదని మనువాదులు పకడ్బందీగా బిసి, ఎస్‌సి, ఎస్‌టిల మధ్య అంతరాలని చెరిపెయ్యలేనివిధంగా ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తున్నారు. అంబేద్కర్ వాదులు ఆశించే కుల నిర్మూలన సమాజం, మార్క్సు వాదులు కలలు కనే వర్గ నిర్మూలన సమాజం కులం పోకుండా భారతదేశంలో సాధ్యం కావు. కులాన్ని కేవలం ఆర్థిక చట్రంలో బిగించి చూస్తే అసలు ముందుకు పోలేం. అంబేద్కర్, మార్క్సు ఇద్దరు ఐక్యమైతే కాని కులాన్ని, మతాన్ని, ఆర్థిక, సామాజిక అసమానతలని అధిగమించలేము అని ఇప్పటివరకు నడిచిన చరిత్ర చెపుతుంది.

పాతపల్లి నేర్పిన గుణపాఠంలోంచి రేపటి కుల నిర్మూలనా ఉద్యమాలు నడవాలి. కులం పోకుండా బంగారు తెలంగాణ ఎంతమాత్రం సాధ్యం కాదు. మహా అయితే దళితులని బలిపీఠం మీద పెట్టి సాధించుకునే తెలంగాణ అగ్రకుల, అభివృద్ధి ముసుగు వేసుకున్న నయా భూస్వామ్య తెలంగాణ కావచ్చు.

*(రచయిత శాతవాహన యూనివర్సిటీలో సమాజశాస్త్ర ప్రొఫెసర్)* వీ

# అడుగంటుతున్న గ్రామీణ భారతం

*ఆరున్నర దశాబ్దాల తర్వాత భారత పాలకుల వైఫల్యాలకు చిహ్నంగా గ్రామాల్లో పేదరికం తాండవిస్తోందనీ, ఇందుకు గ్రామీణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిపిన సర్వే ఫలితాలే నిదర్శనమనీ అంటున్నారు* **ఎ. నర్సింహారెడ్డి**

దేశవ్యాప్తంగా 640 జిల్లాల్లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2011లో సర్వే జరిపినది. మొట్టమొదటి సామాజిక ఆర్థిక, కుల గణన (సెక్) 2011 వివరాలను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బీరేంద్ర సింగ్‌లు సంయుక్తంగా 2015 జూలై 3న విడుదల చేశారు. 1931 తర్వాత చేపట్టిన తొలి సామాజిక ఆర్థిక కులగణన ఇది. ఇందులో నగరాల వివరాలు, కులాల వివరాలు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నివేదిక గ్రామీణ భారతం దుస్థితికి, దశాబ్దాల విధానపర వైఫల్యాలకు, అభివృద్ధి విధానాల్లోనూ ప్రాధాన్యాల్లోనూ ఉన్న లోపాలకు అద్దం పట్టింది. పల్లెల అభివృద్ధికి సంబంధించిన భ్రమలను బద్దలు కొడుతూ కొన్ని నిర్భ్రాంత పరిచే వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. గ్రామీణ భారతం అనుకున్న దానికంటే దయనీయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు వెల్లడైంది. సెల్‌ఫోన్లు పెరిగాయి, వాహనాలు పెరిగాయి, టివిలు పెరిగాయి, రిఫ్రిజిరేటర్లు పెరిగాయి... కానీ గ్రామీణ భారతంలో అక్షరాస్యత పెరుగలేదు, నిరుపేదల సంఖ్య తగ్గలేదు, భూ సంస్కరణలు అమలు జరుగలేదు. పల్లె భారతం నిరు పేదరికంలో ఎంతగా కునారిల్లుతోందో ఈ సర్వే బహిర్గతం చేసింది. ఇది ప్రభుత్వం చేపట్టిన అధికారిక అధ్యయన పత్రం కనుక సాధికారికత ప్రశ్నార్థకం కాదు. అలాగే ఈ నివేదిక ద్వారా తెలిసి వచ్చిన వాస్తవాలు సమకాలీన పరిస్థితులని శ్రద్ధగా గమనించే వారికి అవగాహనలో ఉన్నప్పటికీ సమస్యల తీవ్రత మాత్రం కలవరపెట్టేదే.

గ్రామసీమల అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలు అమలు చేశాం, ఒక్కొక్క ప్రణాళికలో లక్షల కోట్లు ఖర్చు చేశాం అని పాలకులు ఎన్ని తీపికబుర్లు వినిపించినా, అభివృద్ధి ఫలాలు గ్రామాల్లోని పెత్తందారీ వర్గాలకు తప్ప సామాన్యుల దరిచేరలేదు. పట్టణాల-గ్రామాల మధ్య వ్యత్యాసం తగ్గిస్తామని ఎన్ని కబుర్లు చెప్పినా అది పూడ్చలేని అగాధంగానే మిగిలింది. గ్రామాల్లోని అభివృద్ధి అంతరాలు ఏమాత్రం చెరిగిపోలేదు. పైగా ఆర్థిక సంస్కరణలు అమలులోకి వచ్చిన రెండున్నర దశాబ్దాల్లో చేతివృత్తులు దాదాపు అంతరించాయి. ప్రత్యామ్నాయం లేక కులవృత్తుల వారు వ్యవసాయ కార్మికులుగా మారారు. మరోవైపున వ్యవసాయ సంక్షోభం, యాంత్రీకరణ పెరుగుదల వల్ల వ్యవసాయ కార్మికులకే పనులు దొరకని స్థితి. మోతుబరులు పట్టణాలకు చేరుతుండగా, వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు వ్యవసాయ సంక్షోభ దుష్ఫలితాన్ని అనుభవిస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇది సూక్ష్మంగా గ్రామీణ దుస్థితి.

దేశంలో పేదరికాన్ని అధ్యయనం చేసేందుకు 1990లో లక్డావాలా కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ గ్రామాల్లో 2,400, పట్టణాల్లో 2,100 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకోవటానికి ఒక్కరికి ఒకరోజుకు అవసరమైన ఖర్చును అంచనా వేయాలని, ఆ విధంగా ఎవరైతే ఆహారం తీసుకోలేకపోతారో వారంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిగా పరిగణించాలని పేర్కొంది. అయితే దారిద్ర్యాన్ని నిర్వచించే కొలమానాల విషయంలోనే అసలు తగాదా. దారిద్ర్యరేఖను ఒక్కొక్కరు ఒక్కో విధంగా నిర్వచిస్తున్నారు. పేదరికంపై ప్రభుత్వ గణాంకాలకు, ఆర్థిక శాస్త్రవేత్తల అంచనాలకు తీవ్ర వైరుధ్యం గోచరిస్తున్నది. అధినేతల మెప్పు కోసం పేదరికం తగ్గిందని నివేదికలు అందజేయడం అధికారులకు పరిపాటిగా మారింది.

ఒక కుటుంబానికి ఏమేమి వసతులు ఉన్నాయో తెలుసుకొని ఆ కుటుంబం పేదదా? కాదా? అనే నిర్ణయానికి వచ్చే పద్ధతి ఒకటైతే, ఎటువంటి ఇల్లు ఉంది? ఎటువంటి దుస్తులు వేసుకుంటున్నారు? ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు? అక్షరాస్యత ఉన్నదా లేదా? పిల్లలు ఏమి చేస్తున్నారు? ఇటువంటివే మొత్తం 13 సూచీల ద్వారా సమాచారం సేకరించడం మరొక పద్ధతి. 2002లో జరిగిన ఇటువంటి సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతంలో 28.3 శాతం కుటుంబాలూ, పట్టణ ప్రాంతంలో 27.5 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నట్టు నిర్ధారించారు.

ప్రతి కుటుంబం ఆహార, ఆహారేతర అవసరాల కోసం గ్రామీణ ప్రాంతంలో రోజుకు రు. 26 కానీ అంతకంటే తక్కువ కానీ ఖర్చు చేస్తున్నట్లయితే ఆ కుటుంబం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు గుర్తిస్తున్నామనీ, అదే పట్టణ ప్రాంతమైతే రు. 32 కానీ అంత కంటే తక్కువగానీ ఖర్చు చేస్తున్న కుటుంబాన్ని పేదరికంలో ఉన్నట్టు లెక్కిస్తున్నామనీ ప్రణాళికా సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్నది. దేశంలో పేదల సంఖ్యను టెండూల్కర్ కమిటీ 27 కోట్లని, రంగరాజన్ కమిటీ 36 కోట్లని, సక్సేనా కమిటీ 50 కోట్లని, అర్జున్ సేన్ గుప్త కమిటీ 75 కోట్లని అంచనా వేశాయి. ఇప్పుడు నీతి అయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా కూడా గతకాలం నాటి ప్రణాళికా సంఘం ఎంచుకున్న పద్ధతుల మీద అభ్యంతరాలున్నాయంటున్నారు. తమకంటూ కొన్ని లెక్కలు, విధానాలు ఉంటాయనీ, అవసరమైన పక్షంలోనే ఈ సర్వే ఫలితాలను ఉపయోగించుకుంటామని అంటున్నారు.

ఆహార భద్రతా పథకాన్ని అమలు చేయడానికి పేదరికంపై కచ్చితమైన అంచనా అవసరమేర్పడింది. మరోవైపు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లను 50 శాతం పైన పెంచుతూ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు న్యాయ సమీక్షకు వచ్చిన సందర్భంలో కులాల వారీ సరైన జనాభా లెక్కలు లేకుండా రిజర్వేషన్‌ల పెంపుదలను పరిశీలించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ 2009లో ఎన్ సి సక్సేనా నేతృత్వంలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సూచించిన నూతన సూచీల ఆధారంగా సామాజిక ఆర్థిక కులగణన చేపడుతామని 2011 అక్టోబర్ 3న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, గ్రామీణాభివృద్ధి శాఖ

మంత్రి సంయుక్తంగా ప్రకటన చేశారు. ప్రణాళిక సంఘం సాధారణంగా ఆదాయం ప్రాతిపదికపై దారిద్ర్యం అంచనా వేయగా, అందుకు భిన్నంగా సెక్ సామాజిక కొలబద్దలను ఏడింటిని అదనంగా నిర్దేశించుకుని సర్వే నిర్వహించింది. అవి 1. కచ్చా ఇల్లు 2. భూమిలేని కుటుంబాలు 3. రోజు కూలీపై జీవనం 4. మహిళలే కుటుంబ బాధ్యతలను నిర్వహించడం 5. పని చేసే పురుషుడు లేని కుటుంబాలు 6. ఎస్సి కుటుంబాలు 7. ఎస్టి కుటుంబాలు.

ఆర్థికపరమైన సూచీలుగా ద్విచక్ర, త్రిచక్ర వాహనం ఉన్నా, కారు ఉన్నా, వ్యవసాయ పనిముట్లు ఉన్నా, క్రెడిట్‌కార్డు ఉన్నా, కుటుంబ సభ్యులలో ఒక్కరైనా రు. 10,000 లేదా అంతకు మించి ఆదాయం సంపాదిస్తున్నా, కుటుంబంలో ఎవరైనా ఆదాయం పన్ను కానీ వృత్తి పన్నుకానీ చెల్లిస్తున్నా (ఇటువంటివే మొత్తం 14 సూచీలలో ఏ ఒక్క సూచీకి అవునని సమాధానం వచ్చినా) పేదరికం లేనట్టే. దీని ఆధారంగా గ్రామీణ భారతంలోని మొత్తం 17.91 కోట్ల కుటుంబాల్లో సామాజిక ఆర్థిక కుల గణన సర్వేను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ 2011-13 మధ్య కాలంలో నిర్వహించింది.

2011 నాటికి దేశ జనాభా సుమారు 122 కోట్లు. అందులో గ్రామీణులు 73 శాతం (89.06కోట్లు). గ్రామాల్లో నెలకు అయిదు వేల రూపాయల లోపు ఆదాయంతో నెట్టుకొస్తున్నవారు 74 శాతం (65.9కోట్లు). దేశవ్యాప్తంగా పది వేల రూపాయల కన్నా తక్కువ ఆదాయంతో గుట్టుగా గడుపుతున్న కుటుంబాల సంఖ్య 92 శాతం (112.24కోట్లు). దేశంలో మొత్తం కుటుంబాలు 24.39 కోట్లు కాగా గ్రామీణ కుటుంబాలు 17.91 కోట్లు. వాటిలో 10.69 కోట్ల కుటుంబాలు ఏదో ఒక లేమితో ఉన్నాయి. మొదటి లేమి గ్రామీణ కుటుంబాల్లో దాదాపు 30 శాతానికి అంటే 5.37 కోట్ల కుటుంబాలకు సాగుభూమి లేదు. రెండవ ప్రధానలేమి విద్య. 23.5 శాతం కుటుంబాల్లో 25 ఏళ్ల వయసు పైబడిన వయోజన నిరక్షరాస్యులు సుమారు 4.21 కోట్లు ఉన్నారు. 89 కోట్ల గ్రామీణ జనాభాలో 36 శాతం నిరక్షరాస్యులు. గ్రామీణ అక్షరాస్యుల్లో ఐదవ వంతుకు పైగా ప్రాథమిక విద్య పూర్తి చేయలేదు. 5.4 శాతం మాత్రమే హైస్కూలు విద్య పూర్తి చేయగా, 3.4 శాతం మాత్రమే ఉన్నత విద్య పూర్తి చేశారు. మూడవ లేమి గృహవసతి. గ్రామాల్లో 94 శాతానికి సొంత ఇళ్లున్నాయి. అయితే 54 శాతానికున్నవి 1-2 గదుల నివాసాలు. 13.25 శాతం మంది ఒంటిగది కచ్చా ఇళ్లలో (మట్టిగోడలు, గడ్డి, పెంకులు వగైరా కప్పు) నివసిస్తున్నారు. నాల్గవ ప్రధాన లేమి స్థిరమైన ఆదాయం లేకపోవటం. 51.14 శాతం శారీరక, క్యాజువల్ శ్రమపై ఆధారపడగా, 30.10 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. 9.68 శాతం కుటుంబాలకు మాత్రమే వేతన ఆదాయం ఉంది. వారిలో 5 శాతం ప్రభుత్వోద్యోగాలు, 1.11 శాతం ప్రభుత్వరంగ ఉద్యోగాలు, 3.57 శాతం ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తంగా గ్రామాల్లో 10.69 కోట్ల కుటుంబాలు దారిద్ర్యంలో ఉన్నాయి. 16-59 సంవత్సరాల మధ్య వయసుగల మగవారు లేకుండా మహిళలు మాత్రమే పోషించే కుటుంబాల సంఖ్య 68.96 లక్షలని వెల్లడైంది.

ఈ సర్వేలో సామాజిక ఆర్థిక స్థాయిలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని, ప్రభుత్వ పథకాల అమల్లో వాటిని ఉపయోగించుకుంటామని, వాటి ఆధారంగా పథకాలను అమలు చేస్తామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బీరేంద్ర సింగ్‌లిరువురు గాలి కబుర్లు మరోసారి చెప్పారు. మన దేశంలో 60 శాతం జనాభా గ్రామాల్లో వ్యవసాయం జీవనాధారంగా జీవిస్తున్నారు. అందువలన గ్రామీణ ప్రజల జీవితాలు భూమితో ముడిపడి ఉన్నాయి. భూకేంద్రీకరణను బద్దలు కొట్టే భూసంస్కరణలు అమలు చేయకపోవడమే గ్రామీణ పేదరికానికి ప్రధాన కారణమని సర్వే వివరాలను గమనిస్తే స్పష్టమవుతుంది. మన పాలకులు భూసంస్కరణలను అటకెక్కించి, గ్రామీణ ప్రజల మౌలిక సమస్యను పరిష్కరించకుండా సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను దగా చేస్తూ తమ చుట్టూ తిప్పుకొంటున్నారు. ద్రవ్య నియంత్రణ సాకుతో బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కత్తెర వేస్తున్నారు.

అధికార మార్పిడి జరిగి స్వపరిపాలన ఏర్పడి 68 సంవత్సరాలు గడిచినా గ్రామాల పరిస్థితుల్లో మార్పు రాలేదు. ఇప్పటికీ మూడోవంతు గ్రామీణ కుటుంబాలకు సెంటు భూమైనా లేదన్నది యథార్థం. ఇది మన పాలకుల ఆర్భాట భూసంస్కరణల డొల్లతనాన్ని ధ్రువీకరిస్తోంది. ఇప్పటికీ గ్రామీణుల్లో సగం మందికి పైగా రోజువారీ కూలీ చేసి పొట్టపోసుకుంటున్న వారే. ఇళ్లలో పని చేసుకుని, చెత్త ఏరుకుని, భిక్షాటన ద్వారా బతుకీడుస్తున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. భారీయెత్తున గుమ్మరించామన్న సబ్సిడీలు, లెక్కకు మించిన సంక్షేమ పథకాల గురికి బారెడు దూరమైన పర్యవసానంగానే- సంక్షేమం కరువై నేడు పల్లెసీమలు ఇలా గోడుగోడున విలపిస్తున్నాయి. గ్రామీణ భారత్ మసక బారింది. దేశానికి పట్టుగొమ్మలుగా విరాజిల్లాల్సిన గ్రామాలు నిర్జీవ రూపం సంతరించుకున్నాయి. సామాజిక ఆర్థిక కుల గణన 2011 లెక్కలు గ్రామాల దయనీయ స్థితిని, అధోగతిని కళ్లకు కట్టాయి.

ఆరున్నర దశాబ్దాల వ్యవధిలో పదకొండు పంచవర్ష ప్రణాళికల ద్వారా గ్రామీణాభివృద్ధికి చేసిన వ్యయం రెండు కోట్ల కోట్లు. ఈ నిధులన్నీ కరిమింగిన వెలగపండు చందంగా గ్రామ పెత్తందారులకు, పాలకుల జేబుల్లోకే చేరాయి. ఆకలి, అవిద్య, అనారోగ్యం ఎప్పటిలాగే గ్రామీణ భారతాన్ని వెంటాడుతున్నాయి. భూమి కలిగిన వారు తక్కువైనా, దానిపై మనుగడ సాగిస్తున్న వారు అధికం. అందుకనే వ్యవసాయ సంక్షోభం గ్రామీణ ఆర్థిక వ్యవస్థని కోలుకోలేని దెబ్బతీస్తుంది. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడం ప్రభుత్వపు తొలి ప్రాధాన్యతగా ఉండాలి తప్పితే భూమిని లాక్కునే విధానాలూ, వ్యవసాయ సబ్సిడీ తగ్గించే విధానాలు పనికిరావు. ప్రజలను విస్మరించి అభివృద్ధి సాధించడమన్నది అర్థం లేని విషయం. విద్య, వైద్యం, ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ప్రణాళికలుండాలి. పర్యావరణాన్ని నాశనం చేసే, సహజ వనరులను లూటీ చేసే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెట్టుతాయి తప్ప జీవితాలను మెరుగు పరచవు. అందువల్ల మన దేశానికి అనుగుణమైన స్వదేశీ ఆర్థిక విధానాలతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగడమే మన పాలకుల కర్తవ్యం కావాలి.

**తెలంగాణ**

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం గ్రామీణ కుటుంబాలు 57,06,101 ఉండగా, దీనిలో 25.35 లక్షల కుటుంబాలు (44.42 శాతం) ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయి. ఒకే కచ్చా గదిలో నివసిస్తున్న కుటుంబాలు 1.11 లక్షలు వున్నాయి. రోజువారి కులీపైన జీవిస్తున్న కుటుంబాలు 13,04,599 (23) ఉన్నాయి. నెలసరి ఆదాయం పదివేల పైన వున్న కుటుంబాలు 3.54 శాతం ఉన్నాయి. తెలంగాణలో ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు 4,35,712 (7.64) ఉన్నాయి. దీనిలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు 1,55,904 (2.73) ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు 1,14,207 (2శాతం) ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు 1,68,511 (2.95) ఉన్నాయి. తెలంగాణలో నిరక్షరాస్యులు 40.42 శాతం (95.5 లక్షలు). ఇది

| గ్రామీణ సామాజిక ఆర్థిక, కుల గణన వివరాలు (శాతం) | | | |
|---|---|---|---|
| మొత్తం కుటుంబాలు | - | 57,06,101 | |
| ఎస్‌సి కుటుంబాలు | - | 10,26,439 | (17.99) |
| ఎస్‌టి కుటుంబాలు | - | 6,81,169 | (11.94) |
| ఇతరులు | - | 39,96,561 | (70.04) |
| కులం చెప్పనివారు | - | 1587 | (0.03) |
| మొత్తం అక్షరాస్యులు | - | 2.36,30,222 | (59.58) |
| నిరక్షరాస్యులు | - | 95,50,430 | (40.42) |
| ప్రాథమిక విద్య లోపు | - | 25,27,805 | (10.70) |
| ప్రాథమిక విద్య | - | 34,62,151 | (14.65) |
| మాధ్యమిక విద్య | - | 30,37,576 | (12.85) |
| సెకండరీ విద్య | - | 24,94,192 | (10.56) |
| ఇంటర్ విద్య | - | 14,30,613 | (6.05) |
| గ్రాడ్యుయేషన్ | - | 9,96,146 | (4.22) |
| పిజి | - | 1,28,213 | (0.54) |
| వెనుకబడిన కుటుంబాలు | - | 25,35,522 | (44.42) |
| వెనుకబడిన ఎస్‌సి, ఎస్‌టిలు | - | 9,31,090 | (16.32) |
| దినసరి కూలీలు | - | 13,04,599 | (22.86) |
| ఒక్క గదితో ఉన్నఇళ్లు | - | 1,11,432 | (1.95) |
| స్త్రీ ప్రధాన కుటుంబాలు | - | 2,90,546 | (5.09) |
| స్థితి గల కుటుంబాలు | - | 3,54,478 | (13.98) |
| **ఆదాయ వనరులు** (శాతం) | | | |
| వ్యవసాయం ద్వారా | - | 14,94,378 | (26.19) |
| దినసరి కూలీలు | - | 28,29,348 | (49.58) |
| ఇళ్లలో పనిచేయడం | - | 1,44,001 | (2.52) |
| చెత్త ఏరుకోవడం | - | 12,447 | (0.21) |
| వ్యవసాయేతర | - | 1,50,622 | (2.64) |
| భిక్షాటన | - | 11,273 | (0.20) |
| ఇతరాలు | - | 10,61,461 | (18.60) |

జాతీయ సగటు నిరక్షరాస్యత 35.73 శాతం కంటే ఎక్కువ. తెలంగాణ అక్షరాస్యత 59.58 శాతం మాత్రమే ఉంది. మహిళలు యజమానులుగా ఉన్న కుటుంబాలు 16.06 శాతం ఉన్నాయి. 10.51 లక్షల మంది వితంతువులున్నారు. వ్యవసాయ భూమి కలిగిన కుటుంబాలు 24,17,061 (42.35) ఉండగా, భూమిలేని కుటుంబాలు 32,88,938 (57.65) ఉన్నాయి. సెల్‌ఫోన్ వాడుతున్న కుటుంబాల శాతం ఏపీ కన్నా తెలంగాణలో అధికంగా ఉంది. ఏదో ఒక వాహనం ఉన్న కుటుంబాలు తెలంగాణలో 30 శాతమున్నాయి. తెలంగాణ గ్రామీణ జనాభాలో 1.29 శాతం మందికే 4 చక్రాల వాహనాలున్నాయి. తెలంగాణలో పదహారు శాతం కుటుంబాలకు మహిళలే సారథులు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం జనాభా 2,36,30,222. వీరిలో పురుషులు 1,19,90,074, మహిళలు 1,16,34,855 ఉన్నారు.

**రైతుల దుస్థితి**

కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా అందే రుణ సదుపాయం అంతంత మాత్రమే. తెలంగాణలో సొంత భూమిలేని కౌలు రైతులకు రుణాలు సక్రమంగా అందడం లేదు. మొత్తం గ్రామీణ కుటుంబాల్లో కౌలు రైతుల్లో కేవలం 0.46 శాతం (26,296) మందికే కిసాన్ క్రెడిట్ కార్డులున్నాయి. వ్యవసాయానికి రుణం తీసుకున్న వారిలో రు.50 వేలకు మించి రుణం తీసుకున్న కిసాన్ క్రెడిట్ కార్డులున్నవారు 1.59 శాతం మాత్రమే. ఈ విషయంలో జాతీయ సగటు 3.62 శాతం ఉండగా, అందులో సగం కుడా తెలంగాణలో లేదు. సాగునీటి వసతి లేక వర్షాధార భూముల్లో సేద్యం చేస్తున్న రైతు కుటుంబాలు 32.52 శాతం. 28.63 శాతం మందికే సాగునీటి వసతిగల భూములున్నాయి. ల్యాండ్ ఫోన్ ఉన్న కుటుంబాల వారు 1.77 శాతమే కావడం గమనార్హం. ట్రాక్టర్ ఉన్న కుటుంబాలు కేవలం 3.02 శాతం మాత్రమే. అవి కూడ వ్యవసాయేతర పనులకు వాడుతున్నారు.

**ఆంధ్రప్రదేశ్**

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 1,22,23,095 కుటుంబాలు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 92,97,011 కుటుంబాలున్నాయి. దీనిలో 54.78 లక్షల (58.93) కుటుంబాలు రోజువారీ కూలి పనుల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడ్డాయి. 22.41 శాతం కుటుంబాలకు వ్యవసాయం ప్రధాన ఆదాయ వనరు, భూమి ఉన్న కుటుంబాలు 27 శాతం మాత్రమే. నీటి పారుదల సౌకర్యం లేని భూమి ఆంధ్రప్రదేశ్‌లో 24 శాతం ఉంది. రెండు పంటలకు నీటి సౌకర్యం గల భూమి 36 శాతం ఉంది. ఇతర నీటిపారుదల సౌకర్యం గల భూమి 40 శాతం వుంది. గ్రామీణ ప్రాంతాల్లో 3.59 కోట్ల మంది నివసిస్తుండగా, వీరిలో 37.85 శాతం మంది నిరక్షరాస్యులు కాగా అక్షరాస్యులు 62.15 శాతం. 1.35 కోట్ల

| గ్రామీణ అక్షరాస్యత (శాతం) | | |
|---|---|---|
| 5వ తరగతిలోపు | - | 14.72 |
| 5వ తరగతి | - | 17.12 |
| 7వ తరగతి | - | 13.25 |
| 10వ తరగతి | - | 8.54 |
| ఇంటర్ | - | 4.46 |
| డిగ్రీ | - | 3.43 |
| పిజి | - | 0.62 |
| **గ్రామీణ జనాభా వివరాలు** | | |
| మొత్తం జనాభా | - | 3,59,24,522 |
| పురుషులు | - | 1,82,39,917 |
| స్త్రీలు | - | 1,76,80,563 |
| వితంతువులు | - | 18,05,713 |
| మొత్తం కుటుంబాలు | - | 92,97,011 |
| భూమి ఉన్న కుటుంబాలు (27) | - | 25,10,190 |
| భూమి లేని కుటుంబాలు (73) | - | 67,86,821 |
| **వ్యవసాయాధారిత కుటుంబాలు** | | |
| మొత్తం భూమి (ఎకరాల్లో) | - | 4.58,22,592 |
| భూములున్న కుటుంబాలు | - | 24,71,258 |
| పూర్తిగా నీటి సౌకర్యం | - | 1,66,74,945 |
| ఇతర నీటి వసతి | - | 1,81,28,780 |
| వెనుకబాటుతనంలో | - | 56,65,794 |
| వ్యవసాయం ఆధారిత | - | 20,83,753 |
| దినసరి కూలీ | - | 54,78,337 |
| భిక్షాటన | - | 16,321 |

# స్వర్ణాంధ్ర స్వర్ణపిశాచి నగరం

*అభివృద్ధి పేరుతో వచ్చిన బహుళజాతి సంస్థ నగరం గ్రామంలో సృష్టించిన బీభత్సం ప్రజల్ని ఇప్పటికీ వెంటాడుతోందనీ, బాధితులకు నష్ట పరిహారం పేరుతో ప్రభుత్వం తన తప్పిదాలను కప్పిపుచ్చుకుంటోందనీ అంటున్నారు* **హేమా వెంకట్రావ్**

స్వర్ణపిశాచి నగరం.... రష్యన్ విప్లవ మహారచయిత మాక్సిం గోర్కి రాసిన ఒక నవల పేరు అది. గ్యాస్ లీక్ అయి అగ్నికీలల్లో దగ్ధమైన కోనసీమ నగరాన్ని చూసినప్పుడు మొదటగా గుర్తొచ్చింది ఆ పేరే. నగరం తగలబడిపోయి సంవత్సరకాలం గడచిపోయింది. ఇప్పటికీ ఆ తలపులో మార్పు ఏమిలేదు. స్వర్ణాంధ్రులు, బంగారు తెలంగాణలు నిర్మించే చంద్రబాబులు, చంద్రశేఖర్‌లను చూస్తుంటే ఇంకెన్ని స్వర్ణపిశాచి నగరాలకు తెర తీస్తారోననే మృత్యుభయం వెన్నాడుతూనే ఉంది.

ఆంధ్రప్రదేశ్ కేరళగా పిలుచుకునే కోనసీమ 16 మండలాల్లో మామిడికుదురు మండలంలోని నగరం గ్రామంలో 2014 జూన్ 27న తెల్లవారుజామున సహజవాయువు సరఫరా చేస్తున్న పైప్‌లైన్ గ్యాస్‌లీక్ అయ్యి అంటుకోవడంతో భారీ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 22 మంది మరణించగా 30 మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు. 400 మీటర్ల ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. సుమారు 18 అంగుళాల పైప్‌లైన్ ద్వారా సరఫరా అవుతున్న గ్యాస్ అంతకు ముందు అర్ధరాత్రి నుంచి లీక్ అవుతూ దాదాపు 50 ఎకరాల పరిధిలో దట్టంగా అలుముకుంది. యాభై మీటర్ల పరిధిలో మంటలు విస్తరించడంతో ఇళ్లు, చెట్లు, మాడి మసై పోయాయి. భూకంపం వచ్చినట్టు భూమి కంపించింది. ఇళ్లు బీటలు వారాయి. ప్రమాదం సంభవించినప్పుడు గ్రామం ఇంకా మేల్కోలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశం దగ్గర్లోనే స్కూల్ ఉంది. అదే ప్రమాదం పూర్తిగా తెల్లవారిన తర్వాత జరిగివుంటే ప్రాణనష్టం భారీగా జరిగుండేది.

సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం వేసిన ఈ పైపులైన్లు తగిన నిర్వహణ లేక పలుమార్లు గ్యాస్ లీక్ అవుతూనేవుంది. ప్రధాన పైప్‌లైన్‌లోని విస్ఫోటం యాదృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. అంతకు ముందు మూడు రోజుల క్రితమే అక్కడ గ్యాస్ లీక్ అయిందని భావించి గెయిల్ (గ్యాస్ అథారిటి ఆఫ్ ఇండియా లిమిటెడ్) అధికారులు అరకొర మరమ్మత్తు చేశారు. అయినా అక్కడే ప్రమాదం జరిగింది. బావుల నుండి పైపులైన్లు ఒక ప్రధాన పైప్ ద్వారా నియంత్రణ కేంద్రానికి అనుసంధానమవుతాయి. దీనిని ట్రంక్‌లైన్ అంటారు. ట్రంక్‌లైన్‌లోని ప్రతి 2 కి.మీ.కు ఒక అత్యవసర నియంత్రణ వాల్వ్ అమరుస్తారు. పైపులో లీకేజీలు వంటివి జరిగిపుడు వాల్వ్ దానంతట అదే మూసుకుపోవాలి లేదా జి.ఎస్.లో నిపుణులు మూసివేస్తారు. ప్రమాద ఘటనకు దాదాపు 15 కి.మీ. దూరంలో వాల్వ్ కింద తుప్పుపట్టిన పైపు, మూలనపడేసిన కొత్త పైప్‌లైన్ ప్రతిపాదనలు కోనసీమను బూడిదపాలు చేసింది.

కెజిబేసిన్‌లో మూడు దశాబ్దాల్లో ఇది ఆరో అతిపెద్ద లీకేజి. 1993 మార్చ్‌లో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాను ఆనుకున్న ప్రాంత ప్రమాదంలో 28 రోజుల పాటు గ్యాస్ బయటకు వచ్చింది. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద గ్యాస్ లీక్ అవుట్ పాశర్లపూడిలో 1993 జనవరి 8న జరిగి సుమారు 63 రోజులు ఉంది. 1998లో దేవర్లంకలో 17 రోజుల పాటు, 2005లో తాండనపల్లి, ముల్కిపల్లిలో, 2012లో గ్యాస్ కనెక్షన్ సెంటర్ తాటిపాక వద్ద క్రూడ్ లీకేజి జరిగింది. గడిచిన నాలుగేళ్లకాలంలో సుమారుగా 75 చోట్ల పైపులైన్ల లీకేజీ పరంపర కొనసాగుతుంది. బావుల్లో కాలక్రమేణా నిక్షేపాల పీడనస్థాయి తగ్గిపోవడంతో కొత్తపైపులైన్ల ఏర్పాటుపై దృష్టి సన్నగిల్లడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక పాతవాటిని రిపేర్లు చేసే ఆలోచనే లేదు. కోనసీమ

---

మందికి ఇప్పటికీ అక్షరజ్ఞానం లేదు. ఇప్పటికీ ఏపీలో పట్టభద్రులు 3.43 శాతం మాత్రమే ఉన్నారు. ఏపీలో 4,24,174 కుటుంబాలు (4.5) మాత్రమే వేతనాలు పొందుతున్నారు. దీనిలో 1,79,891 కుటుంబాలు (1.93) ప్రభుత్వ ఉద్యోగాల్లోను, 31,952 కుటుంబాలు (0.34) ప్రభుత్వ రంగంలోనూ, 2,13,155 కుటుంబాలు (2.29) ప్రైవేటు రంగంలోనూ ఉన్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిస్థితి ఆసక్తిదాయకం. భూమిలేని గ్రామీణ కుటుంబాలు తెలంగాణలో 58 శాతం కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 73 శాతం. రోజువారి కూలీపై ఆధారపడిన కుటుంబాలు తెలంగాణలో 34.55 శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో 48.46 శాతం. వేతన ఉద్యోగాలు తెలంగాణలో 7.64 శాతం కాగా ఆంధ్రప్రదేశ్‌లో 4.56 శాతం. హైద్రాబాదు నగరంలో పనిచేస్తున్న ఆం.ప్ర. ఉద్యోగులను కలిపి చూపడం వలన ఈ తేడా కన్పిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి ఉన్న గ్రామీణ కుటుంబాలు తెలంగాణలో 2.73 శాతం కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 1.93 శాతం మాత్రమే. తెలంగాణలో నిరక్షరాస్యత శాతం 40.42. కాగా ఆంధ్రప్రదేశ్‌లో 37.85 శాతం. ఈ నివేదిక ఉద్యమకారులకు ఒక మేలు కొలుపు, పాలకులకు హెచ్చరిక కూడా. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం తమ రాష్ట్ర స్థితిని అధ్యయనం చేయాలి. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవలసిన చర్యలను రంగాల వారీగా గుర్తించాలి. ప్రత్యేక ప్రాధాన్యతతో పథకాలు రూపొందించి నిర్దిష్టకాల పరిమితిలో అమలు జరపాలి. ప్రజలందర్నీ ఉద్ధరిస్తున్నట్లు నేతలు చేసే గంభీరోపన్యాసాలకు కడుపునిండే కాలం గతించి పోయింది. ప్రభుత్వాలు మేలుకోకపోతే ప్రజలు మేల్కొనే కాలం వస్తుంది.

*(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి)* వీ

16 మండలాలలో 14 మండలాల్లో ప్రాణాలు హరించే పైపు జనావాసాల మధ్య నుంచే వెళుతోంది.

అమెరికాను అన్నింటా ఆదర్శంగా తీసుకునే ప్రభుత్వాలు అక్కడి రక్షణ ప్రమాణాలు ఎందుకు తీసుకోరు? మనదేశంలో ప్రజల ప్రాణాలు, ప్రకృతికి విలువ లేదు. లాభాపేక్షతో బహుళజాతి కంపెనీలకు పనిముట్టుగా ఉపయోగపడే రాజ్యం ప్రజా వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నది. అమెరికా లాంటి దేశాలలో అయితే చమురు సంస్థలు నిర్వహించే పైప్‌లైన్లలో ఉన్న పీడనం, ఉష్ణోగ్రతను 24 గంటలు పర్యవేక్షిస్తారు. పైపు లైన్ల వెంట లీకేజి గ్రాహకాలను ఉంచుతారు. ఎక్కడైనా లీకేజి సంభవిస్తే తక్షణమే అందుకు సంబంధించిన ప్రమాద హెచ్చరికలు కేంద్రాలకు చేరవేస్తారు. ఎలక్ట్రానిక్ సాంకేతిక పరిజ్ఞానంతో గొట్టాల్లో అంతర్గతంగా ఏర్పడే లోపాలను పసిగట్టి సవరిస్తారు. పైపులైన్ల వెంట పైన ఏర్పాటు చేసే సూచిక ఆధారంగా భూమిపై సముద్ర మార్గంలో నిత్యం హెలికాప్టర్లలో భద్రతా సిబ్బంది నిఘా ఉంటారు. ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అయితే మన దగ్గరకు వచ్చేటప్పటికి నగరం ప్రజలు ఎన్ని కంప్లయింట్‌లు గెయిల్ అధికారులకు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంకా చెప్పాలంటే సరైన నియంత్రణ, మార్గదర్శకత్వమే లేకుండా పోయింది.

వాస్తవానికి జరిగిందేమిటంటే అక్కడి మాజీ సర్పంచ్ ఎం.పి.టి.సి. చెప్పినదాని ప్రకారం 83–84లో తాటిపాకలో సహజవాయువు వనరులున్నాయని గుర్తించడం జరిగింది. ఓఎన్‌జిసి మొదట ప్రజలతో మాట్లాడవలసి ఉంది. కాని ప్రజల ఇష్టాలతో సంబంధం లేకుండా అప్పుడు సర్పంచ్ కొందరు లోపాయకారి సహాయంతో ఆ ఊరిలోకి ఓఎన్‌జిసి గెయిల్ ప్రవేశించాయి.

ఇక నష్టపరిహారం విషయానికి వద్దాం. 80లో జి.ఒ. 68 పరిహార చట్టాలు లేవు. కాని అప్పటికే 1994 భూసేకరణ చట్టం అమలులో ఉంది. ఇచ్చిన కాస్త నష్టపరిహారం కూడా రాజ్యాంగ బద్ధం కాదు. శంకర్ అనే రైతు చెప్పిన ప్రకారం వాళ్ల తల్లి తండ్రుల కాలంలో ఇచ్చిన భూములకు లెక్కపత్రాలు ఏమి లేవు. గ్యాస్ పైపు వెళ్లిన భూమి మేరకే కాస్తంత నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. కాని ఈ రోజు జరిగిందేమిటి? అప్పుడు అడుగు చొప్పున లెక్క కట్టిస్తే ఈ రోజు వామనుని పాదం లాగా నగరం అంతా కమ్మేసిన మృత్యువుకు ఏ లెక్కన లెక్క కడతారు.

మొదట్లో సర్పంచ్, పెద్దలు గ్రామ పరిస్థితులు, పైపు లైను నిర్వహణ గురించి చెప్పినప్పుడు వెనువెంటనే గెయిల్ అధికారులు స్పందించేవారు. కాని తర్వాత కాలంలో తమ బాధ్యతలను తప్పించుకోవడానికి జిల్లా పాలనా యంత్రాంగం ద్వారా మాత్రమే ప్రజలు తెలియపర్చాలని గెయిల్ మాట మార్చివేసి బాధ్యత నుండి తప్పుకుంది అని మాజీ యం.పి.టి.సి. అన్నారు. గ్రామానికి శిస్తు కింద రు. 45,000 అలాగే అక్కడి యువకులకు ఉద్యోగాలు, భద్రత, ఆసుపత్రి సదుపాయాలు లాంటివి చేస్తామన్నారు. వారికాళ్ల కింద గొట్టాలు అయితే పడ్డాయి కాని వారి భవితకు ఎటువంటి బాటలు పడలేదు. అంతకంటే దారుణంగా చరిత్రలో ఒక మృత్యునగరంగా నగరం మిగిలిపోయింది.

2014 జూన్ 28న తెల్లవారుజామున సంఘటనతో దేశం దిగ్భ్రాంతిలో ఉండగానే అప్పుడే రెండుగా విడిపోయిన రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోసం సహాయం, మద్దతు పేరిట రాజకీయ నాయకులు గద్దల్లా స్మశాన భూమిపై వాలారు. ఎలక్షన్ల స్టంట్‌లో భాగంగా కేంద్రం, రాష్ట్రం, గెయిల్ అధికారులు మృతుల కుటుంబాల కోసం పెద్ద ఎత్తున తాయిలాలు ప్రకటించారు. చనిపోయినవారికి 25 లక్షలు ప్రకటించగా గాయపడిన వారికి మాత్రం 5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. చాలా మంది అబ్బో ఎంత డబ్బో అనేంతగా చేశారు. కాని వాస్తవాలు వేరు.

చనిపోయినవారి కుటుంబాలలోని వ్యక్తులకు ఒక ఉద్యోగం, ఇల్లు కట్టిస్తామన్నారు. అధికారులను నిలదీస్తే మీ బతుకుకు ఇదే ఎక్కువ అన్న ధోరణి. గాయపడ్డ వారిలో కొద్దిమందిని సజీవంగా ఉన్న శవాలతో సమానం. ఎలాంటి పని చేసుకోలేక కాళ్లు, చేతులు కదిలించలేని వారు ఉన్నారు. 5 లక్షలతో జీవితకాలం ఎలా కుటుంబాన్ని పోషించగలరో స్వర్ణాంధ్ర నిర్మాతలే చెప్పాలి. 8 సంవత్సరాల బాబు ఎటువంటి పరిస్థితిలోను పనిచేసుకోలేని స్థితిలో ఉన్నాడు. కనీసం మంచి చదువు చెప్పించమని ప్రభుత్వాన్ని అడిగినా స్పందన లేదు. ఇల్లు కోల్పోయిన వాళ్ల పరిస్థితి హృదయ విదారకం. పూరి పాక నుంచి పెద్ద మేడ వరకు ఒకటే గాటనకట్టి డబ్బులు ఇచ్చారు. వీళ్ల కనీసం అదే జిల్లా కాకినాడ సెజ్ ప్రమాణంగా తీసుకోవాల్సింది. అక్కడ ఇంటిని బట్టి వెల నిర్ణయించి ఇవ్వడం జరిగింది. గవర్నమెంట్ కాకిలెక్కలు వేసి జెఎన్‌టియు టీమ్‌తో లెక్కలు కట్టించి నామ్‌కేవాస్తే ఇచ్చారు. అన్నిటికంటే మించి కోనసీమలో కొబ్బరిచెట్టు అంటే ఇంటి పెద్ద కొడుకుతో సమానం. కాని ప్రభుత్వం ఆరు వేలు శిస్తుగా ఇచ్చి చేతులు దులుపేసుకుంది.

ఇక పర్యావరణం గురించి ఎంత చెప్పినా తక్కువే. విచ్చల విడిగా భూమిని పైపులైన్ల కోసం తవ్వేయడం వలన భూమి కుంగిపోయిందని, భూగర్భజలాలు కలుషితమయ్యాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. సంఘటన జరిగిన తర్వాత ప్రజలు చర్మవ్యాధులు, ఆస్తమా లాంటి ఉదరకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. విస్థాపన జరిగినప్పుడు సాధారణంగా ప్రజలు అక్కడ నుంచి వెళ్లిపోతారు. అక్కడ జరిగే కాలుష్యానికి గురికారు. కాని ఇక్కడ జరిగింది కొంత భూభాగాన్ని పైపులైన్లకు ఇచ్చి పక్క భూభాగంలో ప్రజలు ఉంటున్నారు కాబట్టి ప్రజలే అత్యంత బాధితులు.

గ్రామాన్ని దత్తత తీసుకుంటామన్న ప్రకటనలు పేపర్‌కే పరిమిత మయ్యాయి. సాధారణంగా విపత్తు సంభవించినప్పుడు సాధారణ స్థితికి చేరే వరకు ప్రభుత్వం అండ ఉంటుంది. కాని ఇక్కడ పరిమితమైన షెడ్లు వేసి కొంత మందికి అరకొర వైద్య సదుపాయాన్ని, ఆహారాన్ని, నీటిని అందించారు. మానసిక అలజడికి గురైన వారికి కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు ఏమి చేపట్టలేదు.

**న్యాయ పోరాటం**

సంఘటన జరిగిన వెంటనే అనేక ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు ప్రజల్ని పరామర్శించాయి. మానవ హక్కుల కమిషన్, హైదరాబాద్‌లో పిటిషన్ వేయడం జరిగింది. ప్రభుత్వం ఏవో సమాధానాలు చెపుతూనే ఉంది. కాని ప్రాథమికమైన విషయాల పట్ల స్పందన కరువే. రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కును, ఆర్టికల్ 21ని కాలరాసింది. విచారణ నిమిత్తం స్థానిక ప్రజలు, శాస్త్రవేత్తలు, హక్కుల

కార్యకర్తలతో కమిటి ఏర్పాటు చేయాలని, బాధ్యులైన వారిని సెక్షన్ 302 కింద అరెస్టు చేసి విధుల నుండి సస్పెండ్ చేయాలని, బాధితులకు రు. 50 లక్షల పరిహారం, ఉద్యోగం ఇవ్వాలని, ప్రైవేటు కాంట్రాక్టు లైసెన్స్ రద్దు చేయాలని, పైపులైన్లను జనావాసాల నుండి తప్పించాలని కోరారు. న్యాయం జరగని బాధితులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు.

మానవ హక్కుల నాయకులు డా. బాలగోపాల్ ఎప్పుడూ ఒక విషయం చెబుతూ ఉండేవారు. 'న్యాయ పోరాటం కంటే ప్రజా పోరాటమే మంచి ఫలితాలనిస్తుంది, చట్టం ఒక ప్రాతిపదిక మాత్రమే' అని. ఇది అక్షరాలా నిజం, నిజానికి ప్రజలు కోర్టులను ఆశ్రయించలేదు. ఆ పని బయట మానవ హక్కుల సంఘాలు చేసాయి. ఇక ఉద్యమానికి ఒక సోంపేట స్ఫూర్తీ, నందిగాం మార్గదర్శకత్వమో లోపించింది. మధ్య తరగతి, కొంత మేరకు ధనిక రైతాంగం కదిలినా వారు మిగిలిన అట్టడుగు వర్గాలను ఉద్యమంలో కలుపుకోలేక పోయారు. తక్షణం ఇది బాధితుల ఉద్యమమే కాని రాబోయే రోజులలో వీటి ప్రభావం మిగతా సెక్షన్స్‌పై ఉంటుందన్న చైతన్యం, అవగాహన ప్రజలకు ఉన్నా ఒక పోరాట ఎత్తుగడగా ప్రజల్ని సమీకరించడంలో నాయకత్వం విఫలం చెందింది. బయటి హక్కుల సంఘంలో నుంచి ఆ మేరకు ఉద్యమానికి అండ దొరకలేదు. సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్, సెజ్‌లో పాల్గొన్న మహిళల భాగస్వామ్యం ఈ ఉద్యమంలో లేదు. దళిత అస్తిత్వ ఉద్యమానికి పుట్టినిల్లయిన తూర్పుగోదావరి జిల్లా ప్రభావం ఈ ఉద్యమం మీద పడలేదు. ఓఎన్‌జిసికి గెయిల్‌ను బాధిత పోరాట కమిటీ ఒక్క ప్రశ్న సంధించింది. అదేమిటంటే 'మా పిల్లలు, మనకు ఇలాంటి సంఘటన మళ్లీ జరగకుండా ఉంటుందా! అంటున్నారు. ఓ నాయకులారా, ఓ అధికారులారా మీ పిల్లలు కూడా ఈ ప్రశ్నే వేస్తే మీరు ఏమి బదులు చెబుతారు' అని.

జాతి మొత్తం సహానుభూతి చూపించిన ఈ సంఘటన పై స్థానిక ప్రజల స్పందన ఉద్యమ రూపు తీసుకోలేదు. వాస్తవానికి కమ్యూనిస్టు ఉద్యమానికి కోనసీమ రాజోలు ఆయువు పట్టు. నగరానికి ఈ రాజోలు కేవలం 5 కి.మీ. దూరంలోనే ఉంది. ఇప్పుడు దాని ప్రభావం లేక పోవడం విచారకరం. ఇదే తూర్పు గోదావరి జిల్లాలో గత సంవత్సరం వాక్తిప్పలో జరిగిన సంఘటనపై దళిత, బిసి వర్గాలకు చెందిన బాధితులు వివిధ పోరాట రూపాలతో ఉద్యమాన్ని నడిపి తమ డిమాండ్లైన నష్టపరిహారం, ఇంటికొక ఉద్యోగాన్ని సాధించుకున్నారు. అయితే నగరం విషయంలో ఎక్కువ మంది బాధితులు ఆధిపత్య కులాలకు సంబంధించిన వారు కావడంతో రాజ్యంలో భాగస్వాములైన తమ వర్గం వారు ఏదో చేస్తారని ఒక ఆశ కూడ వాళ్లని ఉద్యమంలోకి వెళ్లకుండా వెనక్కి లాగిందేమో! వాక్తిప్ప సెజ్ ఉద్యమాల్లో కదిలి వచ్చిన స్త్రీలు ఇక్కడ కానరారు. అందుకు ఆధిపత్య కులాల స్త్రీలపై ఉన్న పితృస్వామ్య భావజాలం ప్రధాన కారణంగా పనిచేసి ఉండవచ్చు. ఒక కార్యకర్తగా ఉద్యమకారులను అడిగినప్పుడు కూడా వారి సమాధానం ఒకటే. స్త్రీలు బయటకిరారని తెలిపారు. ఇలా కుల పితృస్వామ్య భావజాల ప్రభావంతో పాటు ఒక నిర్దిష్ట సైద్ధాంతికతతో ప్రజలు నడిపే వర్గ దృక్పథం కలిగిన నాయకత్వం లేకపోవడం ఇక్కడ కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

సంక్షేమ రాజ్యంగా లిఖించుకున్న రాజ్యాంగం ఎన్ని మార్పులకు గురయిందో మనకు తెలుసు. పైగా ప్రజలకు, రైతులకు, అట్టడుగు వర్గాలకు ఇచ్చే రాయితీలు ప్రభుత్వ ఖజానాకు దెబ్బ, బడ్జెట్ లోటుకు మూలమని ఇది అరాచకత్వానికి దారి తీస్తుందని మాట మాటకు విమర్శలు వినిపిస్తాయి. కాని పెట్టుబడిదార్ల ప్రయోజనాల కోసం జాతీయ సంపదను అతి చౌకగా ఇస్తున్న మాట నిజం కాదా! జాతి భవిష్యత్తు అవసరాలకు ప్రజల్ని త్యాగం చేయమని 1982-83లో ఓఎన్‌జిసి, గెయిల్ కోనసీమలో ప్రవేశించాయి. ప్రజలకు బంగారు లోకం చూపించాయి. కాని ఇప్పుడు ల్యాంకో, దేశాన్ని శాసిస్తున్న రిలయన్స్ కంపెనీ అవసరాలకు ఈ గ్యాస్ సరఫరా అవుతుందని అందరికి తెలుసు. దేశ సంపదను ఇంత చౌకగా ఏ దేశంలో అమ్మగా చూడమేమో!

1982లో అప్పుడప్పుడే వస్తున్న ఉదారవాదంతో దేశభక్తిని రంగరించి ప్రజలపై రుద్దితే ఇప్పుడు బాహాటంగా గుత్త పెట్టుబడిదారీ వర్గానికి రాజ్యం సమస్త వనరులను కైవసం చేస్తుంది. స్థానిక ప్రజల ప్రయోజనాల కంటే జాతి ప్రయోజనాలు ముఖ్యమని ఊదరగొట్టి సహజవాయువు కోసం నగరంలో ప్రవేశించిన ఓఎన్‌జిసి, గెయిల్ వెనుక పెట్టుబడి అవసరాలు వేరే ఉన్నాయి. అప్పటికి నూతన ఆర్థిక విధానాలు, ఉదారవాదం, ప్రపంచీకరణ, ప్రస్ఫుటంగా కన్పించక పోయినా పెట్టుబడిదారుల ఉమ్మడి సంస్థగా మారిన ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ప్రక్రియ, పారిశ్రామికీకరణ అంత ఎక్కువభాగం పరాధీనంగానే, బహుళజాతి సంస్థ ఆదేశాల మేరకే, బహుళ జాతి సంస్థ ప్రయోజనాల కొరకే జరిగింది. ఇక 1990 తర్వాత నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ తర్వాత విదేశీ పెట్టుబడితో కలిసి పోవడమే అభివృద్ధికి బాగా తలచి, బహుళజాతి సంస్థలకు భాగస్వాములు కావడం జరిగింది. ఈ క్రమాన్నే మనం నగరంలో చూస్తాం. మొదట జాతి ప్రయోజనాలు అని నమ్మబలికిన రాజ్యం క్రమంగా ల్యాంకో, రిలయన్స్ తదితర సంస్థల ప్రయోజనాలకు గ్యాస్ వెలికితీత, సరఫరా ఏజెంటుగా మారింది.

సుప్రీంకోర్టు, కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా భూగర్భంలో ఉన్న మినరల్స్ తదితర భూవనరులు గవర్నమెంట్‌కే చెందాలని లేదని అవి భూమిదారునికి చెందుతాయని జూలై 2013లో ఒక సంచలనాత్మక తీర్పుని ఇచ్చింది. ఆ విధంగా చూసినా నగర సహజ వాయువు భూమిదారువే కాని అవి స్థానికుల నుండి లాక్కొనబడి పెట్టుబడిదారీ వర్గానికి ఉపయోగపడుతున్నాయి.

సంక్షేమ రాజ్యంలో రూపొందిన విధానాలు, ప్రమాణాలు కేవలం మాటల వరకే పరిమితమయ్యాయి. స్వావలంబన, ప్రజా భాగస్వామ్యం వంటి విలువలను రద్దుచేసి లాక్కున్న వనరులన్ని బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు ఉపయోగపడగా నగరం పెట్టుబడి స్వలాభాపేక్ష 'స్వర్ణపిశాచ నగరంగా' మారింది. మృత్యువు నుంచి బతికి బయటపడ్డ అనేక మంది కూలీలుగా ఇంకా ఈ నగరంలోనే తలదాచుకున్నారు. అందుకే నగరం ప్రజలు ఈ గ్యాస్ పైపులైన్లను తమ ఊర్ల నుంచి తీసివేసి దూరంగా జనావాసంలేని చోట వెయ్యాలని, జరిగిన నష్టానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది వీరి డిమాండే కాదు 14 మండలాలలో గ్యాస్‌లైన్ల రూపంలో పొంచివున్న మృత్యువు కోరల్లో కూరుకుపోయిన కోనసీమ వాసుల రాజ్యాంగ ప్రాథమిక హక్కు కూడా.

*(రచయిత నగరం బాధితుల న్యాయవాది)* వీ

# ఉరిశిక్ష అమానవీయం - అనాగరికం

***అత్యధిక ప్రపంచ దేశాలు ఉరిశిక్షలను రద్దు చేస్తున్న సందర్భంలో ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న భారతదేశంలో ఉరిశిక్షలను అమలు చేయడం దాని అసలు స్వభావాన్ని బయట పెడుతోందని అంటున్నారు బైరెడ్డి సతీష్***

జూలై 30న దేశం నిద్రలేస్తున్నవేళ నులివెచ్చని సూర్య కిరణాలు నేలను తాకుతున్న క్షణాన యాకూబ్ మెమన్ కంఠానికి ఉరితాడు బిగించబడింది. ఆ రోజు దేశంలోని అన్ని భాషల్లో ఉన్న వందలాది వార్తా చానళ్లలో మొదటి బ్రేకింగ్ న్యూస్ అదే. నేలమీద తొలిశ్వాసను తీసుకున్న రోజే అంతిమ శ్వాసను తీసుకున్నాడు మెమన్. మరణ దండనపై పెట్టుకున్న విన్నపాలకు అన్నిదారులు మూసుకున్నాక, మొదటి పౌరుడు క్షమించలేనన్నాక మళ్లీ అర్ధరాత్రి అంతిమ విన్నపంకోసం అత్యున్నత న్యాయపీఠం తలుపు తడితే వాదోపవాదాలతో నిద్రలేని రాత్రిని గడిపిన న్యాయమూర్తులు మెమన్ శాశ్వత నిద్రలోకి వెళ్లాల్సిందే అనే తీర్పును ఇవ్వడంతో సమీపంలోనే సంచరిస్తున్న మృత్యువు మెమన్ కంఠానికి బిగుసుకుంది. దేశవ్యాప్తంగా, టి.వి. తెరనిండా ఉరిపై ఎడతెగని చర్చలు చోటు చేసుకున్నాయి. 1993 మార్చి బాంబు పేలుళ్ల విధ్వంసం 200 మందికి పైగా చనిపోయిన ఆనాటి ఘటనలో భాగస్వామిగా ఉన్నాడని మెమన్‌కు కింది కోర్టు విధించిన మరణశిక్షనే అమలు పరిచారు.

1993 విధ్వంసానికి, మారణకాండకు తక్షణ ప్రేరేపణగా నిలిచినట్టి 1992 బాబ్రీ మసీదు విధ్వంసం తదనంతర హత్యాకాండకు కారణమైన ఏ వ్యక్తికి ఇటువంటి శిక్ష అమలుకాకపోవడం సహజంగానే అనేక అనుమానాలను రేకెత్తిస్తుంది. ఆ రెండు నేరాలు అనేక వేలమంది అమాయకుల నిండు ప్రాణాలను బలితీసుకున్నవి. అవి అత్యంత హేయమైన, ఏవిధంగా సమర్థించలేని ఘోరాలు. స్వభావరీత్యా ఒకేరకమైనవి అనుకున్నా ఈ దేశ చట్టాలు, న్యాయవ్యవస్థ ఎందుకు ఒకే రకంగా స్పందించలేదన్న ప్రశ్న ఉత్పన్నమౌతుంది. మెమన్ ఉరితీత నేపథ్యంలో రెండు అంశాలు ప్రధానంగా ముందుకు వస్తున్నాయి, (1) ఈ దేశ చట్ట సంస్థలు, న్యాయవ్యవస్థ అట్టడుగు వర్గాలు, దళితులు, మైనార్టీ వర్గాల నేరాల్ని ఆదిపత్యం, పలుకుబడి ఉన్న వర్గాల నేరాల పట్ల ఎలా వ్యవహరిస్తున్నాయి (2) హింసా సంస్కృతి లక్షణమైన మరణదండనను ఎందుకు పరిష్కారంగా భావిస్తున్నాయి. మనిషి పరివర్తన కేంద్రంగా కాకుండా ప్రతీకార దోరణి ప్రధానంగా తీర్పులెందుకువస్తున్నాయి.

పౌర సమాజం కమ్యూనల్ రాజకీయాలతో పోలరైజ్ అయినప్పుడు ఇటువంటి అంశాలను చర్చించడం సాహసమే. సంఘటనకు మాత్రమే ప్రభావితమై, నేపథ్యాన్ని చూడనిరాకరించే సందర్భంలో భావోద్వేగాలే ప్రధానమై హింసాయుత పరిష్కారాలే సరైనవని అనుకుంటారు. మొత్తంగా మరణ శిక్షను వ్యతిరేకించే క్రమంలో మెమెన్ ఉరితీతను వ్యతిరేకించేవారందరిని దేశ ద్రోహులుగా జమకట్టే ప్రయత్నం కొందరు 'దేశభక్తులు' చేసింద్రు. మెమన్ ఉరితీతను వ్యతిరేకించిన వాళ్లంతా మెమన్ ఏ హత్యాకాండలో భాగస్వామో ఆ చర్యను సమర్థించేవాళ్లేమీ కాదు. 1937 సంవత్సరం నుంచి పెద్దగా మత కల్లోలాను చూడని ముంబై 1980 లోంచి వి.హెచ్.పి., శివసేన మత రాజకీయాలతో దాడుల పరంపరకు తెరలేచింది. 1965, 71 రెండు సంవత్సరాల్లో జరిగిన ఇండో-పాక్ యుద్ధ సందర్భంలో కూడా మత సామరస్యం చెదిరిపోలేదన్న వాస్తవాన్ని గమనించాలి.

మందిర్ రాజకీయాలే మతపరమైన అల్లర్లను ప్రేరేపించాయనేది కాదనలేని వాస్తవం. బాబ్రీ మసీదు విధ్వంసం కంటే ముందు మత విద్వేషంతో కూడిన దాడులు జరగలేదనికాదు కానీ అవి ఆయా ప్రాంతాలకు పరిమితమై స్థానిక కారణాలతో ముడిపడి కొద్ది కాలానికే పరిమితమైనవి. మందిర్ రాజకీయాల విస్తరణతోనే విద్వేషాలు, విభజన దేశమంతా పెరిగి పోయింది. ముంబైలో ఒక సాధారణ ముస్లిం కుటుంబంలో పుట్టి పెరిగిన యాకూబ్ మెమన్ అందరిలాగే చదువుకొని తనకు నచ్చిన వృత్తిని ఎంచుకుని జీవిస్తున్న క్రమంలో ఇంత పెద్ద నేరస్తునిగా ఎందుకు మారాల్సి వచ్చింది? 1992 డిసెంబర్ బాబ్రీ విధ్వంసం, 1993 జనవరిలో ముంబైలో ముస్లింల ఊచకోత లేకుండా 1993 మార్చి 12 మృత్యుకాండ ఉండేదికాదు కదా?

ఇవి ఏదో ఒక రాజకీయ బావజాలాన్ని వ్యతిరేకించే క్రమంలో అంటున్నది కాదు, స్వయంగా శ్రీ కృష్ణ కమిషన్ తేల్చినటువంటి పచ్చినిజం. మతోన్మాద రాజకీయాలను నడిపిన బాల్‌థాకరేను ఆ కమిషన్ బట్టబయలు చేసినందుకే కదా ఆ నివేదికను బి.జె.పి. శివసేన ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ఇలాంటి నేపథ్యంలో నేరస్తునిగా మారినా కూడా మెమన్‌ను సమర్థించాల్సిందేమీ లేదు. నేరానికి పాల్పడి పాకిస్తాన్‌కు పారిపోయి రెండు సంవత్సరాల తర్వాత ఈ దేశ చట్టాలపై, న్యాయ వ్యవస్థపైన నమ్మకం ఉండే కదా లొంగిపోయింది? ఆయనపైన జరిగిన విచారణతోనే కదా ఆ మొత్తం సంఘటనలోని సూత్రదారులు, పాత్రదారులు బయటపడింది. తన స్వంత సోదరునిపైన కూడా ఎటువంటి దాపరికం లేకుండా ఈ దేశ భద్రతా సంస్థకు పూర్తి సమాచారం అందించింది. ఆయన లొంగుబాటును అరెస్ట్‌గా చూపెట్టి జైల్లో వేసిన తరువాత జైల్లో ఉంటూనే రెండు పిజి పట్టాలను సంపాదించిందు అంటే ఈ దేశ చదువుపైన, చట్టంపైన నమ్మకమున్న వ్యక్తి అనేకదా అర్థం కావాల్సింది. జైల్లో ఉన్న కాలంలో తన సత్ప్రవర్తనకు ఎటువంటి మచ్చకలగ కూడదని తోటి ఖైదీలు చేపట్టిన ఏ నిరసన, ఆందోళన కార్యక్రమంలో పాల్గొనకుండా ఉన్నది ఇందతా మనిషి పరివర్తనకు సంకేతం కాదా? ఈ పరివర్తను చూసే ఎవరూ ఆయనను

క్షమించి వదిలివేయమని, నేర విముక్తున్ని చేయమని కోరలేదే.

బాబ్రీ మసీద్ విధ్వంసం అనంతరం జరిగిన ఊచకోతల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవాళ్లు, గుజరాత్‌లో ముస్లిం సామూహిక వధకు పాల్పడ్డ దుర్మార్గులు, ఇందిరా గాంధీ హత్యానంతరం సిక్కులను వేలాదిగా బలి తీసుకున్న హంతకులు, బీహార్‌లోనో, ఉత్తరప్రదేశ్‌లోనో మరో ప్రాంతంలోనో దళితులను ఊచకోతలు కోసిన అగ్రకుల సేనల హంతక ముఠాల పట్ల ఈ దేశ చట్ట సంస్థలు, న్యాయవ్యవస్థ ఎట్లా స్పందించింది? ఎంతమందికి శిక్షలు విధించింది? నరహంతకులు ధరాధిపతులై అన్నట్టు వారి నెత్తుటి మడుగుల్ని దాటివచ్చి అధికార పీఠాల మీద కూర్చున్నారు. ఇవన్నీ చూస్తే ఈ దేశంలో చట్టం దృష్టిలో అందరు సమానమేనని, అందరికి సమన్యాయం జరుగుతుందని ఆశించగలమా? ఈ దేశ జైళ్లల్లో మగ్గుతున్నది, మరణ దండనకు గురౌతున్నది ఈ దేశ అట్టడుగు వర్గాల ప్రజలు, మైనారిటి, పేద ప్రజానీకమే అనే వాస్తవాన్ని అధికారిక లెక్కలే తెలియపరుస్తున్నాయి.

**మరణ శిక్షకు మరణ శాసనం లిఖించాల్సిందే**

మెమన్ ఉరిశిక్ష మళ్లీ దేశమంతటా మరణ దండన (కాపిటల్ పనిష్మెంట్) పై ఒక తీవ్ర చర్చకే దారితీసింది. నాగరిక సమాజంలో ఇది నైతికమేనా అనే మీమాంసను రేకెత్తించింది? సాధారణ ప్రజానీకంతో మొదలుకుంటే అన్ని స్థాయిల్లోని మనుషులందరు రెండు శిబిరాలుగా విడిపోయినారు. ఈ దేశంలో ఉరిశిక్ష ఉండాలనే వారే మెజారిటిగా ఉన్నారనేది వాస్తవం. ఉరిని రద్దు పరచాలనే వారి సంఖ్యకూడా పెరుగు తుందనేది కూడా అంతే వాస్తవం. ప్రజాస్వామ్యంలో మెజారిటి ప్రజల అభిప్రాయానికి విలువ ఉన్నప్పటికిని మెజారిటి ప్రజల అభిప్రాయం ఎప్పుడు ప్రజాస్వామికంగా ఉంటుందన్న గ్యారెంటీ ఏమీలేదు.

మరణ దండనను సమర్థించే వాళ్లు అది ఒక నిరోదకంగా పని చేస్తుందని (డెటెర్రెంట్ థియరీ) వాదిస్తూ ఉన్నారు. కఠినమైన శిక్షుంటేనే ఘోరమైన నేరాలకు పాల్పడరని వారి భావన. నిజానికి ఉరిశిక్ష రద్దైన దేశాల్లో నేరాల సంఖ్య పెరిగిన దాఖలాలు కానీ, అమల్లో ఉన్న దేశాల్లో తగ్గిన దృష్టాంతాలు కానీ అంతకంటే లేవు. క్షణికావేశంలో చేసే నేరాలకి, ఉద్దేశ్యపూర్వకంగా, పథకం ప్రకారం చేసే నేరాలకి ఈ 'నిరోధక సిద్ధాంతం' పనిచేయదు అని అనేక దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. మరణ శిక్ష భవిష్యత్తులో నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం పుట్టించి నేర నిరోధకంగా పనిచేస్తుందనే వాదనను చరిత్రక్రమంలో జరిగిన అనేక సంఘటనలు, పరిణామాలు బలహీనపరిచినవి.

ఒకవ్యక్తి తాను చావడానికి సిద్ధపడి ఎంతటి తీవ్రనేరానికైనా ఒడిగడుతున్నాడంటే ఆ వాధనకు విలువలేదని అర్థమవుతుంది. ఆత్మాహుతి దాడులు ఆ వాదనను కొట్టిపడేస్తున్నాయి. మరణశిక్ష అనేది మధ్య యుగాలనాటి ఆటవిక న్యాయం. మనిషి పరివర్తనని అర్థం చేసుకోలేని, అసలు మనిషి మారుతాడు అనే నమ్మకంలేని చీకటి యుగంలో అమలైన అనాగరికపు శిక్ష. ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదు, ప్రాణం పోసే శక్తి ఎవరికి లేదనే వాస్తవిక దృష్టిపై ఆధారపడి ఉరిశిక్షను రద్దుపరచాలనే భావన బలంగా వేళ్లూనుకున్నది. మరి ప్రాణం తీసే వాళ్లకు ఎటువంటి శిక్ష ఉండాలనేది ఈనాటి చర్చకాదు. అనేక శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్నదే.

ప్రాణం తీసిన ప్రతి నేరానికి మరణశిక్షే సరైంది అయినట్లయితే రాజ్యం అనేక రూపాల్లో ప్రజల ప్రాణాలను ప్రతినిత్యం హరిస్తూనే ఉంటుంది. ఆయుధాలు ఉపయోగించి ప్రాణాలు తీస్తేనే నేరం చేసినట్టు కాదు కదా! ఏ రాజ్యంలో అయిన పౌరుల ఆకలి చావులు, వైద్యంలేక చనిపోయేవి, రాజ్య యంత్రాంగ నిర్లక్ష్యం వల్ల అనేక ప్రమాధాల బారిన పడి అకాల మృత్యువుకు గురయ్యేవారందరు చంపబడ్డట్లే కదా! అలా చూస్తే రాజ్యం నిత్యం హంతకిగా నిలిచిపోవాల్సిందేకదా! అప్పుడెవరిని ఉరితీయాలి?

కంటికి కన్ను అనే న్యాయాన్ని అమలుచేస్తే మిగిలేది అంధ ప్రపంచమే అన్న గాంధీ వ్యాఖ్యల్ని ఎట్లా అర్థం చేసుకోవాలి? వ్యక్తులు, బాధితులు మాత్రమే ప్రతీకార వాంఛ కల్గి ఉంటారు. వ్యవస్థకు ప్రతీకార వాంఛ ఎలా ఉంటుంది? ఆధునిక రాజ్యం నాగరిక రాజ్యం బాధితునికి ఉపశమనం, నేరస్తున్ని దిద్దుబాటు చేసేలా రాజ్యం వ్యవహరించాలిగానీ ప్రతీకార ధోరణిని ఎలా అలవర్చుకుంటుంది? ఒకవేళ ప్రాణానికి ప్రాణం తీయడమే న్యాయమైన శిక్ష అయినట్లయితే బాధితులని చేయి నరికివేసిన నేరానికి నేరస్తునికి చేయి నరికివేయరే? గృహ దహనమో, ఆస్తి నష్టమో చేసిన నేరానికి అదే చర్యతో నేరస్తునికి శిక్షలు విధించటం లేదుకదా? రేప్ కేసులో అదే న్యాయాన్ని ఎలా అమలుపరుస్తారు? ఏ నేరమైన వ్యక్తిగత స్థాయిలో జరిగిన తరువాత అది రాజ్య వ్యవస్థ చేతుల్లోకి వెళ్లిపోతుంది. నేరాల్ని నిరోధించే, నేరస్తుల్ని పరివర్తన చేయించే దిశగా రాజ్యం నాగరికమైన చర్యను చేపడుతుందికానీ, వ్యక్తికి ఉండే బలహీనతకు లోనుకాదు కదా?

రాజ్యం నేరం జరగని సమాజాన్ని నిర్మించాలికానీ, నేరస్తున్ని నిర్మూలించే ప్రతీకారేచ్ఛను కలిగి ఉండరాదు. అయినా ఒక మనిషి నేరాన్ని ఖచ్చితంగా ఏ లోపాలు, పక్షపాత ధోరణి లేకుండా నిర్ధారించే యంత్రాంగం ఇవాళ ఉన్నదా. ఏ వ్యక్తి తనకుతానుగా స్వతహాగా నేరస్తుడు అవ్వడుకదా? సమాజంలో ఆవరించి ఉన్న నేర ప్రవృత్తే వ్యక్తుల మనస్సుల్లోకి చేరుతుంది కదా! అలా అని వ్యక్తిని పూర్తిగా నేరంనుండి వేరు చేయాల్సిన అవసరమూ లేదు. కానీ మొత్తం సమాజం వ్యక్తుల నేరమైన ప్రవృత్తికి తనకి ఏ సంబంధమూ లేదు అనే ధోరణిలో ఉండకూడదు. నేరం ఉంటే శిక్ష ఉండాల్సిందే అయితే అది వస్తుగతంగా వేయాలే తప్ప వ్యక్తిగతంగా కాదు. న్యాయ ప్రక్రియను పాటించినంత మాత్రాన అమానవీయమైన చర్యను (మరణశిక్షను) ఎలా సమర్థించగం? ప్రపంచంలో అనేక దేశాలు దాదాపు 140కిపైగా అధికారికంగా మరణ శిక్షను రద్దుపరిచాయి. అనేక దేశాలు అధికారికంగా అమలును నిలిపివేసినవి. కొన్ని దేశాలు ప్రత్యేకించి ఇస్లామిక్ దేశాలు, చైనాలాంటి దేశాల్లో విచ్చలవిడిగా మరణ శిక్షను అమలుపరుస్తున్నారు. 2015 జనవరి నుండి గడిచిన ఆరు నెలల్లోనే పాకిస్తాన్‌లో వంద మందికి ఉరిశిక్షలు అమలు జరిపారంటే రాజ్య హత్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. నాగరిక దేశమని, గొప్ప ప్రజాస్వామ్య దేశమని అగ్రదేశమని విర్రవీగుతున్న అమెరికాలో సైతం విచ్చలవిడిగా మరణ శిక్షలను అమలుజరుపుతున్నారు.

భారతదేశంలో మరణ శిక్షలను తక్కువ సంఖ్యలో అమలు జరుపుతున్న అధికారికంగా మరణశిక్షను శిక్షాస్మృతి నుండి తొలగించ లేదు. జాతీయోద్యమకాలంలోనే ఉరిశిక్షను రద్దుపరిచే ఉద్యమ బీజాలు ఉన్నాయనే విషయం చరిత్రలోకి తొంగిచూస్తే బోధపడుతుంది. తన సాయుధ పోరాట చర్యలతో తెల్లవాడి పెత్తనాన్ని సవాలు చేసిన

# యాకుబ్ మెమన్‌కు ఉరిశిక్ష సమంజసమేనా?

*పాలకులు అధికారాన్ని అడ్డంపెట్టుకొని చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ, నేరస్తుల విషయంలో ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తూ శిక్షలు విధిస్తున్నారని అంటున్నారు* **చిమ్మె జాన్ బర్నబాస్**

**1993** మార్చ్ 12న దేశ వాణిజ్య రాజధాని ముంబై వరుస బాంబు పేలుళ్ల కేసుతో ఉరిశిక్ష పడిన యాకూబ్ మెమన్‌ను 2015 జూలై 30న ఉరితీసింది ప్రభుత్వం. ఇది కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ చేసిన రాజకీయ తప్పిదం, తొందరపాటు చర్య. ఈ సంఘటనలో మరణించిన 257 మంది, క్షతగాత్రులయిన 700 మంది ప్రజల ఆర్తనాదాలను అడ్డం పెట్టుకుని, దాని ద్వారా రాజకీయ లబ్ది పొందాలనే ఉద్దేశంతో, అటు రాజ్యాంగ ప్రక్రియలన్నింటిని త్వర త్వరగా పూర్తి చేసింది. మానసికంగా కుంగిపోయిన రాజకీయ ఖైదీని ఉరితీయడం ద్వారా బాధితులకు ఏదో న్యాయం జరిపించినట్లు భావించాలనే బలమైన ఆకాంక్ష భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో కనిపిస్తుంది. అది ఆచరణ ద్వారా నిరూపించారు.

నిజంగా మహారాష్ట్రలోని దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం, గతంలో వారి పార్టీలో కేంద్ర మంత్రిగా పనిచేసి, ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న చెన్నమనేని విద్యాసాగర్‌రావు ద్వారా 'క్షమాభిక్ష'ను తృణీకరించి, కనీసం క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకున్న 14 రోజుల గడువును కూడా ముగించకుండా ఆగమేఘాల మీద ఉరితీయడం ద్వారా ఒక వ్యక్తి 'జీవించే హక్కు'ను కోల్పోయేటట్లు చేసి, కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు, వారికి వత్తాసు పలుకుతున్న అధికార యంత్రాంగం అందరూ కలిసి 'హత్య' గావించారు. ఇది రాజ్యాంగ పరిధిలోని హత్య. దీనిని రుజువు చేయడం న్యాయ విచారణ పరిధి, నేర న్యాయ తాత్వికతతో ముడిపెట్టాలి. అది ఈ దేశంలో చాలా కొరవడింది. ఈ విషయం అనేక కేసులలో రుజువైంది.

అసలు దోషులైన దావూద్ ఇబ్రహీం, ముస్తాక్ ఇబ్రహీం (టైగర్) మెమన్‌లను విడిచిపెట్టి, కేవలం తనకు తానుగా కొన్ని ఆధారాలను తీసుకుని వచ్చి లొంగిపోయిన వ్యక్తిని 22 సంవత్సరాలు నిర్బంధించి, చివరకు ఉరితీయడం రాజ్యం చేసిన హత్య గాక మరేమవుతుంది. ఇది పూర్తిగా ఆధునిక న్యాయ విచారణ ప్రక్రియలో ఒక వ్యక్తి నేరాంగీకారాన్ని, 'నేరం'ను రుజువు చేసే క్రమానికి సహకరించాలనే, భారత రాజ్య వ్యవస్థపై నమ్మకంతో, విశ్వాసంతో, తాను జన్మించిన గడ్డపై వందలాది మంది మారణహోమానికి గురయ్యారనే బాధతో 'స్వయం ప్రేరణ'తో లొంగిపోయిన యాకూబ్ మెమన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దయతలచకపోవడం నిజంగా 'భారతీయ జనతా పార్టీ' అధికార రాజ్య వ్యవస్థ, వారి తాత్విక సిద్ధాంత వ్యవస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తమను తాము నిరూపించుకున్నారు.

1992 డిసెంబర్ 6న జరిగిన బాబ్రీ మసీద్ విధ్వంసం తర్వాత దేశ వ్యాప్తంగా, మరీ ముఖ్యంగా, ముంబై లాంటి మహానగరాల్లో హిందూ మతతత్వ వాదుల ప్రేరేపణతో జరిగిన విధ్వంసంలో మరణించిన వారి సంఖ్య, గుజరాత్ గోద్రా అల్లర్లలో, విధ్వంసంలో మరణించిన వారి

---

భగత్‌సింగ్‌ను ఉరితీసిన సందర్భమది. ప్రతి భారతీయుని గుండెను కుదిపేసిన అత్యున్నత త్యాగం నేపథ్యంలో దేశమంతా ఉరిశిక్షపై ఆగ్రహ జ్వాలలు అంటుకున్నవి. ప్రజాభిప్రాయం మరణదండనను సంపూర్ణంగా రద్దుపరచాలనే వైపు మళ్లింది. అంతటి ప్రజా ఆందోళన ఒత్తిళ్ల మధ్య 1931 మార్చి 29 కరాచిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో ప్రాథమిక హక్కులు–విధులు అనే ప్రకటనలోనే 'మరణశిక్షలు ఉండరాదు' *(There shall be no capital punishment)* క్లాజ్–XIII తీర్మాణం జరిగింది. అధికార బదిలీ తదనంతర పరిణామాల్లో రాజ్యాంగ పరిషత్ ఈ అంశాన్ని సీరియస్‌గానే చేపట్టింది. రాజ్యాంగంలో పొందుపర్చాలని నిర్ణయించింది. కానీ సరిగ్గా అదేకాలంలో హిందూత్వ శక్తులు గాంధీని హత్యచేయడంతో ఈ మొత్తం అంశం తలకిందులైంది. ఆనాటి రాజ్యాంగ సభలో ముస్లింలీగ్ సభ్యుడైన జె.హెచ్. లారి మరణశిక్షకు వ్యతిరేకంగా తీర్మాణం ప్రవేశపెట్టి మనిషి ప్రాణం అత్యంత విలువైనదని, మానవ తీర్పు అన్నివేళలా లోపరహితంగా ఉండదని, మరణ శిక్ష ద్వారా మనిషికి సరిదిద్దుకునే అవకాశం కూడా ఉండదని వాధించాడు. కానీ గాంధీ హత్య కాంగ్రెస్ సభ్యుల అభిప్రాయాన్ని పూర్తిగా మార్చివేసింది. మెజారిటి సభ్యులు మరణశిక్షవైపే మొగ్గుచూపారు. అలా ఒక గొప్ప అవకాశం చేజారిపోయింది. అదే గాంధీ కంటికి కన్ను..... పంటికి పన్ను అనే న్యాయం అమలైతే ప్రపంచం అందకారం అవుతుందని, అవిటిదవుతుందన్న అంశాన్ని గుర్తుంచుకోవాలి. ఐక్యరాజ్య సమితి సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనలో భారత్ కూడా భాగస్వామ్య దేశమే. మరణ దండన విధించడమంటే మానవ హక్కుల్ని అత్యంత తీవ్రంగా ఉల్లంఘించడమనే భావన ఆ ప్రకటనలో నెలకొని ఉంది. మరణశిక్షలు సమాజాన్ని మరింత హింసాయుత ప్రవృత్తివైపు నడిపిస్తాయనే అంశాన్ని మరవరాదు. అలా నేరాన్ని పునరుత్పత్తి చేసే వ్యవస్థను పెంచిపోషిస్తుంది. వ్యక్తి సమాజం మొత్తపు ఒక సూక్ష్మరూపం. సమాజపు నేర ప్రవృత్తి వ్యక్తులకు అలవడుతుంది. వ్యక్తి నేరానికి కేవలం వ్యక్తి మాత్రమే కారణం కాదు సమాజం ప్రధాన భాగస్వామే. నేరానికి ఇతరేతర కారణాలుంటాయి వాటిని పరిష్కరించాలేకానీ నేరస్తులను నిర్మూలించడం వల్ల నాగరిక సమాజం నిర్మాణం కాదు.

*(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)* వీ

సంఖ్య, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలు దహనంలో మరణించిన వారి సంఖ్య, రథయాత్ర పేరుమీద జరిగిన ఘర్షణలలో మరణించిన వారి సంఖ్యలతో ఎంత మందిని నిందితులుగా చేసి, శిక్షించవలసి వస్తుందో, అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలకులు, బిజెపి, శివసేన పక్షానికి సహకరించిన వారు, ఎవరూ ఉరిశిక్షలకు మినహాయింపులు కాజాలరు. అయితే వారిపై నేరారోపణలు రుజువు చేయడం చాలా కష్టమైన విషయం. అదే ఈ దేశంలో 'నేర న్యాయ వ్యవస్థ' లోతైన తాత్విక మీమాంస.

ఉరిశిక్ష విధించబడిన నేరస్థునికి ఉన్న అన్ని దారులూ మూసుకుని పోయిన తర్వాతనే అతనిని ఉరితీశామని చెపుతున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అసలు విచారణ చేపట్టిన 'టాడా ప్రత్యేక కోర్టు' న్యాయస్థానం, నేర విచారణ సమయంలో అనేక అంశాలను స్పృశించలేదనే విషయం, పూర్తిగా ప్రాసిక్యూషన్ కథనాలను విశ్వసించి, నిందితుని 'నేరం ఒప్పుకోలు' (అప్రూవర్) అంశాన్ని పరిగణలోకి తీసుకోలేదనేది సుస్పష్టం.

'నూరు మంది దోషులు శిక్ష నుంచి తప్పించుకున్నా ఫర్వాలేదు, ఒక నిర్దోషి శిక్షించబడకూడదు' అనే ఆధునిక న్యాయ సూత్రం యాకూబ్ మెమన్ కేసులో పాటించబడలేదు. ఎలాననగా, దాదాపు 15 మంది న్యాయకోవిదులు, మాజీ సుప్రీంకోర్టు - హైకోర్టు న్యాయమూర్తులు, విజ్ఞులు, మేధావుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పించినప్పటికినీ, రాష్ట్రపతి స్పందించలేదంటే, రాష్ట్రపతి ఏ విధంగా కేంద్ర ప్రభుత్వ అడుగుజాడల్లో నడుస్తాడో, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తాడో అర్థం చేసుకోవచ్చు.

పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ - యాకూబ్ మెమన్ ఉరిశిక్షను రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తూ, అది ఇటీవల మరణించిన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాంకు స్మృత్యంజలిగా ఉంటుందనీ - ఎపిజె అబ్దుల్ కలాం ఉరిశిక్షలకు వ్యతిరేకమంటూ, కనీసం అది కూడా పరిగణనలోకి తీసుకోవాలనీ సందర్భ సహితంగా గుర్తు చేశారు. కానీ అది కూడా పాటించలేదు ఈ కేంద్ర ప్రభుత్వం.

మరో ముఖ్యమైన విషయమేమంటే ఉరిశిక్ష పడి, క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నవారు చాలా మంది ఉన్నారు. ఎందుకనగా పిటిషన్ పెట్టుకున్న తర్వాత 11 సంవత్సరాల వరకూ రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఎలాంటి నిర్ణయం వెల్లడి కాకపోతే అది 'యావజ్జీవ ఖైదు'గా మారే ప్రొవిజన్ ఉంది. కానీ శిక్షపడి 8 సంవత్సరాలు పూర్తి అయింది. కేవలం 2 సంవత్సరాలు ఉండి ఉంటే అది యావజ్జీవ ఖైదుగా మారుతుందనే ఆత్రుతతో, వెంట వెంటనే ఫైలును పరిశీలించి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రాష్ట్రపతి పరిశీలనకు పంపించి, రాష్ట్రపతిపై ఒత్తిడి పెంచి, క్షమాభిక్షను తిరస్కరింపజేశారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి రాష్ట్రపతి వద్దే కొన్ని గంటలు గడిపారంటే, (పార్లమెంట్ జరుగుతూ ఉండగా) ఆయనపై ఎలాంటి ఒత్తిడి తీసుకొనివచ్చి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం, యాకూబ్ మెమన్‌కు ఉరిశిక్ష విధించడం ద్వారా, దేశ ప్రజలలో ఒక సందేశాన్ని ఇవ్వదలచింది. అదేమంటే '1993 ముంబై బాంబు పేలుళ్లకు పాల్పడిన వారిని మేము శిక్షించాం. దావూద్ ఇబ్రహీం-టైగర్ మెమన్‌లకు ఇదే గతి పడుతుంది' అనీ తద్వారా ఈ దేశంలో తీవ్రవాద చర్యలను మేము అణిచివేస్తామని ప్రకటించింది. అందులో భాగంగానే అసాధారణ రీతిలో సుప్రీంకోర్టు వేకువ జామున 3 గంటల సమావేశంపై వాదనలు విన్న అనంతరం, 4.30 (వేకువ జామున) సమయంలో వెల్లడించిన తీర్పు ద్వారా మహారాష్ట్ర ముఖ్యమంత్రి రాత్రంతా నిద్రపోకుండా సుప్రీంకోర్టు నిర్ణయం కోసం వేచి చూసి ఉదయం 6.30 సమయంలోనే ఉరిని అమలు జరిపించారు. సుప్రీంకోర్టు తీర్పు కాపీని ఫాక్స్ ద్వారా ముంబైకి తెప్పించుకుని, మరీ అక్కడి నుంచి, నాగపూర్ కేంద్ర కారాగారానికి రప్పించి, ఉరిశిక్షను అమలు జరిపించారు. ఉరిశిక్ష అమలుకు వాస్తవానికి మహారాష్ట్ర జైలు మాన్యువల్ ప్రకారం కూడా క్షమాభిక్ష పిటిషన్ విచారణ పూర్తయిన తర్వాత 7 రోజుల విరామం ఉండాలనే నియమ నిబంధనలు కూడా పాటించలేదు ఆ రాష్ట్ర ప్రభుత్వం.

1993 మార్చ్ 12న జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో ఏర్పడిన జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ విచారణ రిపోర్ట్ ఇస్తూ, 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీద్ విధ్వంసం తర్వాత ముంబైలోని ముస్లింలపై జరిగిన దాడుల్లో యాకూబ్ మెమన్ కుటుంబం ఆస్తులు పూర్తిగా ధ్వంసం కావడం కూడా 1993 మార్చ్ 12 బాంబు పేలుళ్లకు టైగర్ మెమన్ కుట్రపన్ని ఉండవచ్చన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తపరిచారు. జస్టిస్ శ్రీకృష్ణ అభిప్రాయాన్ని కూడా యాకూబ్ మెమన్ ఉరిశిక్ష రద్దు పిటిషన్ సందర్భంగా పరిగణనలోనికి తీసుకోలేదనేది స్పష్టమవుతున్నది.

వాస్తవానికి బిజెపి ప్రభుత్వం, ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం వివిధ కుంభకోణాల్లో వారి ప్రధాన నాయకగణ్యం, సుష్మాస్వరాజ్, వసుంధరరాజే సింధియా, 'వ్యాపం' కుంభకోణంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇరుక్కొని పోవడం - దేశ ప్రజల దృష్టిని మరల్చడానికి 'ఉరిశిక్ష'ను అమలు జరిపి, ప్రజలలో ఒక చర్చను లేవదీయడం కూడా ఒక ప్రధాన కుట్ర - బిజెపి ప్రభుత్వం చేసింది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఉరిశిక్ష' రద్దుకోసం అనేక హక్కుల సంస్థలు తమ, తమ ప్రయత్నాలు చేశాయి. ప్రపంచ దేశాలలో చాలా దేశాలు ఉరిశిక్షను రద్దు చేశాయి. అయితే భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ఒక దశలో ఉరిశిక్షను - యావజ్జీవ ఖైదుగా మార్చే ప్రయత్నం కూడా చేసింది. కానీ తీవ్రవాదం - మతం రంగు చూపించి భారతీయ జనతా పార్టీ అధికారంలోని కేంద్ర ప్రభుత్వం ఉరిశిక్షను అమలు జరిపింది. ఇది ఆధునిక న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధంగా ప్రపంచ వ్యాప్తంగా బిజెపి ప్రభుత్వ చర్య ఎండగట్టబడింది.

భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం 'చట్టం ముందు అందరూ సమానులే' అన్న సూత్రం కొన్ని కేసులకు మాత్రమే వర్తించేటట్లు, కొన్ని మతాలకు, కొన్ని కులాల వారికే అమలు జరుగుతున్నట్లు చాలా కేసులలో రుజువైంది. ఇది చాలా దారుణం, అప్రజాస్వామికం.

ఇటీవల భారతదేశంలో అధికారంలో ఉన్న పార్టీలకు చెందినవారు, వారి తాత్విక, సిద్ధాంత భూమికకు చెందిన సంస్థలు ప్రజలను రెచ్చగొడుతున్న తీరు - నేరాలను ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తున్నది. అది ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కులకు పూర్తిగా భంగం వాటిల్లుతున్నది. ప్రజల 'జీవించే హక్కు'ను కాలరాస్తున్నది. 'నేరం' అమలు చేసిన వారికన్నా, నేరం ప్రోత్సహించిన వారికే 'శిక్షాస్మృతి' ఎక్కువగా వర్తించాలి. 'ఆత్మహత్య'లన్నీ వ్యవస్థలో లోపం వల్లే జరిగిన హత్యలే' అంటూ గతంలో సుప్రీంకోర్టు చాలా సార్లు వ్యాఖ్యానించింది. ఇది ఉరిశిక్షలకు కూడా వర్తిస్తుంది.

*(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి)* వీ

# డా. రామనాథం హత్య - ముప్పై ఏళ్లు

***ప్రజాస్వామ్యవాది డా. రామనాథం హత్య జరిగి ముప్పై ఏళ్లు గడిచిన సందర్భంగా ఆనాటి పోరాట పరిస్థితులను, నిర్బంధాలను వివరిస్తూ, ఇప్పటికీ ఆ నిర్బంధాలు ఇంకా తీవ్రమవుతూనే ఉన్నాయని అంటున్నారు* వరవరరావు**

ఈ తరానికి డా. రామనాథం గారి గురించి తెలుసుకోవడం ముప్పై నుంచి నలభై ఏళ్ల క్రితం దాకా తెలుగు సమాజంలో బుద్ధిజీవుల్లో ఉండిన విలువలు, ఆదర్శాల గురించి తెలుసుకోవడం. వైద్యులు రోగుల దగ్గరికి, ముఖ్యంగా పేద రోగుల దగ్గరికి వెళ్లాలన్న వైద్య నీతిని తెలుసుకోవడం. ఇంకా విస్తరించి రోగగ్రస్త వ్యవస్థకు చికిత్స చేయడాన్ని తెలుసుకోవడం. ఈ తెలుసుకోవడంలో ఇమిడి ఉన్న ప్రజాస్వామిక ఉద్యమ సంస్కృతిని ఒంటబట్టించుకోవడం. ఆ క్రమంలో ఆయన పరిణతి రాజ్యహింసకు ప్రాణాలే కోల్పోయేంత కఠోర పరీక్షనెదుర్కొన్నది.

డా. ఎ. రామనాథం ఖమ్మం జిల్లా మధిర దగ్గర మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో 1932లో పుట్టారు. బిఎస్‌సి పూర్తయ్యాక, వివాహం కూడ అయ్యాక గాంధీ వైద్య కళాశాల, హైదరాబాద్‌లో ఎంబిబిఎస్‌లో చేరారు. అక్కడ డా. రాజగోపాలన్ విద్యార్థిగా కమ్యూనిస్ట్ భావజాలానికి ఆకర్షితులయ్యారు. డా. రాజగోపాలన్ కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడిన రోజుల్లోనే బాల్యంలోనే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై 13వ ఏటనే కమ్యూనిస్ట్ నాయకులతో పాటు కడతారులో జైలు శిక్షను అనుభవించినవాడు. గాంధీ వైద్య కళాశాల సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసి జీవితమంతా ఎపిసిఎస్‌సిలో, ప్రజాస్వామిక ఉద్యమాల్లో పని చేసిన హృద్రోగ నిపుణుడు.

డా. రామనాథం కొద్ది రోజులు ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి, ఆ తర్వాత కాకతీయ వైద్య కళాశాలలో డిమాన్‌స్ట్రేటర్‌గా చేరి శిశు వైద్యంలో డిప్లొమా చేసి ఉద్యోగం వదిలి వరంగల్‌లో మొట్టమొదటి పిల్లల వైద్యుడుగా స్థిరపడడమే కాదు, ఎంత ప్రసిద్ధుడయ్యాడంటే వరంగల్ జిల్లాలో ఏ శిబిరంలో ఉన్న పేదలైనా సరే తమ పిల్లల్ని ఆయన దగ్గరికే తీసుకు వచ్చేవాళ్లు. వాళ్లు రిక్షాకార్మికుల, మిల్లు కార్మికుల పిల్లలే కానక్కర్లేదు. సెప్టెంబర్ 1985న ఆయనను మఫ్టీలో ఉన్న పోలీసు అధికారి క్లినిక్‌లో దూరి కాల్చి చంపినాక, ఆయన మృతదేహం పాదాల దగ్గర పిల్లల్ని ఉంచి రోదించిన వాళ్లలో ఎక్కువ మంది మామూనురు పోలీసు క్యాంపుకు, వరంగల్‌లోని వివిధ పోలీసు స్టేషన్‌లకు చెందిన పేద పోలీసుల మహిళలు, తల్లులు, భార్యలు.

సృజన 1968లో వరంగల్‌కు మారాక ఆయన 'సాహితీ మిత్రులు'లో చేరారు. ఆ రోజుల్లో కాకతీయ వైద్య కళాశాల, రీజినల్ ఇంజినీరింగ్ కాలెజి వలెనే విప్లవోద్యమానికి ఒక అండగా ఉండేది. విద్యార్థులే కాదు ఎందరో అధ్యాపకులు విప్లవాభిమానులుగానే కాదు, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవాళ్లు. నార్మన్ బెతూన్ సాల్పెల్ అండ్ స్వోర్ట్ 'రక్తాశ్రువులు' పేరుతో తెలుగులో వెలువడిన డెబ్భైల ఆరంభ కాలంలో గాంధీ ఆసుపత్రి నుంచి కాకతీయ వైద్య కళాశాల దాకా (జైలు మినహా) గోడల మీద 'వైద్యులారా, రోగుల దగ్గరికి వెళ్లండి' అనే పిలుపు ఎర్రక్షరాలతో మెరుస్తుండేది. మహారాష్ట్రలో 'దళిత్ ఫాంథర్స్' రచయితలు, సాహిత్య ఉద్యమమే కాదు, యువ రాజకీయోద్యమాన్ని కూడ ప్రభావితం చేసిన రోజుల్లో తొలి స్వాగతం చెప్పింది కూడ ఈ వైద్య బృందమే. ఆ మాటకొస్తే దిగంబర కవులు, సృజన, విరసం – అన్ని పరిణామాల్లో కాకతీయ వైద్య కళాశాల పాత్ర ఉన్నది. ఈ ప్రభావాల నుంచే 1973 అక్టోబర్‌లో వరంగల్‌లో విరసం 'సాహిత్య పాఠశాల' మొదటిసారి నిర్వహించినప్పుడు ఆ సభలకు క్రియాశీలంగా సహకరించడమే కాదు డా. రామనాథం స్వయంగా 'శ్రామిక వర్గ ప్రచురణలు', శ్రామిక వర్గ బుక్ స్టాల్ వరంగల్‌లో ప్రారంభించి 'సరియైన భావాలు ఎచటి నుంచి వస్తాయి' అనే సుప్రసిద్ధమైన మావో రచనను డయాగ్రమ్‌లతో సహా ఫోల్డర్‌గా ప్రచురించారు. తర్వాత కాలంలో మొదటిసారిగా అమరుడు మువ్వా రవీంద్రనాథ్ అనువాదం చేసిన చారు మజుందార్ రచనలు ప్రచురించారు. 1981లో తలపెట్టిన మావో రచనలు తొమ్మిది సంపుటాల ప్రచురణను కూడ చేపట్టారు.

ఇదే కాలంలో డెబ్భైలలో విప్లవ పెళ్లిళ్లుగా ఇతరులు ఆశ్చర్యంగా చెప్పుకునే ఎన్నో కులాంతర, ఆదర్శ వివాహాలు సాహసోపేతంగా నిర్వహించడానికి డాక్టర్ గారే అండగా నిలిచేవాళ్లు – పోలీసు లాకప్‌లు, కేసులు అయ్యేంత పర్యంతం.

ఎప్పుడూ చిరునవ్వుతో మితభాషిగా ఉండే డాక్టర్ గారు ఒక స్టడీ సర్కిల్ కూడా నిర్వహిస్తుండేవారు. తనకంటూ ఒక కార్యక్షేత్రం నిర్దేశించుకునే సమయానికి ఆయన డా. అజ్మదలీతో పాటు ఎపిసిఎల్‌సికి ఆకర్షితులయ్యారు.

1975 జూన్ 21న ఎమర్జెన్సీ ప్రకటించబడి రాష్ట్రంలో ఎపిసిఎల్‌సి నాయకత్వమంతా అరెస్టయిన రోజుల్లో ఒంటరిగా మిగిలిన డాక్టర్ గారు ఒక ప్రయోగంగా ప్రజా వైద్యశాలను మరో యువ డాక్టర్ ఉపేందర్ రావుతో కలిసి నెలకొల్పారు గానీ అజ్ఞాత విప్లవకారులకు అందులో చికిత్స చేశాడనే అభియోగంతో వాళ్లను వేధించి ఆసుపత్రి మూసివేసే పరిస్థితులు కల్పించారు. ఒక విధంగా ఈ ప్రజాహిత కార్యకలాపాల వ్యగ్రత 1976 జూన్ నాటికి ఆయన పట్ల రాజ్య కన్నెర్రకు కారణమైంది.

సరిగ్గా ఎమర్జెన్సీ విధించిన ఏడాది సమీక్షలో భాగంగా రాష్ట్రమంతట వలెనే వరంగల్‌లోనూ పోలీసులు ప్రజాస్వామిక, విప్లవ సానుభూతి పరులపై విరుచుకపడ్డారు. ఈసారి కేవలం డిటెన్షన్‌గా కాదు – ఎవరి ఇంట్లోనూ, ఎవరికి తెలియకుండా మూడు వారాల పాటు పాకాల

చెరువు చివర డాక్ బంగళాలో నక్సలైటు వ్యతిరేక పోలీసు క్యాంపులో నిర్బంధించి, శారీరక, మానసిక చిత్రహింసలకు గురిచేశారు. వీరిలో డా. రామనాథం, లోచన్, అట్లూరి రంగారావు, డి. లక్ష్మినారాయణ, భిక్షపతి వంటి వాళ్లు ఉన్నారు. భిక్షపతి ఎమర్జెన్సీ విధించిన నెలకే 1975 జూలై 24-25 రాత్రి గిరాయిపల్లి అడవుల్లో చెట్లకు కట్టివేయబడిన ఐదుగురిలో కాల్చి వేయబడకుండా మిగిలిన ప్రత్యక్ష సాక్షి - గిరాయిపల్లి అమరులుగా తర్వాత ప్రసిద్ధులైన నలుగురు - సురపనేని జనార్ధన్, లంకా మురళీమోహన్, ఆనందరావు (విద్యార్థులు), సుధాకర్ (మార్కెట్లో అడ్తీ పని చేసే యువకుడు). మూడు వారాల తర్వాత వరంగల్ జైలుకు పంపించినపుడు గానీ వాళ్ల ఆచూకీ ఆ కుటుంబాలకు తెలియలేదు.

అయితే ఈ నిర్బంధం, మానసికంగా వేధించాలని రాజ్యం చేసిన ప్రయత్నం ఎమర్జెన్సీ తొలగి విడుదలయ్యే నాటికి డాక్టర్ గారిని మరింత పదునెక్కించాయి. ఆయన ఇంక పూర్తిగా పౌర, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమానికి అంకితమయ్యాడు. ఎమర్జెన్సీ కాలంలో అక్రమ నిర్బంధాలపై, చిత్రహింసలపై విచారణ కోసం నియమించిన షా కమిషన్‌కు వాఙ్మూలాలు సేకరించి పంపించే పనిలో డా. అమ్జద్ అలీ, రామనాథం, జీవన్‌కుమార్‌లు తలమునకలయ్యారు.

ఆ పనుల్లోనే మా అందరికీ నెలల తరబడి ఎపి గార్డ్స్ (హైదరాబాద్) లో చిత్రహింసలకు గురయిన జన్ను చిన్నాలుతో పరిచయమైంది. ఆ తర్వాత కాలంలో ఆయన మాకు ప్రజా ఉద్యమాల నాయకుడయి 1979 అక్టోబర్ 18న విప్లవద్రోహుల, అసాంఘిక శక్తుల, మాఫియా చేతుల్లో హత్యకు గురయ్యాడు.

ఎమర్జెన్సీలో 'ఎన్‌కౌంటర్'లపై తార్కుండే కమిటీ నివేదిక రూపొందించి, జస్టిస్ భార్గవా కమిషన్ ముందుకు తీసుకపోయే క్రమమంతా మెదక్ జిల్లాలో సాక్ష్యాల సేకరణ, సాక్షులను కమిషన్ ముందుకు తేవడం వంటి పనులన్నీ ఆర్ఇసి రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడు చెరుకూరు రాజకుమార్ నిర్వహిస్తే, భిషపతి ప్రత్యక్ష వాఙ్మూలాన్ని నమోదు చేయడమూ, ఆయనను హైదరాబాద్‌కు తీసుకపోవడమూ, ముఖ్యంగా పోలీసుల నుంచి కాపాడడమనే పనులు చేసిన వాళ్లు కాళోజీ, కన్నబిరాన్, డా. రామనాథంలే.

1978లో ఎపిసిఎల్‌సి రాష్ట్రమహాసభలు నిర్వహించే బాధ్యతంతా ఆయనే చేపట్టాడు. జిల్లాకు, రాష్ట్రానికి కూడ. ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ఇంక 1978-85 మధ్యకాలంలో ఆయా సంవత్సరాల్లో చేరుతూ వచ్చి ఎపిసిఎల్‌సికి బలమైన రూపురేఖలు తీర్చిన ఒక టీంగా డా. అమ్జద్‌కీ, డా. రామనాథం, డా. బాలగోపాల్, జీవన్‌కుమార్‌లు నిర్వహించిన పాత్ర వరంగల్ ప్రజాస్వామిక ఉద్యమం ఎన్నటికీ మరచిపోదు. ప్రజాజీవనం ఎదుర్కొన్న ఎన్ని సమస్యలను చేపట్టి ఎపిసిఎల్‌సి వరంగల్‌లో పనిచేసిందో ఊహించుకుంటే ఆ విస్తృతికి, వైవిధ్యానికి ఆశ్చర్యమేస్తుంది.

హనుమకొండ నయీంనగర్‌లో వరదలొచ్చి పూరిగుడిసెలు మునిగినా, వరంగల్ సికెఎం ఆసుపత్రిలో శిశువులను పందులు ఎత్తుకపోయినా, ఎంజిఎం పక్కన దేవాలయంలో శూద్ర మహిళా పూజారి హక్కును బ్రాహ్మణీయ సంస్కృతి హరించజూసినా, కావలి నుంచి తెచ్చిన బాలికను హసన్‌పర్తి వైశ్యాగృహాలకు అమ్మజూపినా, వరంగల్ మార్కెట్లో రైతులకు ధాన్యాల కొలతలు మొదలు గిట్టుబాటు ధరల వరకు అన్యాయం జరిగినా, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిల ఉద్యోగ నియామకాలు జరపక పోయినా అక్కడ ఎపిసిఎల్‌సి నిలబడి న్యాయం కోసం పోరాడాల్సిందే. 1978-85 మధ్యన రాడికల్స్ జోక్యం లేని ప్రజా న్యాయం లేనట్లే ఎపిసిఎల్‌సి పట్టించుకోని ప్రజాసమస్యలు లేవు.

డా. రామనాథం గారి వలన సాధ్యమైన మూడు ప్రధానమైన సందర్భాలు. 1978 అక్టోబర్‌లో జగిత్యాల - సిరిసిల్లాలను 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించినపుడు ఢిల్లీ నుంచి పియుసిఆర్, ఎపి నుంచి ఎపిసిఎల్‌సి నిజనిర్ధారణకు వెళ్లి రెండు తాలూకాల్లోనూ విస్తృతంగా తిరిగి రూపొందించిన నివేదిక. ఆ తర్వాత కాలంలో రాష్ట్రవ్యాప్తంగానే కాదు, దేశవ్యాప్తంగా నిర్వహించిన ఉద్యమం. అంతకు ముందే ఎమర్జెన్సీ ఎత్తివేయగానే ఢిల్లీలో జరిగిన పియుసిఎల్ & డిఆర్ అఖిల భారత స్థాయి సదస్సుకు కన్నబిరాన్, ఎంవి రామమూర్తిలతో పాటు డా. రామనాథం గారు వెళ్లారు. అక్కడే పియుసిఎల్ & డిఆర్‌ల నుంచి విడిపోయిన పియుడిఆర్, ఢిల్లీ ఏర్పడింది.

జనతా పార్టీ అధికారానికి వచ్చింది గనుక పౌరహక్కుల గురించే తప్ప ప్రజాస్వామిక హక్కుల గురించి పోరాడాల్సిన అవసరం లేదనే వైఖరిని అరుణ్‌శౌరీ (అప్పటి కార్యదర్శి) చోరామస్వామి, ఎంవి రామమూర్తి తీసుకున్నారు. పేరు ఏమున్నా ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాటం ఎప్పుడూ అవసరమైందనే వైఖరిని సివి సుబ్బారావు, సుదేశ్ వైద్, సుమంతో బెనర్జీ తీసుకున్నారు. వీళ్లకు ఢిల్లీ నుంచి గోవింద ముఖీరీ, మనోరంజన్ మొహంతీల మద్దతు లభించింది. ఎపి నుంచి కన్నబిరాన్ (ఆయన తర్వాత కాలంలో ఎపిసిఎల్‌సి అధ్యక్షుడుగా పియుసిఎల్ కార్యవర్గంలోకి తీసుకోబడి, ఆ తర్వాత పియుసిఎల్ అధ్యక్షుడై నప్పటికీ) డా. రామనాథం తీసుకున్నారు. ఈ సమస్యలోనే చంద్రశేఖర్, కృష్ణకాంత్ వంటి వాళ్లు కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల వంటి జాతివిముక్తి పోరాటాల గురించి ప్రస్తావన తేవద్దని పియుడిఆర్ ఏర్పాటును వ్యతిరేకించారు. ఆ తర్వాత చంద్రశేఖర్ ప్రధాని అయ్యాడు. కృష్ణకాంత్ గవర్నర్ అయ్యాడు.

1977 డిసెంబర్‌లో డా. రామనాథం, డా. భుజంగరావు, ఉపేందర్, జీవన్‌కుమార్ మొదలైన వారితో కలిసి తీసుకున్న బృహత్తర కార్యక్రమం దివిసీమ ఉప్పెన బాధితుల కోసం సహాయ శిబిరాలు నిర్వహించడం. అందు కోసం వరంగల్‌లో మందులు, సహాయం సేకరించడం. ఈ పని ఆయన నెలరోజులకు పైగా నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు పొందాడు. (సృజనలో దివిసీమ ఉప్పెనపై వివరమైన రిపోర్టు చూడవచ్చు.)

1979లో రాష్ట్రంలో చరిత్రాత్మకమైన జూనియర్ డాక్టర్ల సమ్మె 72 రోజుల పాటు జరిగింది. ఈ సమ్మె వెనుక నక్సలైట్లు ఉన్నారని ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని అమలుచేసింది. ఒకవైపు ఈ సమ్మెకు పూర్తి మద్దతునిస్తూనే ఎపిసిఎల్‌సి పేద రోగుల కోసం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రి ముందు 72 రోజుల పాటు ఉచిత చికిత్సా శిబిరం నిర్వహించింది. డా. రామనాథం, అప్పుడక్కడ పిజి మెడికల్ విద్యార్థిగా

ఉన్న విరసం కన్వీనర్‌గా డా. గామెర రాములు పర్యవేక్షణలో నిర్వహింప బడిన ఈ శిబిరంలో అన్ని ప్రజాసంఘాలు క్రియాశీలంగా పాల్గొన్నాయి.

అక్రమ నిర్బంధాలు, లాకప్ హత్యలు, ఎన్‌కౌంటర్ హత్యల గురించి ఎపిసిఎల్‌సి, అందులోనూ వరంగల్ జిల్లా శాఖ నిర్వహించిన నిజనిర్ధారణలు, నివేదికలు, పోరాటాల గురించి చెప్పడం ఒక చరిత్ర అవుతుంది. అది పాపారావు మొగిలయ్యలను ఎమర్జెన్సీ ఎత్తివేయగానే గొర్రెకుంటలో పోలీసులు కాల్చేసిన ఉదంతమే కావచ్చు, రవీందర్ రెడ్డి, పర్శయ్యలను ఖమ్మంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి, మర్నాడు సూర్యాపేట మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచి, ఆయన కాంపౌండు బయటనే చంపేసి 'ఎన్‌కౌంటర్' అని ప్రకటించిన సందర్భమే కావచ్చు – రాష్ట్రవ్యాప్త ప్రచారానికి పూనుకొని ఏర్పాట్లు చేసిన వారిలో ఎపిసిఎల్‌సి డా. రామనాథంగారి పాత్ర అవిస్మరణీయమైంది.

ఇంక 1981లో ఎపిసిఎల్‌సిలోకి డా. బాలగోపాల్ కూడ 1983లో ఖమ్మం మహాసభల్లో ప్రధాన కార్యదర్శి అయ్యాక 1985 దాకా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా డా. రామనాథం గారిది ఒక విడదీయరాని అనుబంధం. 'మీ పిల్లలకు ఈ సాయంకాలం సెలవు ఇవ్వరా' అని బాలగోపాల్ అడిగాడంటే దాని అర్థం, ఆ మధ్యాహ్నం ఎపిసిఎల్‌సి నిజనిర్ధారణకు ఎక్కడికో వెళ్తున్నారని. అందులోనూ జిల్లాలో విప్లవోద్యమం, రాడికల్ ఉద్యమం ఎంత ఉధృతంగా ఉందో, అంత తీవ్రంగా రాజ్యహింస ఉన్న కాలమది.

1982–84 మధ్యన వరంగల్‌లో రెండు సంవత్సరాలు పన్నెండు కాలెజీల్లో 144 సెక్షన్ అమలయింది. 1984లో ఎచ్‌జె దొర నక్సలైట్ డిఐజిగా 'ఎబివిపి విద్యార్థులు నా కళ్లు, చెవులు' అని ప్రకటించి అన్ని కాలెజీల్లో వాళ్లకు లైసెన్స్ లేని పిస్టల్స్, చురకత్తులు సరఫరా చేసి స్వైర విహారానికి పురికొల్పిన రోజులు. ఎచ్‌జె దొర స్వయంగా విశ్వహిందూ పరిషత్ సభల్లో ప్రధాన వక్తగా ప్రసంగించిన రోజులు. అరవిందరావు ఎస్‌పిగా ఉండి 'డాక్టర్ రామనాథం, బాలగోపాల్‌లు అలగా జనాన్ని రెచ్చగొడుతూ పౌరహక్కులని మాట్లాడుతూ నక్సలైట్లకు వంత పాడుతున్నారని పియుసిఎల్ నాయకుడు ప్రొ. రజనీ కొఠారీని ఎపిసిఎల్‌సి నిర్బంధానికి వ్యతిరేకంగా పెట్టిన సభలో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేసి విఫలమైన రోజులు. అక్షరాల అది వరంగల్ 'రెండు మహానగరాలు' నవలలో చిత్రించినట్లు మహోజ్వల కాలాన్ని, వల్లకాటి కాలాన్ని తలపించిన రోజులు. రెండవ ప్రపంచ యుద్ధ కాలపు ప్యారిస్ నగరాన్ని, మనకాలపు లాటిన్ అమెరికన్ నగరాన్ని తలపించిన కాలం. ఆ కాలమంతా 1985 దాకా ఈ ఇద్దరూ కాలం, ఉద్యమం డిమాండు చేసిన నాయకత్వాన్ని ఎపిసిఎల్‌సికి అందించారు.

ఇంద్రవెల్లి మారణకాండ (20 ఏప్రిల్ 1981) తర్వాత ఏప్రిల్ నెలాఖరులో రాడికల్ యువజన సంఘం మహాసభలు వరంగల్‌లో జరిగినప్పుడు ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొ. మనోరంజన్ మొహంతీ (పియుడిఆర్) నాయకత్వంలో ఎపిసిఎల్‌సితో కలిసి వెళ్లిన నిజనిర్ధారణ కమిటీని డా. రామనాథం గారే తీసుకెళ్లారు. విరసం తరఫున కెవిఆర్ కూడ వెళ్లారు. ఆ తర్వాత రత్నాపూర్‌లో ఒక ఆదివాసీ యువకుణ్ని చంపి 'ఎన్‌కౌంటర్' చూపడమే కాకుండా క్రాస్‌ఫైరింగ్‌లో చనిపోయాడని, ఇంద్రవెల్లి గిరిజన రైతు కూలీ సంఘం జిల్లా మహాసభల కన్వీనర్‌ను అందులో పోలీసులు దోషిగా చూపారు. ఆ నిజనిర్ధారణకు వెళ్లినప్పుడు డాక్టర్ గారు కొండ ఎక్కలేక కిందనే ఉండిపోయారు. ఆయనకు ఎమర్జెన్సీలో జైల్లో ఉన్నప్పుడే ఒక స్థాయిలో గుండె నొప్పి వచ్చింది. రెండవసారి 1985 జనవరి 18న హనుమకొండ పోలీసులు అరెస్టు చేసినప్పుడు పోలీసు లాకప్‌లో వస్తే ఆసుపత్రిలో చేర్చారు కానీ, కొంచెం నెమ్మది కాగానే మిల్స్ కాలనీ సిఐ ఇంటి మీద ఎవరో బాంబు వేసిన కేసులో ముద్దాయిగా చేర్చి మాతోపాటు వరంగల్ జెయిలుకు పంపించారు.

దానికి కొంచెం నేపథ్యం ఉంది. 1984 డిసెంబర్ ఎన్నికల సమయంలో (అప్పుడు వరంగల్ నుంచి లోక్‌సభకు పివి నరసింహా రావుపై బిజెపి జంగారెడ్డి పోటీ చేసి ఓడిపోయాడు) కొడవటి సుదర్శన్ అనే ఆర్‌వైఎల్ కార్యకర్తను సోమిడిలో రాజకీయ తరగతులు జరుగుతున్న సందర్భంలో కాజీపేట ఎస్ఐ యాదగిరి రెడ్డి అరెస్టు చేసి ఒక రాత్రంతా చిత్రహింసలు పెట్టి డిసెంబర్ నెల చలిలో పోలీసు స్టేషన్ ఆవరణలో మంచు కురుస్తున్న ఇసుకలో నగ్నంగా పడేసాడు. తెల్లవారే వరకు అతను చనిపోయాడు. ఎస్‌పి ఆ శవాన్ని తీసుకవెళ్లి ములుగు అడవుల్లో కాల్చివేసి, 'ఎన్‌కౌంటర్' ప్రకటించమన్నాడు. స్టేషన్ బయట సుదర్శన్ సైకిల్ తల్లికి కనిపిస్తూనే ఉన్నది. సోమిడికి సైకిల్‌పై పోతున్న సుదర్శన్‌ను ఆయన స్వగ్రామం కడిపికొండ గ్రామస్తులు, కాజీపేట వాళ్లు చూశారు.

1985 నుంచి 89 వరకు – ఎన్‌టిఆర్ కాలంలో జరిగిన డెబ్బై అయిదు 'మిస్సింగ్' కేసులు ఇట్లా ప్రారంభమయ్యాయి. వీటిపై ప్రజాందోళన ఫలితంగా, ఎపిసిఎల్‌సి పూనిక వల్ల 1990లో చెన్నారెడ్డి ప్రభుత్వం జస్టిస్ టిఎల్ఎన్ రెడ్డి కమిషన్‌ను న్యాయ విచారణకు నియమించింది. ఆయన కొడవటి సుదర్శన్ 'మిస్సింగ్' కేసులో ఎస్ఐ యాదగిరి రెడ్డిని, ఆ తర్వాత హైదరాబాద్‌లో జరిగిన గోపగాని ఐలయ్య (పీపుల్స్‌వార్ ఉత్తర తెలంగాన కార్యదర్శి) రాజమౌళి 'మిస్సింగ్' కేసులో కె.ఎస్. వ్యాస్, అనురాగ్ శర్మలను, మరో ఐదు 'మిస్సింగ్' కేసులలో మరో ఐదుగురు పోలీసు అధికారులను దోషులుగా నిర్ధారించి వారిపై నేర విచారణ జరపాలని సూచించింది. ముఖ్యమంత్రి చెన్నారెడ్డి దానిని శాసనసభలో పెట్టి చర్చకు అవకాశం ఇవ్వకుండానే ముగింపు పలికాడు.

కొడవటి సుదర్శన్ 'మిస్సింగ్'కు నిరసనగా రాడికల్స్ జనవరి 18న 'బంద్' పిలుపు ఇచ్చారు. ఆ రోజు తెల్లవారకుండానే మిల్స్ కాలనీ సిఐ ఇంటిపై ఎవరో బాంబు వేసారు. కుమార్‌పెల్లి ఇంటిలో ఉన్న నన్ను అరెస్టు చేశారు. నన్నెందుకు అరెస్టు చేశారని ఎపిసిఎల్‌సి తరఫున ఎస్‌పి అరవిందరావును అడగడానికి వెళ్తే డా. రామనాథం, డా. కె. సీతారామరావులను కూడ అరెస్టు చేసి, ఆ రోజు ఊళ్లో లేని బాలగోపాల్‌తో కూడ కలిపి, ఆ తర్వాత కాలంలో ఆర్‌కెగా ప్రసిద్ధుడైన సుదర్శన్ రెడ్డి, గంగన్నగా ప్రసిద్ధుడైన శంకర్‌తో కలిపి మిల్స్ కాలనీ బాంబు కేసు పెట్టారు. ఈ కేసులోనే ముద్దాయిగా చూపిన రామకృష్ణ (పాలిటెక్నిక్ విద్యార్థి) నాగేశ్వరరావులను 1986 మే 20న 'ఎన్‌కౌంటర్' పేరుతో హంటర్ రోడ్ మీద చంపేసి 'ఎన్‌కౌంటర్' ప్రకటించారు. ఇంక రాజ్య నిర్బంధం తీవ్రతరమైంది. ఎన్‌టిఆర్ గవర్నర్ తొలగించిన తర్వాత రెండవసారి అధికారానికి వచ్చి 'ఆట మాట పాట' బంద్ చేశాడు. ఆ కాలంలోనే 1985 జూలై 17న కారంచేడు దళితులపై ఎన్‌టిఆర్

మామ దగ్గుపాటి చెంచు రామయ్య నాయకత్వంలో ఆ సామాజిక వర్గం మారణకాండ చేసిన ఘటన దేశ చరిత్రలో దళిత ప్రతిఘటనా ఉద్యమానికి ఆరంభమైంది.

కొడవటి సుదర్శన్ 'మిస్సింగ్' కేసే కాకుండా ఎన్నో 'ఎన్‌కౌంటర్' హత్యలకు కాజీపేట పోలీసు స్టేషన్ పరిధిలో గ్రామాలపై దాడులు, ప్రజలపై చిత్రహింసలకు, ప్రత్యేకించి ఆర్ఇసి విద్యార్థులపై, మెస్ వర్కర్లపై దాడులకు, దమనకాండలకు బాధ్యుడైన ఎస్ఐ యాదగిరి రెడ్డిని సెప్టెంబర్ 2 సాయంత్రం కాజీపేటలో మద్రాస్ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ దగ్గర పీపుల్స్‌వార్ దళం కాల్చి చంపింది. మర్నాడు ఉదయం ఎంజిఎంలో పోస్ట్‌మార్టమ్ జరిపి ఆయన శవాన్ని ఆయన స్వస్థలం మహబూబ్‌నగర్ గ్రామానికి పోలీసులు ఊరేగింపుగా తీసుకుపోయారు. ఆ ఊరేగింపు తోవలోనే వరంగల్ వేనివారి తోటలో డా. రామనాథం గారి ఇల్లు ఉంటుంది. క్లినిక్ అయితే పూర్తిగా వరంగల్ చౌరస్తా మీదుగా స్టేషన్‌కు వెళ్లే దారిలోనే ఉంటుంది. శవ ఊరేగింపు మధ్యలో ఓపెన్ టాప్ జీపులో డిఐజి ఎచ్‌జె దొర, ఎస్‌పి అరవిందరావులున్నారు. వేణిరావుతోట (గోపాలస్వామి గుడి) దగ్గర ఊరేగింపు నుంచి కొంతమంది పోలీసులు మఫ్టీలో వెళ్లి ఇంట్లో ఉన్నాడో లేదో తెలుసుకున్నారు. క్లినిక్ ముందుకు రాగానే - ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్ ముందు (అక్కడ కొంచెం చౌరస్తా వలె ఉంటుంది) ఊరేగింపు ఆగింది. 'పిల్లల డాక్టర్ ఎ. రామనాథం - అంటే ఎపిసిఎల్‌సి వైస్ ప్రెసిడెంట్ రామనాథం - ఇతనేనా?' అని ఎస్‌పి అరవిందరావు నర్మగర్భితంగా అడిగాడు. ఎచ్‌జె దొర తల ఊపాడు. అంతే క్లినిక్‌లోకి మఫ్టీలో ఉన్న ఇంటెలిజెన్స్ ఎస్ఐ, మరికొందరు పోలీసు అధికారులు దూరి క్లినిక్‌ను చిందరవందర చేశారు. అప్పుడు గానీ ప్రమాదం శంకించిన డాక్టరు గారు వెనుక ద్వారం నుంచి నాలుగడుగులు పరుగెత్తాడు గానీ పోలీసు తూటాలకు కుప్పకూలిపోయాడు. ఎంజిఎంకు పొరుగున ఉన్న డాక్టర్ రాజారామ్ తీసుకపోయే వరకే డాక్టర్ రామనాథం గారు చనిపోయారు.

ఆ రోజుల్లో బాలగోపాల్ ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శి బాధ్యతల్లో తరచుగా హైదరాబాద్‌కు వెళ్లి వస్తుండేవాడు. మధ్యాహ్నం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లి మర్నాడు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు వచ్చి నేరుగా యూనివర్సిటీకి వెళ్లేవాడు. కనుక ఆయన ఊళ్లో లేడు అనుకున్నారు. పైగా ఆయన ఎంజిఎంకు ఎగువన ఏనుగుల గడ్డలో హనుమకొండ - వరంగల్ బస్‌స్టాప్‌లో ఎదురుగా ఇంట్లో ఉండేవాడు. యాదగిరి రెడ్డి హత్య జరిగిన రాత్రి ఆయన తన గదిలోనే ఉన్నాడు. మర్నాడు ఏనుగులగడ్డ దగ్గర చాయ్ తాగి సైకిల్ మీద యూనివర్సిటీకి వెళ్లి క్లాసులోకి వెళ్లాడు. కాని తన క్లాసులో తన విద్యార్థులు కాని అనుమానాస్పద వ్యక్తులు కనిపించారు. ఆ కాసేపటికి ఆయనకు డాక్టర్ గారి హత్య వార్త తెలిసింది.

నేను కారంచేడు బాధితుల సంఘీభావంగా చీరాల సెప్టెంబర్ 1న జరిగిన మహా సభకు వెళ్లి సెప్టెంబర్ 2న విజయవాడలో మా కాలేజి కోసం పుస్తకాలు కొని, ఆ రోజు అక్కడ ఆగాను. ఆ సాయంత్రం మీడియా మిత్రులు యాదగిరి రెడ్డి హత్యా వార్త చెప్పారు. డాక్టర్ గారి డాక్టర్ రమణ ఇంటి నుంచి ఫోన్ చేశాను. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు రండి - స్టేషన్‌లో రిసీవ్ చేసుకుంటాను అన్నారు డాక్టర్ గారు. అప్పటికే కొన్నేళ్లుగా నేను ఎటు వెళ్లినా ట్రెయిన్ ఎక్కించి, దించుకునే పని ఆయనే చేస్తున్నారు. కాని డాక్టర్ గారు మాట ఎందుకు నిలుపుకోలేకపోయాడో, ఆయన క్లినిక్ ముందరగా ఆటోలో కాలెజి వెళ్తున్నప్పుడు గానీ చెల్లాచెదరయిన క్లినిక్‌ను బయట నుంచి అప్రతిభులైన ప్రజల మొహాలు చూసినప్పుడు అనుమానం రాలేదు. అప్పటికే అంతా అయిపోయింది. నాకు వరంగల్ స్టేషన్‌లో ఆటో మలుపు తిరుగుతున్నప్పుడు యాదగిరిరెడ్డి శవ ఊరేగింపు ఎదురు పడి, నినాదాలు చెవిన పడడమే కాదు క్లినిక్ ముందుగా కాలెజికి వెళ్లేవరకే ప్రతీకారం అయిపోయింది. నా జీవితంలో నా స్థానంలో ప్రాణాలు కోల్పోయిన స్నేహితుడుగా డాక్టర్‌గారు నా హృదయంలో నిలిచిపోయారు.

'మిస్సింగ్' హత్యలకు తోడు విప్లవోద్యమ చర్యలకు ప్రతీకారంగా ప్రజాసంఘాల (ముఖ్యంగా ఎపిసిఎల్‌సి) నాయకులను, క్రియాశీల కార్యకర్తలను హత్య చేసే రాజ్యహింస ఇట్లా ఎన్‌టిఆర్ కాలంలో ఎచ్‌జె దొర, అరవిందరావులు ప్రారంభించారు. అంతకు ముందే 1985 జనవరి 18న ఆర్ఎస్ఎస్ గూండాలు జగిత్యాలలో న్యాయవాది, ఎపిసిఎల్‌సి గోపు రాజన్నను కోర్టు నుంచి ఇంటికి రాగానే ఆయన కాంపౌండు ముందే కత్తులతో పొడిచి చంపారు. ఆ విషయం తెలిసి వెళ్లిన బాలగోపాల్‌పై దాడి చేసి తల పగులగొట్టారు. డాక్టర్ గారే చికిత్స చేసి స్వాస్థ్యం చేకూరే దాకా ఇంట్లో పెట్టుకున్నారు.

డా. రామనాథం గారి హత్య వరంగల్ పౌరజీవితంలో బుద్ధిజీవుల పాత్రపై ఒక విభజన రేఖ అయింది. వరంగల్ వల్లకాడు అయింది. కానీ అడుగున లావ పొంగుతున్న అగ్నిపర్వతం వలె 1990 రైతు కూలీ సంఘం సభల వరకు సహించింది. చలించింది. సెప్టెంబర్ 9న డా. రామనాథం హత్యకు నిరసనగా రాష్ట్ర బంద్ కాల్ ఇచ్చిన రోజుననే ఎన్‌టిఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో టాడాను ప్రయోగించే నిర్ణయం తీసుకొంది. తర్వాత 89 దాకా రాష్ట్రంలో పదహారువేల మందిని టాడా కింద అరెస్టు చేసింది.

ఈ సందర్భంలో రెండు రంగాల్లో డాక్టర్ గారి వారసత్వాన్ని స్వీకరించిన ఆయన కన్నా రెండడుగులు ముందుకు వెళ్లి అమరుడైన వారిని స్మరించుకోలేకపోతే డాక్టర్ గారి స్మరణ అసంపూర్ణమే అవుతుంది. వారు 90లో ఎపిసిఎల్‌సిలో ఆయన బాధ్యతను చేపట్టి వరంగల్ జిల్లా ఎపిసిఎల్‌సి కార్యదర్శి అయిన న్యాయవాది నర్రా ప్రభాకర్ రెడ్డి (ఆయన అమరత్వం తర్వాత తాను క్యాన్సర్‌తో మరణించే దాకా బుర్రా రాములు కూడ జిల్లాలోనే కాదు రాష్ట్ర స్థాయిలో ఈ కర్తవ్యాన్ని కొనసాగించాడు.)

18 ఏళ్ల విద్యార్థిగానే రాడికల్ ఉద్యమంలోకి వచ్చి వెల్దండ హత్య కేసులో జైలుకు వెళ్లి, విడుదలయ్యాక ఎపిసిఎల్‌సి పని చేస్తూ తొమ్మిది వందల టాడా కేసులు వాదించి జిల్లా స్థాయిలోనే విడుదల చేయించిన అసాధారణమైన పని నర్రా ప్రభాకర్ రెడ్డి చేసి రాజ్యానికి కన్నెర్ర అయ్యాడు. అందుకే 1991 డిసెంబర్ 3న హయగ్రీవా చారిని పీపుల్స్ వార్ హత్య చేస్తే, ప్రతీకారం అనే సాకుతో డిసెంబర్ 7న నర్రా ప్రభాకర్ రెడ్డిని ఆయన ఇంట్లో దూరి మఫ్టీలో ఉన్న పోలీసులు హత్య చేశారు. అప్పటికాయన వెల్దండ ఉత్తమ పంచాయితీ సర్పంచ్, వరంగల్ బార్ అసోసియేషన్ కార్యదర్శి, ఎపిసిఎల్‌సి జిల్లా కార్యదర్శి. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న పౌరహక్కుల నాయకుడు.

ఇంక వైద్యరంగంలో డాక్టర్‌గా రామనాథం గారి క్లినిక్‌లో పనిచేసి అంతకన్నా గ్రామీణ పేదలకు వైద్య సేవ చేయాలని ఎంచుకొని మొగిలిచెర్లలో ప్రజా వైద్యశాల (చికిత్స క్లినిక్) పెట్టుకొని అమరుడైన డాక్టర్ ఆమడ నారాయణ, ఆ తర్వాత కాలంలో అనారోగ్యంతో మరణించిన డాక్టర్ ఎ. రామయ్య వలె – ఎంతో ఆదర్శప్రాయుడైన ప్రజా వైద్యుడు, వేల మంది పేద, పీడిత, పోరాట ప్రజలకు వైద్య చికిత్స చేసి ప్రాణం పోసారు. చంపడానికి స్కూటర్‌కు అడ్డం వచ్చిన మఫ్టీ పోలీసు కూడ కడుపు నొప్పి నెపంతోనే ఆయనను తోవలో ఆపితే నిజమే అనుకొని దిగి, అతని తుపాకీ తూటాలకు నేలకూలాడు.

డా. రామనాథం గారు శ్రామికవర్గ ప్రచురణలు, బుక్‌షాప్ ద్వారా విప్లవోద్యమానికి చేసిన సహకారమే కాకుండా, అజ్ఞాత జీవితంలో ఉన్న విప్లవకారుల కోసం చేసిన చిరకాలం నిలిచి ఉండే మరొక సేవను కూడా స్మరించుకోవాలి. శ్రీకాకుళ రైతాంగ పోరాటంలోకి గుంటూరు జిల్లా, నెల్లూరు జిల్లాల నుంచి కొందరు డాక్టర్లు పోయారు. వాళ్లతో నక్సల్బరీ సంఘీభావ కమిటీని గుంటూరులో ఏర్పాటు చేసి శ్రీకాకుళోద్యమంలో ఎన్‌కౌంటర్‌లో అమరుడైన నేత్ర వైద్య నిపుణుడు డా. చాగంటి భాస్కరరావు (నరుడో! భాస్కరుడా!) గురించి తెలియని వారుండరు.

అయితే డాక్టర్ మల్లికార్జునుడు, సింగరాయ కొండలో తర్వాత కాలంలో ప్రజా వైద్యశాల నిర్వహించిన డా. శివారామకృష్ణ విప్లవోద్యమంలో పని చేయడమే కాకుండా విప్లవోద్యమంలో అజ్ఞాత జీవితంలో పనిచేసే వాళ్లు ఎదుర్కొనే అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు, గాయాల గురించి అందరికీ అర్థమయ్యే పద్ధతిలో చికిత్సా విధానాలు రూపొందించారు. అయితే అప్పటికింకా విప్లవోద్యమం ఆరంభ దశలోనే ఉంది. 1972 నాటికే సెట్‌బ్యాక్‌కు గురయింది. జగిత్యాల జైత్రయాత్ర తర్వాత విప్లవోద్యమం అడవికి కూడ విస్తరించి దండకారణ్యంలో పీపుల్స్‌వార్ గెరిల్లా జోన్ నిర్మాణానికి పూనుకున్నప్పుడు వైద్య చికిత్స అవసరాలు చాల పెరిగాయి.

అజ్ఞాత జీవితంలోకి వేల సంఖ్యలో స్త్రీలు, పురుషులు వెళ్లే క్రమం 1978 నుంచి ప్రారంభమైంది. ఆ అవసరాల దృష్ట్యా డాక్టర్ గారు 'మెడికల్ గైడ్' రూపొందించారు.

అయితే ఆయన జీవిత కాలంలో చెప్పని విషయం ఇంకా వెలుగుచూడని 'దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కార్' పాణి పుస్తకం ద్వారా తెలుస్తున్న విషయమేమిటంటే డాక్టర్ దండకారణ్యం వెళ్లి అజ్ఞాత జీవితంలోని విప్లవకారులకు చికిత్స చేసి వచ్చి, తన అనుభవంతో, ఆ అవసరాలు గ్రహించి రూపొందించిన పుస్తకమిది.

ఆ తర్వాత కాలంలో ఆయన శస్త్రచికిత్స విషయంలో తనకు అనుభవం తక్కువ కనుక – ఆర్థోపిడిషియన్ వరంగల్‌లో సుప్రసిద్ధులైన డాక్టర్ గంటా వెంకటరావు గారి సహకారం తీసుకొని మెరుగుపరిచాడు. అది రెండు మూడుసార్లు పునర్ముద్రణ పొందింది కానీ, ఇవ్వాటి గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరిట ప్రజలపై యుద్ధం అవసరాల దృష్ట్యా ఇంకా మెరుగు పరచి రూపొందించడమే డాక్టర్ గారికి ప్రజా వైద్యరంగంలో పనిచేస్తున్న వాళ్లు అర్పించగలిగిన నివాళి అవుతుంది.

1984లో ఒకసారి చిత్తూరుకు విరసం సభలో పాల్గొనడానికి నేను వెంట వెళ్లాను. అక్కడ మునిసిపల్ హాల్‌లో సభ జరిగింది. ఆ హాల్ ముందు ఒక శిలాఫలకం ఉంది. అది ఒక బ్రిటిష్ అధికారి కట్టించాడు. ఏ మత, రాజకీయ విశ్వాసం ఉన్నవాళ్లయినా సరే స్వేచ్ఛగా జరుపుకోవ డానికి ఉద్దేశించిన హాల్ ఇది అనే అర్థం వచ్చే మాటలు ఆ ఫలకంపై రాసి ఉన్నాయి.

వరంగల్‌కు తిరిగి రాగానే ఆ విషయం డాక్టర్ గారికి చెప్పాను. అటువంటి సభా భవనం ఒకటి నిర్మించాలన్నది డాక్టర్ గారి కల. ఆయన అమరత్వం తర్వాత ఆయన స్మృతిలో అటువంటి భవన నిర్మాణం కోసం విరాళాలు సేకరించే పనిలో ఉన్నప్పుడే డా. బాలగోపాల్‌పై గ్రేహౌండ్స్ దాడి చేసి కిడ్నాప్ చేశారు. ఏమీ చేయలేక పోయినా వరంగల్‌లో వేణిరావు తోట దగ్గరో, గతంలో ఆయన క్లినిక్ ఉన్న చోటనో రోడ్డు పక్కన ఒక మైలురాయి వలె రామనాథం స్మారకం నిలపాలని కన్నబిరాన్ గారనేవారు – 'ఇక్కడ పౌరహక్కుల కోసం ప్రాణాలర్పించిన ఒక మనిషి ఉండేవాడు' అని.

అయితే డాక్టర్ గారి హత్య వార్త, చెల్లాచెదరయిన ఆయన క్లినిక్ గురించి విని, పత్రికల్లో చదివిన సుప్రసిద్ధ చిత్రకారుడు లక్ష్మాగౌడ్ ఆయన స్మృతిలో ఒక పోస్టర్ చిత్రించాడు – మార్చ్యురీ కోట్ చేసిన ఒక కార్మికుని మాటలతో దానిని ఎపిసిఎల్‌సి డాక్టర్ రామనాథం స్మృతిలో ఒకటికి రెండుసార్లు పునర్ముద్రించింది.

ఇప్పటికీ ప్రతి సంవత్సరం ఢిల్లీ పియుడిఆర్ సెప్టెంబర్ 3ను ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ దినంగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నది. ఇంక ఎపిసిఎల్‌సి చరిత్రలోనయితే డాక్టర్ గారి వలె రాజ్యహింసకు గురయి అమరులైన వాళ్లు ఆరుగురయ్యారు. గోపు రాజన్న మినహాయింపుతో ఆజామలీ దాకా.

ఇవ్వాటి హిందుత్వ రాజ్యస్వభావం నేపథ్యంలో చూసినపుడు ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు చంపిన గోపు రాజన్న హత్యను కూడా రాజ్యహింసలో భాగంగా చూడవలసిందే. రాజ్యహత్యగా చూడవలసిందే. ఎపిసిఎల్‌సి ఈ ఆరుగురి స్మరణలో ప్రతి సంవత్సరం పౌర, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం, రాజ్యహింసకు వ్యతిరేకంగా సభలు, కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంది.

ఆ తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా ఇప్పటికీ ఎందరో డాక్టర్ రామనాథం గారి స్మృతిలో ప్రజాస్వామిక ఉద్యమాలు, హక్కులను పునరుద్ఘాటించే సభలు జరుపుతున్నారు గానీ ఆయన హత్య జరిగిన రోజు మాత్రం నలుగురికి తెలిసిన పౌరహక్కుల, ప్రజాసంఘాల నాయకులెవరూ అంత్యక్రియల్లో పాల్గొనలేకపోయారు. మర్నాడే బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ బాలగోపాల్ ఆ ఉదంతం అంతా వివరించాడు గానీ, సారస్వత పరిషత్ హాల్‌లో పెట్టిన సంస్మరణ సభకు పోలీసులు వక్తలను మాత్రమే అనుమతించి, శ్రోతలనెవ్వరికీ అనుమతించలేదు. అప్పుడా సభలో కాళోజీ 'చనిపోయింది రామనాథమా? మనమా' అని ఆవేదన వ్యక్తం చేసాడు.

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సభను కూడ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన 2015 సెప్టెంబర్ 21న నాకామాట గుర్తుకొచ్చినవి.

*(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం సభ్యులు)* వీ

# తెలంగాణలో నిరుద్యోగ సమస్య

*ఎన్నికలకు ముందు నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన టిఆర్ఎస్ నిరుద్యోగ సమస్య పరిష్కారంలో దార్శనికత చూపాలని అంటున్నారు* **డా. అక్కెనపల్లి పున్నయ్య**

వలస బతుకులకు తెర పడుతుందని, సర్కారీ కొలువులో సల్లగా బతుకొచ్చని వెట్టి సేవల మట్టి బతుకులకు విముక్తి కలుగుతుందని ఝుంఝూ మారుత జన నినాదమై పోరుకెరటమై ఎగిసిన యువత జైలుకెళ్లిన వారు కొందరైతే, జవాన్లతో జంగు చేసినవారు మరికొందరు, పోరాటానికి ఆత్మత్యాగంతో ఊపిరిలూదినవారు మరికొందరు, ఉవ్వెత్తున ఉరకలెత్తినవారు కొందరైతే, ఎగిసిపడ్డ జ్వాలై కాలి బూడిదైనవారు మరికొందరు. కలాలు, గళాలతో రుద్రవీణలు ప్రయోగించినవారు కొందరైతే, కాలికి గజ్జె కట్టి గంతులేసి ధూంధాం చేసినవారు మరికొందరు. అలుపెరగని పోరాటాలతో చేసిన రణ నినాదానికి రంకెలు వేసిన రాజకీయం కూడా భయపడి ముందుకురాక తప్పలేదు. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఎదురు చూసిన యువతకు ఆశల పల్లకీగా ఆవిష్కృతమైంది తెలంగాణ రాష్ట్రం.

ఆది నుంచీ నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశంపైనే పోరాటపు పునాదులు బలపడ్డాయి. ఇందులో నీటి సమస్య దీర్ఘకాలంలో పరిష్కరింప బడేది. కాగా ఏ ఆశల కోసం యువత తిరగబడిందో, ఏ నిధులు తమకు దక్కకుండా పోయాయని రేకెత్తించిన ఆందోళనలో మమేకమైంద్రో ఆ నిధులు మన కోసం కేటాయించుకునే స్వతంత్రాధికారం వచ్చింది కనుక అది స్వల్పకాలిక పరిష్కార అంశం అవుతుంది. ఇకపోతే నియామకాలు - ఇది ఇప్పటికిప్పుడు వెనువెంటనే పరిష్కరించాల్సిన ప్రధాన సమస్య.

నిరుద్యోగ నిర్మూలనకు గత నాయకుల నిర్వాకమెట్లున్నా కేవలం ఏకైక తెలంగాణ నినాదంతో పీఠమెక్కిన ప్రభుత్వ ప్రతిపాదితాంశాలేమిటి? అటువైపు పడుతున్న అడుగులేమిటి? నిరుద్యోగాన్ని తొలగించడంలో ఈ ప్రభుత్వం చేయదలచిన దిశా నిర్దేశమేదైనా ఉందా? కూటికోసం కోటి విద్యలన్నట్లు ఓటుకోసం మాటలతో కోటలు కట్టడమేనా? అసలే యువత వెన్నుపూసతో లేచి నిలబడిన తెలంగాణలో నిరుద్యోగుల స్థితి గతులేమిటి?

నూతనంగా అవతరించిన తెలంగాణ రాష్ట్ర నేపథ్యంలో నిరుద్యోగ సమస్యను చర్చించే ముందు అసలు నిరుద్యోగమంటే ఏమిటో చూద్దాం. పనిచేసే వయస్సు 15-60 సంవత్సరాల మధ్యగల స్త్రీ, పురుషులు, వారి విద్యార్హతలు, శిక్షణ నైపుణ్యాల ఆధారంగా మార్కెట్లో నిర్ధారించిన వేతనంతో పనిచేయడానికి సంసిద్ధత ఉన్నప్పటికీ పని లభించని స్థితిని 'నిరుద్యోగం'గా ఆర్థికవేత్తలు నిర్వచించారు. ఏ ప్రాంతంలోనైనా వర్ధమాన, భవిష్య జీవనాన్ని ప్రభావితం చేసే దురదృష్టకరమైన సమస్యలలో ప్రధానమైనది నిరుద్యోగ సమస్య. ఇది బహుముఖీనమై సామాజిక, ఆర్థిక సమస్యలకు మూలంగా మారుతుంది.

సాంకేతికంగా రోజుకు 8 గంటల చొప్పున సంవత్సరానికి కనీసంగా 273 రోజుల పాటు పనిచేసే వారిని ఉద్యోగిగా గుర్తిస్తారు. మిగిలిన వారందరు నిరుద్యోగులే. సహజంగా ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో పెరిగే మానవ వనరులను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందితే నిరుద్యోగ సమస్య మరింతగా ప్రబలుతుంది. నేషనల్ శాంపిల్ సర్వే నిరుద్యోగ స్థితిని సాధారణ, వారం వారీ, రోజు వారీ నిరుద్యోగులుగా వర్గీకరిస్తే ఆర్థిక వేత్తలు స్వచ్ఛంద, సంఘృష్ట, చక్రియ, ప్రచ్ఛన్న, అల్ప, రుతు సంబంధ, సాంకేతిక, ఒరిపిడి నిరుద్యోగులుగా వర్గీకరించారు. ఇందులో స్వచ్ఛందాన్ని మినహాయిస్తే పని చేయడానికి ముందుకు వచ్చినప్పుడు 'పని దొరకని స్థితి'నే నిరుద్యోగంగా నిర్వచించుకోవచ్చు.

**కారణాలు నాడు - నేడు**

వివిధ రంగాలలో ఏర్పడిన ప్రచ్ఛన్న నిరుద్యోగం, ప్రధానంగా ఉన్నత చదువుల తర్వాత కొలువులు లేని జీవితాలకు ప్రధాన కారణాలను వెతకాల్సి ఉంది. ఈ క్రమంలో మన కళ్లముందున్న కారణాలివే.

లోపభూయిష్టమైన విద్యా విధానం: స్వాతంత్ర్యానంతర భారతీయ విద్యా విధానంలో ఎటువంటి మార్పులు చోటుచేసుకోకుండా బ్రిటిష్ విద్యా విధానాన్ని కొనసాగించడమే ప్రధాన కారణం. అనంతర కాలంలో అరకొర వసతులతో ఇబ్బడి ముబ్బడిగా వెలసిన వృత్తి విద్యా కళాశాలలు, ఉద్యోగ అర్హతల్లేని పట్టాలు పంపిణీ చేసే విద్యా వ్యవస్థలో ప్రలోభాలకు లోనై ఆ పట్టాలు చేతులకిచ్చే ప్రైవేట్ విద్యా వ్యవస్థల పెడ ధోరణులు ఒకవైపు, నైపుణ్యం లేని విద్యార్హతలతో సమాజంలోకి అడుగుపెట్టిన ఉద్యోగార్థులైన విద్యార్థులతో మరొకవైపు ఈ సమస్య వెల్లువలా పొంగింది.

దార్శనికతలేని ప్రభుత్వాలు: విద్యా విధానంలో సంస్కరణలను చిత్త శుద్ధితో అమలు పరచకపోవడం ఉపాధి పెరుగుదలకు ప్రధానమైన అటంకంగా పరిణమించింది. జాతి పురోభివృద్ధికి ప్రధాన వనరైన విద్యా రంగం నుండి నిపుణులను, సృజన శక్తులను అవతరింప చేయాలనే దృఢ సంకల్పం పాలకుల్లో లేకపోవడం ఒక కారణం. ఉద్యోగ సృష్టి కర్తలను (భారీ, మధ్య తరహా, చిన్న, కుటీర పరిశ్రమలను నెలకొల్పే సామర్థ్యం కలవారిని) తయారు చేసుకోకపోవడంతో పాటు ఉన్నత చదువులు ఉద్యోగార్హంగా ఉండడం  లేదన్న సంగతి ప్రభుత్వాలు గుర్తించకపోవడం మరొక కారణం.

ఈ ప్రాంతంలో వ్యవస్థాపక రంగాన్ని పూర్తి స్థాయిలో ప్రోత్సహించక పోవడంతో పాటు వ్యవసాయేతర, అనుబంధ రంగాల అభివృద్ధి జరగకపోవడం కింది స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు నిరుద్యోగం నిట్ట నిలువుగా పెరగడానికి ప్రధాన కారణం. ముఖ్యంగా ఒక ప్రాంతంలోనున్న మొత్తం జనాభా సేవలకు, ఉన్న వనరుల ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ పరంగా ఎంత ఉద్యోగిత అవసరమో కాలానుగుణంగా గుర్తించగలిగే దార్శనికత నాయకులకు లేకపోవడం ముఖ్య కారణం.

పైన పేర్కొన్నట్లు వివిధ కారణాల వల్ల తెలంగాణలో నిరుద్యోగిత 13 శాతానికి ఎగబాకింది. ఈ నిరుద్యోగం నిరక్షరాస్యుల్లో 0.1 శాతం ఐతే పిజి స్థాయిలో 14 శాతానికి పైబడి ఉండడం మరింత ఆందోళన కలిగించే విషయం. లక్షల మంది పట్టభద్రులున్నా, ఉద్యోగాలు లేక యువత నిరాశ, నిస్పృహలలో నిరుద్యోగులుగా మిగిలి పోవడానికి భ్రష్టు పట్టిన విద్యా విధానంతో పాటు ప్రభుత్వాల పారంపర్య దార్శనికతలేని తనమే ప్రధాన కారణమన్నది నిర్వివాదాంశం.

కారణాలేమైనా తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత విద్యా వ్యవస్థ భౌతిక మార్పు మాత్రమే కాకుండా విధాన మార్పులు తేవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో బ్రిటిష్ కాలం నుండి వారసత్వంగా వస్తున్న గుమస్తాగిరి ఉద్యోగాలకు తోడ్పడే మెకాలే విద్యా విధానం మార్చి భౌతిక ఉత్పత్తి పెరగడానికి తోడ్పడే నాణ్యమైన వృత్తి విద్యలు ప్రవేశపెట్టాలి. ప్రస్తుత వృత్తి విద్యలో ఉన్న విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ హెచ్చు స్థాయిలో ఉండాలి. సాంకేతిక విద్యను విస్తృత పరిచి మరింత ఉపయోగంలోకి తేవాలి. మానవ వనరుల నైపుణ్యాలు పెంచడానికి ప్రాధాన్యమిస్తూ ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజనీరింగ్, నర్సింగ్, వివిధ టెక్నాలజీ వృత్తి విద్యా సంస్థలపై దృష్టి సారించాలి.

గ్రామీణ ఉత్పత్తి రంగాలలో అవసరమైన వారికి నిపుణుల చేత వర్క్ షాపులు, స్థానిక శిక్షణా కేంద్రాలు నిరంతరాయంగా కొనసాగిస్తూ గ్రామీణ యువకులను నైపుణ్యం గల మానవ వనరులుగా తీర్చి దిద్దాలి. అభివృద్ధి చెందుతున్న పట్టణీకరణకై చిన్న చిన్న వృత్తులైన ఎలక్ట్రీషియన్, పెయింటింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ ఆపరేటింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, తదితర రంగాలలో నైపుణ్యం గల మానవ వనరుల కొరత స్పష్టంగా ఉంది. దీన్ని అధిగమించడానికి ప్రభుత్వం స్థానికంగా మానవ వనరుల శిక్షణా కేంద్రాలను నెలకొల్పాలి. అదే విధంగా పర్యాటక ప్రచార సాధనాలు, పత్రిక మీడియా రంగాలలో వస్త్ర, ఆహార ఆరోగ్య రంగాల్లో పుష్కల అవకాశాలున్నా, ప్రాపర్ స్కిల్ లేకపోవడంతో వారందరు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నందున ఆయా రంగాల్లో నిపుణతను అందించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించి నిరుద్యోగ భారం నుండి కొంత ఉపశమనం పొందవచ్చు.

తెలంగాణ రాష్ట్ర శ్రమ జీవన సంస్కృతిలో అంతర్భాగంగా అనాదిగా కొనసాగుతున్న వ్యవసాయ రంగాన్ని లాభదాయకమైన వృత్తిగా తీర్చి దిద్దాలి. భూ గరిష్ట పరిమితి చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచి మిగులు భూములను వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయాలి. మూలాధార, భారీ పరిశ్రమలను మినహాయించి ఇతర పరిశ్రమల్లో శ్రమ సాంద్రమైన ఉత్పత్తి పద్ధతులను వినియోగించాలి. ఉక్కు, రక్షణ, రసాయన, ఇంధన ఉత్పత్తి మొదలైన కీలక పరిశ్రమలను స్థాపించినట్లయితే పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగం అవుతుంది. ఈ క్రమంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన తెలంగాణ పారిశ్రామిక విధానం మరింతగా ఉపయోగపడాలి.

**ప్రభుత్వ అనుసరణీయ వ్యూహాలు**

నూతనంగా ఆవిష్కృతమైన తెలంగాణ రాష్ట్రం నిరుద్యోగ నిర్మూలనకు దీర్ఘకాలిక వ్యూహాలను అనుసరిస్తూ సామాజిక రంగ నిపుణుల మేధోమథనాన్ని గ్రహిస్తూ నిరుద్యోగ నిర్మూలనకు దార్శనికతతో కూడిన ప్రణాళికలను రచించుకోవాలి. ఇందులో భాగంగా నేటికి దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఐఎఎస్, ఐపిఎస్‌ల వంటి అఖిల భారత సర్వీసులకు ఈ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో ఎంపికయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల కోసం శిక్షణా కేంద్రాలను అరకొర వసతులతో మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. శిక్షణా కేంద్రాలను మెరుగులు దిద్ది నాణ్యతను పెంపొందించి రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచాల్సిన అవసరం ప్రభుత్వానిదే. మేధో సంపదను సద్వినియోగం చేసుకునేందుకు చిత్తశుద్ధితో పరిశోధనలు జరిపించాలి.

మన రాష్ట్రం కంటే తక్కువ బడ్జెట్ ఉన్న తమిళనాడు, బీహార్, ఒడిశా లాంటి రాష్ట్రాల్లో స్వయంగా ప్రభుత్వాలే శిక్షణా సంస్థలను ఏర్పరిచి, పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాయి. మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వ విధానం ఆదర్శంగా ఉంది. ఆ రాష్ట్ర ప్రభుత్వం సువిశాలమైన స్థలంలో అఖిల భారత శిక్షణా కేంద్రాన్ని స్థాపించింది. వసతి గృహాలు, డిజిటల్ గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్, ఆధునిక వసతి కలిగిన చికిత్సాలయం ఏర్పాట్లతో అనుభవం అంకిత భావం కలిగి పేరొందిన ప్రొఫెసర్లను, ఉన్నతాధికారుల ద్వారా ఈ కేంద్రాలను నిర్వహించడం వలన మెరుగైన ఫలితాలను పొందుతున్నారు. ఈ ప్రక్రియ ప్రతిభా వంతులైన పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారిలో సగానికి పైగా అఖిల భారత సర్వీసుల్లో నియామకం కాగా మిగిలిన వారందరూ రాష్ట్రస్థాయి ఉన్నతోద్యోగులుగా స్థిరపడుతున్నారు.

తెలంగాణ రాష్ట్ర పది జిల్లాల్లో 9 బి.సి. శిక్షణా కేంద్రాలున్నాయి. మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలను మినహాయిస్తే మిగిలినవన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఎస్‌సి శిక్షణా కేంద్రాలు ఎస్‌సి అభివృద్ధి సంస్థ ద్వారా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. వాటి నిర్వాహణ మరింత అధ్వానంగా ఉంది. గడిచిన నాలుగు సంవత్సరాలలో తెలంగాణ వెనుకబడిన శిక్షణా కేంద్రాల నుండి ఒక్కరు కూడా పోటీ పరీక్షల్లో ఎంపిక కాలేదు. తెలంగాణ ప్రాంతం నుండి ఎస్‌సి శిక్షణా కేంద్రాల ద్వారా 2010-11లో 47 మంది, 2011-12లో 57, 2012-13లో 56, 2013-14లో 60 మందికి శిక్షణ ఇస్తే ఒక్కరూ అఖిల భారత స్థాయి సర్వీసుల్లో ఎంపిక కాలేదు.

బిసి శిక్షణా కేంద్రాల నుండి 2884 మందికి శిక్షణ ఇస్తే 309 మంది మాత్రమే అర్హత సాధించారు. ఇందులో 90 శాతం మంది పోలీస్ కానిస్టేబుల్స్‌గా నియామకం అయ్యారు. నేడున్న పరిస్థితుల్లో వీటి నిర్వాహణకు భారీగా నిధుల కేటాయింపుతో పాటు ప్రమాణాల పెంపుదలకు ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. తెలంగాణ ప్రాంతం కానిస్టేబుల్, విఆర్ఓ, విఎఒ, ఎస్ఐ తదితర పోస్టులకు ఎంటెక్, పిఎచ్‌డిలు చేసిన వారు సైతం పోటీ పడడం విచారకరం. ఉపాధి హామీలో ఇంజనీరింగ్ విద్యార్థుల పేర్లు నమోదు కావడం బాధాకరం. యువత ఉపాధ్యాయ పోస్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కాని కార్పొరేటీకరణలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులన్నీ ప్రభుత్వాల నుండి ప్రైవేటీకరించబడ్డాయి. డిజిటల్ బోధనతో అక్కడ కూడా నైపుణ్యలేమితో యువత అనివార్యంగా నిరుద్యోగం వైపే నెట్టబడుతుంది.

గత అనుభవాలను గమనిస్తే గ్రూప్-1, గ్రూప్-2 కంటే గ్రూప్-4 ఉద్యోగాలకే ఎక్కువ అప్లికేషన్స్ వచ్చినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ రంగాలకు సంబంధించి శిక్షణా కేంద్రాలను తక్షణమే బలోపేతం చేయాల్సిన అవసరముంది.

గ్రామీణ చేతి వృత్తుల, గిరిజన ప్రాంత కుటీర ఉత్పత్తుల కొరకు అవసరమైన వనరుల పరికల్పన జరగాలి. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన తెలంగాణలోని నిర్మల్ (ఆదిలాబాద్),

నేలకొండపల్లి (ఖమ్మం) వంటి ప్రదేశాలలో ఉత్పత్తి అయ్యే కళాఖండాలకు వెదురు, రంగులు వంటి స్థానిక వనరుల పరికల్పనకై కృషి చేయాలి.

**పబ్లిక్ సర్వీసు కమిషన్ – పాత్ర**

ఉద్యోగ కాలెండర్ ప్రకటించాలి. దీర్ఘ దృష్టి ఆలోచనలతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఉద్యోగుల శాతం ఏ మేరకు అవసరమవుతుందో చూడగలగాలి. అప్పుడు దశల వారీగా ఆయా డిపార్ట్‌మెంట్స్‌లో నియామకాలు జరపాలి. పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపడే సేవల కోసం అవసరమయ్యే ఉద్యోగాల పరికల్పనకు ప్రభుత్వానికి దార్శనికత అవసరం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలలో ఖాళీలన్నింటిని భర్తీ చేస్తామని చెప్పి రెండు నెలల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను ఏర్పాటు చేసింది. విషయ నిపుణులతో కమిటీ వేసి సిలబస్‌ను నిర్ణయించింది. ఈ తాజా పరిస్థితుల్లో కమిషన్ పాత్ర కీలకంగా మారింది. కమిషన్ దేశంలో అత్యంత ఆధునాతన విధానాలను అధ్యయనం చేసి అమలు చేయాలి. మొదటగా నిరుద్యోగుల్లో కమిషన్ పట్ల పూర్తి నమ్మకం, విశ్వాసాన్ని కలిగించాలి. నోటిఫికేషన్స్, ఖాళీల ప్రకటనల దగ్గర నుండి నియామకపు ప్రక్రియ పూర్తి వరకు పారదర్శకత కనిపించాలి. అభ్యర్థులు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా సమగ్ర సేవలన్నింటిని ఆన్‌లైన్ ద్వారా అందించాలి. ఇంటి నుండే వెబ్‌సైట్ ద్వారా సేవలను వినియోగించుకునేలా ఈ-మెయిల్స్ సదుపాయం కల్పించాలి. ఎలాంటి అనుమానాలు, అభ్యంతరాలున్నా ఫోన్ సమాచారం అందించే కాల్ సెంటర్స్‌ను అందుబాటులోకి తేవాలి. వన్ టైం రిజిస్ట్రేషన్ లాంటి విధానాలను పకడ్బందీగా అమలు చేయాలి. నేటికి రెండున్నర లక్షలకు పైగా అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారంటే దీని ప్రాధాన్యతను అర్థం చేసుకోగలం. ఎప్పటికప్పుడు అప్లికేషన్స్ స్టేటస్, హాల్ టికెట్స్ డౌన్‌లోడ్స్ వంటి విషయాల్లో తలెత్తే సమస్యలు పరిష్కరించడానికి సాంకేతిక కమిటీని అందుబాటులో ఉంచాలి.

ఆబ్జక్టివ్ విధానంలో నిర్వహించే పరీక్షలకు వెంటనే ప్రాథమిక 'కీ'ని ప్రకటించాలి. ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్షలు నిర్వహించి, పరీక్ష రాస్తుండగానే స్కోర్ తెలపాలి. బయోమెట్రిక్ విధానం ద్వారా ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసే విధానాన్ని అరికట్టాలి. ఫలితాలు ప్రకటించిన వారంలోగా నేరుగా నియామకాలు జరగాలి. ప్రభుత్వం రాష్ట్రానికి అవసరమైన కేంద్ర స్థాయి పోస్టులు ఎప్పటికప్పుడు నియామకం జరిగేటట్లు చూడాలి. నియామకాలన్నీ క్రమ పద్ధతిలో దశల వారీగా జరగాలి. దీనివల్ల అభ్యర్థులకు సౌకర్యంతో పాటు పదోన్నతుల్లో సీనియారిటీ సమస్యలుండవు.

నూతనంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర నాయకత్వానికి నిరుద్యోగ సమస్యలపైన ఒక దార్శనికత ఉండడం ఎంతైనా అవసరం. భవిష్యత్తులో కనీసం రెండు దశాబ్దాలకు పెరిగే జనాభా అవసరం దృష్ట్యా, రానున్న సామాజిక, పారిశ్రామిక, సేవా తదితర రంగాలలోని అవకాశాల అంచనాలపైన అవగాహన ఉండాలి.

నిజానికి గత ప్రభుత్వాల కాలంలో ఉన్నత విద్యను సొమ్ము చేసుకోవడానికి రాజకీయ శక్తుల వెన్నుదన్నుతో కనీస వసతులు లేని విద్యా సంస్థలు కోకొల్లలుగా వెలిశాయి. ఆ విద్యాలయాలపై నియంత్రణ లేకపోగా వాటికి ఫీ రీయింబర్స్‌మెంట్ పేర కోట్లాది రూపాయల ప్రజా ధనం కొల్లగొట్టి పెట్టారన్నది బహిరంగ రహస్యమే. పైగా ఆ విద్యాలయాల నుండి ఏమాత్రం నైపుణ్యం, సృజనాత్మకతలేని విద్యార్థులు బయటకు వచ్చి రోడ్లపై నిలబడడంతో పాటు పొంతనలేని ఉద్యోగాల కోసం ఎదురు చూడడం మనం చూస్తున్నాం. కావున సృజన క్షేత్రాలు కాని విద్యాలయాల నియంత్రణకు నిరుద్యోగం పట్ల ప్రత్యేక దృష్టి గల ప్రభుత్వాలకు బాధ్యతతో కూడిన నిర్దాక్షిణ్యత కూడా అవసరమే. వీటిపట్ల కోర్టుల ప్రమేయాలను కూడా సమీక్షించాల్సిన అవసరముంది.

**ముగింపు**

కోటి ఆశలతో ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురందిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి తెరలేపింది. పోరాడిన విద్యార్థులకు, నష్టపోయిన యువతకు వయో పరిమితి సడలింపు, ఉద్యమ కేసుల ఎత్తివేత, తదితర రాయితీలు కల్పించడం హర్షించదగిందే. ఐతే ఉద్యమ కాలంలో ఉవ్వెత్తున లేచిన యువతకు ఇచ్చిన హామీలకు, అనుసరిసున్న విధానాలకు ఎక్కడా పొంతనలేదన్న వాస్తవాన్ని గ్రహించాల్సి ఉంది. ఒకనాటి ఉద్యమ నాయకత్వమే నేటి ప్రభుత్వ రూపం కాగా నాడు ఉద్యమ ప్రవాహంలో లక్షలాది ఉద్యోగాలు కొల్లగొట్ట బడ్డాయని చెప్పి రాష్ట్రం ఏర్పడితే 2.5 లక్షల ఉద్యోగాలుంటాయని, ఇంటికో ఉద్యోగమన్న హామీలు గుప్పించిన మాట వాస్తవం. ఐతే ఆచరణలోకి వచ్చే సరికి లక్ష ఉద్యోగాల భర్తీ అంటూ భారీ ప్రచారానికి తెరతీసి తీరా ఉద్యోగ ప్రకటనల జారీకి చేరే సరికి 58 వేల ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ జరుగుతోందని, మిగిలినవి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణతో నింపుతామంటున్నారు. ఉద్యమ కాలంలో 610 జిఒ అమలు కోసం అరచి గగ్గోలు పెట్టి మన కంటిని మన వేలుతో మనమే పొడుచుకున్నాం. ఇప్పటికీ ఆ పేరుమీద ఒక్క ఆంధ్ర ఉద్యోగిని కూడా బయటకు పంపించలేకపోయాం. అంతేగాక పూర్వ ప్రభుత్వాల మాదిరి నూతన ప్రభుత్వం కూడా ప్రపంచ బ్యాంక్ అనుకూల విధానాలనే అనుసరిస్తుంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ విద్యా రంగమే. రేషనలైజేషన్ పేరుతో ఒకవైపు ఉపాధ్యాయ ఉద్యోగాలను కుదిస్తూ, మరోవైపు కెజి టు పిజి, నియోజక వర్గానికి 10 రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పుతామనడం హాస్యాస్పదం. ఒకవైపు ఉద్యోగాలను కుదిస్తూ మరోవైపు సృష్టిస్తామనడం గందరగోళ పరచడం గాక మరేమవుతుంది? దీనికి ఊతమిచ్చేదే ఇప్పట్లో డిఎస్‌సి ఉపాధ్యాయ నియామకాలు లేవన్న ప్రభుత్వ ప్రకటన.

ఇదిలా ఉండగా ఇప్పటికీ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు మూడు లక్షల మంది నిరుద్యోగులు నమోదు చేసుకున్నారు. అదిగాక ఇప్పటి జిల్లా కేంద్రాల్లో కేవలం అలంకార ప్రాయాలుగా, విశ్రాంతి నిలయాలుగా మిగిలిపోయిన ఉపాధి కేంద్రాల్లో లక్షలాది మంది నమోదై ఉన్నారు. వీరందరికి ప్రకటించిన ఉద్యోగాలు ఏ మూలకి సరిపోవు. భర్తీ చేయదలచిన ఉద్యోగాలకు బడ్జెట్ కేటాయింపు ఉందా? ఇప్పటికే అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగులకు మించిన పిఆర్‌సి అమలుతో, బడ్జెట్ ఫ్రీజ్‌లతో భారంగా వెల్లదీస్తున్నట్లు కనిపిస్తుంది.

ప్రభుత్వం విద్యా ఉపాధి అవకాశాల మధ్య సమన్వయం చేసుకుంటూ కేవలం ఉద్యోగమంటే ప్రభుత్వ ఉద్యోగమే అన్న భ్రమలు తొలగిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కుటీర వ్యవసాయ, వ్యవసాయేతర అనుబంధ రంగాలను స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తూ, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేసుకుంటూ యువత ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలి. రాష్ట్రంలో భౌతిక, మానవ వనరులను సరిగ్గా అంచనా వేసుకుని అందుకనుగుణంగా యువత నైపుణ్యాన్ని పెంపొందిస్తూ నిరుద్యోగాన్ని దూరం చేసి దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు తెలంగాణ నవీన రాష్ట్రంగా ఆదర్శంగా నిలబడాలని ఆశిద్దాం.

*(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలంగాణ విశ్వవిద్యాలయం)* వీ

# అన్యాయాన్ని ఎదిరిస్తే అణచివేతలు

***గుజరాత్ హత్యాకాండలో సంఘ్ పరివార్ పాత్రను సాక్ష్యాధారలతో బయటపెట్టిన వారిపై ప్రభుత్వం నిర్బంధాన్ని, అణచివేతను ప్రయోగిస్తున్న తీరును వివరిస్తున్నారు బి. రామకృష్ణ***

**2002**లో గుజరాత్ రాష్ట్రంలో ఫిబ్రవరి 28 నుండి మూడు రోజుల పాటు జరిగిన బహిరంగ హత్యాకాండలో ఎంతో మంది ముస్లిం ప్రజలు బలైన సంఘటన భారత చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఈ గాయం మానని పుండుగా ఈ దేశంలో హిందూ మతోన్మాదంను గుర్తుచేస్తూనే ఉంటుంది. ప్రభుత్వాధినేతల అండదండలతో పక్కా ప్రణాళికతో ప్రభుత్వ యంత్రాంగం మద్దతుతో జరిగిన బీభత్సంగా భారత చిత్రపటంపై వేలాడుతూనే ఉంటుంది. ఇంత దుర్మార్గమైన సంఘటనకు కారకులైన శక్తులే తరువాత గుజరాత్ ఎన్నికల్లో గెలిచారు. వారే నిరాటంకంగా నేటి వరకు కూడా అధికారాన్ని కొనసాగిస్తుండడం అనేది భారత ప్రజాస్వామ్యం ప్రశ్నగా, విషాదంగా మిగిలిపోయింది.

ప్రజాస్వామిక, రాజ్యాంగ, చట్టబద్ధ సంస్థలు మూగబోయిన సందర్భంలో న్యాయపోరాటాన్ని కొనసాగిస్తూ, బాధితుల, పీడితుల పక్షాన 2002 నుండి నేటి వరకు తీస్తా సెతల్వాడ్, జావెద్ ఆనంద్‌లు నిలబడి ఉండడం మోడీ ప్రభుత్వానికి మింగుడు పడడంలేదు. వీరు బాధితులకు బాసటగా ఉంటూ గుజరాత్‌లో 2002 ఫిబ్రవరి-మార్చ్‌లలో జరిగిన భయంకరమైన హత్యాకాండకు సహకరించిన ప్రభుత్వాధినేతలను కొందరినైనా, ప్రభుత్వ యంత్రాంగాన్ని కొంతమేరకైనా బోనులో నిలబెట్టగలిగారు. కొందరికి శిక్షలు వేయించగలిగారు. గుజరాత్‌లోని నరోద్ పాటియాలో 97మంది ముస్లింల దారుణ హత్యాకాండ విషయంలో 29 జూలై 2012న 32 మందికి శిక్షలు వేయించగలిగారు. ఈ శిక్షలు పడ్డ వారిలో అప్పటి గుజరాత్ రాష్ట్రమంత్రి మాయాకొద్నాని, భజరంగ్‌దళ్ నాయకులు బాబుభజరంగ్ కూడా ఉన్నారు. వీరికి ప్రత్యేక కోర్టు జడ్జి జోత్స్నయాజ్ఞిక్ శిక్షలు వేస్తూ తీర్పునిచ్చారు. అందుకు గాను జోత్స్నయాత్నిక్‌కు ఎన్నో బెదిరింపు ఉత్తరాలు, ఫోన్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమెకు భద్రతను పెంచాల్సిందిపోయి, తగ్గించిన ఘనతను గుజరాత్ ప్రభుత్వం కూడగట్టుకున్నది. శిక్షకు గురైన మంత్రి మాయాకొద్నాని తరువాత బెయిల్‌పై విడుదలయ్యారు. ఈమెపై గల కేసు నీరుగారిపోకుండా, శిక్ష నుండి తప్పించుకోకుండా పై కోర్టుల్లో కూడా శిక్షలు ఖరారు అయ్యేలా న్యాయపరమైన ప్రక్రియను కోర్టుల్లో నడిపేటందుకు గట్టి పట్టుదలతో సెతల్వాడ్ నేటికీ కృషి చేస్తున్నారు.

ఈ సందర్భంలో న్యాయస్థానాలలో లాయర్లు, న్యాయమూర్తుల వైఖరి గుజరాత్ అల్లర్లకు సంబంధించి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఒకప్పుడు న్యాయమూర్తిగా పనిచేసి రాజీనామా చేసిన హిమాంశు త్రివేది అనుభవం ఉపయోగపడుతుంది. గుజరాత్‌లో సివిల్ సెషన్ కోర్టులో జడ్జిగా అక్టోబర్ 2002లో హిమాంశు త్రివేది చేరారు. న్యాయమూర్తిగా ఎనిమిది నెలలు పనిచేసి ఏప్రిల్ 2003లో రాజీనామా చేశారు. ఇతను సివిల్ కేసులను మాత్రమే చూసేవారు. ఆ సమయంలో గుజరాత్ 2002 అల్లర్లకు సంబంధించిన కేసులను కిందిస్థాయి మెట్రోపాలిటన్ కోర్టులు చూస్తుండేవి. ఈ అల్లర్ల గురించి ప్రైవేటుగా చర్చించే సందర్భంలో న్యాయమూర్తులు సైతం ముస్లింలకు తగిన గుణపాఠం జరగాల్సి ఉందని లేదా జరిగిందని అనేవారని త్రివేది అంటారు. గుజరాత్ మారణకాండకు సంబంధించిన కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లందరూ చాలావరకు హిందూ మత సంస్థల రాజకీయాలకు చెందినవారే. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, బిజెపిలకు చెందిన సభ్యులుగా ఉన్నవారే. వీరు అల్లర్లలో పాల్గొన్న నేరస్తులను అంటే వారి సొంత మనుషులను విచారించాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాలలో ఈ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నేరస్తులకు శిక్షలు పడేలా వాదిస్తారా? లేక శిక్షల నుండి తప్పించేలా వాదిస్తారా అర్థం చేసుకోవడం కష్టమేం కాదు. ఇలా న్యాయస్థానాలు నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా ఒక వర్గాన్ని వెనుకేసుకొచ్చే సందర్భాలలో కలత చెందిన త్రివేది తన న్యాయమూర్తి పదవికి ఏప్రిల్ 2003లో రాజీనామా చేశారు. తరువాత ఇతర కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2004లో న్యూజిలాండ్‌కు వెళ్లిపోయారు. అంటే ఇంతలా భ్రష్టుపట్టిన నేపథ్యంలో శక్తివంతమైన మతోన్మాద శక్తులతో అధికార యంత్రాంగానికి వ్యతిరేకంగా సెక్యులర్ భావాలతో గుజరాత్‌లో హక్కుల ఉల్లంఘనలపై న్యాయం కోసం పోరాడడం ఎంతకష్టమైందో అర్థం చేసుకోవచ్చు. గుజరాత్‌లో మత కల్లోలాల మారణకాండ జరిగిన తరువాత 2002 ఏప్రిల్ 1న మతసామరస్యాన్ని కాపాడేందుకు సిటిజన్స్ ఫర్ జస్టిస్ పీస్(సిజెపి) అనే సంస్థను స్థాపించడంలో సెతల్వాడ్, ఆమె సహచరుడు జావెద్ ఆనంద్ ప్రధాన పాత్ర నిర్వహించారు. మొత్తంగా గుజరాత్ అల్లర్ల కాలంలో 120 మంది వరకు శిక్షలు పడేలా చేయడంలో సిజెపి దాని బాధ్యులు సెతల్వాడ్, జావెద్ ఆనంద్‌ల కృషి ఎంతో ఉన్నది. చాలావరకు ఈ అల్లర్లకు, హత్యాకాండకు సంబంధించి కేసులు వీగిపోయాయి. సుప్రీంకోర్టు ప్రమేయంతో కొన్ని కేసుల్లో తిరిగి విచారణను చేపట్టడం జరిగింది. 2002 గుజరాత్ అల్లర్ల సందర్భంగా కాంగ్రెస్ రాజకీయవాది, మాజీ పార్లమెంట్ సభ్యుడైన ఎహ్‌సాన్ జాఫ్రీని 2002 ఫిబ్రవరి 28న అహ్మదాబాద్‌లోని గుల్బర్గ్ సొసైటీలోని తన ఇంటి నుండి బయటకు లాక్కొచ్చి నరికి మంటల్లో కాల్చివేశారు. ఈ కేసుకు సంబంధించి న్యాయం కోసం ఆయన సహచరి జాకియా జాఫ్రిద్ పోరాడుతున్నారు. ఈమెకు అన్ని రకాలుగా అండగా తీస్తాసెతల్వాడ్ నిలబడ్డారు. ఆ రోజు గుల్బర్గ్ సొసైటీలో మొత్తం 69 మంది హత్య చేయబడ్డారు. గుజరాత్ అల్లర్ల సందర్భంగా జరిగిన ఎన్నో దారుణాలలో గుల్బర్గ్ సొసైటీ హత్యాకాండ ఒకటి మాత్రమే. ఇంత పెద్దమొత్తంలో జరిగిన విచక్షణారహిత మారణకాండ అనేది అప్పటి ముఖ్యమంత్రి

నరేంద్రమోడీ ప్రమేయం లేకుండా జరగలేదని జాకీయజాఫ్రీతో పాటుగా ఎంతోమంది అభిప్రాయపడడంలో ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. నేటికి కూడా ఈమె కోర్టుల్లో బలంగా నిలబడుతున్నారు. ఆమెకు మద్దతుగా సెతల్వాద్ తదితరులు ఉంటున్నారు. ఒకవేళ ఈ న్యాయ పోరాటంలో జాఫ్రీ నెగ్గితే పోలీసు అధికారులు, నరేంద్రమోడీతో పాటు ఎందరో రాజకీయ నాయకులు నేర విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వారికి శిక్షలు పడే అవకాశం కూడా ఉన్నది.

గుజరాత్ అల్లర్లపై సుప్రీంకోర్టుచే నియమించబడిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఇచ్చిన రిపోర్ట్ గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్ర ఉన్నట్లుగా చూపే తగిన ఆధారాలు లేవని చెప్పింది. ఈ రిపోర్టును జాఫ్రీ ప్రశ్నిస్తున్నారు. దీన్ని నిరసిస్తూ పెట్టుకున్న పిటిషన్‌ను 2013 డిసెంబర్ 26న గుజరాత్‌లో మెజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. ఇంతటితో వదిలేయకుండా జాఫ్రీ న్యాయపోరాటాన్ని కొనసాగిస్తోంది. దీని తరువాత ఎనిమిది రోజులకు జనవరి 2014లో సెతల్వాద్, జావేద్ అనంద్, జాఫ్రీ కొడుకు తన్వీర్ జాఫ్రీ మరో ఇద్దరిపై ఐపిసి 120(బి), 406, 402 సెక్షన్ల కింద ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. దీంతోపాటుగా సెతల్వాద్ స్థాపించిన సిజెపి, సబ్రంగ్ కమ్యూనికేషన్స్ అండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌సిపిపిఎల్)ల, ఆమె వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లను నిలిపేశారు. అయినప్పటికీ జాఫ్రీ, సెతల్వాద్‌లు 2014 మార్చ్ 15న కోర్టులో క్రిమినల్ ప్రొటెస్ట్ పిటిషన్‌ను వేశారు. ఈ కేసుకు సంబంధించి వాదనలు 2015 జూలై 27న కోర్టు ముందుకు వచ్చాయి. ఈ వాదనలు 2015 ఆగస్టు 4 నుంచి విచారించబడుతున్నాయి. తీర్పు ఎటువైపు వస్తుందో తెలియదు.

తీస్తా సెతల్వాద్, ఆమె సహచరుడు జావెద్ ఆనంద్‌లు మతోన్మాదానికి వ్యతిరేకంగా 1993 నుంచి పనిచేస్తున్నారు. అదే సంవత్సరంలో సబ్రంగ్ కమ్యూనికేషన్స్ అండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎస్.సి.పి.పి.ఎల్.) సంస్థను బొంబాయిలో ప్రారంభించారు. దీని తరపున కొంబాట్ కమ్యునలిజమ్ అనే పత్రికను ప్రచురించారు. దీనికి సెతల్వాద్ సారథ్యం వహించారు. 1992-93లో ముంబైలో జరిగిన అల్లర్లు, ముస్లింల ఊచకోత విషయంలో స్పందిస్తూ జస్టిస్ బిఎన్ శ్రీకృష్ణ కమిషన్ ముందు తగిన సాక్షాదారాలను సమర్పించడంలో కీలకపాత్రను పోషించారు. ముంబై అల్లర్లకు సంబంధించిన నేరస్తులకు శిక్షలు పడాలని క్యాంపెయిన్ నిర్వహించారు. అప్పటి నుంచి వీరు మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరితో పనిచేస్తున్నారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత ముంబైలో జరిగిన మతకల్లోలాల మారణకాండపై సమర్పించబడిన బిఎన్ శ్రీకృష్ణకమిషన్ రిపోర్టును వీరు ప్రచురించారు. ఈ రిపోర్ట్ ముంబైలో జరిగిన మత మారణకాండలో అక్కడి పోలీసులు, శివసేన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నేరాలను వివరంగా వెలుగులోకి తెచ్చింది. ఈ రిపోర్టును అప్పటి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది.

1995లో సబ్రంగ్ ట్రస్ట్, 2002లో సిజెపిని సెతల్వాద్, ఆమె భర్త జావెద్ ఆనంద్‌లు ఏర్పాటు చేశారు. 2002లో సిజెపిని స్థాపించి గుజరాత్ అల్లర్లకు సంబంధించిన నేరస్తులకు వ్యతిరేకంగా కోర్టుల్లో బలంగా పనిచేస్తుండడంతో వీరికి కష్టాలు మొదలయ్యాయి. ఈ కేసుల్లో సాక్షాధారాలను సేకరించడం, సాక్షులను తగు రక్షణతో ప్రవేశపెట్టడం, కోర్టుల్లో బలమైన వాదనలను వినిపించేలా సమర్థులైన లాయర్లను ఏర్పాటు చేసుకోవడం, కొన్ని కేసులను గుజరాత్ కోర్టుల్లో విచారించబడితే న్యాయం జరగదని, సుప్రీంకోర్టు సహాయంతో గుజరాత్‌కు ఆవల విచారించబడేలా చేయడం వంటి పనులను చేపట్టిన వీరు గుజరాత్ ప్రభుత్వానికి కంట్లో నలుసుగా మారారు. ఈ నిరంతర ప్రయత్నాలు కొంత మేరకు ఫలించి 100కు పైగా నేరస్తులకు శిక్షలు పడేలా చేశాయి. ఈ కృషి ఇంకా కొనసాగుతుండడం, గుల్బర్గ్ సొసైటీ హత్యాకాండకు సంబంధించి మోడీతో సహా, పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు ఎందరో నేర విచారణను ఎదుర్కొనేలా చేయడానికి కృషి చేస్తుండడం ప్రధానమంత్రిగా మోడీకి కష్టంగానే ఉంటుంది. తనకు, తన పార్టీకి కష్టం, నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం మోడీకి తక్షణ అవసరంగా కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే సెతల్వాద్‌పై గుజరాత్, కేంద్ర ప్రభుత్వాల వేధింపులను చూడాలి.

మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరితో పని చేయడంలో భాగంగానే 2002లో గుజరాత్‌లో ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నాయకత్వ మద్దతుతో జరిగిన మతమారణ హోమానికి వ్యతిరేకంగా అందుకు బాధ్యులైన నేరస్తులను శిక్షించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడే వచ్చింది పేచీ అంతా కూడా. కళ్ళు, చెవులు, నోరు మూసుకుని ఉంటే గుజరాత్ ప్రభుత్వం కానీ, దాని పోలీస్ వ్యవస్థకానీ, నేడు కేంద్రంలో అధికారం నడిపిస్తున్న నరేంద్రమోడీకి గానీ సంతోషం గానే ఉండేది. వారికి కాలిలో ముల్లులా, కంట్లో నలుసుగా, చెవిలో జోరిగలాగా మారే సరికి చిర్రెత్తుకొస్తున్నదన్నది కూడా స్పష్టమే. అధికార యంత్రాంగమంతా తమ చెప్పు చేతుల్లో ఉన్నప్పటికి కూడా ఎంతో ధైర్యంగా దీక్షగా పట్టుదలతో నిరంతరంగా సెతల్వాద్, ఆనంద్‌లు వాటిని అధిగమిస్తూ కోర్టుల్లో అతికష్టమ్మీదనైనా సరే ఎంతో కొంత మేరకు నెగ్గుకురావడమనేది గుజరాత్ రాష్ట్రంలో, అలాగే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలను ఆగ్రహానికి గురిచేస్తున్నది. చికాకు పరుస్తున్నది. మరిచి పోవాలని అనుకుంటున్న చారిత్రక గాయంను మళ్లీ గుర్తు చేసే పనుల్లో సెతల్వాద్ నిమగ్నం కావడం అనేది బిజెపి ప్రభుత్వాలకు గొంతు బిగుసుకుపోయేలా చేస్తున్నది. సిబిఐని ఆయుధంగా వినియోగించి వీరిని అరెస్ట్ చేసి కోర్టుల్లో హిందూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నడుస్తున్న కేసులను నీరుగారేలా చేయడం కోసం బెదిరింపులకు పాల్పడుతున్నారు. సెతల్వాద్ చేస్తున్న న్యాయపోరాట ప్రయత్నాలను ఆపడంలో భాగంగా సిబిఐచే ఆమె కార్యాలయాలను సోదాలు చేయించడం, బ్యాంక్ అకౌంట్లను నిలిపివేయడం, అలాగే అరెస్ట్ చేయాలని ప్రయత్నించడాన్ని ఎవరైనా సరే సులభంగా అర్థం చేసుకోవచ్చు.

2015 జూలై 8న తీస్తా సెతల్వాద్, ఆమె భర్త జావేద్ ఆనంద్‌లకు వ్యతిరేకంగా ఫారిన్ కంట్రిబ్యూటరీ రెగ్యులేషన్ ఆక్ట్ (ఎఫ్‌సిఆర్ఎ) నిబంధనలను ఉల్లంఘించారని, నేరపూరిత కుట్రలకు పాల్పడ్డారని సిబిఐ కేసును రిజిష్టర్ చేసింది. 2015 జూలై 14న సబ్రంగ్ కమ్యూనికేషన్స్ అండ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంపై సిబిఐ దాడులు చేసింది. దాడులు చేసిన సందర్భాన్ని గమనిస్తే జూలై 27 2015న గుజరాత్ హైకోర్టులో జాకీయ జాఫ్రీ కేసు హియరింగ్‌కు రాబోతున్నది. అక్కడ కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను అందించకుండా సెతల్వాద్‌ను అడ్డుకోవడం ఈ దాడుల్లో భాగమేనని అనుకోవచ్చు. సెతల్వాద్, జావేద్ అనంద్‌లపై గుజరాత్‌లోని అహ్మదాబాద్ పోలీస్ క్రైం బ్రాంచ్ జనవరి 2013లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అప్పటి నుండి సెతల్వాద్, ఆనంద్‌లు క్రైం బ్రాంచ్‌కు 24 వేల పేజీల సాక్ష్యాల డాక్యుమెంట్లను అందించారు. తద్వారా పోలీసులు చేసిన ఆరోపణలు

కేవలం ఆరోపణలుగానే మిగిలిపోతున్నాయి. వీరిద్దరిని అరెస్ట్ చేసి పోలీస్ కస్టడీలోకి తీసుకుందామని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవుతూ వచ్చాయి. చివరకు గుజరాత్ రాష్ట్ర హోంశాఖ, కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖకు చెందిన ఎఫ్.సి.ఆర్.ఎ. విభాగానికి ఉత్తరం రాసింది. దీని ఆధారంగా సిబిఐ 2015 జూలై 8న వీరిద్దరిపై కేసును రిజిస్టర్ చేసింది. ప్రస్తుతం కేంద్రంలో 2002 గుజరాత్ అల్లర్లకు మద్దతుగా నిలిచిన అప్పటి ముఖ్యమంత్రి నేడు ప్రధానమంత్రిగా ఉన్న కారణంగా సిబిఐని సెతల్వాద్‌కు వ్యతిరేకంగా ఆయుధంగా వాడుకునే అవకాశం చిక్కింది. సెతల్వాద్, ఆనంద్‌లు గుజరాత్ అల్లర్లపై గట్టి పట్టుదలతో కోర్టుల్లో పోరాటం చేస్తుండడం, ఒకవేళ ఆ ప్రయత్నాలు ఫలిస్తే మోడీతో సహా ఎందరో నేరవిచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. శిక్షలకు గురికావాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామికంగా ఎన్నికయ్యామని చెపుతూ రాజ్యాంగ బద్ధంగా రాజ్యాంగ విలువలకు కట్టుబడి పని చేస్తామని చెప్పుకుంటూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎంతలా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదో తేలిపోతున్నది. ప్రజాస్వామిక, లౌకిక అభిప్రాయాలను, విలువలను కలిగి ఉండి, వాటికోసం పోరాడే శక్తులను ఎంతలా అణచివేయాలనుకుంటున్నారో, అణచి వేస్తున్నారో, అణచివేయ బోతారో అనే దానికి సెతల్వాద్ ఉదంతం ఒక ఉదాహరణగా నిలిచి పోతుంది. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇటువంటి వేధింపులు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్నాయి.

సెతల్వాద్, జావేద్ ఆనంద్‌లను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ కోసం వారు ముంబై కోర్టులో విన్నవించుకున్నప్పుడు దాన్ని వ్యతిరేకిస్తూ సిబిఐ ఆమెను జాతీయ భద్రతకు ప్రమాదకారి అని ప్రస్తావించింది. ఇది హాస్యాస్పదం అనే కంటే ఎంతో ప్రమాదకరమైన వ్యాఖ్య. దీనిని ఈ దేశ ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడిగా చూడాలి. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా గుజరాత్‌లో ముస్లింల హననం చేసిన అధికార, అనధికార హిందూ మతతత్వ శక్తులు ప్రమాదకారులుగా కాకుండా పోవడం న్యాయం కోసం, సెక్యులర్ విలువలకోసం రాజ్యాంగ బద్ధంగా ప్రయత్నిస్తున్న సెతల్వాద్ వంటివారు ప్రమాదకారులుగా చిత్రీకరించడం అనేది బిజెపి ప్రభుత్వ అజెండాను తెలియపరుస్తున్నది. 2015 ఆగస్టు 13న ముంబై హైకోర్టు సెతల్వాద్, జావేద్ ఆనంద్‌లకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంలో వీరిని దేశ భద్రతకు ప్రమాదకారులుగా చెప్పిన సిబిఐ వాదనలను తోసిపుచ్చింది. అదే సందర్భంలో పౌరులు సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని, ప్రభుత్వం ఇష్టపడని భిన్నాభిప్రాయాన్ని కలిగి ఉండవచ్చని చెప్పింది. ప్రజాస్వామిక దేశంలో పౌరులు తమ సొంత అభిప్రాయాలను కలిగి ఉండవచ్చని ఇలా భిన్నాభిప్రాయాలు కలిగి ఉండే హక్కును పరిరక్షించడం ప్రభుత్వాల విధి అంటూ బాంబే హైకోర్టు ఘాటుగానే సిబిఐ వాదనలను తోసిపుచ్చింది. ఇది మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తుందో లేదో తెలియదుగానీ, భిన్నాభిప్రాయాలను కలిగి ఉండే హక్కును గురించి స్పష్టంగా చెప్పిన ఓ మంచి మాటగా నిలిచి ఉంటుంది. అసమ్మతి వైఖరి లేదా అభిప్రాయం ప్రభుత్వ విధానానికి, ప్రభుత్వాలకు వ్యతిరేకం కావచ్చు కానీ దేశ సమగ్రతకు, దేశ సార్వభౌమాధికారానికి వ్యతిరేకం అని అనుకోలేం. ప్రభుత్వానికి వ్యతిరేకం, దేశ సార్వభౌమాధికారానికి వ్యతిరేకం అనేవి రెండు వేరువేరు భావనలని కూడా ముంబై హైకోర్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా బాంబే హైకోర్టు న్యాయమూర్తి మృదులా భత్కర్ దేశసమగ్రతకు, సార్వభౌమాధికారానికి జావేద్ ఆనంద్, సెతల్వాద్‌ల వల్ల ప్రమాదం ఉన్నట్లు అనిపించడం లేదని కూడా తేల్చిచెప్పారు.

2007లో అజ్మీర్‌లో హిందూ మతశక్తులు జరిపిన బాంబు విస్ఫోటనం కేసు విషయంలో గతంలో తామిచ్చిన వివరణలకు వ్యతిరేకంగా సాక్ష్యులు హిందూత్వవాదులకు అనుకూలంగా మారుతారు. సాక్ష్యాధారాలు లేవని ఈ కేసు మూసివేయబడుతుంది. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో 2008లో జరిగిన బాంబు పేలుడు కేసు విషయంలో హిందూ మతశక్తులకు అనుకూలంగా ప్రభుత్వం పనిచేసింది. గోమాంసంపై నిషేధం, చర్చిలపై దాడులు, ఘర్‌వాపసీ పేరుతో మతపర ఉద్రిక్తలను రెచ్చగొట్టడం, మోడీ మంత్రివర్గంలోని కొందరు మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేసే ప్రకటనలు చేయడం మొదలైన వాటి విషయంలో నోరు మెదపకుండా ఉంటారు. ఇవేవీ కూడా దేశభద్రతకు ప్రమాదం కాకుండా పోతుంటాయి. 2002లో గుజరాత్‌లో ముస్లింలపై జాతి హనన కాండను చేపట్టినవారే దానిని ప్రశ్నిస్తున్న సెతల్వాద్‌ను, ఆమె స్థాపించిన సంస్థలను, మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయని అంటున్నారు. ఇది ఎంతవిడ్డూరమో, కాదు ఎంత కర్కశత్వమో తెలుస్తున్నది. ఈ తీరు దొంగే దొంగ దొంగ అన్న చందంగా ఉన్నది. రాజ్యాంగ విలువలైన సమానత్వం, లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద విలువలను ప్రమాదంలోకి తోసే విధానాలను ముందుకు తెస్తున్నది బిజెపి ప్రభుత్వం. దీనికి తాత్విక పునాదిని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావజాలం ఇస్తున్నదనేది అందరికీ తెలిసిన విషయమే. దేశంలో మైనారిటీలు, దళితులు, ఆదివాసుల హక్కులను హరించివేసే పాలకుల విధానాలు ఓవైపు అలాగే హిందూత్వ శక్తులు మతం పేరు మీద ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే ప్రయత్నం జరుగుతున్నది. పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలపై భిన్నాభిప్రాయాలను గౌరవించకుండా తాము చెప్పిందే, తాము చేసేదే సరైనది అనే దానికి అందరూ కట్టుబడి ఉండాలనే నిరంకుశ పోకడలతో ప్రజాస్వామ్యం ముసుగులో పాశవిక పాలనను కొనసాగించడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. ప్రజాస్వామిక విలువలను పాలకవర్గాలు దేశవ్యాప్తంగా ప్రమాదాలలో ముంచెత్తుతున్నాయి. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేస్తూ విద్య, వైద్యాలను ప్రైవేట్ పరం చేస్తూ, మైనింగ్, పరిశ్రమల పేరుతో ప్రజాభూములను పెట్టుబడిదారుల హస్తగతం చేస్తున్నారు. ప్రజలకు ఇవ్వవలసిన రాయితీలు, సబ్సిడీలు పెట్టుబడిదారులకు నైవేద్యం అవుతున్నాయి. ఉన్నత స్థాయి విద్య, శిక్షణ, పరిశోధన సంస్థల్లో అశాస్త్రీయ హిందూమత భావజాలం సంఘ్ పరివార్ అనుకూల వర్గాన్ని నింపుతూ పోతున్నారు. ముస్లింలపై, క్రైస్తవులపై మత విద్వేషాలను రెచ్చగొడుతూ వారి వల్ల హిందూ మతస్తులు కుంచించుకుపోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తూ ముస్లింలంటేనే ప్రమాదకారులుగా చిత్రీకరణ జరుగుతుండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి నేడు బిజెపి రూపంలో పలు రాష్ట్రాల్లో, కేంద్రంలో రాజకీయ అధికారం తోడైంది. రాజకీయ అధికారం ఉన్నా లేకున్నా కూడా ప్రమాదకర, అశాస్త్రీయ మత భావనలను, పురుషాధిక్యతను, అసమానతకు చిహ్నమైన కులవ్యవస్థను సమర్థించే భావజాలాన్ని సమాజంలో తరతరాలుగా పెంచిపోషిస్తూ వాటికి ఆమోదం పొందుతూ ముందుకు తీసుకు పోవడంలో ఈ ప్రతీఘాతుక శక్తులు విజయం సాధిస్తూ ఉండడం దురదృష్టకరం.

*(రచయిత ఉపాధ్యాయులు)* వీ

# చేనేత గురించి చేదు నిజాలు

*పాలకులు చేనేతను బతకనీయకుండా చేసి ఈ రోజు కపట ప్రేమ కురిపిస్తున్నారనీ, సమాజంలో మౌలికమైన మార్పు వచ్చినపుడే చేనేతకు చేయూత ఉంటుందేమో కాని ఈ సమాజంలో భరోసా లేదనీ అంటున్నారు* **బి.ఎస్. రాజు**

చేనేత మందగమనంతో కూడుకుని ఉన్న పర్యావరణ హిత శాస్త్ర ప్రక్రియ. రోలు-రోకలి, తిరగలి-సనికిలి, రుబ్బురోలు, నాగలి, బండి-బండెడ్లు, తాడు-పేడు, మొక్క-మోడు, చెట్టు-చేమ, పేడ-పెరడు, అలుకు-ముగ్గు ఇవన్నీ అటువంటి మంద గమన శాస్త్రంలో భాగమే. సంచార జీవన విధానం నుండి స్థిరీకరణ చెందిన మానవ జీవన విధానానికి ఇదే పునాది.

ఈ జీవన విధానంలో మనిషికి-మొక్కకు-పశువుకు మధ్య మంచి సయోధ్య ఏర్పడ్డది. ఇందులో భాగంగానే చేనేత రూపు దిద్దుకుంది. అది ప్రకృతిని ప్రేమించింది. శ్రమను గౌరవించింది. శ్రమను మేధస్సును జోడించి నడిచింది. సొంత విత్తనాలను, శక్తి యుక్తుల వ్యవసాయాన్ని, భుక్తినిచ్చే జీవనాన్ని కాపాడుకుంటూ వచ్చింది. పత్తి పంట, నూలు ఉత్పత్తి, వస్త్రనేత, రంగుల అద్దకం, నాణ్యతా ప్రమాణాలు, బహుళ వస్త్రాల తయారీ, అలంకారిక, కలంకారిక వస్త్రోత్పత్తి ఇలా ఎన్నో అద్భుతాలు సాధించి ఖండాంతారాల్లో , ప్రపంచం నలుమూలలా డంకా మోగించింది. ఘన కీర్తిని, పేరు ప్రఖ్యాతులను గడించింది. స్వావలంబనను, ఆర్థిక పరిపుష్టిని భారత సమాజానికి ఒనకూర్చి పెట్టింది. హిమ శిఖరోన్నతిని కోల్పోయి, చేనేత ఈ నాడు దైన్యంగా, దీనంగా, బిచ్చగత్తెగా దళారీ పాలకుల దయా దాక్షిణ్యాలకై, చేయూతకై అర్రులు చాచే దుస్థితికి నెట్ట బడిందంటే- మనమంతా, యావత్ భారత సమాజమంతా చచ్చేంత సిగ్గుపడాలి.

పచ్చదనాన్ని కాపాడుకుంటూ, వెచ్చదనాన్ని పంచుతూ, ప్రేమతో ఒళ్లంతా నిమురుతూ, ఇంటిని, కుంపటిని, బువ్వను-భుక్తిని ఒనకూరుస్తూ, శారీరక, మేధో శ్రమలను మేళవించి వేనవేల సంవత్సరాలు పచ్చని సిరిగా వెలుగొందిన 'చేనేతకు చేయూత' అనే విషాద మేమిటి? ఇటువంటి పరిస్థితి ఎందుకు దాపురించింది? ఎక్కడున్నాయి దీని మూలాలు? ఈ ప్రశ్నలకు జవాబులు దొరకాలంటే ముందుగా మనల్ని మనం తిరగేసి చూసుకోవాలి. మనం ఎక్కడ దారితప్పామో వెతుక్కోవాలి. మన ప్రస్తుత జీవన శైలిని, మకిలిపట్టిన మన నకిలీ మనస్సుల్ని ఉతుక్కోవాలి.

చేనేత చేతులు విరిచి, దాని ఆత్మను దొలిచి, నేతన్నల బ్రతుకులను చిదిమేసిన మన పాలకుల విధానాలను, ఓట్లు దండుకుంటూ మన సంస్కృతీ విలువలను, వనరులను, స్వావలంబన జీవనాన్ని 'స్వదేశీ-విదేశీ' పెట్టుబడికి పాదాక్రాంతం చేస్తున్న దళారీ మరగుజ్జు బానిసతత్వాన్ని కూలంకషంగా అర్థం చేసుకోగల్గాలి. దానిని విదిలించి వదిలించు కోగల్గాలి. తిరిగి మనందరి వస్త్ర ధారణలో చేనేత వస్త్రానికి సముచిత స్థానమివ్వాలి. అది మన బతుకులో భాగమవ్వాలి. దానికి మనమంతా కొంచెం డబ్బు ఎక్కువ వెచ్చించడానికైనా సరే సిద్ధపడాలి.

అంబానీ - అదానీల లాభాలకై పనిచేసే పాలకులు ఈ రోజు చేనేత దినాలు ఘనంగా నిర్వహిస్తారు. చేనేతకు ముద్దు పేర్లు పెడతారు. డిజిటల్ యుగంలో తిరిగి చేనేత ప్రతిభ మారుమోగి పోవాలంటారు, అయితే అది ఎలా సాధ్యమో చెప్పరు. కోట్లాది చేనేతకారులు అర్థాకలితో, ఆకలి చావులతో అలమటిస్తూ ఊళ్లు వదలి, వీధుల వెంబడి, పవర్లూం మృత్యు కుహరాల్లో చస్తూ బతుకుతూ మగ్గిపోతుంటే దళారీ పాలకులు కొందరి నేతన్నలకు బుజ్జగింపు పూలహారాలు వేసి, కీర్తి శాలువాలు కప్పి, జ్ఞాపికలు పంచి, చేనేత పట్ల కట్టలు తెంచుకున్న ప్రేమను ప్రదర్శిస్తారు. పొగడ్తలతో ముంచెత్తుతారు. కార్పొరేట్లకు అమ్ముడు పోయిన ఈ దేశ పాలకులు చేనేత కుత్తుకకు పాలిస్టర్ దారాల ఉరితాడు బిగించి, మిల్లు యంత్రాల వెన్నుపోట్లతో చేనేతను కొన ఊపిరి శవరూపంలో మార్కెట్ మాయాజాలపు నడిబజారులో విసరేసి, చేనేతకు చేయూత నిచ్చి బతికిస్తాం, ఊపిరి పోసి నిలబెడతాం అంటూ డిజిటల్ మంత్రోచ్చాటనలతో రక్షా విబూదిని నేతన్నల నెత్తులపై జల్లుతారు. ఇవేవీ చేనేతకు చేయూత నివ్వలేవు. ఇవేవీ నిజాలుకాదు.

ఈ దేశాన్ని పాలిస్టర్ విషమయం చేసిన అంబానీ సంస్థలను బుజాల మీద మోస్తూ, నూలు దారాన్ని నేతన్నలకు కాకుండా చేస్తూ, చేనేతకు ఇదిగో చేయూత అంటే వంచన తప్ప ఇంకేమిటి? ఒక నాటి 'ఆమ్ ఆద్మీ' నూలు వస్త్రం ఈ రోజు హైక్లాస్ సొసైటీ వస్త్రంగా మారి పోయింది. పాలిస్టర్ వస్త్రం పేద, సామాన్య ప్రజల వస్త్రమై రాజ్యమేలుతోంది. పాలిస్టర్ వస్త్రం మన ఒంటికి మంచిది కాదు. మన వాతావరణానికి అనువైనది కాదు. అది చెమటను పీల్చదు. సరిగా గాలి ఆడనివ్వదు. పర్యావరణానికి చాలా హానికరం. అయినప్పటికీ, ప్రభుత్వాల దుష్ట విధానాల వల్ల అది మన దేశంలో చొరబడి వెల్లువెత్తింది. ఇది ఒక అంశమైతే, ఎక్కువ కాలం మన్నిక, తక్కువ నీళ్లు, తక్కువ సబ్బుతో సులభమైన ఉతుకు, తేలికగా ఉండటం, గంజితో పనిలేక పోవడం, నీడ పట్టునే ఇట్టే ఆరిపోయే గుణం, మాస్ ప్రొడక్షన్‌తో చవక ధరలకు అందించ గలగడం పాలిస్టర్ వస్త్రం ప్రజల వస్త్రమై స్థిరపడటానికి ప్రధాన కారణాలు. ఇంత జరిగిపోయాకా ఈ రోజు చేనేతకు పూర్వ వైభవం కల్పిస్తాం అనడం పరమ బూటకం.

అంతేగాక చేనేత దుర్భర శ్రమతో కూడుకున్నటువంటిది. సమాజంలో వేగానికి, డబ్బుకు, పాశ్చాత్య జీవన విధానానికి ఆదరణ పెరిగి ప్రపంచీకరణ వెల్లువలో స్వావలంభనా ఆర్థిక విధానం, జీవన సరళి నామరూపమే లేకుండా కొట్టుకుపోయిన ఈ దశలో చేనేత కేవలం

# కొన్ని మరణాలు - మీడియా ప్రాధాన్యతలు

***పేరు ప్రఖ్యాతులు పొందిన వ్యక్తుల వేడుకలకూ, మరణాలకూ సంబంధించిన సంఘటనలను ఎత్తి పడుతున్న పాలకవర్గాలు, ప్రచార సాధనాలు సామాన్య జీవుల పట్ల కనీసపు చూపు కూడా ప్రసరింప చేయడం లేదని అంటున్నారు వీరబ్రహ్మాచారి***

డా. అబ్దుల్‌కలాం పేపర్ బాయ్ నుండి ఇస్రో వరకు అటు నుండి భారత ప్రథమ పౌరుడి స్థాయి వరకు ఎదిగిన మనిషి తన 84వ ఏట గుండెపోటుతో హఠాన్మరణం. ఏ భారతీయ యువతను వెలిగించే, రగిలించే, ఉత్తేజపరిచే ప్రసంగాలు చేశాడో, సందేశాలిచ్చాడో, పుస్తకాలు రాశాడో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అనే ప్రతిష్ఠాత్మక వేదిక మీద అట్లాంటి యువతకు సందేశమిస్తూనే హఠాత్తుగా కుప్పకూలాడు. వయసుచేత బలహీనుడై, వ్యాధిగ్రస్తుడై ఆస్పత్రిపాలై దివంగతుడై ఉంటే అంతగా దిగ్భ్రాంతి కలిగించే విషయమేమి కాకపోయి ఉండవచ్చు. పైగా వయసు రీత్యా జీవిత చరమాంకం కూడా. కానీ, చాలా చురుగ్గా వేదిక మీద ప్రసంగిస్తున్న తరుణంలో భారత యువత సాంకేతిక వృత్తి విద్యా నిపుణులు కావాలని ఎంత ఉద్వేగ పడ్డారో.

ఒక్క అంతరిక్ష రంగం రక్షణ రంగమే కాదు, వైద్య రంగానికి కూడా అతను ఒక మెంటర్‌గా పనిచేసి కలాం - రాజు దేశీయ ఇంట్రా రోనరికస్టెంట్ తయారు చేయడంలో, సుమారు వెయ్యి మంది హృద్రోగులకు అమర్చి ఉపశమనం కలిగించడంలో వారందించిన ప్రోత్సాహం, సాంకేతిక సహకారం గురించి కేర్ ఫౌండేషన్ చైర్మెన్ డా. సోమరాజు గుర్తు చేశారు.

సహజంగానే పెద్దపెద్ద వాళ్లందరూ ప్రోటోకాల్ అనిపించే పరిభాషలో దిగ్భ్రాంతిని, దుఃఖ సంతాపాలను వ్యక్తం చేశారు. పెద్దపెద్ద వాళ్లంటే పాలకవర్గాలూ, వాళ్ల ప్రతినిధులు. ప్రతినిధులు మాత్రమే కాదు, భావి భారత ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉండే ఇగ్నైటెడ్ మైండ్స్ కూడా. వారి జీవిత విశేషాలన్నీ ముద్రణా, విద్యున్మాధ్యమాలు పోటీలు పడి ప్రచురించాయి. ప్రసారం చేశాయి. అదేరోజు దిన పత్రికలు కొన్ని, ఎవడూ ఏడ్వని దినాం చచ్చిపోయే వాళ్ల వార్తలు ప్రచురించాయి. తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లా మంగపేట మండలం కమలాపూర్ బిల్ట్ ఫ్యాక్టరీకి చెందిన 40 ఏళ్ల రెగ్యులర్ కార్మికుడు, కరీంనగర్ జిల్లాలో 45 ఏళ్ల, నిజామాబాద్ జిల్లాలో 48 ఏళ్ల, రంగారెడ్డి జిల్లాలో 35 ఏళ్ల అన్నదాతలు అప్పులపాలై తీర్చలేక, మొఖం చెల్లక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశవ్యాప్తంగా మరెందరో వాళ్ల బలవన్మరణాల కారణాలు, వివరాలు క్లుప్తంగా జిల్లా స్పెషల్‌లలో ఒక కాలంలో పది పన్నెండు పంక్తుల్లో.

ఇది విజేతల ప్రపంచం. ఇది ప్రత్యేకంగా, అనేకానేక సామాజికార్థిక అడ్డంకులు, విపత్తులు అధిగమించి విజేతలై రికార్డుల్లో నమోదై వార్తలకెక్కుతున్న ఉత్పరివర్తన ప్రతిభావంతుల ప్రపంచం. అటువంటి ఒక్కొక్క విజేత వెనుక, సామాజికార్థిక కారణాలవల్ల కోట్లాది పేద దారిద్ర్య పీడితులు ఎందరో. వారి అపజయానికి కాదు కదా కనీసం మనుగడకు కూడ నోచుకోని కారణాలు ఎవరికీ పట్టవు. పట్టించుకున్నట్లు, అన్వేషించినట్లు పాలకవర్గాల ప్రకటనలు, రాతలు ప్రసంగాలు. అటువంటి రాతల, ప్రసంగాకాంక్షల పాలక విధానాల నిర్ణయ ప్రకటనలకు ఆచరణలు ఉడతా భక్తి స్థాయికే పరిమితం. కలాం గారి వంటి ఉత్పరివర్తన 'అసాధారణ' ప్రతిభావంతుల విజయాలు, మనిషి ప్రతిభకు సామాజికార్థిక కారణాలతో పనిలేదని పాలకులు వాళ్ల తాబేదార్లు, వందిమాగధులు అయిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఉపన్యాసకులు, యోగా గురువులు, ఏరుదాటి గట్టునబడ్డ మిడిమిడి మేధావులు ఊదరగొడుతుంటారు. మొన్నకు మొన్న ఇటీవల లండన్‌కు చెందిన శాస్త్రవేత్తలు అత్యంత శ్రమకోర్చి చెమటోడ్చి సుమారు రెండు వందల ఏళ్ల క్రితం మార్క్స్ చెప్పిన దాన్నే కొత్..త్తగా కనుగొని చెప్పారు. అదేమిటంటే పేదరికం దారిద్ర్యం పిల్లల మనోబుద్ధి వికాసానికి అడ్డంకి అని. మొత్తానికి ఒకప్పుడు ప్రత్యక్షంగాను, ఇప్పుడు పరోక్షంగాను రవి అస్తమించని సామ్రాజ్యాధినేతల నేల మీది శాస్త్రజ్ఞుల నోరు అనబడే శంఖంలోకి వచ్చిందిక ఇసయం. తీర్థం అవుతుందని ఆశిద్దాం. కుడి అరిచేతి దొప్ప ముందుకు చాచి వేచి చూద్దాం.

మళ్లీ అసలు విషయానికి వస్తే ఇదీ ఉత్పరివర్తన ప్రతిభావంతులతో పాటు స్కిల్డ్ సేవకుల / లేబర్ ప్రివిలెజ్డ్ పర్సన్స్ ప్రపంచం.

ఒకానొక సామాజికార్థిక రాజకీయ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయులు ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి సంపద పంపిణీ

---

ఒక ఫేషన్ వస్తువుగానే మిగులుతుంది తప్ప పూర్వ వైభవమనే మాటకు అర్థంలేదు. మరమగ్గాల, మిల్లు వస్త్రాలను కాదని ఈ రోజు చేనేత నిలబడలేని పరిస్థితిని పాలకులే కల్పించారు. ప్రజలకు స్పృహ లేకుండా చేసి, మార్కెట్ మాయాజాలంతో వారిని పాలిస్టర్ సముద్రంలోకి ఈడ్చుకెళ్లారు. ఆర్థిక స్వావలంబనే బూతుగా మారి, నయావలస-నయా ఉదారవాద సామ్రాజ్యవాద పెట్టుబడి ఊడిగ రాజ్యం కొనసాగుతున్న ఈ అవ్యవస్థలో చేనేతకు పాలకులు పనిగట్టుకు అన్ని దార్లు మూసేశారు. ఇది చేదు నిజం.

ప్రజలు శ్రామిక ప్రజారాజ్యం స్థాపించుకున్న నాడు, ఏమో! చేనేతకు సమాజంలో సముచిత స్థానం లభించవచ్చేమో! ఈలోపు ప్రజలు ఏమేరకు చేనేత వస్త్ర ధారణకు మొగ్గు చూపుతారో, ఆ మేరకే చేనేత నిలబడుతుంది తప్ప ఎవరెన్ని మాటలు చెప్పినా అదంతా కంటి తుడుపే కాని, చేనేతకు నిజమైన చేయూత కాజాలదు.

*(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు)* వీ

సమానత్వం గురించి పాఠం చెప్పినంక ఒక ప్రశ్న అడిగాను. మేం స్కిల్డ్ లేబర్. మేం ప్రయత్నిస్తే నెల రోజుల్లో కొద్ది అటు ఇటుగానైనా వాళ్ల లాగా దున్నగలం, తవ్వగలం, నరకగలం, ఎత్తగలం. కాని ఆ కార్మికులు రైతులు ఆర్నెల్లు కష్టపడ్డా మేం చేస్తున్న పని చేయలేరు. ఈ నైపుణ్య సాధనకు మేం బాల్యం నుండి కష్టపడ్డాం, దశాబ్దాల పాటు. కనుక సహజంగానే కేటాయింపుల్లో, సౌకర్యాల్లో, గౌరవంలో మాకు ప్రాధాన్యత. తప్పేముంది! మాతోనే అభివృద్ధి'.

జవాబు, వివరణ ఇట్లా వచ్చింది: నెల రోజుల పరిశీలన అభ్యాసంలో అటు ఇటుగా ఏం! వాళ్ల కన్నా నైపుణ్యంగా చేయగలం. అయితే మన ఈ నైపుణ్యాలు పెంచుకుంటున్న కాలంలో వాళ్లు పండించిన ఆహారం, పత్తితో చేసిన వస్త్రంలో, వాళ్లు తయారు చేసిన ఇటిక రాళ్ల సిమెంట్ కట్టడాల్లో నీడలో ఎదిగాం. కొంత చర్చ పిదప వారు ఓ పని సూహిద్దాం. ఓ ఏడాది రెండేండ్లపాటు మన స్కిల్డ్ సేవకులం పెన్‌డౌన్ సమ్మె చేద్దాం. హాలిడే ప్రకటిద్దాం. ఎవరూ చావరు. వాళ్లు అదే పని చేస్తే వాళ్లూ, మనతో పాటు సమస్త మానవాళీ ఆకలితో చస్తుంది అన్నారు.

మళ్లీ కలాంగారి విషయానికి వద్దాం. కలాంగారు రాష్ట్రపతి అయిన రాజకీయ సందర్భం గుర్తు చేసుకుందాం. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం గుజరాత్ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రధాన భాగస్వామి బిజెపికి చెందిన ముఖ్యమంత్రి, ఇప్పటి ప్రధానమంత్రి నేతృత్వంలో గాక పోయినా కనీసం ఎరుకలో 2002 గుజరాత్ మైనారిటీల మీద మతోన్మాదుల మారణకాండ. అప్పుడు ప్రధానమంత్రి వాజ్‌పేయి విదేశీ పర్యటన సందర్భంగా వ్యక్తీకరించిన తన ఇబ్బంది మాటలను పాఠకుల యాదికే వదిలేస్తాను.

డాక్టర్‌సాబ్ తిరుపతి సమీపంలోని శ్రీ గురుకుల విద్యాలయ వార్షికోత్సవానికి వెళ్లి ఆ విద్యాలయ వ్యవస్థాపకుడు మోహన్‌బాబుని విద్యావేత్త అని కితాబిచ్చారు. మోహన్‌బాబే విద్యావేత్త అయితే చుక్కా రామయ్య, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొ. క్రిష్ణకుమార్, గిజూబాయిలు ఎవరు? వీళ్లు విద్యావేత్తలే అయితే మోహన్‌బాబు వీరి వరుసలోని వారేనా?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యుడు ఐటి టెక్నాలజీతో దేశంలోనే కాదు, ఖండాంతరాల్లో కూడ పాలమూర్ సెజ్ భూముల మాఫియాల ద్వారా వేల, లక్షల కోట్ల రూపాయలు సంపాదించిన కిచ్చెనగారి లక్ష్మారెడ్డి స్థాపించిన లీడ్ ఇండియా 2020 ఫర్ థాట్స్ కార్యక్రమానికి కలాం సాబ్ బ్రాండ్ అంబాసిడర్. ఈ కార్యక్రమంలో భాగంగా అయితేనేమీ, ఇతర ప్రముఖ విద్యాసంస్థల వివిధ కార్యక్రమాల్లోనైతేనేమీ, ఇప్పుడు మీడియా పడి పడి చెబుతున్నట్లు పిల్లలతో మమేకమైనారు నిజమే. ఆ పిల్లలు గాని ఇప్పుడు డాక్టరు గారి మరణం సందర్భంగా దుఃఖోద్వేగ సంతాప కార్యక్రమాల్లో ప్రకటనల్లో ఫొటోల్లోని పిల్లలు ఎవరు? కలాం సాబ్ లాగా వెలుగు కోసం దీపానికి నూనెలేని పిల్లలా? పేపర్ బాయిలా? ప్రభుత్వ విద్యాసంస్థల పిల్లలా? ఇక కలాం సాబ్ చెప్పిన అనేక పాఠాల్లో చిన్న లక్ష్యాలు నిర్దేశించు కోవడం నేరం?! పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. వాటి కోసం శ్రమించాలి, తపించాలి.

ఏవి చిన్న, ఏవి పెద్ద లక్ష్యాలు! కండక్టర్, కానిస్టేబుల్, టీచర్, ఇంజనీర్, డాక్టర్, కలెక్టర్‌లలో లీడ్ ఇండియా ప్రచురించి పంచిన బుక్‌లెట్‌ల ప్రకారమైతే సచిన్, గవాస్కర్, టాటా, బిర్లా, స్వామినాథన్, కిరణ్‌బేడీ, పిటి ఉష మొదలైన వారు ఈ పెద్ద పెద్ద లక్ష్యాలను అధిరోహించిన వాళ్ల వరుసలో, ఆ పుస్తకంలో సేవారంగ ఉద్యోగి రైతుల పేర్లు ఛాయాచిత్రం ఒక్కటీ లేదు సరికదా ముత్యాలరాజూ, కాశీపాండ్యన్, కరణం మల్లీశ్వరిల ఉటంకింపు కూడా లేదు.

ఛట్! ఇదంతా రంధ్రాన్వేషణ, నెగెటివ్ థింకింగ్. ఏ రంగం ఎన్నుకున్నా ఆ రంగంలో ఉన్నత స్థానానికి అధిరోహించడం అని ఆ పాఠం అర్థం. అయితే తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలంలో కౌలురైతు సుగుణమ్మ ఎకరానికి 65 బస్తాల వరిధాన్యం సేంద్రియ వ్యవసాయంతో పండించి రికార్డ్ సృష్టిస్తే ఆమెను ప్రశంసలతో ఆకాశానికెత్తి అమెరికాకు పంపి పాఠాలు చెప్పించి అమెరికా అనబడే త్రిశంకు స్వర్గాన్ని అట్లా చూపించారు సరే. ఆమెకేం దక్కింది? ఆవిడ వ్యవసాయ శాఖ మంత్రి అయిందా, ఛీఫ్ అడ్వయిజర్ అయిందా? పోనీ కౌలు భూమి గాక స్వంత భూమి ఎంత దక్కింది? ఇటీవల మీడియా సమక్షంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఏమని గోడు వెళ్లబోసుకున్నది? ఆ గోడు మెయిన్ పేపర్‌లో కాదు, జిల్లా స్పెషల్‌లో. జాతీయ మీడియా గురించి అడగనక్కర లేదు.

సగానికి ఖర్చు తగ్గింది సరే. అట్టి కలాం – రాజు స్టెంట్‌నందుకున్న ఆ వెయ్యిమంది ఏ ఆర్థిక, సామాజిక స్థాయికి చెందిన వారు? అందని వాళ్లు ఎందరు? ఆ అందింది ఏ వైద్యశాలలో? ఎవరికందుబాటులో?

ఈ పాలకవర్గాల ఇండ్లల్లో జనన, మరణ, వివాహ, ఇంకా అనేకానేక ప్రత్యేక ఆనంద, విషాద సంఘటనల సమాచారాన్ని ఇంతగా ఎత్తి పడుతున్న, ప్రోత్సహిస్తూ, స్వయం పోషకమే గాదు సమస్త మానవాళిని పోషించే సామాన్యులకు సంబంధించిన జీవిత సంఘటనల సమాచారాన్ని తూతూ మంత్రంగానో, అసలు పట్టించుకోకపోవడమో చేస్తున్నది స్కిల్డ్ వ్యవస్థల స్వార్థ ప్రయోజనాల పరాన్న భుక్కులే. ఈ చరిత్ర గమన నమోదు హైప్ మారాలె. ఎవరు మారుస్తరు? త్యాగధనులైన స్కిల్డ్ మధ్యతరగతి మేధావి వర్గమే.

*(రచయిత రిటైర్డ్ ఉపాధ్యాయులు)* వీ

**రాబోయే సంచికలలో...**

- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు - రవిచందన్**
- **ప్రాథమిక హక్కుల్లో విద్య మిథ్యేనా? - దుర్గం సారయ్య**
- **ఆహార భద్రత అంతంత మాత్రమే - డా. ఇమ్మానేని సత్యసుందరం**
- **ప్రపంచీకరణ బోనులో మాధ్యమిక విద్య - తోట రాజేష్**

# ఆంధ్రప్రదేశ్ పాలనలో కులం - రాజకీయం

*విశ్వవిద్యాలయాల్లో ర్యాగింగ్ మరణాలు, సహజ వనరులను కొల్లగొడుతున్న రాజకీయ మాఫియాను అడ్డుకున్నందుకు బెదిరింపులు, హత్యలు ఈ వ్యవస్థ స్వభావాన్ని వెల్లడిస్తున్నాయని అంటున్నారు* **వై ఎచ్ కె మోహన్‌రావు**

ఉన్నత విద్యాలయాలు దారితప్పిన సంస్కృతికి నిలయాలుగా మారాయి. కుల జాడ్యంతో ప్రాంగణాలన్నీ కుళ్లి కంపుకొడుతున్నాయి. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లోని అధిక శాతం విద్యార్థులు అమ్మాయి కనిపిస్తే చాలు! ర్యాగింగంటూ, ప్రేమంటూ మృగాల్లా పైశాచిక ప్రవర్తనతో ఊగిపోతున్నారు. వికృత సంఘటనలతో విద్యాలయాలు తరచూ మీడియాలో పతాక శీర్షికలకు ఎగబాకుతున్నాయి. నాగార్జునా విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి బలవన్మరణం విద్యాలయాల విష సంస్కృతిని మరోమారు ప్రజల ముందుకు తెచ్చింది.

13వ శతాబ్దికి చెందిన చరిత్రకారుడు మహమ్మద్ ఔఫీ తన జామియుల్-హికాయత్, ఎలియాట్ & డాసన్, వాల్యూం 3, పేజీ 169-170లలో 12వ శతాబ్దికి చెందిన రాజా గురుపాల్ పాలనలో జరిగిన ఒక ముఖ్య సంఘటనను ఈ విధంగా చారిత్రాత్మకం చేశాడు. ఉన్నతమైన ఆచార సాంప్రదాయాలకు తామే సృష్టికర్తలం అని భజాయించుకుని భుజాలెగు రేసుకునే అగ్ర వర్ణాలకు చెందినవాడేమి కాదు, రాజా గురుపాల్. ఇతనో చతుర్థ వర్ణ సంజాత. ఒకరోజు ఆయన అంబారీపై ప్రయాణం చేస్తూ బట్టలు ఉతకడానికి వెళుతున్న అప్సరస లాంటి రజక స్త్రీని చూసి మోహవశుడయ్యాడు. ఎలాగైనా ఆమెను అనుభవించాలన్న తమకంలో ఏనుగును ఆమె చెంతకు పోనిస్తుండగా అతడిలో వివేకం మేల్కొంది. ఇంద్రియాలకు వివశుడై తాను చేయబోయిన తప్పిదాన్ని గుర్తించి పశ్చాత్తాపంతో రగిలిపోయాడు. తన మీద తనకే అసహ్యం వేయగా చిన్నబుచ్చుకున్న మొహంతో నగరుకు వెనుదిరిగాడు. విషయాన్నంతా పండితులకు ఎరిగించి పాపకార్యానికి ప్రాయశ్చిత్తం ఆత్మాహుతేనని తనకు తానే శిక్ష విధించుకున్నాడు. రాజు అయిన వాడే ఇంద్రియాలను అదుపు చేసుకోలేక అందంగా కనిపించిన ప్రతి మహిళనూ వాంచిస్తే ఇక నారీ జనానికి రక్షణ ఎవరు? అంటూ స్పందించి, చితిని ఏర్పాటు చేసుకుని అగ్ని ప్రవేశం చేసే ప్రయత్నం పండితులు అడ్డుకున్నారు. రాజా తప్పు చేసింది నీ దేహం కాదు. మనసుదే ఈ కళంకం. శరీరం దోషానికి పాల్పడినట్లయితే దాన్ని సజీవదహనం చేయవలసిందే! కానీ మనసులో జనియించిన ఈ పాపపు ఆలోచన పశ్చాత్తాపమనే అగ్నిలో దహనమై బుగ్గిగా మారింది. 'ఇక మీరు శిక్షార్హులు కారు' అంటూ ఎంతో ఊరడించిన నేపథ్యంలో గురుపాల్ ఆత్మాహుతిని బలవంతంపై విరమించుకున్నారు.

ఇదీ ఔఫీ ఉటంకించిన సదాచార సంపత్తి నిండిన ఒక చారిత్రక ఘటన. ఎంత గొప్ప పరివర్తన, ఎంత గొప్ప సాంప్రదాయం. మధ్య యుగాన రాచరిక పాలనలో ధ్వజమెత్తిన పర స్త్రీ గౌరవ నినాదం ఒక నియంతృత్వ కాలంలో రూపుదిద్దుకున్న ఉన్నత విలువల కట్టుబాటు. రాచరికంలో రాజ్యంలోని ప్రతీది ప్రజలతో సహా రాజుకు భోగవస్తువులేనన్న ఆచారం కొనసాగుతున్న సందర్భాన, రాజు ఎట్లా ప్రవర్తించినా ప్రశ్నించే ధైర్యం ఏ ఒక్కరికీ ఉండదు. అయినప్పటికీ, రాజా గురుపాల్ విలువలకు కట్టుబడిన తీరు స్త్రీల పట్ల పురుషులు ఎలా ప్రవర్తించాలో అనే విషయానికి దర్పణం పట్టింది. విధ్వంసమవుతున్న నేటి సాంప్రదాయాల పూర్వ రంగాన్ని ఎరుకపరిచేందుకే ఈ చారిత్రక కథాంశాన్ని పొందుపరిచాను. ఇప్పటి సమాజ పోకడలు ఎంత ఛిద్రమయ్యాయో అర్థం చేసుకోవడానికే రాజా గురుపాల్ సంఘటనను పాఠకుని ముందుకు తెచ్చాను.

12వ శతాబ్దం నుండి 20వ శతాబ్దికి పరుగులు తీశాం. నాగరిక ప్రపంచమని, ప్రజాస్వామ్యమని గొప్పలు పోతున్నాం. నాగరికులమని జబ్బలు చరుచుకుంటున్నాం. ఇప్పుడేమి జరుగుతున్నది. నిర్భయ, రిషితేశ్వరి చావులు ఏ సమాజాలకు సంకేతాలు. కళాశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో ర్యాగింగ్ ఒక ఫ్యాషన్‌లా, ప్రేమించబడడం ఒక హక్కుగా విద్యార్థులు భావిస్తున్నారు. విద్యా కేంద్రాలన్నీ కులం కుంపట్లతో దగ్ధమవుతున్నాయి. ఎలాంటి జుగుప్సాకర నేరమైనా నిందితుడు తమ కులం వాడంటూ నిస్సిగ్గుగా కుల సమూహాలు మద్దతుగా నిలుస్తున్నాయి.

నాగార్జునా విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి మరణ వాఙ్మూలం ఆటవిక రాజ్యాన్ని తలపిస్తుంది. ప్రేమించకపోతే ఏ ఆడపిల్లకైనా శాస్తి ఇదేనని హెచ్చరిక చేసింది. రిషితేశ్వరి మరణానికి కారకులైన విద్యార్థిని, విద్యార్థులకు అక్కడి ప్రిన్సిపాల్ బాబూరావు అండ. బాబూరావు నేరాలకు ఆయన కులానికి చెందిన విద్యార్థి సమూహాలు అండదండ. బాబూరావుపై వస్తున్న వదంతులు సమాజానికి చిరాకు పుట్టిస్తున్నాయి. సాటి ఆచార్యులు వల్లె వేస్తున్న అతని వికృత క్రీడలు విద్యార్థి లోకానికి గగుర్పాటును కలిగిస్తుంది. విద్యార్జన కోసం విద్యా కేంద్రాలకు చేరుకున్నామనే స్పృహ విద్యార్థుల్లో అడుగంటి పోయింది. మేకప్ వేసుకుని అమ్మాయిలతో వేదికపై నృత్యాలు చేసిన ప్రిన్సిపాల్ బాబూరావు ప్రవర్తన కొందరు ఆచార్యుల అనైతిక తీరుకు తెరపట్టింది. ఏ సమాజానికి ఈ పరిణామాలు ఆనవాళ్లు. మనుధర్మం చెపుతున్నట్లుగా చదువుకోవడానికి బాలికలు, స్త్రీలు అర్హులు కారా! కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే ఉన్నత చదువులకు హక్కుదారులా! బుద్ధిగా చదువుకోవడానికి అవకాశాలే లేవా? అనే ప్రశ్నలు నేటి సంఘటనలు పురెను పలు విధాలుగా తొలుస్తున్నాయి.

ప్రభుత్వాలు వేసే కమిటీలు, కమీషన్‌లు కంటి తుడుపుగా మారుతున్నాయి. పాలక పార్టీల అనుకూలురను రక్షించడానికి, ప్రతికూలురను నిందితులుగా ఇరికించ డానికే విచారణలు సాగుతున్నాయనే విశ్వాసం ప్రజల్లో నాటుకు పోయింది. కేసులను నీరుగార్చే ప్రత్యామ్నాయ అన్వేషణలే ఈ బూటకపు విచారణలని బలమైన ముద్ర ఉంది. విద్యార్థులను సన్మార్గంలో నడిపించ వలసిన కళాశాలల, విశ్వవిద్యాలయాల నిర్వాహకులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సంఘటనలు

జరిగినప్పుడు కాయకల్ప చికిత్సలతో సరిపెడుతున్న నిర్వాహకులు అనైతిక పోకడలను అరికట్టడంలో అడ్డంగా వైఫల్యం చెందుతున్నారు.

చంద్రబాబు మాటలకు అర్థాలు వేరు అనేది నిస్సందేహం. అక్రమాలను గట్టిగా అడ్డుకోమని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునే వారిని ఎదుర్కోమని ఎపి సిఎం పదేపదే వల్లెవేసే విషయాన్ని ఉద్యోగ వర్గాలు సరిగా అర్థం చేసుకోవడం లేదు. కొందరు అమాయకంగా సిఎం మాటలు అందరికీ వర్తిస్తాయని భావిస్తున్నారు. చంద్రబాబు పదేపదే చెప్పినంత మాత్రాన తెలుగు తమ్ముళ్ల అడ్డగోలు దోపిడీలను అడ్డుకో గూడదనే విషయాన్ని అధికారులు, ఉద్యోగులు అవగాహన చేసుకుని ఆ ప్రకారం ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కృష్ణా జిల్లా ముసునూరు మండల తహసీల్దార్ వనజాక్షిపై కేసు నమోదు చేసి జైలులో పడేస్తారేమోననే భయం విజ్ఞత కలిగిన ప్రజా సమూహాల్లో గుబులు పుట్టిస్తుంది. ఉద్యోగం నుండి తీసివేస్తారేమోననే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బహుశా తరలిపోతున్న ఇసుక ప్రహసనంలో ఆమె బలి పశువు కాబోతుందేమోననే సంశయం బహుళ ప్రచారంలో ఉంది. వనజాక్షి చేసిన తప్పిదమేమిటి? చింతమనేని ప్రభాకర్ గుంపు తరలిస్తున్న ఇసుక తమ మండలానికి చెందినదా? కాదా? అని నిర్ధారించాలని గట్టిగా అడ్డుకుంది. ఇవాళ అదే విషయం ఆమె మెడకు చుట్టుకుంది.

సాధారణ పౌరులైనా, ఎంఎల్ఎ, చీఫ్ విప్ అయిన పాలక పార్టీ నేత చింతమనేని ప్రభాకరైనా చట్టం ముందు సమానమేననే రాజ్యాంగ నిర్దేశాన్ని ఆమె నమ్మింది. అధికారిణిగా ప్రశ్నించింది. పర్యవసానంగా తిట్లు, దూషణలు, కలత, కన్నీళ్లు, బెదిరింపులు, అదిరింపులు, ఆక్షేపణలు, దౌర్జన్యాలు, దాష్టీకాలు బహు మౌనంగా పొందింది. కడుపులో చల్ల కదలకుండా కూర్చొని, పాలక 'దేశం' పార్టీ వారి ఎడల ఉదాశీనంగా వ్యవహరిస్తే వనజాక్షి ప్రశాంతంగా ఉండేది. ఏ పోలీసు అధికారినో పురమాయించి చేతులు కడుక్కుంటే హాయిగా ఉండేది.

ఇప్పుడు నడుస్తున్న పరిణామాలు అంచనా కడితే రంగంపేట ఇసుక రీచ్‌లో జరిగిన గొడవలో ఆమెనే నేరస్తురాలిగా ధృవపరుస్తారనే నమ్మకం బలపడుతుంది. నిజానికి ఈ సంఘటన కేవలం వనజాక్షి ఒక్కరికే సంబంధించిన విషయం కాదు. పాలక పార్టీ వర్గాలను ఆటంకపరిస్తే ఎ.పి.లోని ప్రభుత్వోద్యోగులందరికీ ఇదే గతి పడుతుందని వనజాక్షి కథనం విడమరిచి చెపుతున్న లోతైన పాఠం.

వనజాక్షి కథనం తెలియని తెలుగు వారుంటారని నేననుకోను. తదనంతర పరిణామాలను పరిశీలిస్తే వనజాక్షిపై తప్పిదాలను మోపడం వివాదానికి కేంద్ర బిందువైన ఇసుక రీచ్ పశ్చిమ గోదావరి జిల్లాకే చెందినదని కృష్ణా జిల్లా రంగంపేట పరిధి లోనిది కాదని నిర్ధారించడం నుండి ప్రారంభమైంది. అంతకు క్రితమే సిఎం చంద్రబాబు చింతమనేని, వనజాక్షిలను పిలిచి మాట్లాడిన సందర్భంలో మొత్తం వివాదానికి ఆమె కారకురాలని ఆగ్రహం వెలిబుచ్చి ముద్దాయిని చేశారు. ఈ సందర్భానికి సీక్వెన్సే సర్వే నిర్వాకం. అనంతరం మంత్రివర్గ సమావేశంలో చింతమనేని సచ్చీలుడని తీర్మానంతో కితాబివ్వడం వనజాక్షిని మరింత విపత్తులోకి నెట్టింది. ఎపిసోడ్‌లో ప్రస్తుత ముఖ్య ఘట్టం నాటి సంఘటనపై విచారణాధికారిగా రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి జెసి శర్మను నియమించి 30 దినాలలో నివేదిక కోరుతూ ఎపి సిఎస్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. నివేదికలో ఏమి నిండుతుంది. తప్పంతా వనజాక్షిదేనని చెపుతుంది. ఆమె నేరస్తురాలని ధృవపరుస్తుంది. ఇంతకంటే మనం ఇంకేమైనా ఊహించగలమా? ఆశించగలమా? ఈ నివేదిక ఫలితాలు వనజాక్షిని ఏ మేరకు ఇబ్బంది పెడతాయో వేచి చూడాలి.

ఇదే కోవలో ముసునూరు ఆర్ఐ మరియన్న నిర్బంధం విషయం, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్‌ను చావబాది కట్లు బట్టలు బద్దలు చేసిన వైనం, తహసీల్దార్, మండల మెజిస్ట్రేట్ అని పరిగణించకుండా ఈడ్చి పడేసిన దాష్టీకంపై చంద్రబాబు గానీ, మంత్రి మండలి సభ్యులు గానీ సమావేశంలో పెదవి విప్పకపోవడం ఉద్యోగ వర్గాల పట్ల పాలక వర్గాల ధోరణిని వెల్లడించింది. ముసునూరు సంఘటనకు కొనసాగింపుగా చిత్తూరు జిల్లా చిన్న గొట్టిగల్లు మండల తహసీల్దార్ నారాయణమ్మ కూడా ఇదే విధంగా అవమానాన్ని, దాడినీ చవి చూశారు. కాకపోతే భూమికలు వేరు. ముసునూరు ఇసుక మాఫియా అయితే, చిన్న గొట్టిగల్లు మండల కేంద్రంలోని 'దేశం' నాయకుల చెరువు భూ దందా. అయితే ఈ దౌర్జన్యం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వనజాక్షి కథనానికి వచ్చినంత ప్రచారం రాలేదు.

ఇదే కోవలో గుంటూరు జిల్లా మంగళగిరిలో భూ కబ్జాకు పాల్పడుతున్న పాలక పార్టీ వారిని అడ్డుకున్న విఆర్ఎ చలపతిరావు, విఆర్ఒ శ్రీనివాసరావులపై దాడి చేసి చితకబాదారు. దండాలు, దస్కాలు పెట్టి వదిలివేయమని ప్రాధేయపడినా కనికరం చూపించలేదు. ఈ సంఘటనల్లో దౌర్జన్యాలన్నీ అధికార పార్టీకి చెందినవే. నిజమే ఈ దాడులను ముక్త కంఠంతో నిరసించాల్సిందే. తీవ్రంగా ఖండిద్దాం కూడా. అయితే ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు ఎవరి పక్షాన ఉంటున్నారన్నదే ఇక్కడ పెద్ద ప్రశ్న. ఏ ఒక్క పనిమీదైనా పౌరులు కార్యాలయానికి వెళితే వారిపట్ల ఉద్యోగ వర్గాలు ఎట్లా ప్రవర్తిస్తున్నాయో! వారికి వారే ప్రశ్నించుకుని సమాధానం వెతుక్కోవలసిన అవసరం తప్పనిసరి.

చింతమనేని ప్రభాకర్ పిలుపిస్తే వనజాక్షి చర్యలను నిరసిస్తూ వేలాది మంది ఏలూరులో ప్రదర్శన జరిపి జిల్లా కలెక్టర్‌కు ఆమెపై ఫిర్యాదు చేశారు. మరి వనజాక్షికి మద్దతుగా ప్రజలు ఏమాత్రం స్పందించి రహదారిపైకి వచ్చారో? ఉద్యోగ శ్రేణులు అంచనా వేసుకోవాలి. కొన్ని ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు తమ సహజ ధోరణిలో ధర్మబద్ధంగా చేసిన ఆందోళన గుర్తించడానికి వీలే లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ అవకాశాన్ని వదులుకోకుండా జరిపే ఆందోళన పరిగణనలోకి రానేరాదు. స్వచ్ఛందంగా ప్రజలు ఏమాత్రం సహకరించారనేది ప్రధాన అంశం. ఉద్యోగవర్గాలు ప్రజలకు దగ్గరగా, వారిపట్ల సానుభూతితో ఉంటున్నారా? అసహనం, తిరస్కారం, అగౌరవం, మామూళ్లు ఇవన్నీ కలిస్తే ప్రభుత్వ కార్యాలయమని చెపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగ వర్గాలు ఆలోచించుకోవాలి. వారంతా ప్రజల పక్షాన చేరాలి. బదిలీ కోసమో, లంచాలు దండిగా వచ్చే కేంద్రంలో తిష్ఠ వేసేందుకో పాలక వర్గాల పాదాలను ఒత్తినంత కాలం ఇలాంటి సంఘటనలే పునరావృతమౌతాయి. ఇవాళ కాకపోతే రేపో మాపో అందరూ రుచి చూడవలసే వస్తుంది. కాగా వనజాక్షిని చంపుతామంటూ వచ్చిన బెదిరింపు లేఖ కలకలం బహుశా కృష్ణా జిల్లాకో, లేక ఆమె మండలానికో చెందినవారి సృష్టి అయి ఉండవచ్చు. గతంలో ఆమె వలన ఇబ్బందుల పాలైన వారో, ప్రస్తుతం ఎదుర్కొంటున్న వారో, ముసునూరులో ఇసుక దందా నడిపేవారో, కాకపోతే ఆకతాయిలో చేసిన సందిట్లో సడేమియా. అదంత ప్రాధాన్యత సంతరించుకునే అంశం కాదు. భయపడవలసిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడేవారు పేరంటానికి పిలిచినట్లు ఉత్తరాలు రాసి చేస్తారా? సందేహం కాదా?

*(రచయిత పల్నాడు రచయిత సంఘం అధ్యక్షులు)* వీ

# అభివృద్ధి, పెరుగుదల - వేర్వేరు పరిణామాలు

***అభివృద్ధి అంటే పిడికెడు మంది ఆదాయాలు పెరగడం, రహదారులు, ఫ్లై ఓవర్లు, ఎయిర్‌పోర్టులు, రైలు మార్గాలు, భారీ నీటి ప్రాజెక్టులు రావడం కాదనీ, ప్రజల జీవన ప్రమాణాల్లో మౌలికమైన మార్పే అభివృద్ధి అనీ అంటున్నారు*** **వి. హనుమంతరావు**

అభివృద్ధి, అభివృద్ధి అంటూ పాలకులు రామకోటి రాసేస్తున్నారు. ఊరు, వాడ కాళ్లరిగేటట్లు తిరిగి నోరు నొప్పి పుట్టేటంతగా ఉపన్యాసాలు దంచేస్తున్నారు. 1947లో అధికార మార్పిడి జరిగినప్పటి నుంచి లెక్కపెట్టలేనన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రకటిస్తూనే ఉన్నారు. కొన్నిసార్లు అదే అభివృద్ధి పథకాన్ని పేరు మార్చి మరో కొత్త పథకం ప్రవేశపెట్టినట్లు నటిస్తున్నారు. కేంద్ర పథకాల పేర్లు మార్చి అవి తమ పథకాలేనని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఖాతాలో వేసేసుకుంటున్నాయి. దారిద్రం గురించి మాట్లాడని రోజులేదు. ఆరు దశాబ్దాలు దాటినా కొత్తకొత్త పథకాలు, కొత్తకొత్త లెక్కలు విడుదల చేస్తున్నారు. అభివృద్ధి జరిగిందంటే పేదరికం పోవాలి కదా. అభివృద్ధి నినాదం పాతబడిపోవడంతో ఇందిరా గాంధీ 'సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి' అని ప్లేటు మార్చింది. అంటే అభివృద్ధి ఫలితాలు పేదరిక నిర్మూలనకు దారితీయడం లేదని అంగీకరించడమే కదా. కొంతకాలం తర్వాత మరోసారి ప్లేటు మార్చి 'సమానతతో కూడిన అభివృద్ధి' నినాదాన్ని ప్రభుత్వం చేపట్టింది. మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం కాస్త మార్చి, మెరుగుదిద్ది 'ఇంక్లూజివ్ గ్రోత్' నినాదాన్ని చేపట్టింది. అధికార మార్పిడి జరిగి ఆరు దశాబ్దాలు గడిచినా, ఎన్ని అభివృద్ధి పథకాలు చేపట్టినా, కొంత మేరకు అభివృద్ధి జరిగినా, అభివృద్ధి కునికిపాట్లు పడుతూందెందుకని ఎవరూ జుట్టు పీక్కోనక్కర్లేదు. ఎందుచేతనంటే అసలు తప్పు అభివృద్ధి నిర్వచనంలోనే ఉంది. మనం సాధిస్తున్నది పెరుగుదల మాత్రమే. ఆ పెరుగుదల సౌకర్యాల ఫలితాలు యావన్మంది ప్రజలకు సమతూకంగా అందినప్పుడే అది అభివృద్ధి అనిపించుకుంటుంది. ఇందిరాగాంధీ మొదలు మన్‌మోహన్ వరకూ తమ నినాదాలను మార్చుకొంటూ రావడంలోనే వారి వైఫల్యాలను, అభివృద్ధి ఫలితాలు ప్రజలకు అందడం లేదనే విషయాన్ని ఎత్తి చూపుతున్నాయి. ప్రస్థుత ప్రధాని ఏం తక్కువ తినలేదు. ఉదాహరణకు ఇన్ని కోట్లు బ్యాంకు ఖాతాలు తెరిచామని చెపుతారే గాని, ఆ ఖాతాలలో ప్రభుత్వం ఇంత డబ్బు జమచేసినట్లు చెప్పరేమి? కాగా కార్యక్రమాలు పెరుగుదలకు దారితీస్తున్నాయి కాని అభివృద్ధికి దారితీయడం లేదు. పేదరికం జనాన్ని వెంటాడుతూనే ఉంది. పెరుగుదలనే అభివృద్ధి అంటున్నారంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదులను దేశం నుంచి వెళ్లగొట్టాల్సిన పనిలేదు. ఎందుచేతనంటే వాళ్లు రైలు మార్గాలు, రహదారులు, ఓడరేవులు, నీటి ప్రాజెక్టులు నిర్మించారు. అయినా వారిని దేశం నుంచి వెళ్లగొట్టామంటే లక్షల రూపాయలు ఖర్చుచేసి పై సదుపాయాలు కల్పించారంటే మనదేశ సంపదను దోచుకుని వెళ్లడానికే. ఆ లెక్కన మన నల్ల దొరలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు పరుస్తున్నారంటే వాటి ఫలితాలన్నీ పాలకులు, కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తల, భూ కామందుల, కార్పొరేట్ల జేబుల్లోకి పోవడానికే. ఉదాహరణకు రైతు తన పంటను మార్కెట్‌కు తీసుకుని పోవాలంటే రహదారులులేని కాలంలో ఏ రెండెడ్ల బండిమీదో తీసుకుని వెళ్లేవాడు. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఓ రోడ్డు వేస్తే, ఆచరణలో మోటర్ సైకిళ్లు, కార్లు, రైతు పంటను మార్కెట్‌కు తరలించడానికి లారీలు తిరగడానికి ఉపయోగపడుతున్నాయి. మధ్య దళారీలు రైతు పంటలను మార్కెట్‌కు తరలించడానికి సౌకర్యం ఏర్పడింది. ఈ విధంగా రైతాంగాన్ని దోపిడీ చేయడానికి ప్రభుత్వం పరోక్షంగా సహాయపడుతూ, మరోపక్క ఈ రహదారి నిర్మాణాన్ని అభివృద్ధి ఖాతాలో జమచేస్తోంది. సమానావకాశాలు కలిగించనంత కాలం ఇది అభివృద్ధి కార్యక్రమం ఎలా అవుతుంది?

రాజ్యాంగం నిర్దేశించిన ఆర్థిక ప్రజాస్వామ్యం, రాజకీయ ప్రజాస్వామ్యం రెండూ ప్రజలకు నిరాకరించబడుతూనే ఉన్నాయి. డా.బి.ఆర్. అంబేద్కర్ ఇలాంటి పరిణామం జరుగుతుందని ముందే ఊహించారు. ఆయన ఏమన్నారంటే 'ప్రభుత్వాలు ఏర్పడే ముందు వాళ్లు ఒక ఆదర్శాన్ని నిలపాలని రాజ్యాంగం భావిస్తున్నది. ఆ ఆదర్శం ఆర్థిక ప్రజాస్వామ్యం ఇక్కడ మనం కేవలం అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ఒక యంత్రాంగాన్ని తయారు చేసే పని మాత్రమే పెట్టుకోలేదు. ఎందుకంటే రాజ్యాంగంలో రూపొందించిన విభిన్న యంత్రాంగాల ద్వారా ఒక పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్ని స్థాపించడమే ఉద్దేశం కాదు, ఆ ప్రభుత్వానికి మన ఆర్థిక లక్ష్యం గురించిన దిశానిర్దేశం లేకుండా మన సామాజిక ధర్మం ఎలా ఉండాలనే ఆలోచనే లేకుండా ఉండకూడదు. ఆ ఉద్దేశంతోనే మన రాజ్యాంగ విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలను తయారు చేశారు. ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించే అవకాశం ఉంటుందని చెపుతూ ప్రభుత్వాల పరిస్థితులు కష్టతరంగా ఉన్నాయని ఆర్థిక వనరులు సరిపోయినంత లేవని అందువలనే రాజ్యాంగం నిర్దేశించిన దిశలో తాము చర్యలు చేపట్టలేకపోతున్నామని అనవచ్చు'నని హెచ్చరించారు. ఇవాళ ప్రభుత్వం నడుస్తున్న తీరు చూస్తే అంబేద్కర్‌ది ఎంత ముందు చూపో అర్థమవుతుంది. డా. బి.ఆర్. అంబేద్కర్ చేసిన ఈ హెచ్చరికను ఉటంకిస్తూ ప్రముఖ న్యాయ శాస్త్రవేత్త కన్నబిరాన్ రాజ్యాంగాన్ని ఉదహరిస్తూ 'సామాజిక శ్రేయస్సుకు భంగకరమైన పద్ధతిలో సంపద కాని, ఉత్పత్తి సాధనాలు కాని గుత్తాధిపత్యం కిందకు వెళ్లకుండా ఆర్థిక వ్యవస్థ నిర్వాహణ జరగాలని 39వ అధికరణం అదేశించింది.

ఈ సందర్భంలో ఆయన ఇద్దరు ప్రముఖులు చెప్పిన విషయాన్ని ఉటంకించారు 'ప్రజాస్వామ్య తత్వవేత్త జాన్‌లాక్ రాజ్యాంగాన్ని దాని ఆదేశాలను అమలు పరచకపోతే దుష్టపరిపాలనను ప్రతిఘటించే, తిరగబడే హక్కు ప్రజలకు ఉంది' అలాగే హెరాల్డ్ లాస్కీ అన్నారు కదా 'చట్టబద్ధమైన పరిపాలన అనేది దాని నుంచి అర్థం చేసుకోవాల్సిందేమంటే ప్రతీ ఒక్క వ్యక్తికి రక్షణ ఇచ్చే, సంఘీభావాన్ని అందించే బాధ్యత రాజ్యాంగానికి ఉంది. ఈ లక్ష్య సాధనకు రాజ్యం పనిచేసే అంతిమ చట్రంలో రాజ్యాంగ బద్ధమైన హామీలు కూడా ఉండాల్సి ఉంటుంది.

సంస్మరణ

# ఉత్తరాంధ్ర హక్కుల గొంతు రామ్మూర్తి

- కెకెకె వర్మ

పాల రామ్మూర్తిగా సుపరిచితుడైన బలిపిరెడ్డి రామ్మూర్తి ఉత్తరాంధ్ర హక్కుల స్వరం. తనదైన శ్రీకాకుళ రైతు యాసతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రజాసంఘాల వారికి సుపరిచితమైన కార్యకర్త రామ్మూర్తి. 2015 ఆగస్టు 7న విశాఖపట్నంలోని కెజీహెచ్ లో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన చివరి వరకు తను పనిచేసిన పౌరహక్కుల సంఘం బాధ్యతలను అత్యంత శ్రద్ధతో నిర్వహించడమే కాకుండా ఆస్పత్రికి తనకు పలకరింపుగా వచ్చిన మిత్రు లతో సంఘ బాధ్యతలను బాధ్యతతో నిర్వహించమని ఆశించిన నిబద్ధతగల హక్కుల కార్యకర్త. ఆయన పాఠశాల రికార్డుల ప్రకారం 1949 జూలై 1న విజయనగరం జిల్లా రామభద్రపురం గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. విశాఖ డైరీలో మెకానిక్‌గా ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. అదే పాల డైరీలో పనిచేసే సూర్యకుమారిని ఆదర్శ వివాహం చేసుకొని ఆమెకు తనున్నంత వరకు ఆసరాగా నిలిచి కుటుంబ బాధ్యతలను కూడా ఆదర్శంగా నిర్వహించారు.



తన అరవై ఆరేళ్ల జీవిత కాలంలో నలభై ఐదు ఏళ్లు తను నమ్మిన సిద్ధాంతం కోసం మొక్కవోని దీక్షతో నిబ్బరంగా నిలబడి పోరాడిన మనిషి రామ్మూర్తి. ఆయన మొదట అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదికలో పని చేసిన కాలంలో కూడా ఆ సంస్థ లక్ష్యానికి సంపూర్ణంగా కృషి చేసిన ఆర్గనైజర్. తను ఒక సంస్థలో బాధ్యుడిగా ఉన్నా మిగిలిన ప్రజా సంఘాలపట్ల కూడా అంతే బాధ్యతతో తన వంతు సహాయ సహకారాలు అందించడంలోనూ వాటి సభలు సమావేశాలు విజయవంతం కావడంలోనూ ఆయన అకుంఠిత కార్యాచరణ తోడయి ఉండేది. తనకున్న విస్తృత పరిచయాల ద్వారా ఆర్థికంగా హార్థికంగా సహాయ సహకారాలను అందించి తన రాజకీయ కర్తవ్యాన్ని కార్య రూపంలో పెట్టేవారు. ఇందుకు చాలా ఉదాహరణలున్నాయి. 1997లో శ్రీకాకుళంలో జరిగిన విరసం రాష్ట్ర మహాసభలు విజయవంతం కావడంలో తన కార్యదీక్ష తోడయింది. కులనిర్మూలనా సమితి సభల నిర్వహణకు సహాయ సహకారాలను అందించారు. అలాగే రాష్ట్రంలో ఏ పెద్ద సంఘటన జరిగిన దాని పట్ల స్పందనగా టెక్కలిలో, ఉద్దాన ప్రాంత గ్రామాలలో జరిగిన ప్రజా సంఘాల సమావేశాలు తన ఆశక్తితోను సహాయ సహకారాలతోను నిర్వహించబడేవి. తన అనారోగ్యాన్ని లెక్క చేయక దేశం నలుమూలలా ప్రజా సంఘాల సమావేశాలకు పట్టుదలగా హాజరయ్యేవారు.

అందరికీ తన ఇల్లు, ఉద్యోగ కేంద్రం ఒక ఆసరాగా మలిచి తనున్న చోటే కేంద్రంగా పని చేసి చూపడంలో రామ్మూర్తి ఆచరణ అందరికీ ఆదర్శప్రాయం. తను పనిచేస్తున్న విశాఖ పాల డైరీ పాలకవర్గం రామభద్రపురంలో ఒక రాజకీయ నాయకుడి కుమారుని వివాహానికి నీళ్ల సరఫరా చేయడాన్ని తాను వ్యతిరేకించడంతో అక్కడి నుండి తనను టెక్కలి బదిలీ చేసినా వారిని బతిమాలకుండా అదే టెక్కలిని తన కార్యాచరణకు కేంద్రంగా చేసుకొని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం(ఎపిసిఎల్‌సి) జిల్లా బాధ్యతలను చేపట్టి అక్కడ ఎపిసిఎల్‌సి రాష్ట్ర మహాసభలను నిర్వహించడంలో తన పాత్ర మరువలేనిది. హక్కుల సంఘ కార్యకర్తగా శ్రీకాకుళం జిల్లా బాధ్యుడిగా తనున్న కాలంలో కార్యవర్గ సమావేశాల నిర్వహణలో గానీ, జిల్లా సమావేశాల నిర్వహణలోగాని తన అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా నిర్వహించేవారు. తద్వారా సంఘాన్ని కార్యాచరణకు దగ్గరగా తీసుకుపోవడంలో ముందుండేవారు. తోటి సభ్యులను తన మాటలతో ఉత్సాహపరుస్తూ హక్కుల సంఘం ఆవశ్యకతను గుర్తుచేస్తూ ప్రజల పట్ల నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరాన్ని తెలియచేస్తూ అందరినీ పని

---

ఆ చట్టాలను గనుక రాజ్యం బహిరంగంగా' ఉల్లంఘిస్తే ఆ ప్రయోజనాల నిరాకరణకు ప్రజలకు తిరగబడే హక్కుంది.

ప్రస్తుత ప్రభుత్వం ఆ మాటకొస్తే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అధికారంలో ఉంటూ వచ్చిన ప్రభుత్వాలన్నీ రాజ్యాంగంలో నిర్దేశించిన ఆదేశిక సూత్రాలను ఎలా ఉల్లంఘిస్తూ వస్తున్నాయో మన నిత్య జీవితంలో అనుభవిస్తున్నాం. ప్రభుత్వం ఏమీ చేయడంలేదని, పెరుగుదలను సాధించడం లేదని నేననబోవడం లేదు. కాని ఆ సౌకర్యాలన్నీ అభివృద్ధి నిర్వచనం కిందకు రావు. వాటి ఫలితాలు సామాన్యులకు చేరినప్పుడే అవి అభివృద్ధి కార్యక్రమాలవుతాయి. అందరికీ అభివృద్ధి ఫలితాలు అందడం లేదని ఇన్‌క్లూజివ్ గ్రోత్ లక్ష్య సాధనకు కృషి జరగాల్సి ఉంటుందని ప్రధాని నినదించడమే అందుకు తిరుగులేని సాక్ష్యం నిదర్శనం. మాజీ ప్రధాని కూడా పెరుగుదల (గ్రోత్) అనే అంటూ వచ్చారు కాని అభివృద్ధి (డెవలప్‌మెంట్) అని అనలేదు. పెరుగుదలకు, అభివృద్ధికి తేడా ఉందని పెరుగుదల ఫలితాలు అందరికీ అందినప్పుడే అది అభివృద్ధి అవుతుంది. దేశంలో బిలియనీర్ల సంఖ్య ఏడాదికేడాదికి పెరుగుతుండడం చూస్తే అభివృద్ధి ఫలితాలు వారికే అందుతున్నాయనేది స్పష్టం.

1991లో మాజీ ప్రధాని, అప్పటి ఆర్థిక మంత్రి మన్‌మోహన్‌సింగ్ సంస్కరణలనే సర్వరోగ నివారిణి అనే మందుతో వైద్యం ప్రారంభించారు. 2011 జనాభా లెక్కల్లో ప్రజలు, ముఖ్యంగా గ్రామీణులు ఉపాధి, విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో ఎలా జీవిస్తున్నారో పౌష్టికాహార లేమివల్ల ఇటు తల్లులు, అటు పిల్లలు ఎలా పిట్టల్లా రాలిపోతున్నారో చదివాం.

అభివృద్ధి శీర్షాసనం వేస్తోంది. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు డిక్షనరీ తిరగరాసి అభివృద్ధి అంటే ఆకలి, పేదరికం, అనారోగ్యం, నిరుద్యోగం, మంచినీరు దొరకని పరిస్థితి అని అర్థం చెపుతారు. మోడీ ప్రభుత్వం 2014-15 ఉత్తరార్ధ భాగంలో బడ్జెట్‌లో ఈ సమస్యల పరిష్కారానికి ఘనంగా కేటాయింపులు చేసి సెప్టెంబర్ నెలలోనే కేటాయింపులకు కోత విధించి, 2015-16 లో సుమారుగా కోత విధించిన స్థాయిలోనే కేటాయింపులు చేయడం చూస్తే ప్రజల జీవన స్థితిగతులంటే మోడీ ప్రభుత్వానికి ఎంత అలుసో అర్థమైపోతుంది. పైనే హెరాల్డ్ లాస్కీ అన్నట్లు ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు తిరగబడే హక్కుంది.

*(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు)* వీ

చేయించడంలో తన కృషి ఎన్నదగినది. ఆయన పౌరహక్కుల గురించి వాటి ఆవశ్యకత గురించి నిబద్ధతతో ఆలోచించి ఆచరణలో చూపిన వారు. ఎక్కడ ఎదురుకాల్పుల సంఘటన జరిగినా వెంటనే మిగిలిన హక్కుల కార్యకర్తలను కూడగట్టుకొని ఆ సంఘటనలో మరణించిన వారి మృతదేహాలను వారి వారి బంధువులకు అప్పగించడంలోను, ఆ ఎదురుకాల్పుల సంఘటన వెనక ఉన్న అసలు నిజాన్ని రాబట్టేందుకు వెంటనే నిజ నిర్ధారణ కమిటీని తను ముందుండి తీసుకుపోయే వారు రామ్మూర్తి. అది ఎంత దూరమైనా అడవైనా తన ఆరోగ్యం సహకరించకపోయినా అందరితో కలిసి వెళ్లి ఆ సంఘటనపై నివేదికతో నలుగురికీ తెలియచేయడంలో ముందుండే వారు. అలాగే ఆయా ఎదురు కాల్పుల సంఘటనలపై న్యాయ విచారణలకు కూడా హాజరయి తన వాణిని వినిపించేవారు. పౌర హక్కుల సంఘం చురుకుగా పనిచేయడంలో ఆయన పాత్ర కీలకంగా ఉండేది. ఆయన ఉద్దానం ప్రజల తలలో నాలుకలా మారిపోయారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రభుత్వం పదమూడు థర్మల్ పవర్ ప్రాజెక్టులను అడ్డగోలుగా మంజూరు చేసి అదే విధంగా కొవ్వాడ వద్ద నిర్మించతలపెట్టిన అణువిద్యుత్ కర్మాగారం అక్కడి ప్రజల ఉనికినే ప్రశ్నార్థకం చేయడంతో వాటికి వ్యతిరేకంగా ప్రజా సంఘాలను కూడగట్టి క్యాంపైన్ చేసి కాకరాపల్లి, సోంపేట ప్రజల నిరాహార దీక్షా శిబిరాల నిర్వహణకు తన వంతు సాయం చేయడంలో ముందున్న వ్యక్తి. అణువిద్యుత్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేయడం, జీపులో ఆయా గ్రామాలన్నీ క్యాంపైన్ చేసి ప్రజలలో ప్రాజెక్టు వలన వారికి కలిగే ముప్పును ఎరుకపరచడంలోను ఆయన పాత్ర మరువలేనిది. అలాగే కాపు కుల పెత్తందారీల చేతిలో హత్యకు గురైన లక్ష్మీపేట దళితుల పక్షాన వేగంగా స్పందించి వారికి మద్దతుగా ప్రజా సంఘాలను సమాయత్తం చేసి వారి పోరాటానికి సహాయ సహకారాలను అందించడంలోనూ ఆయన శ్రమ ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాలలో ఎక్కడ ఏ రూపంలో అణచివేత జరిగినా అక్కడ రామ్మూర్తి గొంతు వినపడేది. ఒక హక్కుల సంఘ నేతగా ఇంతగా ప్రజలతో మమేకమై వారి పట్ల ఉన్న తన బాధ్యతను నిర్వర్తించడంలో జీవితాంతం కార్యాచరణను విడవకుండా కొనసాగించడం రామ్మూర్తి రాజకీయ నిబద్ధతను మనకు తెలియజేస్తుంది.

ఒక మనిషి సంఘ జీవితం ఆయన కార్యాచరణకు గీటురాయి కదా? రామ్మూర్తి నలుగురిని కలుపుకు పోవడంలోను, కొత్త కొత్త పరిచయాలు ఏర్పాటు చేసుకోవడంలోను ఎంత చురుకుగా ఉండే వారో అంతే నిక్కచ్చిగా ఎదుటి వారు చేసే తప్పులను తమ మొఖం మీదే అడిగేయడం ద్వారా తను శత్రువులను పెంచుకున్నా అనేకసార్లు విమర్శలకు గురైనా పట్టించుకొనే వారు కాదు. ఇది ఆయనకు మొదటినుండి ఉన్న స్వభావం. ఇది రైతు కుటుంబ వారసత్వం కావచ్చు. దీని ద్వారా ఎదుటి వారు తమను తాము సరి దిద్దుకొనేందుకు ఉపయోగపడేది. అలాగే తను నమ్మిన ఉద్యమ రాజకీయాల పరిచయాలే తనకు గీటురాయి. ఎవరి మీదనైనా వారి గురించి చెడుగా విన్నా లేక వారు ఉద్యమానికి దూరమైనా తరువాత తాను వాళ్లకు దూరమయ్యేవారు. తనకు ఉన్నది రాజకీయ సంబంధాలే కాని వ్యక్తిగత సంబంధాలు లేవనే వారు. ఇంత నిక్కచ్చిగా నిర్మొహమాటంగా వ్యవహరించడం మనకు ఆదర్శప్రాయం ఆచరణీయం. సహచర మిత్రుల కుటుంబ సభ్యునిలా వారి బాగోగులను పట్టించుకోవడంలోనూ, వారి సమస్యల పట్ల సరిగా సమయానికి స్పందించడంలోనూ రామ్మూర్తి ఆదర్శప్రాయుడు. సగటు మనిషి సంఘ కార్యక్రమాలను సరిగా ఆచరించడంలో ఈ విధమైన సహకారం లేకపోతే వారు ఆచరణకు దూరమయ్యే పరిస్థితి వస్తుందని కాబట్టి సహచరుల పట్ల బాధ్యతగ ఉండాలని చెప్పేవారు. దీని వలన తన చుట్టూ ఉన్న వారి పట్ల తన మానవీయ స్పందనతో వారికి దగ్గరయి కుటుంబంలోని వ్యక్తిలా మసలుకొని వారిని కార్యాచరణకు దగ్గర చేసి తద్వారా సంఘ నిర్వహణకు తోడ్పడడంలో రామ్మూర్తి ప్రత్యేకత అందరికీ సుపరిచితం. ఒక మనిషి జీవిత కాలం చివరంటా తన సమయాన్ని, ఆదాయాన్ని (తన వ్యక్తిగత అవసరాలకు అతి తక్కువ వినియోగిస్తూ) తను నమ్మిన రాజకీయాలకు వెచ్చించడంలో ఆయన మనందరిలో ముందుండేవారు. ప్రజా ఉద్యమాల నాయకుడిగా వృద్ధాప్యంలో అనారోగ్యానికి గురయి ఉన్న కామ్రేడ్ గోరు మాధవరావుకి తనకిష్టమైన బొడ్డపాడు గ్రామంలో నివాసమేర్పాటు చేసి ప్రజలతో దగ్గరగా ఉండేందుకు తద్వారా తన అనుభవాలను వారితో పంచుకునేందుకు వారికి సహాయం అందించడంలో రామ్మూర్తి పాత్ర ప్రస్ఫుటం. ఆయన తను ఆశించిన నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అహరహం కృషి చేసిన ఆదర్శప్రాయుడు. ఉద్యమం తనకు అప్పచెప్పిన పనులను తూచా తప్పకుండా చేయడంలో పట్టుదలగా ఉండి అసాధ్యమైన వాటిని కూడా తన చొరవతో సులువుగా పని పూర్తి చేయడంలో నేర్పరితనం కలిగి ఉన్నవారు. తను పనిచేసే పాలకేంద్రంపై, తన ఇంటిపై పోలీసుల నిఘా, అనేక మార్లు రాత్రులలో వారు సోదాలు జరిపి హెచ్చరికలు జారీచేసినా వెరవకుండా అదే చోట తాను నివాసముండి పనిచేయడంలో రామ్మూర్తి నిబద్ధత అందరికీ ఆదర్శం కావాలి.

రామ్మూర్తిలో మరొక కోణం సాహిత్యాభిలాష. పురోగామి సాహిత్యాన్ని నిరంతరం అధ్యయనం చేయడం, తద్వారా తను తెలుసుకున్న విషయాన్ని పదుగురికి తెలియచేయడంలోను ఆయన నిరంతరం చర్చలలో ఉంటూ తన్ను తాను మెరుగుపరుచుకోవడమే కాకుండా మిగతా వారిని చైతన్య పరిచేవారు. ఏ కొత్త పుస్తకం వచ్చినా వెంటనే ఆసక్తిగా చదవడం ఆయనకు అలవాటుగా ఉండేది. తనకా పుస్తకం కావాలనుకుంటే ఎలాగైనా సంపాదించి చదివేంత వరకు తనకు ఊపిరాడేది కాదు. ఉద్యమం సమకాలీన సమస్యలపట్ల ఎలా స్పందిస్తుందో ఆసక్తిగా తెలుసుకొని ఆ విషయమై తను తెలుసుకున్నదానిని అందరితో పంచుకోవడం ఆయనకిష్టమైన పని. మిత్రులలో చాలా మంది దీని పట్ల అయిష్టంగా ఉండేవారు. ఈయనేంటి ఇలా పబ్లిక్‌గా మాటాడేస్తుంటారు అని తాము భయపడి వ్యతిరేకించేవారు. కానీ మాటాడకపోతే ఎలాగయ్యా వాడేదో తను చెప్పిందే రైటనేసి పోతే మన మాట ఎలా తెలుస్తుంది అని తన యాసలో నవ్వుతూ ప్రశ్నించేవారు. తన రాజకీయ సైద్ధాంతిక తాత్వికతను పెంపొందించుకోవడంలో పట్టుదలగా ఉండేవాడు. చదవాలయ్యా చదవకపోతే మనకు చుట్టు ఏం జరుగుతుందో తెలియదు. తద్వారా మనం వెనకబడి పోతాం అనే వారు.

సంఘ ఆర్థిక కార్యకలాపాలలో నిక్కచ్చిగా ఉండడం తద్వారా తన తోటి వాళ్లు కూడా అలాగే ఉండాలని కోరుకోవడం ఆయనకి మొదటి నుండీ ఉన్న మంచి గుణం. ఇది తన నిబద్ధతకు నిదర్శనంగా ఉండేది. ఏ సమావేశాలు సభలు నిర్వహించినా ఎప్పటికప్పుడు లెక్కలు సరి చూసి వాటి నిర్వహణా బాధ్యతలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఆయన కృషి చెప్పుకోదగింది. దేనికి కేటాయించిన వనరు దానికే ఉపయోగపడేలా పోట్లాడేవారు. ఏ మాత్రం తేడా వచ్చినా ఎంతటి సన్నిహిత మిత్రుడైనా నిలదీయడంలో రామ్మూర్తి తర్వాతే ఎవరైనా. ఏదీ దాచుకోకుండా అడిగేయడం ఆచరణలో చూపడం ఆయనలోని రాజకీయ నిబద్ధతను తెలియచేస్తుంది. ఇటీవలే ఉత్తరాంధ్ర పెద్ద దిక్కుగా ఉన్న కామ్రేడ్ చలసాని ప్రసాద్‌ను కోల్పోవడం అతి కొద్ది దినాలలోనే రామ్మూర్తిని కోల్పోవడం ఈ ప్రాంత ప్రజా సంఘాలకు తీరని లోటు. వారి ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి.

*(రచయిత విప్లవ రచయితల సంఘం సభ్యులు)* వీ

# మన ప్రాథమిక అవసరాలు - కృత్రిమ అవసరాలు

*ప్రపంచీకరణ ఎంత వేగంగా పెరిగిందో, ప్రకృతి, పర్యావరణ విధ్వంసం కూడ అంతే వేగంగా జరుగుతోందనీ, ఇది మనిషి మనుగడకే ప్రమాదకరంగా మారుతోందనీ హెచ్చరిస్తున్నారు* **గోపి**

*ఇన్ ది టైమ్ ఆఫ్ యూనివర్సల్ డిసీట్, టెల్లింగ్ ది ట్రుత్ ఈజ్ ఎ రెవల్యూషనరీ ఆక్ట్. - జార్జ్ ఆర్వెల్*

గురూ, నాకర్థంకాక అడుగుతున్నా! నీవు రాస్తున్న టాపిక్ ఎవరికైనా పనికొస్తుందా? మనకు ఏ వస్తువులు వాడాలో మనకు తెలీదా? ఇందులో నేర్చుకోవలసిన విషయం ఏముంది? అదీకాదు సార్. నాకనిపిస్తుంది - మన పాలకులు, వ్యాపారస్తులు, పాలసీ మేకరులు, దళారులు మన ప్రాథమిక అవసరాలేంటో ఏనాడో మరచినట్టున్నారు! ఈ మధ్య కాలంలో నీవెప్పుడైన, ఎక్కడైన మన ప్రాథమిక అవసరాల గురించి గాని, వాటి ధరల నియంత్రణల గురించి గానీ, చుట్టుముడుతున్న వ్యర్థాల గురించి గానీ, మాయమవుతున్న అడవుల గురించి గానీ, పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల గురించి గానీ, తరుగుతున్న పచ్చదనం గురించి గానీ, ఇంకుతున్న నీళ్ల గురించి గానీ, వణుకుతున్న ఊళ్ల గురించి గానీ, వారానికో రోజు నీళ్లు అందుతున్న పరిస్థితుల గురించి గానీ, విద్యుత్ చేరని ప్రాంతాల గురించి గానీ చర్చలు ఎక్కడైనా మనం వింటున్నామా!?

హర్ష్ మందర్ రాసిన కొత్త పుస్తకం 'లుకింగ్ అవే: ఇనీక్వాలిటీ, ప్రెజుడైస్ అండ్ ఇన్‌డిఫరెన్స్ ఇన్ న్యూ ఇండియా' ప్రకారం భారతదేశంలో 200 మిలియన్ల ప్రజలు ఆకలితో నిద్రించవలసిన పరిస్థితి ఉండగా, మరో వంద మిలియన్లకు పైగా ప్రజలు మురికివాడల్లో అతి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నట్లు తెలుస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువున 50 శాతం మంది ప్రజలున్నారనీ మన ప్రభుత్వ రికార్డులే చెపుతున్నాయి. ఏది ఏమైనా మనం నివసిస్తున్నది ఐఫోన్ జనరేషన్. కంప్యూటర్ల యుగం, సెల్‌ఫోన్‌ల యుగం, ఫేస్‌బుక్‌ల యుగం, వాట్‌సప్‌ల యుగం, ల్యాప్‌టాప్‌ల యుగం, స్మార్ట్ ఫోన్‌ల యుగం, ట్విట్టర్ల యుగం, ఇంటర్‌నెట్‌ల యుగం, ట్యాబ్లెట్ పిసిహెవాల యుగం, మొత్తంగా చూస్తే ఐటి యుగం. ఇంకో విధంగా కూడా మన ఆధునిక యుగాన్ని చెప్పుకోవచ్చు 'హై టెక్నాలజి-లో వేజెస్-లో ఎంప్లాయ్‌మెంట్ - లాంగ్ వర్కింగ్ అవర్స్- డేంజరస్ వర్కింగ్ కండిషన్స్-హై ప్రాఫిట్స్ ఫర్ ది ఫెవ్'

ఇది ఇలా ఉండగా మనలో మరో ప్రశ్న కలుగుతుంది. మనిషి మనుగడకు కూడు-గూడు-గుడ్డ కనీస ప్రాథమిక అవసరాలని మనమంతా నిత్య పారాయణం చేస్తూ ఉంటాం. మనదేశంలో నివసిస్తున్న నూట 25 కోట్ల జనాభాకు సరిపడిన నిత్య అవసరాల ఉత్పత్తి చేసుకోగలుగుతున్నామా? నిత్యవసరాలు అంటే వరి, గోధుమ, జొన్న, రాగి, పంచదార, పప్పులు, కాయగూరలు, ఆకు కూరలు, పాలు, పండ్లు, గుడ్లు, చేపలు, రొయ్యలు, మాంసం, నూనె గింజలు, మసాల దినుసులు, అత్యవసర మందులు మొదలైనవి. ఇవే గాక, తాగడానికి పరిశుద్ధమైన నీరు, ఆరోగ్యకరమైన-పరిశుభ్రమైన, గాలి-వెలుతురూ సోకే నివాసయోగ్య పరిసరాలు. విద్య-వైద్యం-వినోదం, ఆటపాటలకు, కళలకు కావలసిన సౌకర్యాలు, మంచి బట్ట, మంచి పరిసరాలు, మంచి సినిమా, మంచి నాటకాలు, కళలు, సాహిత్యం, సైన్స్ ఫేయిర్స్, గ్రంథాలయాలు, ఆసుపత్రులు, రోడ్లు, రవాణా సౌకర్యాలు, మహిళా-శిశు సంరక్షణ, పనిచేయగలిగే ప్రతి పౌరునికీ పని, ఉద్యోగ భద్రత, సాంఘిక భద్రత, గౌరవనీయమైన వృద్ధాప్య భద్రత-సంరక్షణ ఇవన్నీ కూడా యావత్ ప్రజల ప్రాథమికమైన అవసరాలు, హక్కులు. బతకాలనీ, బాగా బతకాలనీ మనిషికి ఉంటుంది. ఈ ప్రాథమిక అవసరాలే మనిషిని బాగా బతకడానికి సహకరిస్తాయి.

ఐతే, ఇవి సమాజంలో ఏకొద్ది శాతం ప్రజలకో అందుబాటులో ఉండి, అతికొద్ది మందికి మాత్రం అవసరానికి మించి, మితిమీరి ఉండి, అధిక శాతం ప్రజలకు వాటి ఛాయలు కూడా పడని దుస్థితి ఉన్నట్లయితే, అటువంటి సమాజాన్ని ప్రజాస్వామ్య సమాజం, న్యాయబద్ధ సమాజం అని అనలేం. భారత రాజ్యాంగం ఇవన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ప్రకటించింది. ఆ ప్రకటనకు 68 సంవత్సరాలు నిండినాయి. ఇంతటి సుదీర్ఘకాలం గడిచినా, ఈ దేశంలో అధిక శాతం ప్రజలు దుర్భర దారిద్ర్యంలో, ఏహ్యమైన సామాజిక ఆర్థిక వ్యత్యాసాల నడుమ, అవినీతిమయ పాలనలో మగ్గిపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని కుటుంబాలు, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తి పొంది, ఓ స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థను ఏర్పరచుకుని, 68 సంవత్సరాలుగా స్వపరిపాలన కొనసాగుతున్న మన భారతదేశంలో పైన చెప్పుకున్న కనీస ప్రాథమిక అవసరాలు, వసతులు అధిక శాతం ప్రజలకు ఎందుచేత అందుబాటులోకి రాలేదు?

అన్ని అనర్థాలకు తల్లివేరు రాజకీయం, మార్కెట్ ప్రభావం అన్నట్లు మన పాలకుల విధానాలతోనే పేదరికం, ఆకలి, అనారోగ్యం, పౌష్టికాహారలేమి జనాలు, సామాజిక వెనుకబాటుతనం, సరైన విద్యావకాశాలు లేకపోవడం, పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, కుల సమస్యలు, వనరుల అసమాన పంపకం, నీటి సమస్యలు, పర్యావరణంలో జరిగే మార్పులు ముడిపడి ఉంటాయి.

ఉత్తమ సమాజం, మెరుగైన సమాజం పేర ప్రాథమిక అవసరాలపైన ఆధారపడకుండా కొన్ని కృత్రిమ అవసరాలపై (ఫాల్స్ నీడ్స్) ఆధారపడి ప్రజల్లో ఫాల్స్ కాన్షియస్‌నెస్ కలిగిస్తూ పేదల సంక్షేమం అంటూ ముసుగేస్తూ ప్రజా ధనాన్ని అడ్డంగా దోచేస్తూ మాయమాటలతో ప్రజల్ని

మోసం చేస్తూ మద్యం తాగించి కుటుంబాలను కూల్చేస్తున్నారు. మద్యం కారణంగానే అనేక అనర్థాలు జరుగుతున్నాయి. మద్యం తాగి తల్లి, భార్య, పిల్లలు ఎవరనేది మరిచి వ్యవహరిస్తున్నారు. వీటికితోడు జూదం, వ్యభిచారం, మత్తు పదార్థాలు, గుర్రపు పందాలు, లాటరీలు, గుట్కా, బీడీలు, సిగరెట్లు, చుట్ట, తాంబులాలు, పాన్‌పరాగ్, నశ్యం, కల్తీ మద్యం, జర్దా, పొగాకు ప్రభుత్వ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రభుత్వం వీటిని వ్యాపారంగా మార్చుకుంది. దళారుల, వ్యాపారస్తుల మోజు వీటిపై రోజు రోజుకూ ఎక్కువై ప్రజల ఆరోగ్యాలను కూడా లెక్క చేయకుండా లాభాలే తమ ధ్యేయంగా మార్చుకుంటున్నారు. వీటి కారణంగానే యువత పక్కదారి పట్టి, హింస, దోపిడీ, అనారోగ్యం, అరాచకాలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.

1947లో గద్దెనెక్కిన మన నేతలు రూపొందించిన రాజ్యాంగంలోని 47వ నిబంధన ఇలా చెపుతుంది. 'జూదం, వ్యభిచారం, మత్తు పదార్థాలు, లాటరీలు, సారా వంటి విషయాలు ప్రభుత్వపు ఆదాయ వనరులు కారాదు. ఈ ఆదాయ వనరులతో ప్రభుత్వ పాలన జరపరాదు' మానవ జీవితం ఈ ఆదాయం కన్న విలువైనది. (హ్యూమన్ లైఫ్ ఇజ్ మోర్ వాల్యుబుల్ దాన్ రెవెన్యూ)

ఒకవైపు కొంత మంది డాక్టర్లు జెనరిక్ డ్రగ్స్ మాత్రమే రోగులకు, సమాజానికి మంచిదంటే కొన్ని కంపెనీలు అదే మందుల్నీ కొత్త కొత్త పేర్లతో ఎక్కువ ధరలకు మార్కెట్లోకి దింపి రోగులతో వ్యాపారాలు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. వ్యాపార ప్రకటనలు కూడా జనాల్ని బాగా మోసం చేస్తున్నాయి. ఉదాహరణకు టానిక్ తాగితే బలం వస్తుందనీ, బ్రోనోలిన్ వాడితే జ్ఞాపకం బాగా పెరుగుతుందనీ, తిన్న తర్వాత కేడ్‌బరీ చాక్లెట్లు వాడే సంస్కృతిని పెంచడం, అలానే బోలెడన్ని అనవసరపు వస్తువుల్ని ప్రచారం చేస్తూ ప్రజల్లో కొనాలనే కోర్కెను బలంగా నాటుతున్నారు. అంతేకాదు గ్లూకోజ్, హార్లిక్స్, బోర్నవిటా, బూస్ట్ పేర్లు పెట్టి మన రైతులు పండించిన పంచదార, గోదుమ పిండితో తయారు చేసి, అందమైన పాకెట్లు, సీసాల్లో ఉంచి తిరిగి మనకే అనేక అధిక రెట్లు అధిక ధరలకు అమ్ముతున్నారు. కూల్ డ్రింక్స్, హెల్త్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింకులు, కృత్రిమంగా తయారు చేసిన జ్యూసుల పేర్లతో మనల్ని మోసగించి, తాగించి కార్పొరేట్ వ్యాపార దోపిడీ కొనసాగిపోతూనే ఉంది. వాటి స్థానంలో మనం పాలు, మజ్జిగ, అంబలి, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, చెరుకురసం, నిమ్మరసం తాగితే మన ఆరోగ్యానికి ఎంతో మేలు, రైతుకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాదు మనకు అనారోగ్యకరమైన ఆహార అలవాట్లను కూడా పెంచుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, స్పైసీ ఫుడ్‌లు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, రెస్టారెంట్‌లో ఆహారం బాగా పెరిగాయి. కొవ్వులు, ఐస్‌క్రీములు, కేకులు, స్వీట్స్, బర్గర్‌లు, పిజ్జాలు, నూడుల్స్‌లు, నూనెలో ఎక్కువసేపు వేయించిన పదార్థాలు, చక్కెర ఎక్కువగా ఉండి ఆరోగ్యానికి హానిచేసే బిస్కెట్లు, చాక్లెట్లు, క్యాండీలు, కంకీలు, వగైరా వగైరా. వీటి స్థానంలో మన సంప్రదాయ బద్ధమైన టిఫిన్స్ ఎక్కువ మేలు చేస్తాయి.

కాలం, ఆరోగ్యాన్ని హరించే సెల్‌ఫోన్‌లు పెరుగుతున్న మొబైల్ ఇంటర్నెట్ మోజు అన్ని వర్గాలవారు అవసరాన్ని మించి వాడుతున్నారు. విద్యార్థులు ఎక్కువ సెల్‌ఫోన్లతో మాట్లాడడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలే కాకుండా ఎంతో విలువైన కాలం వృదా చేస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఇయర్ ఫోన్ల సంస్కృతి విశృంఖలంగా విజృంభించి, యావత్ ప్రపంచాన్ని కలవరపరుస్తుంది. ముఖ్యంగా యువత నవ నాగరికత పేరుతో సామాజిక బాధ్యత కూడా మరిచిపోతోంది. ఒళ్లు మరచి హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారే తప్ప, చాలా సందర్భాలలో అమూల్యమైన ప్రాణాలకు ఎదురవుతున్న ముప్పును కూడా గమనించడం లేదు. రైల్వే స్టేషన్లలోనూ, బస్ స్టేషన్లలోనూ, రోడ్లమీద, హోటళ్లలోనూ, ఆసుపత్రులలోనూ, బహిరంగ ప్రదేశాలలోనూ ఆఖరికి మోటర్ సైకిళ్లపై వెళ్లేటపుడు కూడా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ ఈ ఇయర్ ఫోన్లను ఉపయోగిస్తున్నారు. ఈ విష సంస్కృతిని సమాజం నుంచి సమూలంగా బహిష్కరించకపోతే కొన్ని కుటుంబాలు కూలిపోవడం ఖాయం.

ఫోన్ బిల్లులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, వాణిజ్య వాహనాలు, దిగుమతి చేసుకునే లగ్జరీ వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, ఎసిలు, వాషింగ్ మిషన్లు, సబ్బులు, కాస్మెటిక్స్, మొబైల్‌పోన్‌లు, ఎల్‌సిడిలు, ఎల్ఇడిలు, టివిలు, స్మార్ట్ ఫోన్‌లు, ట్యాబ్లెట్ పిసిలు, ల్యాప్‌టాప్‌లు, శీతల పానీయాలు, వివిధ రకాల వస్తువులను ఎడాపెడా కొని వాడడాన్ని వినియోగ సంస్కృతి అంటారు. ఈ అతి వినియోగ సంస్కృతి ఎంతగా పెరిగితే పర్యావరణం కూడా అంతగా పాడవుతుంది. అంతేకాదు వస్తువుల ఉత్పత్తి, రవాణాల కారణంగా కాలుష్యం వ్యర్థాలు కూడా అదే స్థాయిలో పెరుగుతాయి.

ప్లాస్టిక్ వస్తువుల వాడకం రోజురోజుకి పెరిగిపోతుంది. గృహ సంబంధమైన కాఫీ కప్పులు, చెంచాలు మొదలుకొని కుర్చీలు, సోఫాలు, వాటర్ ట్యాంకుల వరకు అన్నీ ప్లాస్టిక్ పరికరాలే వాడుకలో ఉన్నాయి. అంతేకాదు ప్లాస్టిక్‌ను క్యారీబ్యాగ్‌లకు, ప్యాకింగ్ మెటీరియల్‌గా ఉపయోగి స్తున్నారు. పర్యావరణానికి పెను ప్రమాదకారిగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని పెంచి జనపనారతో తయారైన జూట్ బ్యాగుల అవసరాన్ని తగ్గిస్తున్నారు. ఈ విధంగా మార్కెట్ మనల్నే కాదు మన ప్రభుత్వాల్నీ కూడా పూర్తిగా అదుపుచేస్తున్నాయి. ఒకప్పటి 'ప్రజలచేత, ప్రజల కొరకు ప్రజల వల్ల సాగే ప్రభుత్వం' అనే ప్రజాస్వామ్య నిర్వచనం 'కార్పొరేట్ల చేత, కార్పొరేట్ల కొరకు, కార్పొరేట్ల వల్ల' నడిచే ప్రజాస్వామ్యంగా మారింది.

ప్రకృతి అనేది ప్రజానీకానికి జీవనాధారం. సహజ వనరులు గానీ, గాలి గానీ, నీళ్లు గానీ, నేల గానీ, చెట్లు గానీ ఇవి కేవలం ప్రకృతి కాదు, ప్రజానీకానికి జీవనాధారం. ప్రపంచీకరణ మూలంగా మానవుడి జీవన గమన వేగం ఎంత పెరిగిందో అంతకు రెండింతలు అతని చుట్టూ ఉన్న ప్రకృతి పర్యావరణాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రజానీకానికి కనీస జీవనం కల్పిస్తున్న ప్రకృతి వనరులను మొత్తం తీసుకొని పెట్టుబడిదారీ కంపెనీల లాభాల వేటకు అప్పగించేసే పరిస్థితిని వ్యతిరేకించాలి. మన ప్రాథమిక అవసరాలను మనమే గుర్తిస్తూ మార్కెటింగ్‌పైన ప్రభుత్వానికి అజమాయిషీ ఉండాలనే డిమాండ్ ముందుకు తీసుకురావాలి. ప్రజల కనీస జీవన ప్రమాణాలను, సమాన అభివృద్ధి హక్కును కాపాడుకుందామనే ప్రయత్నంలో అన్ని ఉద్యమాలు కలిసిరావాలి.

*(రచయిత ఉపాధ్యాయులు)* వీ

# గ్రామజ్యోతి కర్తవ్యాలు

***కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన గ్రామజ్యోతి పథకం వివరాలను, వాటి తీరుతెన్నులను వివరిస్తూ, అవి నిజమైన హక్కుదారులకు పావు వంతైనా చేరితే గ్రామాలు కొంతైనా అభివృద్ధి చెందుతాయని అంటున్నారు దుర్గం రవీందర్***

పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకే గ్రామజ్యోతి కార్యక్రమాన్ని రూపొందించారు. ఆగస్టు 15న గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తున్నారు, ఆగస్టు 17న గంగదేవిపల్లిలో గ్రామజ్యోతి కార్యాచరణను మొదలు పెడతారు. మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, అధికారులు ఎక్కడికక్కడ గ్రామజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆగస్టు 17 నుంచి 24 దాకా గ్రామజ్యోతి వారోత్సవం నిర్వహిస్తున్నారు. 'గ్రామజ్యోతి అంటే గ్రామాలకు నిధులను కేటాయించడమే కాదని ప్రతి పౌరుడ్ని చైతన్యపరిచి గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రజలే సారథులు కావాలని' ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఇచ్చే నిధులకు ప్రజల సంఘటిత శక్తి తోడైతేనే మార్పు, ప్రగతి సాధ్యమౌతుంది. మార్పు సాధకులు ప్రజలే. ప్రభుత్వ కార్యక్రమం గా ఈ పథకముంటే ఫలితం రాదు. ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును ఇస్తూ సదుపాయాలు కల్పించేందుకే ఉండాలి. గ్రామాభివృద్ధికి ఏం చేయాలి, ఎలాంటి ప్రణాళికలు రూపొందించు కోవాలనేది అధికారులు ప్రజలకు చెప్పాలని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రతి గ్రామానికీ వచ్చే ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం కావాలి. సంఘటిత శక్తిలోని గొప్పతనాన్ని గ్రామీణ ప్రజలు గుర్తించాలి. క్షేత్ర స్థాయి అవసరాలకు అనుగుణంగా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు సాగాలి. ఏ గ్రామానికి ఆ గ్రామం అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడాన్ని నేర్పాలి. స్థానిక సంస్థ ద్వారా వివిధ పథకాలతో వేల కోట్లు ఖర్చవుతున్నా ఆస్తుల సృష్టి జరగడం లేదు. గ్రామ సభలు నిర్వహించి కార్యక్రమాలను రూపొందించాలి. నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుంది. ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల నియామకాలతోపాటు ఇతర సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి అన్నారు.

మొదటి దశలో ప్రజలు గ్రామాన్ని శుభ్రంగా ఉంచడానికి కృషిచేయాలి. గంగదేవిపల్లి గ్రామంలో వలె కమిటీలు వేసుకుని ప్రజల భాగస్వామ్యం పెంచాలి. గ్రామ పంచాయతీ నిధులు బాధ్యతలపై విధి విధానాలను రూపొందించి కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యమైన అధికారులంతా ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని మార్పుకు మార్గదర్శకం కావాలి. మండలానికో జిల్లాస్థాయి అధికారి బాధ్యులుగా ఉండాలి. వీరి ఆధ్వర్యం లోనే గ్రామ సభ జరగాలి. నిర్లక్ష్యానికి గురైన దళితవాడలు, గిరిజన తాండాలపై సంచార కులాల వారు, వృత్తిని కోల్పోయిన కులాల వారిపై ప్రత్యేక దృష్టి నిలపాలి. గామజ్యోతి కార్యక్రమంపై ఏర్పాటైన క్యాబినెట్ సమావేశమైంది. ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేసేందుకు గ్రామజ్యోతిని ప్రారంభించనున్నట్లు కమిటీ ప్రకటించింది. గ్రామాల రూపురేఖలు మార్చే ఈ కార్యక్రమాన్ని పారిశుద్ధ్య పనులతో ప్రారంభించారు. పారిశుద్ధ్యంతోపాటు తాగునీరు, విద్య, సామాజిక భద్రత, వ్యవసాయం, ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, గ్రామీణ మౌలిక వసతుల కల్పనవంటి అంశాలతో గ్రామజ్యోతి మొదలైంది.

రాష్ట్రంలోని పది జిల్లాల్లో 8,687 పంచాయతీలున్నాయి. 9834 జనావాస గ్రామాలున్నాయి. దాదాపు పదివేలు అనుకోవచ్చు. 600 జనం లేని (బేచిరాగ్) గ్రామాలున్నాయి. 459 మండలాలున్నాయి. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతున్నది. తెలంగాణ పునర్నిర్మాణానికి గ్రామజ్యోతి కార్యక్రమం నాంది కానుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**గ్రామజ్యోతి ప్రణాళిక**

గ్రామజ్యోతి కార్యక్రమంలో రెండు గ్రామసభలు నిర్వహిస్తారు. 17న గ్రామసభ, ముఖ్యమంత్రి సందేశం చదవడం. గ్రామంలో తిరిగి సమస్యను గుర్తించడం, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై సమీక్ష, ముళ్ల కంప తొలగింపు, 18న వీధులను శుభ్రపరచడం, చెత్త తొలగింపు. డంపింగ్ యార్డు గుర్తింపు, 19న ప్రభుత్వ కార్యాలయాలు పిఎచ్‌సిలు, అంగన్‌వాడీ కేంద్రాల శుభ్రం, 20న మురుగుకాలువల్లో పూడిక, నిల్వనీటి తొలగింపు, నీటి నిల్వ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు, సోక్‌పిట్ నిర్మాణం, 21న రక్షిత మంచినీటి వనరులను శుభ్రపరచడం, క్లోరినేషన్, చేతిపంపు, పబ్లిక్ నల్లా ప్లాట్‌ఫాం నిర్మాణం, ప్రభుత్వ కార్యాయాలకు నీటిసరఫరా, 22న వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన. వాటి నిర్మాణానికి స్థలాల గుర్తింపు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలకు స్థలాలున్న చోట మరుగుదొడ్ల నిర్మాణం, 23న గ్రామసభ నిర్వహించి గ్రామజ్యోతి ప్రణాళిక ఖరారు, గ్రామసభల్లో రూపొందే అభివృద్ధి ప్రణాళికలతోనే నాలుగేళ్ల పల్లె అభివృద్ధి గమనం సాగాలన్న లక్ష్యంతో నిబంధలను రూపొందించారు. ఏడాదికి ఆరు గ్రామసభల నిర్వహణ, శాఖ సమన్వయం, క్షేత్రస్థాయి సేవలందించే శాఖలన్నీ పంచాయతీకే జవాబుదారీగా ఉండడం వంటి అంశాలకు కీలక ప్రాధాన్యమిస్తారు.

**రెండు నెలలకో గ్రామసభ :** రెండు నెలలకోసారి గ్రామసభ జరుగుతుంది. దీనిలో అభివృద్ధిపై చర్చించడంతోపాటు జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షిస్తారు. పారదర్శకత, జవాబుదారీ పెరగడానికి

ఈ పద్ధతిని రూపొందిస్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రజ భాగస్వామ్యాన్ని పెంపొందించారు.

**మౌలిక సదుపాయాల కల్పన:** ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో పల్లెల్లో జీవన స్థితిగతులను మెరుగుపరుస్తారు. గ్రామాల్లో సేవలందించే శాఖలు పంచాయతీలకు సంబంధం లేకుండా వ్యవహరిస్తుండడంతో పర్యవేక్షణ లోపిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీలకు కీలక శాఖలను జవాబుదారీ చేస్తారు.

**పారిశుద్ధ్యానికే తొలిప్రాధాన్యం:** ఆగస్టు 17 నుంచి వారం రోజుల పాటు 'గ్రామజ్యోతి'లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమిస్తారు. శ్రమదానం, పంచాయతీ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో దళితవాడలు, గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యం కల్పిస్తారు.

**సమర్థ పాలనా వ్యవస్థ:** పరిపాలనా విధానాలపై అవగాహన కల్పించి సర్పంచు, వార్డు సభ్యులకు పాలనపై సాధికారత కల్పిస్తారు. పంచాయతీలను కంప్యూటరీకరించడం ద్వారా పారదర్శకతతోపాటు ఇతర సేవలందించేలా చేస్తారు. వంద శాతం జనన మరణాల నమోదు చేస్తారు.

**వసతుల కల్పన :** గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా, వ్యక్తిగత మరుగుదొడ్లు, మురుగునీటి కాలువ నిర్మాణం వంద శాతం చేస్తారు. పూర్తిస్థాయిలో వీధిదీపాల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, నిర్వహణ, ఆటస్థలాలు పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తారు.

**వైద్య, ఆరోగ్యం :** అంగన్‌వాడీ ద్వారా నూరు శాతం గర్భిణుల నమోదు, వారికి పౌష్టికాహారం, పంపిణీ, ఆస్పత్రుల్లోనే కాన్పు జరిగేలా చూస్తారు. మాతాశిశు సంరక్షణ, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, కుటుంబ నియంత్రణ వంటి వాటికి ప్రాధాన్యం కల్పిస్తారు.

**విద్య :** గ్రామాల్లో 6-14 ఏళ్లలోపు అర్హులైన పిల్లలందర్నీ పాఠశాలల్లో గుర్తించి పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్పిస్తారు. వారు మధ్యలో బడి మానేయకుండా పర్యవేక్షణ, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలుచేయడంపై దృష్టి సారిస్తారు. 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులకు వయోజన విద్య అందిస్తారు.

**సంక్షేమం, పథకాల అమలు :** సామాజిక ఫించన్ల పంపిణీ సలహా సంక్షేమ పథకాలన్నీ అర్హులకు దక్కేలా పర్యవేక్షిస్తారు. పంచాయతీ ద్వారా ఉపాధి హామీ పథకం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తారు. మెరుగైన ప్రజా పంపిణీ వ్యవస్థతోపాటు రైతుకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ ద్వారా సేవలందేలా పర్యవేక్షణ పంచాయతీ ఆస్తుల, భూముల సంరక్షణ, వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయ, పశు సంవర్ధక, మహిళా-శిశు సంక్షేమ శాఖ, విద్య, వైద్య, ఆరోగ్య శాఖల్లోని కింది స్థాయి విభాగాలు పంచాయతీలకు జవాబుదారీ కానున్నాయి, పంచాయతీ పర్యవేక్షణలో, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రం, చౌకధర దుకాణం, స్వయం సహాయక సంఘాలు, వాటర్‌షెడ్ కమిటీలు పనిచేస్తాయి. వన సంరక్షణ సమితిలు కూడా జవాబుదారీగా ఉంటాయి. ముఖ్యమంత్రి ఉటంకించినట్లు అంకాపూర్, ముల్కనూర్, గంగదేవి పల్లె లాంటి గ్రామాలను అధ్యయనం చేసి పరిశోధకులు పలు వ్యాసాలు రాశారు. పత్రికల్లో ఈ గ్రామాల అభివృద్ధిపై పలు కథనాలు ప్రచురిత మయ్యాయి. దేశ విదేశీ పరిశోధకులు పలువురు తెలంగాణ గ్రామాలపై లోతైన అధ్యయనాలు చేశారు. వారి అధ్యయనాలను పరిశీలించాల్సి ఉంది.

తెలంగాణలో కొన్ని గ్రామాలు కనీసం వెయ్యి ఏళ్ల వయసున్నవి ఉన్నవి. దుద్దెడ, బెజ్జంకి, పొలవాస, అంకాపూర్, పాకాల, నకిరేకల్లు, ఇందూర్, బోధన్, బైంసా, ముథోల్ లాంటి గ్రామాల వయస్సు సహస్రాబ్దం కన్నా ఎక్కువే. ఈ గ్రామాల్లో అద్భుతమైన సంస్కృతి ఉంటుంది. గ్రామనిర్మాణం, పాలనా పద్ధతులు బాగుంటాయి. గ్రామంలో బొడ్రాయితోపాటు రెండు లేదా మూడు చెరువులతోపాటు గుడి, బడి, గడి, దుకాణం, కరణం ఇల్లు, మాలపల్లె, మాదిగవాడ, ముత్రాసీలు, గౌండ్లోలు, వడ్ల, కుమ్మరి, కంచరి, కంసాలులు, కమ్మరి, చాకలి, కోమటి, కాపు కులాల వారి ఇండ్ల కూర్పు శాస్త్రీయంగా ఉంటుంది.

తెంగాణాలో వెయ్యేళ్లపైగా చరిత్రగల ఒక్కో గ్రామం సజీవ ప్రదర్శనశాలగా ఉంటుంది. కొన్ని గ్రామాలు సినిమా సెట్టింగుల్లా ఉంటాయి. ఇలాంటి గ్రామాలు ప్రపంచంలోనే అరుదుగా ఉంటాయి. గ్రామాల్లో కులాల మధ్య వ్యవహారాలు, బంధుత్వాలు, పంచాయతీలు, పండుగలు, అన్ని ఒక పద్ధతిగా ఉంటాయి. కాకతీయుల తర్వాత గ్రామాల ఎదుగుదల ఆగిపోయింది. 1956 తర్వాత గ్రామాలు మరింత గిడసబారాయి. సీమాంధ్రుల స్వార్థంతో తెలంగాణ గ్రామాలలో సమస్యలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోయాయి. ఈ సమస్యలను తీర్చడానికి తెంగాణ ప్రభుత్వం గతంలో మన ఊరు - మన ప్రణాళిక ప్రారంభించింది. సరైన ప్రణాళిక ఉంటే అభివృద్ధి సరిగా ఉంటుందని ప్రభుత్వ ఉద్దేశ్యం. సమస్యల సాధనకు తగిన ప్రణాళిక రూపొందించి సరిపడ ఖర్చు చేస్తే ఫలితం బాగుంటుందని ముఖ్యమంత్రి అప్పుడు మన ఊరు - మన ప్రణాళికను ప్రారంభిస్తూ అన్నారు. గ్రామజ్యోతి దానికి కొనసాగింపే.

తెలంగాణలో గ్రామాలు, చిన్న పట్టణాల పరిస్థితి దయనీయంగా ఉంది. సెవన్ సీటర్, షేర్ ఆటోల పుణ్యాన గ్రామీణ ప్రాంతాల్లో నగరశివారుల్లో రవాణా సమస్య కొంత తీరింది. కానీ ఇతర సమస్యలు అలాగే ఉన్నాయి. విద్యా, వైద్య సౌకర్యాలు దయనీయంగా ఉన్నాయి. గొలుసుకట్టు చెరువులు తెగిపోయాయి. ఉన్న చెరువుల్లో పూడిక నిండింది. బావులు, వాగులు, కుంటలు ఎండిపోయాయి. గొట్టపు బావులు లక్షల్లో వచ్చాయి. వాటికి అవసరమైన విద్యుత్ ఇబ్బందుల్లో పడింది. మొత్తం మీద గ్రామీణ తెలంగాణం కష్టాల్లో కూరుకుపోయింది. పల్లెలు పాలిపోయాయి. మిషన్ కాకతీయ వల్ల చెరువుల పునరుద్ధరణ మొదలైంది.

సమగ్ర గ్రామాభివృద్ధి కోసం గ్రామాలవారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి మండల స్థాయి నుంచి జిల్లాకు పంపి వాటి విశ్లేషణ ద్వారా జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తారు. అన్ని జిల్లాలకు సమప్రాధాన్యం ఉండేలా రాష్ట్ర స్థాయి ప్రణాళికలను రూపొందిస్తారు.

గ్రామాలు మొదలుకొని పట్టణ స్థాయి వరకు ప్రజల అవసరాల మేరకు ప్రణాళికలు రూపొందుతాయి. ప్రతీ గ్రామంలో గ్రామ సభలు, ప్రణాళిక ఏర్పడుతుంది. అధికార యంత్రాంగం, రాజకీయ వాదులు తదితరులు ప్రణాళిక రూపకల్పనలో పాలుపంచుకుంటారు. ప్రణాళిక సరిగ్గా రూపొందితే అభివృద్ధి దానంతట అదే సాకారమౌతుంది.

1961లో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రెండేసి గ్రామాలను ఎంపిక చేసుకుని విలేజీ మోనోగ్రాఫ్‌ను తయారుచేసింది. రెండు ఎస్సీ కులాలపై ఇదే రీతిన అధ్యయనం జరిపింది. కొన్ని వృత్తి కులాలు, కళాకారులపై మోనోగ్రాఫ్‌ను తయారుచేసింది.

పాలెం సుబ్బన్న, ముల్కనూరు విశ్వనాథ్‌రెడ్డి, అంకాపూర్ హేమచందర్ తదితరులు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అద్భుత

ఫలితాలు సాధించారు. 1970 - 71లో హేమచందర్ అనే వ్యవసాయ శాఖాధికారి చేసిన కృషివల్ల నిజామాబాద్ జిల్లాలో ఐదు వేల జనాభా ఉన్న అంకాపూర్ గ్రామం ఏటా వంద కోట్ల విత్తన వ్యాపారాన్ని, మరో 50 కోట్ల కూరగాయల వ్యాపారాన్ని చేస్తున్నది. తద్వారా అంకాపూర్ దేశంలోనే ఒక సంపన్న గ్రామంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా పాలెం గ్రామంలో సుబ్బన్న అనే వ్యక్తి ఒక్కడు పూనుకుని ఆ ఊరిని అభివృద్ధి బాట పట్టించాడు. ఆచరణలో గ్రామ ప్రణాళికలు అమలు జరిపి విజయం సాధించిన వేనేపల్లి పాండురంగారావు (ఆలగడప - నల్గొండ జిల్లా) లాంటి ఎందరో సర్పంచులు మనకున్నారు. అలాగే చిత్తశుద్ధితో పనిచేసిన అధికారులు, నాయకులు కొందరున్నారు.

నిజామాబాద్ జిల్లాల్లో కులాల ప్రాతినిధ్యంతో ఏర్పడిన గ్రామాభివృద్ధి కమిటీలు చక్కటి ఫలితాలు కనపరిచాయి. పాండురంగ అథ్వాలే లాంటి వారు రూపొందించిన స్వాధ్యాయ సంఘాలు గ్రామాల్లో ఆరోగ్యవంతమైన అభివృద్ధి వాతావరణాన్ని ఏర్పాటు చేశాయి. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పరిశోధనలు చేసిన వీరు భగవద్గీత ఆధారంగా గ్రామం ఒక కమిటీ అంటూ ప్రార్థనా మందిరాలను ఏర్పర్చి అనవసర ఖర్చును తగ్గించి కులరహిత గ్రామాన్ని రూపొందించే ప్రయత్నం చేశారు. కొన్ని కుల సంఘాలు పెళ్లి, అంత్యక్రియ ఖర్చుల పనులను తమ మీద వేసుకుని చక్కటి పనితనాన్ని ప్రదర్శించాయి, ప్రదర్శిస్తున్నాయి, గ్రామాభివృద్ధి కమిటీలు ఐక్యంగా ఉండి సమస్యలను చక్కగా పరిష్కరించుకుంటున్నారు. పూణే శివార్లలో మగ్గర్‌పట్టా అనే గ్రామం కార్పొరేటీకరణ చెంది గ్రామాన్ని కార్పొరేట్ సంస్థగా రూపొందించి గ్రామస్తులను సంపన్నులను చేసింది.

భారతదేశాన్ని వ్యవసాయ దేశం అంటారు కానీ నిజానికి ఇది వృత్తి కులాల దేశం కూడా. పూర్వం ప్రతి ఇంట్లో రాట్నం తిరిగేది. చాలా గ్రామాలు ఒకే వృత్తివారితో నిండి ఉండేవి. కమ్మరిపల్లిలో కమ్మరివారే ఉండేవారు. గాజులరామారంలో అందరూ గాజుల తయారు చేసేవారు. బొమ్మలరామారంలో అందరూ బొమ్మలు తయారుచేసేవారు. పెంబర్తి, నిర్మల్, చండూరులో కంచరులు ఎక్కువగా ఉండేవారు. గ్రామాలకు గ్రామాలు చేనేత కుటుంబాలతో నిండి ఉండేవి. వారు దేశానికే కాదు, యావత్ ప్రపంచానికి వస్త్రాలను సరఫరా చేసేవారు. చేనేత, కంసాలి, వడ్రంగి, కంసాలి, తదితరుల 'నకరములు' సమర్థవంతంగా పనిచేసేవి. గ్రామ నిర్మాణం, వృత్తి కులాల వారి ఇండ్ల ఆర్కిటెక్చర్ శాస్త్రీయంగా ఉండేది. ఈ అంశాలను షామీర్‌పేట గ్రామంలో అధ్యయనం చేసిన ఎస్‌సి. దూబె, తన 'భారతీయ గ్రామం' పుస్తకంలో చక్కగా వివరించారు. 'బిట్వీన్ ద మడ్‌వాల్స్' పుస్తక రచయిత విలియమ్ వైజర్, 'వాయిస్‌లెస్ ఇండియా' పుస్తక రచయిత జి. ఎమర్సన్ తదితరులెందరో ఈ అంశాను వివరించి చెప్పారు.

గ్రామాలు, కులాలు కుటుంబాల సముదాయం. ప్రతి కులానికి ఒక ప్రత్యేక సంస్కృతి, వృత్తి ఉంటుంది. ఒక వనరు ఉంటుంది. కట్టు బొట్లు, ఆహారపు అలవాట్లు, హక్కులు, బాధ్యతలు వేరువేరుగా ఉంటాయి. గ్రామస్థాయి ప్రణాళిక రచనలో ఈ అంశాలను పట్టించుకోవడం అవసరం. గ్రామం యూనిట్‌గా అభివృద్ధిని ఎవరూ పెద్దగా పట్టించు కోలేదు. నిజానికి ఇది పట్టించుకోవాల్సిన అతి ముఖ్యమైన అంశం.

గ్రామంలో ఎన్ని ఇండ్లు ఉన్నాయి. ఎంత జనాభా ఉంది. గ్రామ ఆర్థిక పరిస్థితి ఏమిటి? గ్రామంలో ఉన్న సహజ, మానవ వనరులేమిటి? రవాణా సదుపాయాలు ఎలా ఉన్నాయి. గ్రామంలో ఏ ఏ కులస్తులు ఎందరున్నారు. ఎవరెవరి దగ్గర ఎంత భూమి ఉంది. ఏడాదికి ఎందరు శిశువులు జన్మిస్తున్నారు. మాతా శిశు ప్రసూతి మరణాలు ఏమైనా ఉన్నాయా? ఊర్లో ఆరోగ్య సమస్యలేమిటి? గ్రామంలో గత ఐదేళ్లలో అర్థాంతర మరణాలున్నాయా? ఏటా గ్రామంలో నుండి ఎన్ని డబ్బులు బయటకు పోతున్నాయి. ఎన్ని రకాల వినియోగ వస్తువులు ఊర్లోకి వస్తున్నాయి. ఊర్లో ఎన్ని కట్టె పొయ్యిలున్నాయి, కిరోసిన్ దీపాలున్న ఇండ్లెన్ని? ఇత్యాది అనేక అంశాలపై సమాచారాన్ని సేకరించి తదను గుణంగా గ్రామ ప్రణాళికలు రూపొందించవలసి ఉంది. ఎందరు ఊరిని విడిచి వెళ్లారు. ఎందుకు వెళుతున్నారు. ఎక్కడికి వెళుతున్నారు. ఏఏ కులాల వారు ఎందరున్నారు. గ్రామంలో ఎంత భూమి సాగవుతుంది. నీటి వనరు ఎలా ఉంది. ఎన్ని పంటలు పండుతున్నాయి. ఊర్లో ఎన్ని చింత, మామిడి, ఈత, తాటి చెట్లున్నాయి. ఎన్ని చెట్లు లారీలెక్కి పట్నం బాటపట్టాయి. ఎన్ని పశువులు ఉన్నాయి. ఎన్ని కబేళాలకు తరలించ బడ్డాయి. ఊరి నుండి ఎంత ధాన్యం, ఇతర ఉత్పత్తులు బయటికి పోతున్నాయి. బయటి నుండి ఎన్ని వస్తువులు ఊర్లోకి వస్తున్నాయి. షాంపూ, బీరు, బ్రాందీ, కూల్‌డ్రింక్, సోడా, టీ పౌడర్, ప్లాస్టిక్ గ్లాసు-విస్తరాకు లాంటివి ఊర్లోకి ఎన్ని వస్తున్నాయి. గుట్కా, సిగరెట్లు, ఎన్ని అమ్ముడుపోతున్నాయి. గ్రామస్తుల ఆహార, సంస్కృతి అలవాట్లు ఎలా ఉన్నాయి. గ్రామంలో ఉన్న సహజ మానవ వనరుల పరిస్థితి ఏమిటి, రవాణా సదుపాయాలు ఎలా ఉన్నాయి. గ్రామంలో వీధుల, ఇండ్ల అమరిక ఎలా ఉంది. ఊరిలో అభివృద్ధికి ఆస్కారమున్న అంశాలే మున్నాయి. ఇత్యాది విషయాలపై సమాచారం సేకరించి తదనుగుణంగా గ్రామజ్యోతి ప్రణాళికలు తయారుచేస్తే, దీనికి చిత్తశుద్ధిగల అధికార రాజకీయ గణం తోడైతే ప్రతి ఊరు నందనవనమౌతుంది.

గతంలో గ్రామాభివృద్ధికి నిర్దేశించిన నిధులను కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేది. కేంద్ర నిధులు రాష్ట్ర ఖజానాలోకి ముందుగా వెళ్లి, రెండో అంచెలో గ్రామాలకు వెళ్లేవి. కొన్ని నిధులు దారి మళ్లేవి. మరికొన్ని మురిగిపోయేవి. ఈ పరిస్థితి గమనించే కేంద్రం నిధులను పంచాయతీలకు నేరుగా ఇవ్వడానికి నిర్ణయించింది. ఇది రాష్ట్రాలకు నచ్చని అంశం కాని, అభ్యంతరాలు చెప్పడానికి సహేతుక కారణం ఏమీలేక, ప్రత్యామ్నాయ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఈ నిధుల వినియోగానికి గ్రామాలను సిద్ధం చేయడంతోపాటు, ఆ ఖ్యాతిని రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకునే వ్యూహం కూడా ఇందులో ఇమిడి ఉంటుంది.

రాష్ట్రానివో, కేంద్రానివో నిధులు ఎవరివైతేనేమి గ్రామాలకు లబ్ధి కలిగితే అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. 1947 నుండి గ్రామాభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యాయి, కానీ అందులో 15 శాతం కూడా సద్వినియోగం కాలేదని ప్రధానమంత్రి హోదాలో రాజీవ్‌గాంధీ స్వయంగా ప్రకటించారు. దేశంలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాల మీద గడిచిన 68 ఏళ్లలో రెండు కోట్ల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ వర్గాలే లెక్కించి చెప్పాయి. ఈ రెండు కోట్ల కోట్లల్లో అత్యధికంగా అధికారులు, రాజకీయవాదులు, బహుళజాతి కంపెనీలు, కాంట్రాక్టర్లు, బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, పైరవీకారులు, దళారుల జేబుల్లోకి వెళ్లాయి. గ్రామాల్లోని పేదలకు శతాంశం కూడా వెళ్లలేదు. అందుకే గ్రామాల్లో నూటికి ఎనభై శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ప్రభుత్వం చెబుతున్నంత కాకపోయినా గ్రామజ్యోతి నాలుగో వంతు సఫలమైనా సంతోషమే.

*(రచయిత సీనియర్ జర్నలిస్టు)* వీ

# వాళ్లెందుకు భయపడుతున్నారు?

***అమెరికన్ సామ్రాజ్యవాదులు, భారత పాలక వర్గాలు మావోయిస్టు ఉద్యమాన్ని చూసి ఎలా ఆందోళన పడుతున్నారో ఇంటర్‌నెట్‌లో దొరికిన ఆధారాలతో వివరిస్తున్నారు*** **లోక సంచారి**

ఒక అంశంపై పరిశోధనా పత్రం రాయడానికి కావలసిన సమాచారం కోసం అమెరికా రక్షణ శాఖకు చెందిన ఇంటర్నెట్ డేటాబేస్‌ను వెతుకుతున్న క్రమంలో, అమెరికన్ మిలటరీ భారత మావోయిస్టులపై చేసిన పరిశోధన, దాని సంబంధిత పత్రాలు దొరికాయి. వాటిలో కొన్ని రహస్య పత్రాలని వారే రాసుకున్నారు. కొన్ని ప్రత్యేక సెర్చ్ టెక్నిక్‌లను వాడి వెతికినందుకు బహుశా అవి నాకు కనబడి ఉంటాయి. వాషింగ్టన్ డి.సి లోని లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ సభ్యున్ని కూడా కావడం కొంత ఉపయోగపడింది. ప్రపంచంలో అత్యంత శక్తివంత మైనదిగా చెప్పబడే అమెరికన్ మిలటరీ, తమ దేశానికి చెందని, కనీసం అధికారంలో కూడా లేని భారత మావోయిస్ట్ పార్టీపై ఎందుకు పరిశోధన చేసిందనే కుతూహలం నాలో కలిగి, దానిపై మరింత పరిశోధన చేయాలనే ఆసక్తి మొదలయింది. వేరే అంశంపై చేస్తున్న పరిశోధనను ముందు పూర్తి చేసి, ఈ అంశంపై పరిశోధన మొదలు పెట్టాను.

అమెరికన్ రక్షణశాఖకు చెందిన వివిధ విభాగాలు అమెరికా ప్రభుత్వానికి మిలటరీ అంశాలపై సలహాలు ఇచ్చే అతిపెద్ద రక్షణా పరిశోధనా సంస్థలు (వీటిని థింక్ ట్యాంక్‌లని లేదా లాబీ గ్రూప్‌లని అంటారు) కూడా ప్రత్యేకంగా మావోయిస్ట్ పార్టీపై రిపోర్ట్‌లను తయారు చేశారు.

మిలటరీ వ్యూహం ప్రకారం, రక్షణా పరమైన ప్రాముఖ్యత (స్ట్రాటెజిక్ ఇంపార్టెన్స్) లేని అంశాన్ని మిలటరీ వారు అసలే పట్టించుకోరు లేదా సీరియస్‌గా తీసుకోరు. రక్షణా పరమైన ప్రాముఖ్యత ఇచ్చారంటే ఆ అంశంపై వారు పరిశోధనా రిపోర్ట్‌లను తయారు చేస్తారు. అయితే, మావోయిస్ట్‌లపై చేసిన రిపోర్ట్‌లు ఏవి కూడా 2004 సంవత్సరానికి ముందు చేసినవి కాదు. అంటే 2004కు ముందు మావోయిస్ట్ ఉద్యమాన్ని రక్షణా పరమైన ప్రాముఖ్యతగా గుర్తించలేదనేది స్పష్టం అవుతున్నది. 2004లో పీపుల్స్‌వార్ పార్టీ, మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్‌లు విలీనమై భారతదేశంలో అతిపెద్ద సాయుధ పోరాట సంస్థగా మావోయిస్ట్ పార్టీ పేరుతో అవతరించడం, భారత పాలక వర్గాన్ని మాత్రమే కాదు చివరికి అమెరికా పాలక వర్గాన్ని కూడా భయందోళన లకు గురి చేసిందనేది ఈ రిపోర్ట్‌ల ద్వారా అర్థమవుతున్నది. భారతదేశ రక్షణా వ్యూహాన్ని (డిఫెన్స్ డాక్ట్రిన్) 2004 విలీనం పూర్తిగా మార్చి వేసింది.

భారత ప్రభుత్వ లెక్కల ప్రకారం 2004 విలీనం తర్వాత సాయుధ మావోయిస్ట్‌ల సంఖ్య ఇరవై వేల లోపునే. భారత రక్షణా వ్యూహంలో అప్పటివరకున్న 'దేశానికి ప్రమాదం శత్రు దేశాల నుండి ఉంది' అనే పాలసీ స్థానంలో 'దేశానికి ప్రమాదం దేశంలోనే ఉంది' అనే ప్యారడైమ్ షిఫ్ట్ (దృక్పథంలో సమూల మార్పు) జరగడానికి కారణం కేవలం ఇరవై వేల సాయుధులా? 1947 తర్వాత రక్షణా వ్యూహంలో జరిగిన అతి పెద్ద మార్పు ఇది. ఇంత పెద్ద మార్పు కేవలం ఇరవై వేల సాయుధుల వలన జరుగదని, బయటకు చెప్పలేని విషయాలు భారత ప్రభుత్వానికి అర్థమవడం వలననే అంత పెద్ద మార్పులు రక్షణా వ్యూహంలో జరిగాయనేది పరిశోధిస్తే గాని అర్థమవదు. సరిగ్గా ఇవే కారణాలు అమెరికా సామ్రాజ్యవాదులను కూడా భయాందోళనలకు గురి చేస్తున్నవి.

వీటిలో ప్రధాన కారణమేమంటే, ప్రపంచంలో ఏ దేశ ప్రభుత్వమైన తమ దేశంలో సాయుధంగా తిరుగుబాటు చేస్తున్న సంస్థ క్రిటికల్ మాస్ (విజయానికి కావలసిన బలం) ను సంపాదించకుండా ఆపాలని విశ్వ ప్రయత్నాలు చేస్తాయి. ఒకసారి క్రిటికల్ మాస్‌ను సాదిస్తే, ఆ సంస్థ గెలుపు వెనకా ముందు తప్పనిసరి. భారత మావోయిస్ట్ పార్టీ ఈ క్రిటికల్ మాస్‌ను సాధించినదని వారు భావించినందుకే వారు దీని రక్షణాపర ప్రాముఖ్యతను గుర్తించి, తీవ్ర పరిశోధనలు చేశారు (ఇంకా చేస్తున్నారు కూడా).

కేవలం అమెరికా సంస్థలే కాదు, కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల రక్షణ శాఖలు, వాటికి సలహాలు ఇచ్చే ఆయా దేశాల థింక్ ట్యాంక్ సంస్థలు, బహుళజాతి సంస్థలకు తమ పెట్టుబడుల రక్షణపై సలహాలు ఇచ్చే 'సెక్యూరిటీ అండ్ పొలిటికల్ రిస్క్ అనాలిసెస్' సంస్థలు, చివరికి ఆ దేశాలకు చెందిన కొన్ని యూనివర్శిటీలు కూడా మావోయిస్ట్ పార్టీపై పరిశోధనా రిపోర్ట్‌లు తయారు చేశాయంటే ఆ దేశాలు మావోయిస్ట్ పార్టీ క్రిటికల్ మాస్‌కు చేరిందని గుర్తించాయి. కొన్ని దేశాల సంస్థలు మావోయిస్ట్ 'సమస్య'పై ప్రత్యేక సెమినార్లు కూడా నిర్వహించాయి.

తమ శత్రువుకు (అంటే మావోయిస్ట్ పార్టీకి) తమ పరిశోధనా రిపోర్ట్‌లు లభ్యమైనా నష్టమేమి లేదని భావించే వాటిని ఇంటర్నెట్‌లో పెట్టారు. (ఎలాగైతే మావోయిస్ట్‌లు తమ శత్రువుకు తెలిసినా నష్టమేమీ లేదనుకున్న డాక్యుమెంట్లను 'బ్యాన్డ్ థాట్ డాట్ నెట్' అనే వెబ్‌సైట్లో పెడుతున్నారో అలాగ). అయితే, రెస్ట్రిక్టెడ్ యాక్సెస్ (అనుమతి ఉన్న వారు మాత్రమే చూడగలిగే) రహస్య రిపోర్ట్‌లు, రహస్య సెమినార్లు ఇటు భారతదేశపు, అటు సామ్రాజ్యవాద దేశాల సంస్థలు మావోయిస్ట్ 'సమస్య' పై జరిపి ఉంటాయనడంలో ఏమాత్రం సందేహం అవసరం లేదు. క్రిటికల్ మాస్ మావోయిస్ట్ పార్టీకి మాస్ బేస్ (ప్రజల ఆదరణ) వలన వచ్చినదనే వాస్తవం గుర్తించినందునే వారు ప్రజలను మావోయిస్ట్ పార్టీ నుండి దూరం చేయడానికి భారత ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టాలనే సలహాలు కూడా ఇచ్చారు.

వీరి భయాందోళనకు మరో కారణమేమంటే, భారత మావోయిస్ట్ ఉద్యమాన్ని సమర్థిస్తూ, యూరప్‌లో ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పడింది. ఇంటర్నెషనల్ కమిటీ ఫర్ ద సపోర్ట్ ఆఫ్ పీపుల్స్‌వార్ ఇన్ ఇండియా పేరున ఏర్పడ్డ ఈ సంస్థలో ఎన్నో దేశాలకు చెందిన మార్క్సిస్ట్, లెనినిస్ట్ పార్టీలు సభ్యులుగా ఉన్నట్లు, వారు ప్రతి రెండు, మూడు సంవత్సరాల కొకసారి అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను యూరప్‌లో నిర్వహించు కుంటున్నట్టు వారి వెబ్‌సైట్ ద్వారా అర్థమవుతున్నది. భారతదేశం లాంటి పెద్ద దేశంలో మావోయిస్ట్ ఉద్యమం అధికారాన్ని హస్తగతం చేసుకుంటే అది సామ్రాజ్యవాద దేశాలకు తీవ్రస్థాయిలో ఆర్థికనష్టం కలుగుతుందనేది వారి మరో భయం. సామ్రాజ్యవాద దేశాలకు చెందిన పరిశ్రమలకు కావలసిన ఏ ఖనిజాలు కూడా వారి దేశాల్లో లేవు. భారత్ లాంటి పేద దేశాలలోనే ఆ ఖనిజాలు ఉన్నాయి. మావోయిస్ట్‌లు అధికారాన్ని హస్తగతం చేసుకుంటే, ఆ ఖనిజాలను విదేశాలకు వెల్లకుండా ఆపుతారని, దాంతో తమ దేశ పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందనేది వారి భయం. అదే సమయంలో, బహుళజాతి సంస్థలకు భారతదేశం రెండవ అతిపెద్ద మార్కెట్. మావోయిస్ట్‌లు అధికారంలోకి వస్తే బహుళజాతి సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకుని, వారిని వెళ్లగొడతారని వారి మరో భయం. అంతే కాకుండా, సామ్రాజ్యవాద దేశాల అవసరాల కొరకు కావలసిన చవకైన, అత్యంత హీన పరిస్థితులలో కూడా పని చేయడానికి సిద్ధపడే మానవ వనరులున్న అతిపెద్ద దేశం తమ చేతి నుండి జారి పోతుందనే భయం కూడా వారిలో వ్యక్తమవుతున్నది. భారతదేశం లాంటి అతిపెద్ద దేశాల్లో కమ్యూనిస్ట్ భావజాలం కల మావోయిస్ట్ ఉద్యమం విజయవంతమైతే, అధికారంలోకి వస్తే, ఆ భావజాలం ప్రపంచంలోని ఇతర దేశాలకు విస్తరిస్తుందనేది కూడా వారి మరో భయంగా అర్థమవుతున్నది.

ఇంకో ఆసక్తికరమైన విషయం కూడా ఉంది. భారత ఆర్మీకి చెందిన ఒక ఆర్మీ జనరల్ మావోయిస్ట్ పార్టీపై రిపోర్ట్‌ను అమెరికన్ ఆర్మీ కొరకు తయారు చేశాడు. ఈ అంశంపై ఈ రెండు దేశాల ఆర్మీల మధ్య ఎక్స్ఛేంజ్ నడుస్తున్నదనడానికి ఇది ఆధారం. భారత్‌కు చెందిన స్పెషల్ ఆపరేషన్స్ బలగాల టీమ్‌కు అమెరికాలో శిక్షణనిచ్చే సమయంలో తీసిన వీడియో కూడా యూట్యూబ్‌లో ఉంది.

మావోయిస్ట్ ఉద్యమాన్ని భారత ప్రభుత్వం దేశానికి అతిపెద్ద ప్రమాదంగా గుర్తించి, విదేశీ సహాయంతో దాన్ని అణచాలని చూస్తున్న దనడానికి ఇంటర్నెట్‌లో పై ఆధారాలే కాదు ఇంకో ఆధారం కూడా ఉంది. 'పలాంటీర్ టెక్నాలజీస్' అనే ఒక విదేశీ సంస్థ (ఇది అమెరికా రక్షణ శాఖకు తన సేవలను అందిస్తున్నది) తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌ను వారి సేవలను భారత ప్రభుత్వం మావోయిస్ట్ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి వాడుకుంటున్నది. ఈ సంస్థ, భద్రతా బలగాలు తమ శత్రువును అంచనా వేయడం కొరకు ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసింది. ఇది 'బిగ్ డేటా', 'ప్రెడిక్టివ్ అనలిటిక్స్' అనే సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్‌ల ఆధారంగా భద్రతా బలగాలకు తన సేవలను అందిస్తుంది. ఈ కాన్సెప్ట్‌లను ఇక్కడ వివరించడం ఈ వ్యాసం పరిధికి మించినది. క్లుప్తంగా చెప్పాలంటే, మావోయిస్ట్ ఉద్యమానికి సంబంధించిన ప్రతి డేటాను సమీకరించి అలా సేకరించబడిన 'బిగ్ డేటా' ద్వారా నిర్ణయాలు తీసుకోవడానికి ఆ సాఫ్ట్‌వేర్ సహకరిస్తుంది. అదే సమయంలో, తమ వద్ద ఉన్న డేటా ఆధారంగా భవిష్యత్తులో పలానా పరిస్థితి ఏర్పడినప్పుడు మావోయిస్టులు ఏ విధంగా రియాక్ట్ అయ్యే అవకాశం ఉందని తెలుసుకోవడానికి 'ప్రెడిక్టివ్ అనలిటిక్స్' అనే కాన్సెప్ట్‌ను వాడుతున్నారు. అయితే, దీంతో ఒక సమస్య ఉన్నది. మావోయిస్టుల వ్యూహాలు ఒకటే ప్యాటెర్న్ (మూస పద్ధతిలో ఒకే రకంగా వ్యూహ రచన చేసే అలవాటు) ప్రకారం సాధారణంగా ఉండవు. కాబట్టి భవిష్యత్ వ్యూహాన్ని ఈ సాఫ్ట్‌వేర్ ప్రెడిక్ట్ చేసి (ఊహించి) చెప్పగలగడం అతిశయోక్తే. నిజానికి, ఇదే సాఫ్ట్‌వేర్‌ను, ఇంకా ఇలాంటి ఎన్నెన్నో సాఫ్ట్‌వేర్‌లను, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలను అఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా దేశాలలో అమెరికా రక్షణ శాఖ వాడినప్పటికీ ఆయా దేశాల్లో అమెరికా సైన్యాలు ఓటమి చవి చూశాయి.

ఇక భారతదేశానికి వస్తే, స్వయంగా రక్షణ శాఖ సంస్థలు కాని, దానితో కలిసి పనిచేసే సంస్థలు ఉదాహరణకు సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్, కెపిఎస్ గిల్ ఆధ్వర్యంలో నడిచే 'సౌత్ ఏషియన్ టెర్రరిజం పోర్టల్' అనే థింక్ ట్యాంక్ లాంటి సంస్థలెన్నో మావోయిస్ట్ ఉద్యమంపై రిపోర్ట్‌లు తయారు చేశాయి, సెమినార్లు నిర్వహించాయి. దేశ భద్రత అంశాల్లో ప్రధాని మోడీకి గుండెకాయ అయిన జాతీయ భద్రతా సలహాదారుడు అజయ్ దోవల్ ఆర్ఎస్ఎస్ సహాయంతో స్థాపించిన వివేకానంద ఫౌండేషన్ కాని, అతని కొడుకు ఆర్ఎస్ఎస్ సహాయంతో నడుపుతున్న ఇండియా ఫౌండేషన్ కాని మావోయిస్ట్ 'సమస్య'పై రిపోర్ట్‌లు ఇవ్వడం, పాలసీ ఫ్రేమ్‌వర్క్ తయారు చేయడంలో సహాయం చేస్తున్నాయి.

ప్రభుత్వానికి చెందిన 'రాజ్యసభ టివి' ఛానెల్ వారు మావోయిస్ట్ 'సమస్య'పై ఈ మధ్యే చేసిన మూడు డాక్యుమెంటరీ ఫిల్మ్‌ల ద్వారా కూడా ప్రభుత్వ భయందోళనలు మనకు అర్థమవుతాయి. ఈ డాక్యుమెంటరీలలో బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్ లాంటి భద్రతా బలగాల అధిపతులే ఖనిజాల మైనింగ్‌ను, తరలింపును అడ్డుకుంటున్న మావోయిస్ట్‌లను అణచడానికే తాము ఈ ప్రాంతాలకు వచ్చామని స్వయంగా ప్రకటిస్తున్నారు. తమ శత్రువు తమ దేశ తోటి పౌరుడేనని ఒప్పుకుంటున్నారు. అయితే, 'థియేటర్ ఆఫ్ కాన్‌ఫ్లిక్ట్' అని వారు పిలుచుకునే యుద్ధ క్షేత్రంలో పనిచేస్తున్న బలగాల మొహాలలో భయాందోళనలు దాచిపెట్టలేరు కదా?

2004కు ముందు విడివిడిగా ఉన్న పీపుల్స్‌వార్, ఎంసిసిలను స్థాపించిన నాయకుల సంఖ్య పట్టుమని పది మంది కూడా కాదు. 7 లేదా 8 మంది వ్యవస్థాపకులతో మొదలైన అవి తమ మాస్‌బేస్‌ను విస్తరించుకుంటూ, ఏ రకంగా కూడా దాన్ని నిర్మూలించలేని, ఓడించలేని స్థాయి క్రిటికల్ మాస్‌ను సాధించడం (అది కూడా ఎందరో ముఖ్య నాయకులు చనిపోవడం, అరెస్ట్ కావడం జరిగినప్పటికీ, లోపాలున్నాయని తామే ఒప్పుకుంటున్నప్పటికీ), దేశమంతా విస్తరించడం, ప్రపంచంలోనే మూడవ అత్యంత శక్తివంతమైన సాయుధ సంపత్తి కలిగిన భారత ప్రభుత్వంతో ఢీకొట్టి నిలదొక్కుకోగలగడం, సామ్రాజ్యవాద దేశాల పాలక వర్గాలకు ఆందోళన కలిగించే స్థాయికి ఎదగడం మిలటరీ వ్యూహ కర్తలనే ఆశ్చర్యానికి గురి చేస్తున్నది.

మావోయిస్టులను చుట్టుముట్టాం, వారిని ఒక నెలలో ఖతం చేస్తామని ఒకరు, మానవ రహిత విమానాలతో సంవత్సరంలోనే అంతం చేస్తామని మరొకరు, ఆ పార్టీ నాయకులందరికీ అన్నీ రోగాలేనని, నడవలేక

# భారత రాజ్య సామాజిక స్వభావం

***భారత పాలకులు ప్రజలను కులాలుగా, మతాలుగా విభజించి ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ బ్రాహ్మణీయ భావజాలంతో పరిపాలన కొనసాగిస్తున్నారని అంటున్నారు* కోట శ్రీనివాస్**

మనిషి సంఘజీవి. జీవ పరిణామ క్రమంలో జంతువు నుంచి విడివడి సంఘజీవిగా రూపాంతరం చెందిన నాటి నుంచి క్రమంగా ప్రకృతిపై ఆధిపత్యం సాధించడం ప్రారంభం అయ్యింది. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతున్న క్రమంలో కొద్దిపాటి మిగులు సంపద అనేది రావడం ప్రారంభం అయ్యింది. మిగులు సంపదపై ఆధిపత్యం కోసం బీజప్రాయమైన వర్గాలు ఆవిర్భవించాయి. అంటే సంపదను, శ్రమను కొల్లగొట్టడం కోసం యుద్ధాలు, దాడులు, ఒక వర్గాన్ని మరో వర్గం అణిచిపెట్టడం మొదలైంది. దీని మూలం సామాజిక ఉత్పత్తిని సమిష్టిగా అనుభవించడం స్థానంలోకి వ్యక్తిగత ఆస్తి ప్రవేశించింది. వ్యక్తిగత ఆస్తి వల్ల ప్రయోజనం పొందే విశ్రాంతవర్గం వ్యవస్థీకృతమై రాజ్యంగా ఆవిర్భవించింది.

భారతదేశంలో రాజ్య ఆవిర్భావం దాని పరిణామ క్రమం, స్వభావం యూరోప్‌లో రాజ్యాల వలె కాకుండా భిన్నంగా ఉన్నది. హిందూ మత ప్రామాణిక గ్రంథాలుగా చెప్పబడుతున్న రామాయణం, మహాభారతం, భగవద్గీత మొదలైన అభూతకల్పనలని, అవి మానవ సృష్టి అని శాస్త్రీయంగా తేలిపోయింది. అయినప్పటికీ భారత ప్రాచీన సామాజిక జీవన విధానంలోని అనేక పార్శ్వాలు, యుద్ధ రాజకీయాల ఎత్తుగడలు వాటిలో స్పష్టంగా గమనించవచ్చు.

రాజ్యమంటే వ్యవస్థీకృత నియంతృత్వమే తప్ప ఈ నిర్వచనంలో ఏనాడు, ఏదేశంలో మార్పు లేదు. ఆ రాజ్య యంత్రాంగంపై ఏఏ వర్గాల, ఏఏ సామాజిక సమూహాల ఆధిపత్యం ఉంటుంది అనే దానిపై రాజ్య స్వభావం నిర్ణయించబడుతుంది. రాజ్య ఆవిర్భావ క్రమం ఏ పరిస్థితుల్లోనైనా యుద్ధం ద్వారా జరిగి తీరవలసిందే. మావోసేటుంగ్ 'యుద్ధమంటే రక్తపాతంతో కూడిన రాజకీయాలు, రాజకీయాలంటే శాంతియుత యుద్ధమ'ని అన్నాడు.

వర్గ రాజకీయాల ప్రారంభమే రాజ్య ఆవిర్భావానికి మూలమని ఎంగెల్స్ 'కుటుంబం-సొంత ఆస్తి- రాజ్యాల పుట్టుక' అనే గ్రంథంలో పరిశోధనాత్మకంగా, శాస్త్రీయ అవగాహనను సమాజానికి అందించాడు. దానిలో 'వర్గ వైరుధ్యాలను అదుపులో ఉంచవలసిన అవసరం నుంచి రాజ్యం ఉద్భవించింది. కానీ, అదే సమయంలో అది ఈ వర్గాల ఘర్షణల మధ్యలో ఉద్భవించింది గనుక, అది సర్వేసర్వత్రా అత్యంత శక్తివంతమైన, ఆర్థికంగా ప్రబలమైన వర్గ రాజ్యంగా ఉంటుంది'

అయితే యుద్ధ రాజకీయాలు ఎలా ప్రారంభం అయ్యాయి? భారత రాజ్యం ఆవిర్భావం, దాని మనుగడ ఏ వ్యవస్థపై ఆధారపడి నడుస్తుంది? దీని సామాజిక స్వభావం ఏమిటి? రాజ్యం, దాని స్వభావాన్ని తెలుసుకోకుండా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, అసమానతలను, దోపిడీ పీడనల గురించి తెలుసుకోవడం అసాధ్యం. పశుపోషకులుగా ఉంటూ ఇరాన్ పరిసర ప్రాంతం నుంచి ఉత్తర భారత భూభాగంలోకి ప్రవేశించిన ఆర్యులు స్థానికులపై దాడి చేసి వారిని శాశ్వత పాలితులుగా మార్చివేశారు. 'కాల క్రమంలో ఆర్య, అనార్య సమ్మేళనం జరిగి ఒక బ్రాహ్మణ వర్గం ఏర్పడింది'. బ్రాహ్మణ వర్గం ఆధిపత్య అధికారవర్గంగా రూపొంది దాని ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణాలను సృష్టించింది. తరువాత క్రమంలో అతి శూద్రులుగా కూడా మరో బృందాన్ని తయారు చేసింది. ఈ క్రమమంతా రాజ్య స్వభావం విలక్షణంగా ఉంది. ఆర్య ప్రభావిత ఉత్తర భారత ప్రాంతాల్లోకి ఇతర రాజ్యాలకు స్పష్టమైన బేధాలున్నాయి. ప్రస్తుత భారత రాజ్య వ్యవస్థను అర్థం చేసుకోవడానికి అవి కొంత ఉపకరిస్తాయి.

క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నాటికి భారతదేశంలో పూర్తిగా రూపొందిన మొట్టమొదటి ప్రధాన రాజ్యమైన మౌర్య సామ్రాజ్యం ఈ నూతన వాస్తవాన్ని ప్రతిబింభించింది. తెగ రాజులను, పూజారులను తమలో కలుపుకుంటూ, అవసరాన్ని బట్టి అణిచివేతపై ఆధారపడుతూ ఎప్పటికప్పుడు అవసరమైన నిర్మాణ తాత్వికపరమైన మార్పులను బ్రాహ్మణ మతం సమకూర్చుకుంటూ వ్యవస్థీకృతమైంది. యజ్ఞయాగాదులు, కర్మకాండలు మొదలగు పద్ధతులు ఆధిపత్యం

---

పోతున్నారని, చూడలేకపోతున్నారని, కూర్చుంటే లేవలేక పోతున్నారని, ఆ పార్టీలో దళితులను అణచివేస్తున్నారని, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారని, కొత్త రిక్రూట్‌మెంట్లు లేవని, అమాయకులను చంపుతున్నారని మీడియా ద్వారా విపరీతంగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వమే, మావోయిస్ట్ ఉద్యమం మాస్‌బేస్ పెరుగుతూ ఉండడంను చూసి ఆందోళన చెందుతున్నట్లు మనకు ఆ రిపోర్ట్‌ల ద్వారా అర్థమవుతుంది.

సోషలిజం, కమ్యూనిజంల పట్ల చిన్న వయసు నుండే అసహ్యాన్ని నింపే పెట్టుబడిదారీ దేశాలలో కూడా కార్మిక మేధావి వర్గం ఏకమై భారత మావోయిస్ట్ ఉద్యమాన్ని సమర్థిస్తూ, దానికి మద్దతుగా అంతర్జాతీయ సంస్థను స్థాపించడం కూడా భారత ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తున్నట్లు ఆ రిపోర్ట్‌ల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

అందుకే, లోతుగా పరిశోధిస్తే తప్పించి అసలు వాస్తవాలు తెలియవు.

*(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త)* వీ

వహించడంతో స్థానిక సంస్కృతి విచ్ఛిన్నం అయి, దాని స్థానంలోకి బ్రాహ్మణ ఆధిపత్య సంస్కృతి వచ్చి చేరింది. 'ఈ సంస్కృతి అత్యంత క్రూరమైన అణిచివేతకు, రాజకీయ సంస్కృతికి ప్రాణం పోసింది. న్యాయం, అధికారం, హక్కులు, విధులు అన్నీ చతుర్వర్ణ చట్రంలో ఒదిగేలా ఓ పాలక వ్యవస్థ రూపుదిద్దుకుంది'

అమానవీయమైన బ్రాహ్మణిజం పలు రూపాల్లో అన్ని పొరల్లో సంఘటిత రూపం తీసుకున్నది. గుప్తుల స్వర్ణయుగం (దోపిడీ, బ్రాహ్మణ ఆధిపత్యాలకు), మౌర్య సామ్రాజ్యం ఇందుకు దర్పణం పట్టగలవు. బ్రాహ్మణులు కాక మరెవర్నయినా వేదాలు వల్లిస్తే నాలుక కత్తిరించమని, వింటే చెవుల్లో సీసం పోయమని మనువు ఆదేశించాడు. 21శతాబ్దంలో అతిపెద్ద లిఖిత రాజ్యపతులు, దాని అమలు కర్తలు ఈనాటికీ అదేనీతిని పాటిస్తున్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానంలాంటి బ్రాహ్మణ పవిత్ర క్షేత్రాల్లో ఈ నాటికీ వేదాలు వల్లించే అర్హతను మరొకరికి రానివ్వ లేకపోయారు. ఓడిపోయిన ప్రజలను రకరకాలుగా విడదీసి, విభజించి పాలించు అనే పద్ధతిని బ్రాహ్మణిజం పాటించింది. నిజానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈ పద్ధతిని అన్వయించడం ద్వారానే ఇక్కడ చాలా కాలం ప్రత్యక్ష దోపిడీ చేయగలిగారు. బ్రాహ్మణ ఆధిపత్య రాజ్యాలు సామాజిక వ్యవస్థను కుల ఆధారిత భూస్వామ్య వ్యవస్థగా మార్చివేశాయి. పెట్టుబడిదారీ విధానంలో ఈ స్వభావం, స్వరూప వ్యక్తీకరణలు చాలా స్పష్టంగా చూడవచ్చు.

బ్రాహ్మణ వర్ణం, బ్రాహ్మణ మతం తమ ఆధిపత్యాన్ని, అధికారాన్ని నిర్మించి కాపాడుకోవడానికి తాత్విక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అనుసరించిన జిత్తుల మారి ఎత్తుగడల సారాంశమే బ్రాహ్మణిజం. భారత రాజ్యం బ్రాహ్మణిజం పునాదులపైన బతుకుతున్నది. బ్రాహ్మణిజం రూపాల్లో కులవ్యవస్థ ఉన్నతమైంది. ఇది ఆధిపత్య వర్గాలకు అణచివేతకు, దోపిడీకి ఆయుధం అయ్యింది. రాజ్యం దీన్ని పెంచి పోషిస్తుంది. పీడిత జాతులకు, అణిచివేయబడుతున్న కులాలకు, మైనార్టీలకు ఇది శాపంగా పరిణమించింది. వారి తాత్విక, సాంస్కృతిక ఐక్యతకు విఘాతంగా మారింది. పరమదుర్మార్గమైన ఈ కుల వ్యవస్థను హిందూ మతం, ఆ హిందూ మతాన్ని దాని పవిత్ర గ్రంథాలు రక్షిస్తున్నాయి. అవి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆధునిక రూపం ధరించాయి.

భారత రాజ్యం నూటికి నూరు శాతం బ్రాహ్మణ సనాతన సంప్రదాయాలను పాటిస్తున్నది. అన్ని రంగాల్లో అది అవలంబిస్తున్న విధానాలు ఎంత అమానవీయంగా ఉంటున్నాయో సోదాహరణంగా వివరించడానికి చరిత్ర పుటల్లో లక్షల సందర్భాలున్నాయి. సామాజిక వాస్తవం బ్రాహ్మణిజానికి గిట్టదు. అది మాట్లాడడం దాని దృష్టిలో పరమ నేరం. దాన్ని వ్యతిరేకిస్తే అది రాక్షసత్వం. దస్యులుగా, రాక్షసులుగా చరిత్ర పుటల నిండా ఉన్న నెత్తుటి ప్రవాహం అంతా ఈ దేశంలోని ఉత్పత్తి కులాలు, శ్రమజీవులదే. మొదట లోకాయతులను, తరువాత కాలంలో బౌద్ధంను ఎందుకు తన శత్రువుగా ఎంచుకుందో అర్థం చేసుకుంటే ఈ నాటి రాజ్య అణచివేత, దోపిడీలోని సామాజిక కోణాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఆధిపత్య, దోపిడీ వర్గం తమను తాము రక్షించుకునే ప్రయత్నంలో భాగంగా అణిచివేయబడుతున్న వర్గాలు, కులాల్లోని కొన్ని వర్గాలను తనలో భాగం చేసుకోవడం ఒక వ్యూహంగా అనుసరిస్తున్నది. ప్రజల సామాజిక చైతన్యాన్ని బట్టి అధికారంలోకి కింది వర్గాలను భాగం చేసే క్రమం వేగం పుంజుకుంటున్నది. అదే క్రమంలో హక్కుల కోసం, సమానత్వం, స్వేచ్ఛ, స్వయంపాలన మొదలైన అంశాలపై ఉద్యమిస్తున్న శక్తులను నూతన పద్ధతుల్లో అణిచివేయడానికి కూడా సామ, దాన-భేద దండోపాయాలు అనే పురాతన పద్ధతిని ఆధునీకరించి అన్వయిస్తున్నారు. చొరబాటును ప్రశ్నించి, తిరగబడి నిలువరించిన మూలవాసులను రాక్షసులుగా ముద్ర వేశారు. నేడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తమ కాళ్ల కింది భూమిని రక్షించుకోవడం కోసం, జీవించే హక్కు కావాలని అడుగుతున్నందుకు, సామాజిక న్యాయం, స్వయం గౌరవం దక్కాలన్నందుకే ప్రజలపై రాజ్యం యుద్ధం చేస్తున్నది. ఈ యుద్ధానికి ప్రాంతాన్ని బట్టి పేర్లు, పద్ధతులు, ఎత్తుగడలు మారుతున్నాయి అంతే తేడా. టెర్రరిస్టులు, అసాంఘిక శక్తులు, మావోయిస్టులు, లేదా నక్సలైట్లు మొదలైన పేర్లతో జరిగే హింసంతా కూడా దోపిడీ వర్గాల పరిరక్షణకు జరిగే రక్తపాత రాజకీయాలే.

కులతత్వ, హిందూత్వ స్వభావం గల రాజ్యం దాని అంగాలైన చట్టసభలు, జైళ్లు, న్యాయస్థానాలు, సైన్యం, నిరంకుశ ఉన్నతాధికారుల నిర్మాణాలు, నియామకాల్లో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. 'అంటరాని జాతిని అంతా అమానుషత్వంలో ఉంచిన కాలంలో నలందా విశ్వవిద్యాలయాన్ని ఎంత గొప్పగా నడిపితే ఎవరికి కావాలి? యావత్ ఆసియా ఖండం నుంచి అనేక మంది పండితులు నలందాను సందర్శించారని రొమిల్లా థాపర్ పొగడొచ్చు కానీ, అక్కడ ఒక్క అంటరాని వారైనా ఆ గడపలు తొక్కిన దాఖలాలు ఉన్నాయా అని ఈ ఆఖరు మనిషి అంతరంగం అడుగుతుంది' అని జి. కళ్యాణరావు రాశారు.

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలోని వివిధ సామాజిక దొంతరలకు చెందిన సమూహాల స్థానం ఎక్కడ అనే ప్రశ్నకు మనకు దొరికే జవాబుపైనే దాని స్వభావం నిర్ణయం అవుతుంది. మేడిపండు లాంటి ప్రజాస్వామ్యం, ఎండమావి లాంటి సామాజిక న్యాయం, కాగితాలకే పరిమితమైన ప్రాథమిక హక్కులు ఆచరణలో వాటి తీరు భారత రాజ్యాంగాన్ని వెక్కిరిస్తున్నాయి. ప్రకృతిలో లభించే సంపదతో పాటు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు అందరికీ దక్కాలనే ప్రాథమిక హక్కును నిరాకరించడం ద్వారా, అణిచివేస్తూ ఉండడం ద్వారా కరుడుగట్టిన అప్రజాస్వామిక ధోరణిని గమనించవచ్చు. సమాజంలో నూటికి యాభై శాతం మందిగా ఉన్న స్త్రీలు విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ రంగాలతో పాటు అత్యంత ప్రధానమైన చట్టసభల్లో రిజర్వేషన్ల వరకు, ఆస్తిహక్కును కల్పించడం వరకు అన్నింటిలో పూసలో దారంలా మనుధర్మమే రాజ్యాధికారమై వర్ధిల్లుతుంది.

సామాజిక న్యాయం అంటే అందరికీ అన్ని అవకాశాల్లో సమాన అవకాశాలు కల్పించడమే అనుకున్నప్పుడు ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలు వారి జనాభా దామాషా ప్రకారంగా ఎందుకు ప్రయోజనం పొందలేక పోతున్నారు? ఇప్పటికీ దేశంలోని ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3, నాల్గో తరగతి ఉద్యోగుల్లో వరుసగా 90, 70, 65, 40 శాతం అగ్రకులాలు అనుభవిస్తున్నారు. దీనర్థం ఏమిటి? న్యాయశాఖలో ఈనాడు బ్రాహ్మణ, అగ్రకులాల గుత్తాధిపత్యం పరిఢవిల్లుతోంది. పీఠాధిపతులు, మఠాధిపతులవలె వారసత్వంగా పదవులు పొందుతున్నారు. రాజ్యాంగంలోని ప్రధానమైన

న్యాయవ్యవస్థ అత్యున్నత నిర్మాణం అయిన సుప్రీంకోర్టు, ఇతర కింది నిర్మాణాలు చూస్తే అవి న్యాయస్థానాలు కావని, అగ్రహారాలని అర్థం కాకమానదు.

ఈనాటికి కూడా జనాభా లెక్కలను కులాల వారీగా ప్రకటించే స్థితి కూడా లేనంతటి భయాన్ని రాజ్యం కలిగి ఉంది. అందుకే 1992లో మండల్ కమిషన్ సిఫార్సుల అమలు ప్రారంభం అయిన తర్వాత మరింత అప్రమత్తంగా ఉంటుంది. చట్ట సభల్లోని జనాభా దామాషా ప్రకారం రావాల్సిన వర్గాలను, కులాలను, బృందాలను అడ్డుకోవడం పథకం ప్రకారంగా చేస్తూ అగ్రవర్ణాలు రాజ్యాధికార భోగాల్ని అనుభవించ గలుగుతున్నాయి.

భారత రాజ్యవ్యవస్థ ఒక విలక్షణమైన వ్యక్తిత్వం కలిగి ఉంది. అదేమిటంటే అస్పృశ్యత, అంటరానితనం, అణిచివేత, దోపిడీ పీడన, వివక్ష అనే రుగ్మతలను చట్టబద్ధం చేసి ప్రజలను చాలా సందర్భాల్లో అంగీకరింప జేయగలుగుతుంది. రాజ్యం మనుగడ కొనసాగించడంలో ఇది ఓ లోతైన పార్శ్వంగా అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యం విఫలం అయితే అరాచకం, విప్లవం వస్తాయని అంబేద్కర్ అన్నాడు. ఈ దేశంలో అధికార మార్పిడి అనంతరం 60 ఏండ్ల పాలనలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విఫల చరిత్రనేది స్పష్టం 'సర్వసత్తాక, సార్వభౌమ, లౌకిక, గణతంత్ర, సామ్యవాద దేశమని' చెప్పుకుంటుంది. ప్రజలకు జీవించే హక్కు పీడనను ఎదిరించే హక్కు, సహా ప్రాథమిక హక్కులను ప్రకటించి రాజ్యం తన ఔదార్యాన్ని ప్రకటించుకుంది. హక్కులడిగితే, దోపిడీ నిరోధించే హక్కుందంటే అణిచివేయడం, తన స్వయం ప్రకటిత రాజ్యాంగానికి వ్యతిరేకం.

ప్రపంచీకరణ ద్వారా భారతదేశం ఓ ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొంటోంది. భారత రాజ్యం ఉదారీకరణ, ప్రైవేటీకరణ ఎజెండా అమలులో వర్ణాశ్రమ ధర్మాన్ని అత్యంత సృజనాత్మకంగా వ్యవస్థీకృతం చేసింది. విద్యా, వైద్య, పారిశ్రామిక, నిర్మాణ రంగాల్ని అగ్రకుల సంపన్న వర్గాల చేతుల్లోంచి ఇప్పటికీ బయట పడలేదు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సోషలిస్టు క్యాంపు పురోగమన దశలో దోపిడీ రాజ్యాలు వాటి మనుగడకు సంక్షేమ రాజ్యం అనే మానవ ముఖం తగిలించుకున్నాయి. క్రమంగా భారత రాజ్యం ఆ ముసుగును కూడా వదిలించుకున్నది. సామాజిక బాధ్యత లేని ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తూ సంక్షేమం నుంచి రాజ్యం తప్పుకోవడం తిరిగి ప్రైవేటు రంగాన్ని రక్షించే బాధ్యతను రాజ్యం తీసుకోవడంజరుగుతోంది. ప్రభుత్వ రంగంలో 50 శాతం మించి రిజర్వేషన్లు ఉండరాదనే తీర్పు ఇచ్చిన రాజ్యా'అంగం' ప్రైవేటు రంగంలో సమానత్వ ఆకాంక్షను కాపాడగలదా?

రాజ్యం తాను ప్రకటించుకున్న ఆదర్శాలు, లక్ష్యాలు, ఆశయాల నుంచి బహిరంగంగా వైదొలగక తప్పని స్థితి ఏర్పడింది. దానికి మూలం దాని స్వభావంలోనే ఉండడం అత్యంత సహజం. కారల్‌మార్క్స్ చెప్పినట్లు 'ప్రజలను అణచిపెట్టి ఉంచేందుకు దోపిడీ వర్గాలకు సాధనమే రాజ్యం'. అది తన అవసరాన్ని బట్టి వివిధ రూపాలు ధరిస్తూ మానవ ముఖాన్ని కూడా అప్పుడప్పుడూ ప్రదర్శిస్తుంది.

అర్ధవలస, అర్ధభూస్వామ్య సంబంధాలు గల ఈ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానంతో లంకె వేసుకుంది. ఇక్కడ పెట్టుబడిదారీ వర్గానికి హిందూ మత పునాదే పెద్ద మార్కెట్. కులతత్వం, హిందూ మతతత్వం, బ్రాహ్మణీయ రాజ్యం సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అయి వాటి ప్రయోజనాలను రక్షించుకునే క్రమంలో నాడు దస్యుల, రాక్షసుల వారసులైన నేటి ఆదివాసులు, ముస్లింలు, దళితులు బలైతున్నారు. గ్లోబలీకరణలో భాగంగా ముందుకొచ్చిన గ్లోబల్ స్టేట్ ఈనాడు రాజ్య వ్యవస్థ నిలబడడానికి మిలటరీ, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నది.

మూడవ ప్రపంచ దేశాల్లో పెద్దదైన భారతదేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని అగ్రరాజ్యం అమెరికా ఓ వైపు ప్రయత్నిస్తూ, మరోవైపు దాని విస్తరణ కాంక్షను ప్రోత్సహించడం ద్వారా దానిలో భాగం చేసుకుంటుంది.

దళితులపైన, ఆదివాసులపైన, ముస్లింలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులు, హత్యాకాండలు రాజ్యం యొక్క అత్యంత క్రూరమైన స్వభావాన్ని తెలుపుతున్నాయి. ఈ ఫాసిస్టు పద్ధతులకు, ఘటనలకు, విధానాలకు ఒక వ్యవస్థీకృత రూపం ఇచ్చేందుకు, ఓ సాంస్కృతిక ఆమోదం లభింపజేసేందుకు భారత రాజ్యం విస్తృతమైన పథకాలు, పద్ధతులు ప్రవేశపెట్టింది. జాతుల బందీఖానాగా ఉన్న దేశం, భిన్న సంస్కృతులున్న సామాజిక వ్యవస్థలో ఏకీకృతమైన సాంస్కృతిక నిర్మాణం మార్కెట్ శక్తులకు అనుకూలంగా జరగాలని దోపిడీ వర్గాలు కోరుకుంటున్నాయి. దానికి అణిచివేతే ప్రధాన ఆయుధమవుతుంది. అంతర్యుద్ధం బద్దలు కాకుండా కొన్ని రాయితీలిస్తూ కింది వర్గాలపై బ్రాహ్మణీయ శక్తుల అగ్రకులాల దోపిడీ వర్గం అణిచివేత సాగిస్తోంది.

సామాజిక దోపిడీ, పీడనల అణచివేతకు వ్యతిరేకంగా రెండు వేల సంవత్సరాల శ్రమజీవుల చరిత్ర ఉంది. ఆ యుద్ధం సాగుతూనే ఉంది. ఉత్పత్తి శక్తుల సామాజిక అభివృద్ధి క్రమంలో రాజ్యం కూలిపోక తప్పదు. మానవ పరిణామ క్రమంలో, ప్రకృతిలో పుట్టుక, పెరుగుదల, చావు ఒక ప్రకృతి ధర్మం. మనిషి సామాజిక సామానత్వ ఆకాంక్ష నిరంతరం జ్వలిస్తూ పోరాటం వైపు నడిపిస్తుంది.

ఈ దేశంలో కూడా రాజ్య వ్యవస్థను ధ్వంసం చేయకుండా ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ అసాధ్యమని సుదీర్ఘ చరిత్ర సాక్ష్యంగా నిలిచింది. సామాజిక శక్తుల అభివృద్ధికి గుదిబండగా ఉన్న రాజ్యం అనేది అనాది కాలం నుంచి ఉన్నది కాదు. రాజ్యం లేకుండా, రాజ్యం గురించి, రాజ్యాధికారం గురించి ఏమీ తెలియకుండా ఉండిన సమాజాలు ఉండినాయి. ఆర్థిక అభివృద్ధిలోని ఒకానొక దశలో, సమాజం వర్గాలుగా చీలిపోవడంతో అవశ్యంగా ముడిపడినట్టి ఆ దశలో, ఈ చీలిక మూలంగా రాజ్యం అవసరమైంది. 'ఇప్పుడు మనం ఉత్పత్తి అభివృద్ధిలోని ఈ దశను వేగంగా సమీపిస్తున్నామంటే... ఆ దశలో ఈ వర్గాల అవసరం తీరిపోవడమే కాక, ఇవి ఉత్పత్తికి తప్పక ఆటంకంగా తయారవుతాయి. ఇంతకు ముందు దశలో అవి ఎంత అనివార్యంగా ఉత్పన్నమైనాయో.. అంత అనివార్యంగా అదృశ్యమవుతాయి. వాటితో పాటు రాజ్యం అనివార్యంగా అదృశ్యమవుతుంది. స్వేచ్ఛ, సమానతలు గల ఉత్పత్తిదార్ల సంఘపు ప్రాతిపదిక మీద ఉత్పత్తిని పునర్నిర్మించబోయే సమాజం మొత్తం రాజ్య యంత్రాన్ని అప్పుడది ఎక్కడ ఉంచవలెనో అక్కడ ఉంచుతుంది. పురావస్తు మ్యూజియంలో రాట్నమూ, కంచుగొడ్డలి ఉండేచోట' లెనిన్ అన్నాడు.

*(రచయిత రాజనీతి శాస్త్ర విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ)* వీ

# ఎదుగుదల లేని వార్తా ఛానళ్లు

***సంఖ్యా పరంగా వార్తాప్రసార మాధ్యమాలు పెరుగుతున్నాయి కానీ పోటీతత్వంతో వాటి నాణ్యతా ప్రమాణాలు దిగజారి పోతున్నాయని అంటున్నారు* టంకశాల అశోక్**

తెలుగు వార్తా ఛానళ్ల సంఖ్య పెరగడం మొదలై సుమారు 20 సంవత్సరాలు అవుతున్నది. కాని వాటి ప్రమాణాలలో ఇప్పటికీ ఎదుగుదల ఉండడం లేదు. పైగా క్షీణిస్తున్నాయి. ఇది సర్వ సాధారణ అభిప్రాయం.

పాశ్చాత్య దేశాల టెలివిజన్ జర్నలిజంతో పోల్చితే మనదేశంలో ఈ రంగం ఇంకా కొత్తదన్న మాట నిజమే. కాని వృత్తి ప్రమాణాలకు, విలువలకు దానితో సంబంధం ఉండనక్కరలేదు. సాంకేతిక విషయాలలో తేడాలు ఉండవచ్చు. అవి ఎక్కువగా పెట్టుబడుల స్థాయిని బట్టి ఉంటాయి. పెట్టుబడులు రాబడుల బట్టి ఉంటాయి. అందువల్ల యంత్ర పరికరాల ఉపయోగం, సిబ్బంది నియామకం వంటి విషయాలలో మన ఛానళ్లు పాశ్చాత్య స్థాయిని అందుకోలేకపోతే అభ్యంతర పెట్టవలసిందేమీ ఉండదు. కాని ఈ అంశాలకు వృత్తి ప్రమాణాలు, విలువలతో నిమిత్తం లేదు.

ఆ విధంగా చూసినపుడు వృత్తి ప్రమాణాలలో, శైలిలో గతం కన్న ఇప్పటికి మెరుగుదల కన్పించడం లేదు. వినోదపు ఛానళ్ల మాట పక్కన ఉంచి వార్తా ఛానళ్లకు వస్తే వాటి కార్యక్రమాలలో ప్రధానమైనవి నాలుగు. అవి, 1) నిరంతరం సాగుతుండే స్క్రోలింగ్. 2) వార్తలు 3) ప్రత్యేక కథనాలు 4) చర్చా కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు.

వీటిలో వార్తల కార్యక్రమం ఒక్కటే లోగడ కన్న పాక్షికంగా బాగుపడింది. ఇది ఇంచుమించు అన్ని ఛానళ్లకు వర్తిస్తుంది. వార్తలు స్పష్టంగా, సరైన ఉచ్చారణతో, విరుపుతో, వేగంతో చదవగలిగిన వారు తొలిదశలో కొద్దిమందే ఉండేవారు. వారు ఏ ఛానల్‌లో పని చేస్తుంటే అది ఆకర్షణీయంగా ఉండేది. క్రమంగా కొత్తగా మంచి వారు ఈ వృత్తిలో ప్రవేశించడం, బహుశా వారికి శిక్షణ కూడా ఉండడం వల్ల అన్ని ఛానళ్లు బాగుపడ్డాయి.

ఇప్పుడు వార్తాంశాల మాట అట్లుంచితే కేవలం చదివే ప్రతిభకు సంబంధించి ఏ ఛానల్‌ను విన్నా తేడా అంతగా ఉండడం లేదు. కాని వారి పరిజ్ఞానాలు చాలా తక్కువ స్థాయిలో ఉంటున్నాయి. వార్తాంశాల మాట వేరే చర్చ. ఇందులో ఏ ఛానల్ ఏ వార్తలు ఇస్తుంది, వేటిని తొక్కి పెడుతుంది, వేటిని వక్రీకరిస్తుంది, వేటిని సంచలనాత్మకం చేస్తుంది, వాస్తవాలతో నిమిత్తం లేని కట్టుకథలు చెపుతుంది అన్న కోణం నుంచి చూస్తే అది వృత్తి విలువల ప్రశ్న అవుతుంది. అందులో ఇప్పుడున్న ఛానళ్లు బాగుండేవి, ఫరవాలేదన దగ్గవి సగం కన్న ఉండవు. అయినా అది సంతృప్తిని కలిగించే విషయమే. ఎందుకంటే, ఛానళ్ల వార్తలను వర్గీకరిస్తే, అవి వేర్వేరు ప్రయోజనాల కోసం చెప్పే ఈ విధమైన వార్తలను పక్కన ఉంచితే, అసలు విషయ సేకరణ పరిధి పెరిగింది. విలేఖరులు, కెమెరాలు, వ్యాన్లు, క్లిప్పింగులు తెప్పించుకునే ఏర్పాట్లు, బయటి ఛానళ్లతో వార్తా వినిమయ ఒప్పందాల వంటివి గణనీయంగా పెరిగాయి. ఇది సంతృప్తిని కలిగించే విషయమే.

ఇది పాక్షికమైన మెరుగుదల. ఒకటి, వార్తలు చదివే పద్ధతి బాగుపడడం. రెండు, వార్తా సేకరణలు మెరుగుపడడం. వీటితో పాటు సాంకేతిక పరికరాల స్థాయి కూడా లోగడ కన్న పెరిగింది. కాని బాగుపడక పోవడమే గాక క్షీణించిన పార్శ్వం పైన చెప్పుకున్న రకరకాల అవలక్షణాలు. పరిస్థితులను గమనించగా అవి సమీప భవిష్యత్తులో మారగల అవకాశాలు కనిపించడం లేదు. ఛానళ్ల యాజమాన్యాలకు, సంపాదకులకు గల ప్రయోజనాలు, సానుభూతులు, రాజకీయ – ఆర్థిక – సామాజిక శక్తులతో గల సంబంధాలు అందుకు కారణం. గతం కన్న ఈ ప్రయోజనాలు, సంబంధాలు ఇంకా పెరుగుతున్నాయి కూడా. కనుక ఈ కోణం నుంచి దైనందిన వార్తలలో కూడా ఒక శ్రేణికిందకు వచ్చేవాటి ప్రమాణాలు, విలువలు గతం కన్న మెరుగుపడకపోగా క్షీణిస్తున్నాయి.

స్క్రోలింగ్‌లను గమనిస్తే, అవి రకరకాలుగా నడవడం తప్ప ఒక నిర్దిష్టతను, ప్రామాణికతను ఇంకా ఏ ఛానల్ కూడా చేరుకున్నట్లు తోచదు. స్క్రోలింగ్ వార్తలు ఆ తర్వాతనో, ముందో బులెటిన్లలో వివరంగా రావచ్చు, రాకపోవచ్చు. కాని అదెట్లున్నా ఆ విషయాన్ని అప్పటికి అస్పష్టతలు, తప్పులు లేకుండా చెప్పాలి. క్లుప్తంగా చూపడంలోనే ఈ రెండు లోపాలు, కొరతలు లేకుండా చెప్పడం ఎట్లాగన్నది ఒక నేర్పు. అందుకు తగిన శిక్షణ, అవగాహన అవసరం, కాని ఆ పనులు చూసే డెస్క్ సిబ్బందికి ఇవి చాలా వరకు ఉండడం లేదు. స్క్రోలింగులను ఎడిటర్లతో సహా సీనియర్లు గమనిస్తూ తర్వాతనైనా సరిదిద్దక పోవడం అంతకన్న విచారం కలిగించే పరిస్థితి. తరచు అవే తప్పులు, అస్పష్టతలతో ఆ స్క్రోలింగులు గంటల తరబడి సాగుతూనే ఉంటాయి. డెస్క్‌లోకి, రిపోర్టింగులోకి వస్తున్న వారికి సరైన చదువులు, స్వీయ అధ్యయనాలు, శిక్షణలు ఉండడం లేదు గనుక యాజమాన్యాలు వీలైనంత తక్కువ వేతనానికి ఎవరు వస్తే వారిని నియమించుకుంటున్నాయి గనుక, ఇన్ హౌస్ శిక్షణలు ఎంతవరకు ఉంటున్నాయో తెలియని స్థితిలో పరిస్థితి ఈ విధంగా ఉంటున్నది. ఇది బాగుపడేందుకు యాజమాన్యాలు, ఎడిటర్లు చేయవలసింది ఏమిటో మళ్లీ వివరించి చెప్పనక్కర లేదు.

ప్రత్యేక కథనాలు రావడం లేదని కాదుగాని ఒకప్పటి కన్న సంతోషించదగ్గ స్థాయిలో లేవు. కథనాలు చేయదగ్గ అంశాలకు కొరత ఎంత మాత్రం లేదు. వేర్వేరు రంగాలలో, వృత్తులలో, పట్టణాలలో, గ్రామాలలో, వ్యక్తి సీమితంగా, సమూహాలతో ముడిపడి అంతులేనన్ని ఉన్నాయి. కథనాల అవకాశాలే గాక అవసరాలు ఇది వరకన్న పెరుగు తున్నాయి. జర్నలిజం పరిణతి చెందుతూ పోవడానికి ఇది ఒక

# రాజ్యహింస

**- ఆర్. లక్ష్మి**

సెప్టెంబర్ 11 దాడుల అనంతరం సిఐఏ ఖైదీలను విచారించే విధానంలో అవాంఛనీయమైన మార్పులు చాలా వచ్చాయని క్రూరాతి క్రూరమైన, అమానవీయమైన పద్ధతులలో విచారణ జరుగుతోందని అమెరికన్ సెనెట్ ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించిన రిపోర్టులో బయటపడింది. నిరుటి డిసెంబర్‌లో ఈ రిపోర్టు వెల్లడించబడింది. ఖైదీలను కటిక చీకటిలో ఉంచడం, నీళ్లల్లో ముంచి ఉక్కిరి బిక్కిరి చేయడం వంటి అమానుషమైన విధానాలను అవలంబించడం ద్వారా వారి నుండి నిజాన్ని రాబట్టేందుకు బలగాలు ప్రయత్నిస్తున్నాయని వెల్లడయింది. నిరంతరంగా హింసకు గురిచేసే ఖైదీలు మానసిక స్థైర్యం సడలి నిజాలను వెల్లడిస్తారని బలగాలు నమ్ముతున్నట్లు వెల్లడి కాగా, అటువంటి నమ్మకానికి శాస్త్రీయమైన ఆధారాలు ఏమీ లేవనీ రుజువు అయింది.

కాగా 2010లో ఒబామా అధికార యంత్రాంగం నియమించిన మానసిక వైద్య నిపుణుల బృందం సైతం పై విషయాలనే నిర్ధారించింది. ప్రస్తుతం నడుస్తున్న విచారణ పద్ధతులు ఎంత వరకు సరియైనవో, ఏమేరకు సత్ఫలితాలనిస్తున్నాయో పరిశీలించడమే గాక, కొంచెం మానవీయమైన, నీతివంతమైన విధానాలతో విచారణ కొనసాగించ డానికి అనువైన విధానాలను రూపొందించవలసిందిగా కూడా ఆ బృందాన్ని కోరడం జరిగింది.

'లోవా స్టేట్ యూనివర్సిటీ' ప్రొఫెసర్ డా. క్రిష్టియన్ మైసనర్ ఆధ్వర్యంలో ఆ మానసిక నిపుణుల బృందం సుదీర్ఘకాలం పాటు విస్తృతంగా అధ్యయనం జరిపింది. హింస, క్రూరత్వం ఖైదీల మొండి తనాన్ని బెదరగొట్టలేవని వారిపట్ల సుహృద్భావంతో మెలగడం, వారి విశ్వాసాన్ని చురగొనడం వంటి చర్యల ద్వారా వారి నుండి తేలికగా వాస్తవాలను రాబట్టవచ్చని బృందం అభిప్రాయపడింది. బృందం వెలువరించిన 60 అధ్యయనాల తాలూకు నివేదికలు బహిరంగంగానే లభిస్తున్నాయి.

'ఇంటరాగేషన్ ఎక్స్పాండింగ్ ది ఫ్రాంటియర్స్ ఆఫ్ రిసెర్చ్ అండ్ ప్రాక్టిస్' పేరున ఒక పుస్తకాన్ని కూడా మైసనర్ బృందం వెలువరించింది. అయితే మైసనర్ బృందం చేసిన సూచనలు, ఇచ్చిన సలహాలు ఏమేరకు అమలవుతాయో తెలియదు. కరడుగట్టిన విధానాలతో విచారణ సాగించడానికి అలవాటు పడిన సి.ఐ.ఎ లోని ఉన్నతాధికారులు కొందరు, సాక్షాత్తు డైరెక్టర్‌తో సహా అమెరికన్ సెనెట్ కమిటీ రిపోర్టులో లోపభూయిష్టమైనదని కొట్టి పారేస్తున్నారు. ఒక నిపుణుల బృందం రిపోర్టుకు ఏపాటి మన్నన దక్కుతుంది? 2015 ఆరంభంలో వెలువడిన ఈ రిపోర్టు సెనెట్ కమిటీ రిపోర్టును అన్ని విధాలా సమర్థించింది, ధృవపరిచింది కూడా.

ఐక్యరాజ్య సమితి 'హింస'కు వ్యతిరేకంగా తీసుకొని వచ్చిన కన్వెన్షన్‌లో భారతదేశం కూడా భాగస్వామి. ఇక్కడ 2004 – 2008 నడుమ లాకప్ మరణాలు 42 శాతం పెరిగాయి. హింసకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టబడిన బిల్లు సంవత్సరాల తరబడి నలుగుతూనే ఉంది. ఇది మనదేశానికి ఏమాత్రం శోభాయమానం కాదు. సిఐఏ మాట ఎలా ఉన్నా కన్వెన్షన్‌పై సంతకాలు చేసి ధృవీకరించిన దేశాలు ఖైదీల పట్ల కొంచెం ఉదారంగా స్పందించి నేర విచారణ విధానాలలో మార్పులు తీసుకొచ్చి వారినీ మనుషుల్లా చూడగలిగితే బాగుంటుంది.

*(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు)* వీ

గీటురాయి. కాని ఛానళ్లు ఆ పని చేస్తున్నది చాలా తక్కువ. అందుకు కారణం ఎడిటర్లకు ఆ దృష్టిలేకపోవడం, ఆ కథనాలకు మార్కెట్ ఉండదనుకోవడం, కథనాలు బాగా చేయగల వారు లేకపోవడం వంటిది ఏదైనా కావచ్చు. కాని అంతిమంగా అది ఛానళ్ల వైఫల్యమే. సమాజంలోని కథనాలను, వార్తల వెనుక గల పరిస్థితులను వెలికి తెచ్చి వీక్షకుల అవగాహనను పెంచనట్లయితే అది ఛానళ్లలో ఎదుగుదల లేకపోవడమే. ఈ స్థితిలో ఒకప్పటికీ ఇప్పటికీ తేడా ఏమీ లేనట్లే.

ఇటువంటి కథనాలకు వీక్షకుల ఆదరణ ఉండదనుకోవడం పెద్ద పొరపాటు. వారు పత్రికలలో ఫీచర్లు హాయిగా చదువుతున్నప్పుడు, ఛానళ్లలో వచ్చే ఫీచర్లు చూసి ఆనందిస్తున్నప్పుడు, వార్తలతో – జీవితాలతో ముడిబడిన కథనాలను సరిగా అందించగలిగితే ఆదరించరనుకోవడం సరైనదేనా? లోపం సంకల్పానిది, కథనాలను తయారు చేయడంలోనిదీ తప్ప వీక్షకులది కాదు. ఇటువంటి పరిస్థితుల మధ్య ఛానళ్లకు ఎదుగుదల గాని, పరిణతి గాని సిద్ధించే అవకాశం ఉండదు. ఇది విచారించవలసిన విషయం.

చివరది చర్చా కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు. ఒకటి రెండు ఛానళ్లను మినహాయిస్తే తక్కిన అన్నింటిలో అన్నిటి కన్న తక్కువ ప్రమాణాలతో సాగే కార్యక్రమం చర్చాగోష్ఠి. వాటిలో ఒక వైపు గోష్ఠి నిర్వాహకులు అనబడే యాంకర్లు, మరొక వైపు చర్చలో పాల్గొనే వారుంటారు. గోష్ఠి నిర్వాహకులు సీనియర్లు అయినపుడు కూడా నిర్వహణ పద్ధతి సరిగా ఉండడం లేదు. తామే అధికంగా మాట్లాడడం, ఎదుటి వారిని మధ్యలో కత్తిరించడం, తాము కోరుకున్నది చెప్పించే ప్రయత్నం భిన్నమైనవి వచ్చినపుడు అడ్డు తగలడం, విషయం గురించి ముందు సరిగా హోంవర్క్ చేయకపోవడం వంటిది వీరి సమస్యలు. ఇక చర్చలో పాల్గొనే వారు అనేకులుండడం, వారు చర్చకన్న వాదనలు అధికంగా చేయడం, యాంకర్లు కూడా ఒకరిపై ఒకరిని ఉసి గొల్పడంతో కేకల వల్ల ఆ సోకాల్డ్ చర్చ నుంచి వీక్షకులు నేర్చుకునేది ఉండడం లేదు. ఈ కార్యక్రమాలు గతం కన్న ఇపుడు చాలా క్షీణించాయి. బయటి రాజకీయాలు, ప్రయోజనాలు మురికి కూపంగా మారుతూ, యాంకర్లకు తగిన స్థాయి లేకపోవడం, చర్చలో పాల్గొనే వారు తెలివి గల వారైనా వాదనలు చేయడమే చర్చగా భావించడం వల్ల ఈ స్థితి ఏర్పడుతున్నది. యాంకర్లకు తగు పరిజ్ఞానం, శిక్షణ ఉండి, చర్చను కొద్ది మందికి పరిమితం చేస్తే ఈ కార్యక్రమం మెరుగుపడడం సాధ్యమే. మొత్తానికి ఈ నాలుగు విధాలైన అంశాలు కూడా రానున్న కాలంలో మారవలసిన అవసరం ఉంది. పెట్టుబడికి కూడా పరిణతి మేలునే చేస్తుంది.

*(రచయిత సీనియర్ జర్నలిస్టు)* వీ

# అదనపు విలువ గురించి మార్క్స్

**మార్క్స్ విలువల మారకాలను వివరించడంలో పొరపాటు పడ్డాడనే వాదన నేపథ్యంలో అసలు మార్క్స్ చెప్పిందేమిటో, ఏ నేపథ్యంలో చెప్పాడో వివరిస్తున్నారు ఇఎస్ బ్రహ్మచారి**

*'In view of the incredibly widespread nature of the distortions of Marxism, our first task is to restore the true doctrine of Marx.*

*- Lenin, The State and Revolution*

మార్క్సిజాన్ని కొందరు 'మేధావులు' ఇచ్ఛవచ్చినట్లు వక్రీకరిస్తున్నారు. విలువ నియమం భంగం కాకుండా మార్క్స్ అదనపు విలువని శాస్త్రీయంగా వివరించినప్పటికీ అది తప్పనేవారు ఏర్పడ్డారు – అదీ 'మార్క్సిస్టు' ముద్రతో. కనక అసలు మార్క్స్ ఏమిచెప్పాడో చూడాల్సిన అవసరం వుంది. మార్క్సిజానికి ఆధారం ఆయన రచనలేగదా!

పెట్టుబడి పుస్తకం లక్ష్యం 'ఆధునిక సమాజపు ఆర్థిక చలన నియమాన్ని బయటపెట్టడం' అని మార్క్స్ తొలి జర్మన్ కూర్పుకి ముందుమాటలో ప్రకటించాడు. అదే అదనపువిలువ నియమం. అదనపువిలువ ఉత్పత్తే ఈ ఉత్పత్తి విధానపు అఖండ నియమం (కాపిటల్ 1 పే. 580) అని చెప్పాడు.

అదనపువిలువ సూత్రం మార్క్స్ ఆర్థిక సిద్ధాంత సౌధానికి పునాది. విలువ నియమాన్ని అనుసరించి అదనపు విలువను రుజువుచేశాడు. ఈ రెంటినీ పరిశీలించడానికే ఈవ్యాసం.

**మారకాలూ– విలువా**

మన చుట్టూ అనేక సరుకులున్నాయి. మార్కెట్లలో లెక్కకు మించి మారకాలు జరుగుతుంటాయి. అవన్నీ సరుకుకీ డబ్బుకీ మధ్య. డబ్బు ఏర్పడక ముందు వస్తుమార్పిడి సాగింది. ఒక శేరు జొన్నలు యిచ్చి చిన్న గిన్నెడు నూనె తెచ్చుకోవడం. ఆరెండూ సమానమని ఇరువురూ అనుకుంటేనే మారకం జరుగుతుంది. డబ్బొచ్చాక సరుకుకీ, డబ్బుకీ సరిపోవాలి.

ఒక ఇల్లు వ 5 మంచాలు అనేదానికీ, ఒక ఇల్లు వ ఫలానింత డబ్బు అనేదానికీ తేడావుండదు అన్నాడు అరిస్టోటిల్.

ఇలా విలువరూపాన్ని మొదట విశ్లేషించిన వ్యక్తి ఆయనే. మారకం అయ్యాయంటే రెండూ సమానమనే. 'సమానత్వం లేకుండా మారకం జరగదు. ఒకే ప్రమాణం చేత కొలవబడకుండా సమానత్వం వుండదు.' సమాన విలువలు కలిగిన సరుకులే మారకం అవుతాయి అనే విషయం అరిస్టోటిల్ కి తెలుసు. అయితే 'వాస్తవంలో అలాంటి పోలికలేని వస్తువులు ఒకే ప్రమాణంతో కొలవబడడం అసాధ్యం' అన్నాడు. కనక సమానీకరణ వాటి నిజస్వభావానికి కుదరని విషయం. పర్యవసానంగా అది వాడుకలో అవసరాలకోసం తాత్కాలిక వుపకరణం మాత్రమే. అవసరాలకోసం నీది నాకు కావాలి, అలాగే నాది నీకు కావాలి. కనక మారకం చేసుకుందాం.

రెండు భిన్న రూపాలున్న సరుకుల్లో ఉమ్మడిగా ఏదో వుంటేనే గాని దాన్ని కొలిచి సమానం చేయటం సాధ్యంకాదు. అన్ని సరుకుల్లో ఉమ్మడిగా వుండి కొలవటానికి వీలయిన అంశం ఏదో ఆయన పరిశీలనకు అందలేదు.

ఆ అంశాన్ని సాంప్రదాయక అర్థశాస్త్ర సంస్థాపకుడూ, ఆడం స్మిత్, డేవిడ్ రికార్డో, కార్ల్ మార్క్స్‌ల మార్గదర్శకుడూ విలియం పెట్టీ (1623–1687) పట్టుకున్నాడు. 'ఒకడు సరిగ్గా ఒక బుషెల్ ధాన్యాన్ని ఉత్పత్తి చెయ్యగలిగిన కాలంలోనే, పెరూ నేలలోంచి ఒక ఔన్సు వెండిని తవ్వి లండన్‌కి తీసుకురాగలిగితే, అప్పుడు ఒకటి ఇంకోదానికి సహజమైన ధర అవుతుంది' అంటూ శ్రమే విలువసారం అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు (కాపిటల్ 1, పే. 95). ఆయన 'సరుకుల విలువను వాటిలో ఇమిడి ఉన్న శ్రమ పరిమాణాన్ని పోల్చి నిర్ణయిస్తాడు' (థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూ, సం. 1, పే. 355). పేరు తెలియని ఆర్థికవేత్త ఒకరు 1739–40లో కావచ్చు, జీవితావసరాలు '...ఒకదానితో మరొకటి మారకం చేసుకోబడినప్పుడు, వాటి విలువ తప్పనిసరిగా అవసరమైన శ్రమ పరిమాణం చేత, వాటిని ఉత్పత్తి చెయ్యడంలో మామూలుగా గ్రహించబడిన శ్రమ పరిమాణంచేత నియంత్రించ బడుతుంది" అన్నాడు (కాపిటల్ 1, పాదసూచిక 47).

మొట్టమొదటిసారి ఉద్దేశ్యపూర్వకంగా, స్పష్టంగా మారకపువిలువని శ్రమకాలంగా తేల్చినవ్యక్తి బెంజమిన్ ఫ్రాంక్లిన్ (1706–1790). 'రాజకీయ అర్థశాస్త్రపు ప్రాథమిక నియమాన్ని మొదట సూత్రీకరించిన వ్యక్తి... ఫ్రాంక్లిన్' 'విలువ వాస్తవస్వభావాన్ని కనుగొన్నాడు' అన్నాడు మార్క్స్. వర్తకం అంటే శ్రమను శ్రమతో మారకం చేయటం తప్ప మరొకటి కాదు, కనక అన్నివస్తువుల విలువా శ్రమచేత ... న్యాయంగా కొలవబడుతుంది అన్నాడు. మారకం అవుతున్న శ్రమలలోని వ్యత్యాసాల్ని ఉపేక్షించాడు. వాటన్నిటినీ సమాన మానవ శ్రమగా కుదించే అభిప్రాయాన్ని, తెలిసి కాకున్నా, వెల్లడించాడని మార్క్స్ శ్లాఘించాడు (కాపిటల్ 1, పే. 57, పాదసూచిక 1).

శ్రమే అన్ని సరుకుల మారకం విలువలకీ నిజమైన కొలత అన్నాడు ఆడం స్మిత్.

వేటగాళ్ల సమాజంలో ఒక బీవర్ని చంపటానికి పట్టేకాలం ఒక జింకని చంపటానికి పట్టేకాలానికి రెట్టింపు అయితే, ఒక బీవర్ కీ

రెండు జింకలకీ మారకం జరుగుతుంది. తరవాతి సమాజాల్లో అలాకాదు. ధాన్యం ధరలో ఒక భాగం భూస్వామి భూమి కౌలుగా, రెండో భాగం కార్మికుల వేతనంగా, మూడోది రైతు లాభంగా ఉంటుంది. ధాన్యం ధర కౌలు, అద్దె, వేతనం, లాభంగా పరిణమిస్తుంది అంటాడు. వేతనాలూ, అద్దె, లాభమూ మూడూ మారకపు విలువకి వనరు అని స్మిత్ చెప్పాడు. దీన్ని తర్వాత కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ థీరీ అన్నారు.

**విలువ నియమంలో గందరగోళం**

విలువ నిర్ణయం విషయంలో స్మిత్ కుదురుగా లేడు. ఆదిమ సమాజంలో ఒక విధంగానూ, ఆతర్వాత సమాజాల్లో వేరొక విధంగానూ సరుకు విలువ వుంటుందని స్మిత్ అభిప్రాయపడ్డాడు. ఆదిమసమాజాల్లో ఉత్పత్తిసాధనాలు ఉత్పత్తిదారుల చేతిలోనే వుంటాయి. కనక ఉత్పత్తయిన సరుకు విలువను శ్రమపరిమాణం నిర్ణయిస్తుంది. ఉత్పత్తి విలువలో కౌలూ, వడ్డీ, లాభమూ ఉండవు. అందువల్ల ఆకాలంలో శ్రమ పరిమాణమే విలువను నిర్ణయిస్తుంది. అయితే భూస్వామ్యంలో, పెట్టుబడిదారీ విధానంలో భూస్వామీ, వడ్డీ వ్యాపారీ, పెట్టుబడిదారూ వుత్పత్తిసాధనాలకు యజమానులుగా వుంటారు. ఉత్పత్తిదారులు వాళ్లమీద ఆధారపడాలి. ఆ పరిస్థితుల్లో ఉత్పత్తయిన సరుకు విలువ శ్రమని బట్టి మాత్రమే వుండదు. దానికి కౌలూ, వడ్డీ, లాభాలూ కలుస్తాయి. దీన్నిబట్టి భూస్వాములూ పెట్టుబడిదారులూ లేని సమాజానికి వర్తించిన విలువ నియమం వాళ్లు వున్న సమాజానికి వర్తించదు.

'ఈ ధోరణి రికార్డోకి ఆమోదయోగ్యం కాలేదు.' విలువ నియమం వంటి మౌలిక నియమం, సమాజపు అభివృద్ధితో మారిపోదు. 'శ్రమకాలాన్ని బట్టి విలువని నిర్ణయించటం సర్వకాలాలకూ వర్తించే సార్వత్రిక నియమం' అన్నాడు. రికార్డో అర్థశాస్త్రానికి చేసిన గొప్ప సేవ ఇదే.

రాజకీయార్థికశాస్త్రం సైన్సుగా వృద్ధి అయ్యేకొద్దీ బూర్జువా సమాజంలో సరుకువిలువని నిర్ణయించేది ఆ సరుకు ఉత్పత్తికి అవసరమైన శ్రమకాలమేఅనే విషయాన్ని సాంప్రదాయ అర్థశాస్త్రం ఆవిష్కరించింది.

అన్ని సరుకుల ధరలూ నిరంతరం మారుతూ వుండడం పూర్వమే గమనించారు. ఆ పరిస్థితులకు, ధరలు పెరుగుతూ, తరుగుతూ ఉండ డానికి, ఉత్పత్తితో తరచుగా సంబంధం లేదనీ, ధరలు యాదృచ్ఛికంగా నిర్ణయించ బడుతున్నాయనీ అప్పట్లో భావించారు. తర్వాతి కాలంలో 'ఈ యెగుడు దిగుడులు దేనిచుట్టూ జరుగుతాయో ఆ స్థిరమైన కేంద్రబిందువుకోసం అన్వేషించారు. సరుకు విలువ సరుకులో ఉన్నట్టి, దాని వుత్పత్తికి అవసరమైనట్టి శ్రమ చేత నిర్ణయింప బడుతుందని సాంప్రదాయిక అర్థశాస్త్రం కనుగొన్నది. ఈ వివరణతో అది తృప్తిపడింది...'

ఈ వివరణ అరకొర వివరణే అన్నాడు ఎంగెల్స్. శ్రమకు గల విలువను సృష్టించే గుణాన్ని సమగ్రంగా పరిశీలించిన మొదటివాడు మార్క్సేనన్నాడు. స్మిత్, రికార్డోల అభిప్రాయాలలో వున్న లోపాల్ని మార్క్సు సవరించాడు. సమగ్రమైన, శాస్త్రీయమైన శ్రమాశ్రయ విలువ నియమాన్ని రూపొందించాడు. వారికిముందు అభివృద్ధి అయి, కాలపరీక్షకు నిలబడ్డ ప్రతి అంశాన్నీ ఇముడ్చుకున్నాడు. మార్క్సు కాపిటల్ చదివినవారికి ఆయన తన ముందువారి రచనల్ని కూలంకషంగా చదివినట్లు బోధ పడుతుంది. అంతేకాదు, ఎవరు ఎంత గౌరవానికి అర్హులయితే అంతా ఇచ్చాడు. అదే సమయంలో వాళ్లు జవాబు చెప్పలేకపోయిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చాడు. మార్క్సు విలువనియమాన్ని లోపరహితం చేశాడు.

**శ్రమ ద్వంద్వ స్వభావం**

సరుకు అనేది ఉపయోగపువిలువ, విలువల సమ్మేళనం. అలా అది ద్వంద్వ స్వభావి అయినప్పుడు, దాన్ని సృజించిన శ్రమ కూడా ద్వంద్వ స్వభావం కలిగివుండాలని మార్క్సు గ్రహించాడు. మార్క్సు శ్రమ విలువ సిద్ధాంతంలో అనిర్దిష్ట శ్రమ కేంద్ర బిందువు. నిర్దిష్ట అనిర్దిష్ట శ్రమల మధ్య భేదానికి ఆయన చాలా ప్రాముఖ్యత ఇచ్చాడు. 'సరుకుల్లో ఇమిడివున్న శ్రమ ద్వంద్వస్వభావమే రాజకీయ అర్థశాస్త్ర అవగాహనకి ఇరుసు' అన్నాడు (కాపిటల్ 1, పే. 49)

ఇంతకు ముందటి ఆర్థికవేత్తలు సరుకుని శ్రమకు మదింపు చేశారు. అయితే ఆ మదింపు అసంపూర్ణమైనదీ, అస్పష్టమైనదీను. సరుకును శ్రమకు మదింపు చేస్తేనే చాలదు. నిర్దిష్ట, అనిర్దిష్ట రూపాలలో, ద్వంద్వ రూపంలో మదింపు చేయటం అవసరం (మార్క్స్ ఎంగెల్ ఆర్కైవ్స్ సం. 11, పే. 38 – ఉంటంకింపు: కార్ల్ మార్క్సు గ్రేట్ డిస్కవరీ – అఫనాసియేవ్, పే. 24). సరుకులు ఉత్పత్తిచేసేటప్పుడు ఏ నిర్దిష్ట శ్రమ చేస్తున్నప్పుడయినా శారీరక,మానసిక శ్రమ వ్యయమవుతుంది. ఇది సాధారణ శ్రమ (లేబర్ ఇన్ జనరల్). ఇది సమాజంలో సార్వకాలిక మైనది. ఇది కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో, సరుకుల వుత్పత్తిలో, అనిర్దిష్ట శ్రమ రూపం పొందుతుంది. ఆర్థికవేత్తలందరూ, మినహాయింపు లేకుండా, సరుకు ద్వంద్వ స్వభావం అనే మామూలు అంశం వదిలి పెట్టారు. ఉపయోగపు విలువ, మారకపు విలువ కలిగి వున్నట్లయితే ఆ సరుకు ఏ శ్రమకు ప్రతినిధిగా వుందో ఆ శ్రమ కూడా ద్వంద్వ స్వభావాన్ని కలిగి ఉండాలి అని ఎంగెల్స్‌కి రాసిన లేఖలో మార్క్సు అన్నాడు.

నిర్దిష్ట శ్రమ ఉపయోగకర వస్తువులను సృష్టిస్తుంది. బట్ట నేసే పనికీ, కుండలు చేసే పనికీ భేదం వుంటుంది. ఏ వస్తువు ఉత్పత్తి చెయ్యాలన్నా దానికి అనువైన నిర్దిష్ట శ్రమ అవసరం. కనక నిర్దిష్ట శ్రమలను సమాన పరచడం వీలుకాదు. అవి ఒకదానితో ఒకటి విభేదిస్తాయి. నిజమే. అయితే, వాటన్నిటికీ ఒక సామాన్య గుణం వుంది. ఏ వస్తువు చేస్తున్నా, మెదడూ, కండరాలూ, నరాలూ పని చేస్తాయి. మనిషి శక్తి ఖర్చవుతుంది. సరుకులో చేరుతుంది. ఇది అన్ని సరుకుల్లోనూ వుంటుంది. సరుకు ఉత్పత్తి రాకముందు కూడా ఈ శ్రమశక్తి వ్యయం వుంది. అయితే ఉత్పత్తయిన వస్తువులు ఆ బృందం లోని వారే వాడుకునేవారు. అవి సరుకులు కావు. మారకం కావు. అందువల్ల, వెచ్చించిన శ్రమను మారకం కోసం పోల్చాల్సిన పనిలేదు. కాని సరుకుల ఉత్పత్తీ, మారకం ఏర్పడ్డాక మాత్రం వెచ్చించిన శ్రమను పోల్చవలసి వచ్చింది. ఇది చారిత్రక ధాతువు. దీన్ని మార్క్సు అనిర్దిష్ట శ్రమ అన్నాడు. విలువని ఏర్పరచేది ఇదే. అన్ని సరుకుల్లోనూ ఉండే ఉమ్మడి అంశం ఇదే. సరుకుల సమానత్వాన్ని తేల్చేది ఇదే.

ప్రతి ఉత్పాదకుని శ్రమా మొత్తం సమాజపు శ్రమలో భాగం. అంటే అది సామాజిక శ్రమ. తమ వుత్పాదితాల్ని అంగట్లో అమ్మేటప్పుడు అన్ని నిర్దిష్ట శ్రమల్నీ అనిర్దిష్ట శ్రమకు కుదించాలి. అప్పుడు వారి శ్రమ సామాజిక స్వభావం తెలుస్తుంది.

ఒకే సరుకు అనేకమంది తయారుచేస్తారు. వాళ్ల పరిస్థితుల్ని బట్టి వేర్వేరు పరిమాణాల్లో శ్రమ వెచ్చిస్తారు. ఒకే రకం సరుకులకు వేరు వేరు శ్రమకాలాలు లెక్కకు రావు. అవి సామాజికంగా అవసరమైన శ్రమ కాలానికి కుదించబడతాయి.

'సామాజికంగా అవసరమైన శ్రమకాలం అంటే, ఆకాలంలో అమలులోవున్న సాధారణ పరిస్థితులలో సగటు నైపుణ్యపు ప్రమాణంతో, తీవ్రతతో ఒక వస్తువును వుత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమకాలం" అని మార్క్స్ నిర్వచించాడు. సరుకు విలువని నిర్ణయించేది సామాజికంగా అవసరమైన శ్రమకాలం అని మార్క్స్ నిర్ధారించాడు.

**ఆదనపు విలువ-విలువ నియమంతో చిక్కులు**

మార్క్సు పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. ఆయనకు ముందే సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తలు శ్రమాశ్రయ విలువ సిద్ధాంతానికి పునాదులు వేశారు.

పెట్టుబడికీ శ్రమకీ మారకంలో "శ్రమవిలువ దేనిచేత నిర్ణయించ బడుతుంది? శ్రమచేతనే విలువ నిర్ణయించ బడుతుందనే నియమాన్ని శ్రమ అనే సరుకుకి అన్వయించినప్పుడు అర్థశాస్త్రవేత్తలు అంతర్వైరుధ్యం లో పడ్డారు. శ్రమ విలువ ఎలా నిర్ణయించబడుతుంది? ఆ శ్రమలో వున్న అవసరశ్రమ చేత. ఒక గంట శ్రమవిలువ ఒక గంట శ్రమకు సమానం అనిమాత్రమే మనకు తెలిస్తే, దాన్నిగురించి బొత్తిగా మనకేమీ తెలియదన్నమాట. యిది మనల్ని వెంట్రుక వాసి కూడా గమ్యం దగ్గరకి తీసుకుపోదు; మనం ప్రదక్షిణం చేస్తూనే వుంటాం." ('వేతన శ్రమ - పెట్టుబడి' కి ఎంగెల్స్ ప్రవేశిక, సంకలిత రచనలు-2, పే 84-85).

శ్రమ సృజించిన విలువనే వాళ్లు శ్రమవిలువ అనుకున్నారు. అందువల్లే, శ్రమవిలువని తేల్చే పని పెట్టుకున్నారు. అది తేలలేదు, తేలేదీ కాదు.

రికార్డో పెట్టుబడికీ శ్రమకీ మారకం విషయంలో సమానత్వం గురించి ఆలోచించాడు. ఆయనకొక చిక్కు వచ్చింది. పెట్టుబడిదారు కార్మికుని శ్రమకు శ్రమవిలువ చెల్లించి చాకిరీ చేయించుకుంటున్నాడు. లాభం పొందుతున్నాడు. శ్రమవిలువ పూర్తిగా కార్మికుడికిస్తే మరి లాభం ఎక్కడనుంచి వస్తుంది? కార్మికునికి తక్కువ ఇస్తే సమాన విలువల మధ్య మారకం జరగలేదని అర్థం గదా? శ్రమ విలువ సిద్ధాంతమే తప్పవుతుంది గదా? సమాన విలువలే మారకం కావాలి, లాభం రావాలి. శాస్త్రీయంగా దీన్ని రుజువు చెయ్యలేకపోయాడు రికార్డో. ఇదే ఆయన్ని వేధించిన సమస్య. వాస్తవానికీ సూత్రానికీ మధ్య పొంతన కుదర్చలేక పోయాడు. విలువ సిద్ధాంతాన్ని వదులుకోలేకా, వాస్తవంగా వస్తున్న లాభాన్ని భ్రమ అనలేకా సతమతమయ్యాడాయన.

రికార్డో శిష్యుడిగా జాన్ స్టువర్ట్ మిల్ (1806-1873) శ్రమనీ, పెట్టుబడినీ శ్రమ వేర్వేరు రూపాలుగా నిర్వచించాడు. "శ్రమా, పెట్టుబడీ...ఒకటి ప్రస్తుత శ్రమ...మరొకటి నిల్వపడ్డ శ్రమ" అన్నాడు. తక్షణ శ్రమ తక్కువ నిల్వశ్రమతో మారకమవుతుంది అని అభిప్రాయ పడ్డాడు. అసమాన విలువల మారకం అన్నమాట. ఇది విలువ నియమాన్ని భంగపరుస్తుందని అంగీకరించడమే అన్నాడుమార్క్స్ (అదనపు విలువ సిద్ధాంతాలు-3, పే. 98-99).

**శ్రమా - శ్రమశక్తీ**

కార్మికుడు అమ్ముతున్నది శ్రమని కాదు, శ్రమశక్తిని అని మార్క్స్ నిర్ధారించాడు. శ్రమశక్తి సరుకు. శ్రమ కాదు. శ్రమ అనేది చలనంలో వున్న శ్రమశక్తి. కనుక శ్రమకి విలువ వుండదు. శ్రమశక్తి అనే మాట మార్క్సుకి ముందు వాడుకలో లేదు. శ్రమశక్తి విలువనే శ్రమవిలువ అనేవారు. మార్క్స్ ప్రకారం శ్రమకి విలువ వుండదు. ఎందుకంటే అది సరుకు కాదు. కనక శ్రమవిలువ అనేది అర్థంలేని పదబంధం. శ్రమశక్తి ధర లేక విలువ పైకి శ్రమ ధరగా, విలువగా కనిపిస్తుంది. మార్క్స్ శ్రమశక్తి విలువ అనే అర్థంలోనే శ్రమ విలువ అనే మాట వాడాడు. కారణం ఆ మాట ప్రజల్లో విశేషమైన ప్రాచుర్యంలో ఉండటమే.

సాంప్రదాయిక అర్థశాస్త్రం పరిష్కరించలేకపోయిన సమస్యని మార్క్స్ ఎత్తుకున్నాడు. సమానవిలువలే మారకం కావాలి. అయినా లాభం రావాలి. ఈ వాస్తవ పరిస్థితి కళ్లకు కనబడుతున్నదే. కార్మికులు శ్రమ చేస్తున్నారు. బదులుగా వేతనం పొందుతున్నారు. ఇది శ్రమకీ, పెట్టుబడికీ మారకం. శ్రమచేయని పెట్టుబడిదారు లాభం పొందుతున్నాడు. శ్రమే విలువకు ఏకైక వనరు అయితే లాభం వుండకూడదు. లేదా, శ్రమకీ, పెట్టుబడికీ నిరంతరం జరుగుతున్న మారకం అసమానమయినది అయి తీరాలి. వాళ్లు కొట్టుమిట్టాడిన వైరుధ్యం ఇదే.

'అందుచేత, లాభాల సాధారణ స్వభావాన్ని వివరించడానికి, సగటున, సరుకులు తమ అసలు విలువకు అమ్ముడవుతాయనీ, వాటిని వాటి విలువకు అంటే, వాటిలో నిక్షిప్తమైన శ్రమ పరిమాణపు అనుపాతంలో అమ్మడం ద్వారా లాభం వస్తుంది అన్న సిద్ధాంతం నుండి బయలుదేరాల్సి వుంటుంది. ఈ ప్రాతిపదికపై సమస్యను వివరించలేక పోయినట్లయితే, దాన్నసలు వివరించనే లేం. నిత్యజీవితానుభవాన్ని బట్టి యిది విరోధాభాసమైన అసంగత విషయంగా కనిపిస్తుంది. కాని భూమి సూర్యునిచుట్టూ తిరగటం, భగ్గునమండే రెండు వాయువుల కలయికద్వారా నీరు ఏర్పడటం కూడా విరోధాభాసమైన విషయాలే. నిత్యజీవితానుభవరీత్యా విజ్ఞాన శాస్త్రీయ సత్యాలను పరిశీలిస్తే, నిత్యజీవితానుభవమెప్పుడూ వస్తువుల భ్రమాత్మక బాహ్యాకృతులనే చూస్తుంది కనుక, అవి ఎల్లప్పుడూ విరోధాభాసగానే కానవస్తాయి' (మార్క్స్ ఎంగెల్స్ సంకలిత రచనలు, భాగం 2, పే. 45).

**రెండు రకాల చలామణీలు**

డబ్బుకీ సరుకులకీ రెండురకాల చలామణీలున్నాయి. ఒకటి కొనడం కోసం అమ్మడం: గంపలమ్మి, బియ్యం కొనడం. ఇది సరుకు-డబ్బు-సరుకు. ఇక్కడ రెండు సరుకులూ భిన్నమయినవి. ఈ మారకపు ఉద్దేశం ఉపయోగపువిలువ. ఈ చర్యతో అది ఆగిపోతుంది. రెండోది అమ్మడం కోసం కొనడం. అంటే డబ్బు-సరుకు-డబ్బు. ఇక్కడ మొదటిదీ డబ్బే చివరదీ డబ్బే. గుణాత్మకంగా ఒకటే. పరిమాణంలో మాత్రమే తేడా

వీలవుతుంది. సరిగ్గా పెట్టుబడిదారు ఆశించేది అదే. దీని సంకేతం డ-స-డ'. కాని సమాన విలువల మారకం ప్రాతిపదికన ఇది ఎలా సాధ్యపడుతుంది?

డ-స-డ' చలనం డబ్బుని పెట్టుబడిలోకి మారుస్తుంది. డబ్బు దానికదిగా పెట్టుబడికాదు.

మొదట మదుపు పెట్టిన ధనంకంటే 'సరుకునుంచి మరింత ఎక్కువ ధనాన్ని తిరిగి రాబట్టటం కోసం సరుకు రూపంలోకి మార్చబడిన ధనమే పెట్టుబడి.

కొత్తగా రంగంలోకి (మార్కెట్లోకి) దిగే పెట్టుబడి మొదట డబ్బు రూపంలోనే ఉంటుంది. అది ఒక నిర్దిష్టప్రక్రియ ద్వారా పెట్టుబడిలోకి మారుతుంది. కేవలం డబ్బుకీ, పెట్టుబడి అయిన డబ్బుకీ తొలితేడా వాటి చలామణీ రూపం తప్ప మరేమీకాదు.

మొదట పెట్టిన డబ్బుకంటె చలామణీ చివరలో ఎక్కువ పొందుతాడు. ఈ ప్రక్రియ కచ్చితమైన రూపం డ - స - డ' లో డ' = డ + డ= మొదట మదుపు (అడ్వాన్స్) పెట్టిన డబ్బు + పెరుగుదల. ఈ పెరుగుదలని లేక ఎక్కువని అదనపు విలువ అన్నాడు మార్క్స్. మదుపు పెట్టిన విలువ చలామణీలో అలాగే వుండి, అదనపు విలువని కూడా తనకు తాను కలుపుకుంది. ఈ చలనమే దాన్ని పెట్టుబడిలోకి మారుస్తుంది. డబ్బునుంచి సరుకుల్లోకీ, సరుకులనించి డబ్బులోకీ మారుతూ, అదేసమయంలో పరిమాణాన్ని మార్చుకుంటుంది. విలువ అనేదే ఇక్కడ క్రియాశీలమైనది. విలువ తనకు విలువను కలుపు కుంటుంది. అయితే స-డ-స వలయంలో లాగే డ-స-డ' లో కూడా సరుకుల విలువల సమానత్వం అవసరమైన షరతు.

అయితే డబ్బు రెండు రూపాల్లో ఒకటి మాత్రమే. అది సరుకురూపం తీసుకుంటేనే గాని పెట్టుబడి కాదు. డ-స-డ' అనేది పెట్టుబడి సాధారణ సూత్రం.

మరి అదనం ఎక్కడినించి వస్తున్నది? సరుకుల మారకమే విలువని తేదు. కనక చలామణీలో కనబడనిది ఏదో నేపథ్యంలో జరిగి వుండాలి.

పెట్టుబడిదారు కార్మికునికి రోజుకూలీ యిచ్చి దూదినుంచి నూలు తీయిస్తాడు. దూది విలువ అలానే వుంటుంది. కాని నూలులో కొత్తగా శ్రమ కలుస్తుంది. ఆమేర విలువ పెరుగుతుంది. ఇప్పుడు నూలును దాని విలువకే అమ్ముతాడు అయినా అదనపు విలువ పొందుతాడు.

అదనపు విలువ అనే భావాన్ని ప్రవేశపెట్టినవాడు మార్క్స్. అంతకు ముందు వాళ్లు అందులోని భాగాల్ని - లాభం, వడ్డీ, భూమి అద్దె/ కౌలు - విడివిడిగా చూశారు. ఆర్థికవేత్తలందరూ ఒక పొరపాటు చేశారు. అదనపువిలువని దానికదిగా, స్వచ్ఛరూపంలో ఎవ్వరూ పరిశీలించలేదు. దాని ప్రత్యేకరూపాలయిన లాభంగా, అద్దెగా పరిశీలించారు (థియరీస్ ఆఫ్ సర్ ప్లస్ వాల్యూ సం. 1 పే. 40).

అదనపు విలువను దాని ప్రత్యేక రూపాలయిన లాభం, వడ్డీ, అద్దె వగైరాల నుంచి విడిగా, స్వతంత్రంగా చూడటం తన పుస్తకంలోని రెండు మంచి అంశాలలో ఒకటని పెట్టుబడి మొదటి భాగం ప్రచురించాక, ఎంగెల్స్ కి 1867 ఆగస్ట్ 24 న రాసిన ఉత్తరంలో మార్క్స్ అన్నాడు.

మార్క్సుకు ముందువాళ్లు కార్మికుడు అమ్మేది తన శ్రమని అన్నారు. ప్రస్తుత బూర్జువా ఆర్థికవేత్తలు దాన్నే కొనసాగిస్తున్నారు. మార్క్స్ దీన్ని ఖండించాడు. అమ్మేది శ్రమను కాదు, శ్రమశక్తిని అని రుజువుచేశాడు. ఇది ఆయన శాస్త్రీయ ఘనతల్లో ఒకటి.

శ్రమవిలువ దగ్గర బయలుదేరిన సాంప్రదాయ ఆర్థికవేత్తలకు యిబ్బంది ఎదురయింది. శ్రమశక్తి దగ్గర బయలుదేరితే చిక్కు వీడిపోతుంది. శ్రమశక్తి ఒక సరుకు. అయితే అది విశిష్టమైన సరుకు. విలువను సృష్టించటం దాని ఉపయోగపు విలువ.

పెట్టుబడిదారు కార్మికుల శ్రమను డబ్బుతో కొన్నట్లు కనబడుతుంది. వాళ్లు తమ శ్రమను డబ్బుకుగాను పెట్టుబడిదారుకు అమ్ముతారు. కాని యిది పైకి కనిపించేది మాత్రమే. నిజానికి వాళ్లు అమ్మేదీ, అతను కొనేదీ శ్రమశక్తిని. శ్రమవిలువ సిద్ధాంతం కేంద్రంగా రాజకీయ అర్థశాస్త్రాన్ని నిర్మించటానికి రికార్డో ప్రయత్నించాడు గాని కార్మికులు అమ్ముతున్నది శ్రమని కాదనీ శ్రమశక్తిననీ గ్రహించలేదు అంటాడు మార్క్స్.

పెట్టుబడి సాధారణ సూత్రం డ-స-డ' లో మొదటి డబ్బు కంటే రెండోది ఎక్కువ పరిమాణం. మొదటి చర్య డబ్బుతో సరుకును కొనడం. ఈ చర్య డబ్బుని పెంచదు. రెండో చర్య సరుకుని డబ్బుకు అమ్మడం. ఇందులోనూ డబ్బు పెరగదు. మరి చివరలో ఎక్కువ డబ్బు ఎలా వస్తున్నది? ఇది సాధ్యం కావాలంటే మొదటి చర్యలో కొన్న సరుకు విలువకంటె రెండోచర్యలో అమ్మే సరుకు విలువ ఎక్కువై తీరాలి. ఈ విలువ పెరగడం మొదటి చర్యలో కొన్న సరుకు వల్ల జరగాలి. అదికూడా ఆ సరుకు విలువలో భాగం కాదు. అందువల్ల ఒకనిర్ధారణకు రాకతప్పదు: అదేమంటే, ఆ సరుకు విలువను సృష్టించేదై వుండాలి. అదికూడా తన విలువకంటె ఎక్కువ విలువను. అప్పుడు మాత్రమే డ-డ' అవుతుంది. అలాంటి విశిష్ట లక్షణం గల సరుకు లభ్యమయింది. అదే శ్రమశక్తి, పనిచేయగల సామర్థ్యం. విలువని ఏర్పరిచే సరుకు అదొక్కటే. అందుకే అది విలక్షణమైన సరుకు.

మరి దాని విలువ ఎలా నిర్ణయమవుతుంది? అన్ని సరుకుల విలువ లాగానే. అంటే దాని వుత్పత్తికి అవసరమయ్యే శ్రమకాలం చేత. శ్రమ శక్తి మనిషికి బయట వుండదు. సజీవ మానవుని శక్తిగా వుంటుంది. కనక అతని వుత్పత్తికి కావలసింది పోషణే. అందుకు కొంత పరిమాణంలో జీవితావసరవస్తువులు కావాలి.

శ్రమశక్తి వుత్పత్తికి అవసరమయ్యే శ్రమకాలం, ఆ జీవితావసర వస్తువుల వుత్పత్తికి అవసరమయ్యే శ్రమకాలమే. ఆ విలువ చెల్లించి ఒక రోజు శ్రమశక్తిని కొన్నా గాని, కార్మికుడు దాన్ని చేతుల్లో పెట్టలేడు. వచ్చి పనిచేస్తాడు. బట్ట నేశాడనుకుందాం. బట్టగా మారేది దారం. మగ్గం కాదు. అయినా మగ్గం లేనిదే బట్ట తయారవదు. ఇవి పాదార్థిక అంశాలు. శ్రమ మానవాంశం. రెండూ వుంటేనే శ్రమప్రక్రియ సాధ్యమవుతుంది.

శ్రమవిలువ సిద్ధాంతాన్ని పట్టుకున్న స్మిత్, రికార్డోలు కార్మికుడు అమ్ముతున్నది శ్రమ అనుకున్నారు. వాళ్ల దృష్టిలో శ్రమే సరుకు. సరుకు విలువని నిర్ణయించేది ఆ సరుకులోవున్న శ్రమే. ఆలెక్కన శ్రమలో ఇమిడివున్న శ్రమే శ్రమవిలువని నిర్ణయించాలి. ఇలా శ్రమవిలువ శ్రమే అనే వలయంలో చిక్కుకున్నారు.

అర్థశాస్త్రవేత్తలు శ్రమే సరుకు అనుకున్నారు. పెట్టుబడిదారు కార్మికుని శ్రమను కొంటున్నాడు. మారకం విలువ చెల్లించి, ఉపయోగపు విలువను పొందుతున్నాడు. అతని చేత శ్రమ చేయించి సరుకులు ఉత్పత్తి చేయిస్తున్నాడు. ఆ సరుకులు కార్మికునికి చెందవు. వాటిపై సర్వహక్కులూ పెట్టుబడిదారువే. వాటిని వాటి విలువలకే అమ్ముతున్నాడు. ఈ వాదనతో వచ్చిన చిక్కేమంటే సమాన మారకాలే జరుగుతుంటే లాభం ఎలా వస్తుంది? రాకూడదు. కాని వస్తున్నదే! అంటే శ్రమవిలువ నియమమే సరయినది కాదా?

'ఒక మనిషి విలువ...మిగతా వస్తువుల విలువ లాగ అతని ధర, అంటే, అతని శక్తిని వుపయోగించుకునేందుకు ఎంత ఇవ్వబడుతుందో అంతన్నమాట' (కాపిటల్ 1, పే. 167, పాదసూచిక 2) అని థామస్ హాబ్స్ తన లెవియాథాన్ పుస్తకం (1839–44) లో చెప్పాడు. ఆయన తర్వాతివారు ఈ ఆవిష్కరణని గమనించలేదు అంటాడు మార్క్స్ (వేతనం, ధర, లాభం, మార్క్స్ ఎంగెల్స్ సంకలిత రచనలు, భాగం 2, పే.46).

ఒక ఉపయోగపు విలువని ఉత్పత్తిచేసేటప్పుడు, తనలో వున్న ఏ మానసిక శారీరక సామర్థ్యాల్ని మనిషి నియోగిస్తాడో ఆ సామర్థ్యాల మొత్తమే శ్రమశక్తి లేక పనిచేయగల సామర్థ్యం అని శ్రమశక్తిని నిర్వచించాడు (కాపిటల్ 1, పే. 164). అలాగే, 'శ్రమశక్తి విలువ శ్రమశక్తిని సృష్టించడానికీ, అభివృద్ధి చెయ్యడానికీ, కొనసాగించడానికీ కావలసిన జీవితావసరాల విలువ చేత నిర్ణయించబడుతుంది' అన్నాడు (సంకలిత రచనలు, భాగం 2, పే. 48).

సమానకాలు మారకమైనా, అసమానకాలు మారకమైనా అదనపు విలువ రాదు. చలామణీ విలువను చేర్చదు. మారకం విలువను చేర్చదు. ఇవన్నీ మార్క్స్ కి ముందువాళ్లే చెప్పారు. వర్తకుని పెట్టుబడి, వడ్డీ పెట్టుబడికి విభిన్న రూపాలు. అయితే ఇవి ఆధునిక పెట్టుబడి ప్రామాణిక రూపం కంటే ముందునుంచే వున్నాయి. డబ్బు పెట్టుబడిలోకి మారడాన్ని సరుకుల మారకపు నియమాల పునాది మీద వివరించాలి. సమానమైన వాటి మారకం అందుకు ఆరంభ బిందువు కావాలి. డబ్బుని పెట్టుబడి లోకి మార్చాలని వచ్చిన తొలి పెట్టుబడిదారు సరుకుల్ని వాటి విలువలకే కొనాలి. వాటి విలువలకే అమ్మాలి. ప్రక్రియ చివరలో చలామణీ మొదట పెట్టిన డబ్బుకంటె ఎక్కువ డబ్బు లాగాలి. పూర్తి పెట్టుబడిదారుగా అతని అభివృద్ధి చలామణీ రంగం లోపలా, వెలుపలా జరగాలి. ఇవి సమస్య షరతులు.

**మార్క్స్ వివరణ**

ఇవన్నీ ఎలా నెరవేరాయో మార్క్స్ వివరించాడు. 'మార్కెట్‌లో ఎంతో విలక్షణమైన సరుకు ఒకటి ఉంది. దాని ఉపయోగపు విలువ అంతా మారకపు విలువని ఉత్పత్తి చేయడమే. అలాంటి సరుకును కనుగొన్నప్పుడు మాత్రమే ఈ చిక్కు సమస్య విడిపోతుంది. అలాంటి సరుకు ఉంది – అదే శ్రమశక్తి. ఒక సరుకు సొంతదారు తన శ్రమతో విలువని సృజించగలడు, కాని స్వయం వర్ధమాన విలువను సృజించ జాలడు. తన సరుకుకు తాజాశ్రమ కలిపి మరికొంత విలువను చేర్చగలడు. ఉదాహరణకి, తనదగ్గరున్న తోలుతో బూట్లు తయారు చెయ్యడం ద్వారా. అదే తోలులో ఇప్పుడు ఎక్కువ విలువ ఇమిడి ఉంటుంది, ఎక్కువ శ్రమ ఇమిడి ఉంటుంది కనక. అయితే తోలు విలువ అంతకు ముందెంతో ఇప్పుడూ అంతే. అది వ్యాకోచించలేదు. బూట్లు తయారు అవుతున్నప్పుడు అదనపు విలువను చేర్చలేదు.

కనక సరుకు ఉత్పత్తిదారు ఇతర సరుకు ఉత్పత్తిదారులతో సంబంధంలోకి రాకుండా, చలామణీ రంగం బయట, విలువని పెంచలేడు. ఆ కారణంగా డబ్బునిగానీ, సరుకునిగానీ పెట్టుబడిలోకి మార్చలేడు. అంటే, చలామణీ వల్ల పెట్టుబడి ఉత్పత్తి సాధ్యం కాదు. చలామణీ వెలపల ఉత్పత్తవటం అసాధ్యం.

ఒక కార్మికుడి జీవితావసర వస్తువులు ఒక రోజుకు సరిపడేవి ఉత్పత్తి కావటానికి 4 గంటల సామాజిక శ్రమ పడుతుందనుకుందాం. ఆతర్వాత కూడా అతను పనిచెయ్యగలడు. మరో 4 లేక 6 గంటలు. ఇది అదనపు శ్రమ. ఆ కాలంలో తయారయిన సరుకులు యజమానివే. వాటిని అమ్మినప్పుడు అదనపు విలువ దక్కుతుంది. కార్మికుడు తన శ్రమశక్తి మారకపు విలువ పొంది, ఉపయోగపు విలువను వదులుకున్నాడు. అంటే ఒకరోజు శ్రమశక్తి ఉపయోగపు విలువ అంతా శ్రమ యజమానికి చెందుతుంది. కనక అతను రోజంతా యజమాని కొరకు శ్రమ చెయ్యాలి. ఒక రోజు శ్రమశక్తిని పోషించటానికి సగం రోజు శ్రమ మాత్రమే చాలుననే పరిస్థితి ఈ శ్రమశక్తి చేత రోజంతా పని చేయించవచ్చునన్న విషయమూ, అందుచేత దానిని రోజంతా ఉపయోగించడం ద్వారా సృష్టించబడే విలువ దాని రోజువారీ విలువకు రెట్టింపు అయిన విషయమూ – ఇదంతా కొనేవాని అదృష్ట విశేషమే గాని, అమ్మినవానికి జరిగిన అన్యాయం యెంతమాత్రమూ కాదు. షరతులన్నీ వర్తించాయి. అదనపు విలువ చేకూరింది. డబ్బు పెట్టుబడిగా, స్వయం వర్ధమాన విలువగా మారింది.

పెట్టుబడిదారు అదనపు శ్రమకాలాన్ని వీలయినంత పొడిగించే యత్నం చేస్తాడు. అది అతనికి ప్రయోజనం కనక. అయితే ఈ పొడిగింపు కార్మికుల ప్రయోజనాల్ని దెబ్బగొడుతుంది. వర్గ పోరాటానికి దారి పడుతుంది. మామూలు పనిదినాన్ని తేల్చటం ఇరు వర్గాల మధ్య వందల ఏళ్లపాటు సాగిన పోరాట ఫలితం.

ఆ సరుకుల ఉత్పత్తికి పట్టే కాలం 'అవసరశ్రమకాలం'. ఆ కాలంలో వ్యయమైన శ్రమ 'అవసరశ్రమ'. ఆతర్వాత కూడా కార్మికుడు పనిచేస్తాడు. ఈ రెండోభాగం 'అదనపుశ్రమకాలం'. వ్యయమైన శ్రమ 'అదనపు శ్రమ'. ఇది అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. శ్రమప్రక్రియ చివరలో మొదటపెట్టిన డబ్బుకంటె ఎక్కువ వస్తుంది. ఆ ఎక్కువే డబ్బును పెట్టుబడిలోకి మారుస్తుంది. పెట్టుబడిలోకి మారిన డబ్బు మరల చలనంలోకొస్తుంది. ఇది అలా కొనసాగుతూనే వుంటుంది.

విలువను నిర్ణయించేది సామాజికంగా అవసరమైన శ్రమ. కార్మికుడు అమ్మేదీ, పెట్టుబడిదారు కొనేదీ శ్రమశక్తిని, శ్రమను కాదు. శ్రమ సరుకు కాదు. కనక శ్రమవిలువ అనేది అర్థంలేని మాట.

సమాన విలువలు మారకం అవుతూనే అదనపు విలువ వస్తుంది. ఇవి మార్క్స్ శాస్త్రీయంగా రుజువుచేసిన విషయాలు. వీటిని తప్పన్నా, వక్రీకరించినా, అది మార్క్సిజం అవదు. మహా అయితే మరొకరిజం కావచ్చు.

*(రచయిత రిటైర్డ్ లెక్చరర్)* వీ

# విమర్శనారహిత విమర్శ

**- విద్యాసాగర్**

'పల్లెను మింగిన పెట్టుబడి' అనే పుస్తకంలో ప్రధానంగా గ్రామీణ ఆర్థిక రంగంపై పెట్టుబడి ఆధిపత్యాన్ని, వ్యవసాయాన్ని, అనుబంధ వృత్తులను పెట్టుబడి తనకు అనుబంధ పరిశ్రమలుగా మార్చుకున్న పద్ధతులను చర్చించాను. దీనికోసం రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లాలుగా 'పేరు పొందిన' విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని గ్రామాలను (ఒకప్పటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా) క్షేత్రస్థాయి పరిశీలనకు ఎంచుకున్నాను.

ఈ పుస్తకంపై తొలి వ్యాసాన్ని జి.ఎస్. రామ్మోహన్ 'సారంగ' పత్రికలో రాశారు. దీనిపై చర్చ నడిచింది. ప్రధానంగా సాహిత్యకారులు ఆ చర్చలో పాల్గొన్నారు. 'చర్చ జరుగుతున్న తీరు చర్చలో పాల్గొనాలనే ఆసక్తిని చంపేసిందని' ఎన్. వేణుగోపాల్ ఆ సందర్భంలో పేర్కొన్నారు. అయితేనేం! తాను సంపాదకత్వం వహిస్తున్న వీక్షణం పత్రిక ఫిబ్రవరి సంచికలో ఒక సమీక్షా వ్యాసం రాశారు. (సౌలభ్యం కోసం ఎన్. వేణుగోపాల్‌ని ఇక నుంచి ఎన్ అని రాస్తాను)

వ్యవసాయం, మత్స్యపరిశ్రమ, అడవులు, చేనేత, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తులవారీగా ఉన్న గ్రామీణ సమాజ ప్రజానీకపు అనుభవాలు ఈ పుస్తకానికి తొలి వనరు. ఇదే అంశాలమీద దేశ, విదేశాలలో జరిగిన పరిశోధనలు రెండవ వనరుగా ఉన్నాయి. గత 60 ఏళ్ల కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ రంగంపై వెలువరిస్తున్న నివేదికలు, గణాంకాలు, విధానాలు, బడ్జెట్ పత్రాలు, ఆర్థిక సర్వేలు మూడవ వనరుగా ఉన్నాయి. మార్క్సిస్టు తత్వవేత్తలు తాము చేసిన పరిశోధనలకనుగుణంగా చేసిన నిర్ధారణలు నాలుగవ వనరు. ఆ విధంగా ఈ నాలుగు వనరుల ప్రాతిపదికమీద ఈ పుస్తక రచన సాగింది. అయితే ఎన్ ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే విమర్శకు దిగారు. ఆ విధంగా ఎన్ విమర్శకు ప్రాతిపదిక నాకు అర్థం కాలేదు. తను ఈ అంశాలను గురించి ఏమనుకుంటున్నదీ ఎక్కడా బైట పెట్టలేదు. లేదా తను అనుకుంటున్న విషయాలకు ప్రాతిపదిక ఏమిటో బయటపెట్టలేదు. తన భావాలకు ప్రాతిపదికగా ఎవరి బోధనల సారాంశం ఉన్నది కూడా అతను చెప్పలేదు. అనేక సందర్భాలలో అతను దౌత్యభాష పద్ధతిని ఎంచుకున్నాడు.

**ఎ) విమర్శ – పద్ధతి :** విమర్శ చేసే పద్ధతి ఎలా ఉండాలన్న దానిపై 'అరుణతార' సమీక్షల ప్రత్యేక సంచికలో (జనవరి, 1998) సంపాదకీయ వ్యాఖ్య ఇలా పేర్కొంది 'ప్రమాదమల్లా ఆ ప్రమాణం సమీక్షకుడి వ్యక్తిగత ఇష్టాయిష్టాల దగ్గరికి, అభిరుచుల దగ్గరకు కుంచించుకుపోయినపుడు, ప్రమాణం స్వీయమానసికమైనపుడు ప్రమాదం సమీక్షించబడ్డ రచనకే కాదు, ప్రమాణానికి కూడా ఏర్పడుతుంది. అది కాలం సైజు సమీక్ష కావచ్చు. పేజీల కొద్దీ సాగే సమీక్ష కావచ్చు. రచనని ఆకాశానికి ఎత్తడం, పాతాళానికి తొక్కడం, లేదా భూమికీ ఆకాశానికీ కాకుండా నిలబెట్టడం జరుగుతుంది. నిజానికి ఇది సమీక్ష తాలూకా విషాద సన్నివేశం'.

ఈ సలహాను ఎన్ ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు సరికదా దానికి సరిగ్గా వ్యతిరేక దిశలో ఈ విమర్శను సాగించారు.

**బి) పరిశోధకుడు – ముందస్తు అభిప్రాయాలు అనే అంశంపై :** పరిశోధకుడు కొన్ని ముందస్తు అభిప్రాయాలను ఏర్పాటు చేసుకుని ఈ పరిశోధనా గ్రంథాన్ని తీసుకువచ్చాడనే ప్రాతిపదికను సిద్ధం చేయడానికి ఈ విమర్శలో చాలాభాగమే ఎన్ కేటాయించారు. అయితే నేను అలా చేశానా? లేదా? అనే అంశాన్ని కాసేపు పక్కన పెడితే కనీసం అలా చేయడం తప్పు అనే నిర్ధారణను ఎన్ చేయలేదు. అక్కడకూడా అతను దౌత్యవేత్త భాషనే ఉపయోగించారు. దీనిని గురించి ఎందుకు చర్చించాలంటే కాలమ్‌రీత్యా చూసినపుడు ఎన్ గారిది 8 కాలమ్‌ల వ్యాసం. అందులో 2 కాలమ్‌లు దాటేయి అంటే 25 శాతం జాగాను ఈ అంశమే చర్చించింది. ఆయన ఈ జాగాను, నా'మాట'ను, అధ్యయన పద్ధతి గురించి వాడారు. ఇంతచేసీ ఆయన నా 'మాట' లోని మొదటి పేరాను మినహాయించి మిగతా వాటన్నింటి గురించి రాశారు. నా 'ముందస్తు అవగాహన'ను నిర్ధారించే పనిలో నేను రాసిన తొలి పేరానే 'ప్రస్తావించకుండా' వదిలిపెట్టారు.

నా మాట ఇలా ప్రారంభమయింది. 'గత కొన్ని సంవత్సరాలుగా నా సన్నిహిత మిత్రుల నుండి లేదా ఉనికిలో ఉన్న రచనల నుండి నేను వింటున్నదీ లేదా చదువుతున్నదీ ఒకటే, గ్రామాలు మునుపటిలా లేవు. గ్రామాలు మారిపోయాయి. ఈ మారిపోయిన గ్రామాల పట్ల పూర్తి స్థాయి విచారాన్నే నేనెరిగిన అన్ని బృందాలు ప్రకటిస్తున్నాయి. దాదాపు నేను కూడా ఈ విచారంలో పాలుపంచుకున్నాను. ఈ మారిపోయిన క్రమం అత్యంత విధ్వంసకరమైనదనే అని నేను నమ్మాను. దానికి అకనుగుణంగానే నేను అనేక వాదనలు చేశాను. అవి లిఖిత రూపంలో లేకపోవచ్చుగానీ మిత్రబృందాల మధ్య చర్చల రూపంలో సాగాయి'.

అంటే నేను బయల్దేరిన దిశ నుంచి చాలా దూరంగా కాదు నిజానికి వ్యతిరేక దిశలోకి నా నిర్ధారణలు వచ్చాయన్నమాట. కాబట్టి ముందస్తు నిర్ధారణతో విషయాన్ని పరిశీలించడానికి పూనుకోవడం అనే ప్రశ్నే తలెత్తలేదు.

**సి) పెట్టుబడిదారీ తగినంత అభివృద్ధి చెందక పోవడం అనే అంశం:** నిజానికి ఏ సమాజంలోనూ ఒకే ఉత్పత్తి విధానం ఉనికిలో ఉండదు. ఏకకాలంలో భిన్న ఉత్పత్తి విధానాలు ఉనికిలో ఉంటూనే ఉంటాయి. ఇందులో ఏ ఉత్పత్తి విధానం చోదక శక్తిగా పనిచేస్తున్నదో పరిశీలించడమే సామాజిక శాస్త్రవేత్తల కర్తవ్యంగా ఉంటుంది. నిజానికి పెట్టుబడిదారీ విధానం తగినంతగా అభివృద్ధి చెందకపోవడం అనే సమస్య కూడా పెట్టుబడిదారీ విధాన సంపూర్ణ అభివృద్ధి ఫలితంగా వచ్చే సమస్యలతో పాటూ వుంటుందని మార్క్స్ స్వయంగా రాశాడు. ఈ అంశాన్ని కౌట్స్కీ, లెనిన్‌లు విస్తృతంగా చెప్పారు. దీనినుంచే ఎన్ తర్కాన్ని లాగే ప్రయత్నం చేస్తూ మిగిలివుందని ఒప్పుకుంటున్నారు కాబట్టి ఎంత మిగిలివుందో

లెక్క తేల్చమంటున్నారు. మార్క్స్ క్యాపిటల్‌కి రాసిన ముందుమాటలోనే ఈ విషయం గురించి రాస్తూ ఈ తరహా ఉత్పత్తి విధానాన్ని ..డయింగ్ అని రాశారు. (మరణిస్తోంది లేదా కాలగర్భంలో కరిగిపోతోందనే అర్థం తీసుకోవచ్చు.) దీనర్థం ఏమిటి? ఏది వర్ధిల్లుతున్న దిశలో ఉంది, ఏది శవప్రాయంగా మిగిలే దశలో ఉందని అర్థం చేసుకోవడానికి. కాబట్టి (కాలగర్భంలో కలిసిపోయే అంశాలపట్ల (...డయింగ్) పై పోరాటం చేయడానికే ఎన్ మొగ్గు చూపితే నామట్టుకు నాకు ఎటువంటి అభ్యంతరం లేదు.

**డి) శ్రీకాకుళం జిల్లాలో రుజువైన అంశాలు (ఒకవేళ రుజువ య్యాయని అనుకుంటే) దేశానికంతటికీ సాధారణీకరించవచ్చునా? :** ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనదీ! విలువైనదీ కూడా! అయితే ఈ ప్రశ్న భారతదేశం 'అర్ధఫ్యూడల్', 'అర్ధ వలస దేశం' అని సూత్రీకరించిన ఈ దేశపు 'మార్క్సిస్టు' తత్వవేత్తలను, ఉద్యమకారులను అడిగి ఉండాల్సింది. స్వయంగా తాను ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ ధోరణికి తాను ఏ పరిశోధనల ఫలితంగా వచ్చారో ఈ సందర్భంగా వివరించి ఉండాల్సింది. మరీ ముఖ్యంగా ఎన్ కి గుర్తు ఉండి ఉంటే విజయవాడలో లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ నిర్వహించిన సదస్సులో ఆనాటి సిపిఐ (ఎం-ఎల్) గ్రామాలను పరిశీలించి ఈ దేశాన్ని 'అర్ధఫ్యూడల్' దేశంగా నిర్ధారించిందని ఆయన చెప్పి ఉన్నారు. నిజానికి సిపిఐ (ఎం-ఎల్) పార్టీ తన డాక్యుమెంటులో ఫలాన పరిశోధనల ద్వారా ఈ దేశాన్ని అర్ధఫ్యూడల్‌గా నిర్ధారించామని రాసుకోలేదు. అయితే ఆనాటి సిపిఐ (ఎం-ఎల్) ఎన్ని గ్రామాలను, విస్తృతి వైవిధ్యంగల భారతదేశపు ఏ ప్రాంతాలను, ఏ గ్రామాలను ఎన్నుకొని ఆ నిర్ధారణలకు వచ్చిందని ఆయన పరిశీలించి ఉండాల్సింది. ఒక రైతాంగ కార్యకర్త పేరుతో ఒక వ్యాసం 2 భాగాలుగా 1969 జూన్, ఆగస్టు లిబరేషన్ సంచికలో వచ్చింది. ఈ వ్యాసం బెంగాల్ రాష్ట్రంలోని ముర్షీదాబాద్ జిల్లాలోని ఒక గ్రామపు వర్గ విశ్లేషణకు సంబంధించినదే! అయితే నేడు పరిశీలిస్తే ఆ వ్యాసం కూడా అనేక అపసవ్యపు పరిశీలనలతో నిండి ఉంది. అయితే ఆ అపసవ్యతల చర్చను అలా వదిలేస్తే కేవలం ఈ గ్రామపు పరిశోధనతోనే ఈ విస్తృత వైవిధ్యపు భారతదేశాన్ని 'అర్ధఫ్యూడల్'గా నిర్ధారించగలమా అనేదే అసలు ప్రశ్న. (ఎన్ దృష్ట్యా). అలాగే బీర్జుమండల్ 1968లో బెంగాల్ రాష్ట్రంలోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 3 గ్రామాలను (చిత్రంగా రెండు వ్యాసాల్లోనూ ఊర్ల పేర్లు లేవు) పరిశీలించి సెమీ ఫ్యూడల్ నిర్ధారణ చేశారు. ఈ వ్యాసం 1969, ఏప్రిల్, మే నెలల 'లిబరేషన్'లో ప్రచురించారు.

ఇక్కడే ఎన్ నన్ను వేసిన ప్రశ్నకు మరికొన్ని ప్రశ్నలు జోడిస్తున్నాను. బెంగాల్ రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో నాలుగు గ్రామాల మీద చేసిన పరిశీలన ఈ విస్తృత, వైవిధ్య విశాల భారతదేశపు ఉత్పత్తి విధానాన్ని నిర్ధారించడానికి సరిపోతాయా? ఎన్ చెప్పినట్లు ఈ పరిశోధనను ఎవరు చేయగలుగుతారు? హిమాలయ పర్వత పాదాల నుండి, సుందరవనాల దాకానూ విస్తరించిన నిర్మాణాలు కలిగిన రాజకీయ కార్యకర్తలు చేయగల్గుతారు లేదా ఒక పరిశోధనా సంస్థ, పత్రిక, తగిన సిబ్బంది కల్గిన వాళ్లు చేయగల్గుతారు. కాబట్టి ఎన్ తన ప్రశ్నలను అటు ఎక్కుపెట్టగలగాలి లేదా తానే స్వయంగా రంగంలోకి దిగనైనా దిగాలి.

నిజానికి ఎన్ ఇలాంటి ప్రశ్నలు చాలానే వేయగలిగారు. నా దృష్టిలో ఎన్ జవాబులు చెప్పాల్సిన స్థితిలో ఉన్నారు. అతనే ప్రశ్నలు ఆరంభిస్తే, అతని నుంచి జవాబు ఆశించే వాళ్లు హతాశులయ్యే ప్రమాదం ఉంది. ఇవే ప్రశ్నలు ఇతనిని ఇతనే ఎందుకు వేసుకోవడం లేదనే దగ్గర ఈ ప్రశ్నలు మొదలవుతాయి. నిజానికి ప్రస్తుత వ్యాసంలో అతను 'పెట్టుబడి దశ, మార్కెట్టు స్థాయి ఇలా 14 అంశాలను ప్రాతిపదికగా చూపాడు. నిజానికి ఇతనే స్వయంగా ఈ అంశాల ప్రాతిపదికన ఆంధ్ర, తెంగాణాలో గ్రామాలను ఎంచుకొని పరిశోధనా ఫలితాలు రాబట్టి ఉండవచ్చు. పోనీ, ఈ 14 అంశాల నా పరిశోధనలోకి ఎన్ని వచ్చాయో, అసలు వచ్చాయో రాలేదో చర్చించి ఉండాల్సింది. కాని ఎన్ ఆ శ్రమను తీసుకోలేదు. ప్రశ్నలు వేయడంలో ఉన్న ఆసక్తి జవాబు వెదకడంలో ఉంటే పరిష్కారంకి చేరువలోకైనా వెళ్లే అవకాశం ఉంటుంది.

నిజానికి అధికారిక సమాచారం లోపభూయిష్టంగానో, లేదా అరకొరగానో ఉంటే క్షేత్రస్థాయి పరిశోధనలు కీలకపాత్ర వహిస్తాయి. దీనికోసం తీవ్రమైన శ్రమను వెచ్చించాల్సి ఉంటుంది. అయినప్పటికీ సమాచార సేకరణలో ఇబ్బందులుంటూనే ఉంటాయి. ఇన్ని పరిమితుల మధ్య పరిశోధనను జరపడం ఇష్టంలేని వారు మాత్రమే 'పదాడంబరం'తో ఫలితాలకన్నా టెక్నిక్ (సాంకేతిక అంశాల) మీద చర్చను ఎక్కుపెట్టడంలో శ్రద్ధ చూపిస్తారు. నిజంగా సమస్యకు మూలాలు వెదకడంలోగానీ, పరిష్కార మార్గాలు చూపడానికి గానీ నిరాసక్తత ప్రదర్శిస్తారు. సరిగ్గా ఎన్ ఈ తరహా వ్యక్తే అనుకోవడానికి నాకు ఏ అభ్యంతరం కనిపించలేదు.

**ఇ) ఫ్యూడలిజం జబ్బుకి పెట్టుబడి మందుగా పనిచేస్తుంది. దీన్ని తిరగరాసి పెట్టుబడి జబ్బుకి మందు ఫ్యూడలిజంలో లేదు అనే నా వ్యాఖ్యపై:** ఇక్కడ తిరిగి ఎన్ గత 50 ఏళ్లుగా భారతదేశంలో ప్రచారంలో ఉన్న 'ఫ్యూడలిజం, దళారీ పెట్టుబడి, సామ్రాజ్యవాదం' కుమ్మక్కు సిద్ధాంతాన్ని తెచ్చారు. దీనినే నిజమైన జబ్బు అన్నారు. దీనికి మందు పెట్టుబడిలో లేదు అన్నారు. నేను ఈ జబ్బుకు మందు 'పెట్టుబడి' అని రాశానా? నేను పెట్టుబడి, ఫ్యూడలిజం అనే జబ్బుకి వ్యతిరేకంగా మందులా పనిచేస్తుంది అన్నాను. అయితే ఈ అంశంలో ఎన్ కి నాకు విభేధమేంటి అనేదే చూడాలి. దేశంలో ప్రధాన ఉత్పత్తి విధానంగా పెట్టుబడి ఉన్నది. దానికి లొంగిపోయి ఈ దేశపు ధనిక రైతాంగ శక్తులున్నాయి. నిజానికి వాటి ప్రయోజనాలు పెట్టుబడితో ముడిపడి ఉన్నాయి. సంప్రదాయక అర్థంలో ఫ్యూడలిజం / అర్ధఫ్యూడలిజం ప్రధాన ఉత్పత్తి విధానంగా లేవు. పెట్టుబడిని ఓడించి తమ స్థానాన్ని నిలబెట్టుకోగలమని కలలుకన్న 'ఫ్యూడల్‌శక్తులు' కాలగర్భంలో కలిసిపోయాయి. పెట్టుబడికి అనుగుణంగా సహవాసం చేయగలిగే శక్తులు మరో అర్థంలో పెట్టుబడిదారీ లక్షణాలను సంతరించుకున్న గ్రామీణ రైతాంగ పెట్టుబడిదారీ (గ్రామీణ బూర్జువా) విశాల పెట్టుబడి గొలుసులో భాగస్వాములుగా కుదిరారు. రోజురోజుకీ గ్రామీణ రైతాంగం భూమిలేని వ్యవసాయ కార్మికులుగానూ, చారెడు నేలకు బందీలైన సన్న, చిన్నకారు రైతాంగంగా ఒక వైపు, అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్న గ్రామీణ బూర్జువా వర్గంగా మరోవైపు చీలి వున్నారు. ఈ లక్షణమే వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధాన ఆక్రమణకు కొండగుర్తు.

ఈ అంశాన్ని ప్రజా వ్యతిరేక కుమ్మక్కు అని ఎందుకంటున్నారు? ఈ శక్తులు ప్రజలకు వ్యతిరేకంగా కాకుండా ప్రజలకు అనుకూలంగా పొత్తులు పెట్టుకుంటాయా? ఆ గొలుసులో మీరు ఉద్దేశ్యపూర్వకంగానే గ్రామీణ ధనిక రైతాంగాన్ని (రూరల్ బూర్జువాజీని) వదిలివేశారు. నిజానికి శ్రామికుల మిగులు విలువను కాజేసే శక్తులన్నీ ఒకవైపు ఏకం కావడమనేది చారిత్రక సత్యం. ఇందులోంచి మిగులు విలువను కాజేసే ప్రధాన శక్తులను వదిలివేయడంలోనే భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధిని అంగీకరించలేని సత్యం ఉన్నది. ఇంకా ఈ వాదనను చివరి వరకూ లాగవచ్చుగానీ ఈ వ్యాస పరిధికి మించిన విషయం అవుతుంది. మరో ముఖ్య విషయం ప్రపంచంలో ఫ్రాన్స్ విప్లవం (పారిస్ కమ్యూన్) తర్వాత బూర్జువావర్గం, భూస్వామ్యవర్గంతో రాజీలేని పోరాటాన్ని విరమించుకుంది. దానికి మారుగా వర్ధిల్లు లేదా అంతరించు అనే (Flourish or perish) మార్గాన్ని 'రాజీమార్గం'గా చూపించింది. వర్ధిల్లాలంటే మాలాగా మారాల్సిందే అని సుతిమెత్తని హెచ్చరికలు జారీ చేసింది. పెట్టుబడి ఇచ్చిన ఈ 'రాజీ' ఫార్ములాను అందిపుచ్చుకున్న గ్రామీణ భూస్వామ్య / అర్ధభూస్వామ్య శక్తులు గ్రామీణ పెట్టుబడిదారీ వర్గంగా మారారు. ఈ రాజీని అంగీకరించలేనివారు, తలాయించిన వాళ్లు కాలగర్భంలో కలిసిపోయారనేది చారిత్రక సత్యం.

**ఎఫ్) వలసలు :** దీని గురించి కూడా ఎన్ తన స్వంత అభిప్రాయాన్ని ప్రకటించలేదు. గ్రామీణ వ్యవసాయ జనాభా అక్కడ నుంచి ఖాళీ చేసిన తర్వాత పారిశ్రామికరంగంలోకి కార్మికులుగా పరివర్తన చెందితేనే అది పెట్టుబడిదారీ పంథాకు పరివర్తనగా చూడాలని (ఆయన చెప్పిన అంశాల నుంచి) నాకర్థం అయింది. బహుశ నేను అపార్థం చేసుకున్నానని ఆయన భావిస్తే ఎన్ తన అభిప్రాయాలను సూటిగా ప్రకటిస్తే చర్చ సరళంగా సాగుతుంది.

ఆయన వాక్యం తీసుకుంటే 'గ్రామీణ వ్యవసాయ జనాభా పెద్ద ఎత్తున వలస వెలుతుండడం నిజంగా ఒక **'సమస్య'**. దీనిని బట్టే **వలస ఒక 'సమస్య'** అనుకున్నట్లు అర్థం అవుతుంది. (క్షమించాలి! ఎన్ ఊరు నాకు తెలియకపోయినా హైదరాబాద్ అతని స్వంత ఊరు అయి ఉండదు) ఈ ప్రతిపాదనపై ఎన్‌కి నేను ఏ దురుద్దేశాలు ఆపాదించడం లేదు. అతని సమస్యల్లా ఇట్లా వలసపోయిన వాళ్లంతా 'పరిశ్రమలోకి, ఉన్నత ఉత్పత్తి విధానంలోకి, ఇతర ఉత్పత్తి విధానంలోకి, స్వేచ్ఛలోకి, స్థిరత్వంలోకి, ఎక్కువ ఆదాయంలోకి వెళ్లడం లేదని చూపుతున్నాయి'. ఇందులో ప్రతీ పదానికి అర్థాలను / అపార్థాలను వెదికే పని చేయదలుచుకోలేదు. అయితే ఒక్కమాట మాత్రం చెప్పగలను. ఎంత పెద్ద స్థితిలో ఉన్న ఉద్యోగి అయినా పెట్టుబడిదారీ వ్యవస్థలో 'వేతన బానిసే' అనేది నా అంచనా! పుస్తక రచయితనుద్దేశించి 'రచయిత 'పరిశ్రమ' అని రాయలేదు. పట్నం అనే రాశాడు' అని కూడా ఉల్లేఖించారు (సరిగ్గానే)

పైన చెప్పినంత స్థిరత్వంలోకి, స్వేచ్ఛలోకి గ్రామీణ శ్రామిక వర్గాన్ని, వ్యవసాయ జనాభాను పెట్టుబడి తీసుకువెళ్తుందని ఎవరు చెప్పారు? ఈ దేశంలోనే కాదు ఏ దేశంలో అయినా పెట్టుబడి శ్రామిక వర్గానికి ఊపిరి పీల్చుకునే వ్యవధి అయినా ఇస్తుందని ఎవరు సూత్రీకరించారు? ప్రపంచంలో ఎక్కడైనా గ్రామీణ ప్రాంతాలను ఖాళీ చేసిన శ్రామిక ప్రజానీకానికి గాలి పంఖాలుండే గదులలోనూ, శీతలీకరణ గదుల్లోనూ పెట్టి ఉపాధి కల్పించే బాధ్యతను పెట్టుబడిదారీ పంథా తీసుకుందా? కానేకాదు. సరికదా మరింత కఠిన పరిస్థితుల్లోకి వాళ్లను నెడుతుంది. వాళ్లను రిజర్వ్ కార్మికసైన్యంగా నిలిపి ఉంచే ప్రయత్నం చేస్తుంది. ఇంగ్లాండ్‌లో మొదలుకొని అన్ని దేశాలలోనూ ఇదే తీరు సాగింది. దుర్భరమైన పరిస్థితులలో బతుకు వెళ్లమారుస్తున్న శ్రామిక వర్గం గురించి దేశ, విదేశీ పరిశోధనలు అందుబాటులో ఉన్నాయి. అన్నింటికీ మించి ఎంగెల్స్ పరిశోధన 'ఇంగ్లండ్‌లో కార్మిక వర్గ స్థితిగతులు' పుస్తకం అందుబాటులో ఉంది. నిజంగా ఎన్ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటే 19వ శతాబ్దపు ఉజ్వల పారిశ్రామిక దేశం ఇంగ్లండ్‌ను అర్ధ ఫ్యూడల్ దేశం అనాల్సి ఉంటుంది.

అయితే పెట్టుబడి ఏంచేస్తుంది? 'ఆధునిక వ్యవసాయం రైతును వ్యవసాయం నుంచి వైదొలిగేలా చేస్తుంది' అతనిని మరో ఉపాధి వెతుక్కోవడం కోసం నిరంతరం తరుముతూ ఉంటుంది. రైతు పరిస్థితే ఇలా అయినపుడు వ్యవసాయ కూలీలుగా ఉన్నవారు మరింత త్వరితంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్తారు. ఆ విధంగా పట్టణాలకు, గ్రామీణ జనాభా తరలివెళ్లడంలో 'పుల్' పాత్రే కాదు 'పుష్' పాత్ర కూడా పెట్టుబడిదే! గ్రామీణ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, పంట మార్పిడి.. ఇలా అనేక కారణాలతో అనేక మందిని 'పని'లేని వాళ్లుగా మారుస్తుంది.

అయితే ఈ పెట్టుబడి ఈ గ్రామీణ పేదలను / పనివారలను నిపుణత కల్గిన, నిపుణత లేని శ్రామికులుగా గుర్తిస్తుంది. నిపుణత కలిగిన వాళ్లు ఎన్ చెప్పిన 'స్థిరత్వం'... ఇలా అనేక రంగాల్లోకి వెళ్తారు. మిగతావాళ్లు రోజువారీ పనిని వెదుక్కుంటూ ఉంటూనే వుంటారు. పెట్టుబడి వర్ధిల్లడానికి వీళ్లొక అప్రకటిత సైన్యంలా ఉంటారు. పెట్టుబడి అటు వ్యవసాయంలోనూ, ఇటు పరిశ్రమలలోనూ తన చొరబాటును పెంచేకొద్దీ 'పనిలేనివాళ్ల' జాబితా పెరిగిపోతూ ఉంటుంది. నిజానికి భారీ పారిశ్రామిక రంగమే ఈ సంచార శ్రామిక జనావళిని సృష్టిస్తుందని గుర్తించాలి. ఈ జనాభా ప్రధానంగా 'పుష్' ఫ్యాక్టర్‌గానే వ్యవసాయ రంగంలో ఉంటుంది. దానినే సంక్షిప్తంగా చెప్పాలంటే మార్క్స్‌ను స్మరించాలి.

*... They are the light infantry of Capital, thrown by it according to its needs, now to this point, now at that point.. Nomad labour is used for various operations of building and draining, brick making, lime-buirning, railway making etc.* (క్యాపిటల్, వాల్యూం-1)

నా పుస్తకంలో నేను చర్చించిన ఇలాంటి పనులను గురించే రచయిత 'గ్రామీణ వ్యవసాయ ప్రజలను లాక్కొంటున్నది పరిశ్రమ అని రాయలేదు. పట్టణం అని రాశారు' అని ఉల్లేఖిస్తూ ఎన్ మరి పట్టణమే ఒక కొత్త ఉత్పత్తి ఎలా అయిందో తెలియదు అని ముగించారు.

దీనికి కూడా మార్క్స్ దగ్గరకే వెళ్లాల్సి ఉంటుంది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం పెరుగుతున్న కొద్దీ గ్రామీణ మిగులు శ్రామిక జనాభా తయారౌతుందని వివరిస్తూ ఇలా చెప్పారు. *'part of the agricultural population is therefore constantly on the point of passing over into **urban or manufacturing** proletarian'.*

*(ఇంకా ఉంది)*

*(రచయిత 'పల్లెను మింగిన పెట్టుబడి' గ్రంథకర్త)* వీ

### దళితుల పై దాడులకు నిరసనగా చలో పాతపల్లి

మహబూబ్‌నగర్ జిల్లా 'పాతపల్లి దళితుల న్యాయ పోరాట సమితి' ఆధ్వర్యంలో 'చలో పాతపల్లి' కార్యక్రమాన్ని ఆగస్టు 6న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డే పాల్గొన్నారు. మొదట పెబ్బేరు మండల కేంద్రంలో దళితులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరానికి వెళ్లి అక్కడి నుండి ర్యాలీగా పాతపల్లికి వెళ్లారు. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఆనంద్ తేల్‌తుంబ్డే యాభై ఏళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణలో దళితులపై దాడులు జరుగుతుంటే బంగారు తెలంగాణ ఎలా సాధ్యమౌతుందని పాలకులను ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడ్డాక దళితుల ఉద్యమం పాతపల్లి నుంచే మొదలైందని అన్నారు. దళితుల గుడిసెల పక్కన బోయలు శవాల్ని పూడ్చిపెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులు ఆలయ ప్రవేశం చేస్తే గుడి మైల పడిందని శుభ్రం చేయడం దారుణమని అన్నారు. పాతపల్లి లాంటి ఘటనలకు దళితుల ఐక్యత ద్వారానే అంతిమ పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బి. రామమూర్తి మృతి

పౌరహక్కుల సంఘం నాయకుడు బి. రామమూర్తి విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రిలో ఆగస్టు 7న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పుట్టింది విజయనగరం జిల్లా రామభద్రపురం. ఆయన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అఖిల భారత ప్రజా ప్రతిఘటన వేదికలో చేరి పనిచేశారు. ఆ తరువాత శ్రీకాకుళం జిల్లా పౌరహక్కుల సంఘంలో సభ్యునిగా చేరి జిల్లా అధ్యక్షునిగా ఎదిగారు. ఆయన చివరి వరకు ప్రజా జీవితంలో ఉంటూ అన్ని ప్రజా సంఘాలకు తన శక్తి మేరకు సహకారాన్ని అందించారు. ఆయన విజయనగరం జిల్లా రామభద్ర పురంలో విశాఖ డెయిరీ పాల కేంద్రంలో ప్లాంట్ మెకానిక్‌గా చేరి తరువాత టెక్కలికి మారారు.

### లవణం కన్నుమూత

ప్రముఖ నాస్తికోద్యమ నాయకుడు సంఘ సంస్కర్త గోపరాజు లవణం ఆగస్టు 14న విజయవాడలో మృతిచెందారు. నాస్తికోద్యమ నిర్మాత గోపరాజు రామచంద్రరావు (గోరా) కుమారుడు లవణం. తన తండ్రి స్ఫూర్తితో స్వాతంత్రోద్యమంలో, సంఘ సంస్కరణ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1973లో హేతువాద సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 1955లో తెలంగాణలో జరిగిన భూదాన పాదయాత్రలో వినోబాభావేతోపాటు కలిసి లవణం పర్యటించారు. నాస్తికత్వాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసిన ఆయన కృషికి జమన్‌లాల్ బజాజ్ అవార్డు, గాంధీ స్మారక అవార్డు లభించాయి.

### మునిసిపల్ కార్మికుల సమ్మె విరమణ

ప్రజల ఇబ్బందులు, వ్యాధుల ఉధృతిని దృష్టిలో పెట్టుకొని నలభై రోజులుగా కొనసాగుతున్న మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను విరమిస్తున్నట్లు తెలంగాణ మునిసిపల్ కార్మిక సంఘాల జెఎసి ఆగస్టు 14న ప్రకటించింది. ఇక ప్రత్యక్ష సమ్మె ఉండదని, సమస్యల పరిష్కారం కోసం ఇతర రూపాల్లో నిరసన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. ప్రభుత్వంతో మునిసిపల్ కార్మిక జెఎసి జరిపిన చర్చలు విఫల మయ్యాయి. అయితే హైదరాబాద్‌లోని మునిసిపల్ కార్మికులకు మాత్రమే ప్రభుత్వం వేతనాలు పెంచింది. మిగతా మునిసిపాలిటీలలో పెంచలేదు.

### ర్యాగింగ్‌పై ఎపి సిఎం కార్యాలయం ముట్టడి

నాగార్జున యూనివర్సిటీ బిఆర్క్ విద్యార్థిని రిషితేశ్వరి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విద్యార్థులు విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ముఖ్యమంత్రి స్పందించి బాధ్యులను అరెస్ట్ చేయాలని లేదంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. క్యాంపు కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకుని విద్యార్థి నాయకులను అరెస్ట్ చేశారు. యూనివర్సిటీకి సెలవులు ప్రకటించి విద్యార్థులు లేనప్పుడు సుబ్రహ్మణ్యం కమిటీ విచారణ ఎలా నిర్వహిస్తుందని పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్‌ల నేతలు ఆగ్రహించారు. సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్‌కు గురై జూలై 14న రిషితేశ్వరి నాగార్జున యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరివేసుకుని చనిపోయింది. అట్లాగే నెల్లూరులోని శ్రీ గాయత్రి విద్యా సంస్థలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి మధువర్ధన్‌రెడ్డి (16) సీనియర్ల ర్యాగింగ్‌కు కుంగిపోయి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

### తోటపల్లి రిజర్వాయర్ సాధన కోసం ధర్నా

తోటపల్లి రిజర్వాయర్ రద్దు చేయవద్దంటూ ఆగస్టు 12న కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామం వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాజీవ్ రహదారి దిగ్బంధం జరిగింది. తోటపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించి 500 కోట్లు ఖర్చు చేసిన తరువాత ఇప్పుడు ముఖ్యమంత్రి దాన్ని రద్దు చేస్తానంటున్నారు. ఈ విషయంలో ప్రజలు చేసే ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

### చీప్ లిక్కర్‌ను వ్యతిరేకిస్తూ ధర్నాలు

చీప్ లిక్కర్‌ను తెలంగాణలోని ఊరూరా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో కల్లుగీత కార్మిక సంఘాలు ఆందోళన బాట పట్టాయి. రియల్ ఎస్టేట్, సెజ్‌లు, పరిశ్రమల వల్ల ఈత, తాటి చెట్లు కనుమరుగయ్యాయని అంటున్నారు. ఇప్పుడు చీప్ లిక్కర్ గ్రామాల్లోకి తీసుకువస్తే గౌడ వృత్తి మొత్తంగా దెబ్బతినే ప్రమాదం ఉందంటున్నారు. చీప్ లిక్కర్ విధానంపై మహిళా సంఘాలు మద్య వ్యతిరేక పోరాటాన్ని నిర్మిస్తూ ధర్నాలు నిర్వహిస్తున్నాయి. ఆగస్టు 19న కరీంనగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సిఎం దిష్టి బొమ్మను దహనం చేశారు.

### ఎపి రాజధాని భూసేకరణకు వ్యతిరేకంగా ధర్నా

రాజధాని పేరిట ప్రభుత్వం రైతుల పంట భూములను తీసుకొని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానానికి వ్యతిరేకంగా రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ల సాకుతో రైతుల నుండి బలవంతంగా భూములు గుంజుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రైతులు పండించిన కూరగాయలను తీసుకువచ్చి విజయవాడలోని క్రీడా కార్యాలయం ముందు ఆగస్టు 21న ధర్నా చేశారు. ఈ ధర్నాకు రాజధాని చుట్టుపక్కల గ్రామాల రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, వృత్తిదారులు, రైతు కూలీలు, ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చినా భూములు ఇచ్చేదిలేదని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్థానికులు చెపుతున్నారు. వీ

## మాజీ రాష్ట్రపతి కలాం మృతి

మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం (84) జూలై 27న గుండెపోటుతో మరణించారు. ఆయన 1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామనాథ పురం జిల్లా, రామేశ్వరంలో పుట్టారు. 1954లో తిరుచిరాపల్లిలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో భౌతికశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1955లో మద్రాస్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. 1960లో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థతో ఆయన ప్రయాణం మొదలైంది. 1969లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు బదిలీ అయ్యారు. 1970 – 90 మధ్య ఇస్రోకు సేవలందించారు. ఆయన కృషికి ప్రభుత్వం పద్మభూషణ్ (1981), పద్మవిభూషణ్ (1990), భారత రత్న (1997) అవార్డులతో సత్కరించింది. 2002–07 మధ్య భారత 11వ రాష్ట్రపతిగా ఉన్నారు.

## మెమన్ ఉరిశిక్ష అమలు

1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో ముద్దాయిగా ఉన్న యాకుబ్ మెమన్ (53)కు జూలై 30 ఉదయం నాగపూర్ జైలులో ఉరిశిక్ష అమలు చేశారు. జూలై 29న మెమన్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తిరస్కరించడంతో శిక్షను అమలు చేశారు. శిక్ష అమలు అనంతరం ముంబైలోని మెరైన్ లైన్స్‌లో ఆయన మృతదేహాన్ని ఖననం చేశారు.

## నాగా మిలిటెంట్లతో శాంతి ఒప్పందం

నాగా తిరుగుబాటు సంస్థ అయిన ఎన్ఎస్‌సిఎన్ (ఐఎం)తో కేంద్ర ప్రభుత్వం శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్‌దోవల్‌ల సమక్షంలో ఎన్ఎస్‌సిఎన్ నేత టి ముయివా, ప్రభుత్వ ప్రతినిధి ఆర్ఎన్ రవి ఆగస్టు 3న సంతకాలు చేశారు. 1997లో నాగాలతో ప్రభుత్వం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. నాగాలు తమకు ప్రత్యేక గ్రేటర్ నాగాల్యాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో ఇరు పక్షాలు ఒప్పందాన్ని అమలు చేయలేకపోయాయి.

## దేశంలో కొనసాగుతున్న అవినీతి పాలన

దేశంలో వివిధ శాఖల్లో జరుగుతున్న అవినీతిపై ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయని కేంద్ర నిఘా సంఘం (సివిసి) తెలిపింది. 2013తో పోలిస్తే 2014లో 82 శాతం మేరకు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. ఫిర్యాదులు అందిన శాఖల్లో రైల్వే ప్రథమ స్థానంలో ఉంది. సివిసి 2014 వార్షిక నివేదికను ఇటీవల పార్లమెంట్‌కు అందించింది. దేశ వ్యాప్తంగా సివిసికి అందిన మొత్తం ఫిర్యాదులు : 64,410. విచారణకు ఆదేశించినవి : రైల్వే శాఖపై: 12,776, బ్యాంకు అధికారులపై: 6,836, ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులపై: 3,572, ఆదాయ పన్ను అధికారులపై: 3,468, కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖపై: 3,378, పట్టణాభివృద్ధి శాఖ ఉద్యోగులపై: 2,917, ఉక్కు మంత్రిత్వ శాఖపై: 1,494, టెలీ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖపై: 1,303, ఇతర వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులపై: 45,713.

## మధ్యప్రదేశ్‌లో రెండు రైలు ప్రమాదాలు

ముంబై నుంచి వారనాసికి వెళ్తున్న కామయాని ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 రాత్రి 11.30 గంటలకు హార్దా జిల్లాలోని మచక్ నది సమీపంలోని కల్వర్టు దాటుతుండగా పట్టాలు తప్పి 10 బోగీలు పడిపోయాయి. కొన్ని నిమిషాల వ్యవధిలో పక్కనున్న రైలు పట్టాల మీద పట్నా నుంచి ముంబైకి వ్యతిరేక దిశలో వెలుతున్న జనతా ఎక్స్‌ప్రెస్ కూడా ఇదే ప్రాంతంలో పట్టాలు తప్పి 7 బోగీలు పడిపోయాయి. పక్కనే నది ఉప్పొంగుతుండడంతో నీళ్లు రైలు బోగీల్లోకి వచ్చి చేరాయి. బిర్కియా, బిరాంగీ స్టేషన్ల మధ్య ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 30 మంది మృతి చెందగా 50 మందికి గాయాలయ్యాయి. భారీ వర్షంతో ఆకస్మికంగా తలెత్తిన వరద కారణంగా మాచక్ నది ఉప్పొంగి ప్రవహించిందని, దీంతో రైలు పట్టాల్లో కొంతభాగం కొట్టుకుపోయిందని రైల్వే మంత్రి సురేశ్‌ప్రభు తెలిపారు.

## మ్యాగీపై నిషేధం ఎత్తివేత

మ్యాగీ నూడుల్స్‌పై భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ డిపార్ట్‌మెంట్ (ఎఫ్‌డిఎ) విధించిన నిషేధాన్ని బాంబే హైకోర్టు ఆగస్టు 13న కొట్టి వేసింది. నూడుల్స్‌పై నిషేధం విధించడానికి సహజ న్యాయ సూత్రాలను పాటించలేదని, నూడుల్స్‌లో సీసం ఉందని పరీక్షించిన సంస్థలకు గుర్తింపు లేదని జస్టిస్ ఎంవి. కనడే, జస్టిస్ బి.పి. కోలా ఒవాలత్ కూడిన ధర్మాసనం పేర్కొంది.

## విద్యాలయాల్లో హిందుత్వ

ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాలయాల్లో రాజకీయ జోక్యం అసాధారణ రీతిలో సర్వసాధారణమైందని, జాతి ప్రయోజనాల కోసం ఏర్పాటైన అత్యున్నత సంస్థలకు అధిపతుల నియామకాల్లో హిందుత్వకే ప్రాధాన్యతనిస్తున్నారని అమర్త్యసేన్ అన్నారు. భారత చారిత్రక పరిశోధక మండలి అధిపతిగా ఎల్లాప్రగడ సుదర్శన్‌రావు నియామకం ఇందుకో ఉదాహరణ అన్నారు. ఆయన చరిత్ర పరిశోధనల గురించి జనానికి పెద్దగా తెలియదుగానీ, హిందుత్వ భావజాలరంగం వ్యక్తిగా అందరికీ బాగా తెలుసునని ఆగస్టు 16న తెలిపారు.

## గుజరాత్ ఐపిఎస్ అధికారి తొలగింపు

2002లో గుజరాత్ అల్లర్లలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అధికారి సంజయ్‌భట్‌ని రాష్ట్ర ప్రభుత్వ సిఫారసుతో కేంద్ర హోంశాఖ ఆగస్టు 18న ఇండియన్ పోలీసు సర్వీసు నుంచి తొలగించింది. భట్ నిబంధనలను ఖాతరు చేయనందుకు అతనిపై క్రమశిక్షణా చర్యల కింద పోలీస్ సర్వీసు నుంచి తొలగిస్తున్నట్లు హోంశాఖ ప్రకటించింది. 2002 అల్లర్లపై ప్రత్యేక దర్యాప్తు బృందం ముందు హాజరైనప్పటి నుండి తాను ప్రభుత్వంతో జరుపుతున్న పోరాటం గురించి మీడియాకు తెలిపారు. తాను పోరాడుతున్నది ఒక వ్యక్తితో కాదని, వ్యవస్థతోనని అయినప్పటికీ శక్తి కొద్దీ ముందుకు వెళుతా నన్నారు. తాను ఇప్పటికీ కూడా నిజాయితీగా జరిపే ఎలాంటి విచారణనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, కాని భారత్‌లో అది సాధ్యం కాదన్నారు. భట్ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో నాటి ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ అల్లర్ల సమయంలో హిందూ అధికారులు అందరూ బయటకు వెళ్లి కక్ష తీర్చుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

## రైతు ఆత్మహత్యలను నివారించాలి

దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలను నివారించాలని సుప్రీంకోర్టు ఆగస్టు 21న స్పష్టం చేసింది. రైతుల ఆత్మహత్యల నివారణకు రూపొందించుకున్న విధానాన్ని మరోసారి పునఃపరిశీలించాలని పేర్కొంది. 8 ఏళ్ల కింది పాలసీని మరోసారి సమీక్షించి, ఆరు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం చేస్తున్న వాదనతో ధర్మాసనం సంతృప్తి చెందలేదు. అసలు రైతుల ఆత్మహత్యలు ఎక్కడా ఉండకూడదని పేర్కొంది.

## దేశంలో పెరుగుతున్న మత ఘర్షణలు

2015లో గడిచిన ఆరు నెలల్లో దేశంలో మత ఘర్షణలు పెరిగాయి. జనవరి నుంచి జూన్ వరకు 330 మత ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో 51 మంది మృతి చెందారు. 1,092 మంది గాయపడ్డారు. మతఘర్షణల్లో ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. గత సంవత్సరం దేశ వ్యాప్తంగా 95 మంది మృతి చెందగా, 644 మత ఘర్షణలు జరిగాయి. 1,921 మంది గాయపడ్డారు. యుపిలో ఇప్పటి వరకు జరిగిన మత ఘర్షణల్లో 10 మంది మరణించగా, 224 మంది గాయపడ్డారు. 68 సంఘటనలు జరిగాయి. బీహార్‌లో జూన్ వరకు జరిగిన సంఘటనల్లో 14 మంది మృతి చెందగా, 169 మంది గాయపడ్డారు. 41 సంఘటనలు జరిగాయి. గుజరాత్‌లో 25 సంఘటనల్లో ఏడుగురు మృతిచెందగా, 79 మంది గాయపడ్డారు. వీ

## మధ్యధరా సముద్రంలో పడవ ప్రమాదం

ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాలలో అశాంతి, అంతర్యుద్ధ పరిస్థితుల వల్ల నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల వల్ల ప్రజలు ఇతర దేశాలకు వలసపోతున్నారు. ప్రమాదకరం అని తెలిసినా సముద్ర మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఎన్నో పడవ ప్రమాదాలు సంభవించి వేలాదిగా ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఆగస్టు 5న జరిగిన పడవ ప్రమాదంలో రెండు వందల మందికి పైగా ప్రజలు మరణించారు. ఆరు వందల మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న పడవ మధ్యధరా సముద్రంలో మునిగిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇటలీ, ఐరిష్ దేశాల నావికా సిబ్బంది, మానవ హక్కుల సంస్థలు రెస్క్యూ ఆపరేషన్‌లో దాదాపు 370 మందిని కాపాడగలిగారు.

## కొత్త సూయెజ్ కాలువ ప్రారంభం

మధ్యధరా సముద్ర ప్రాంతంలో కొత్తగా నిర్మించిన సూయెజ్ కాలువను ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ శిశి ఆగస్టు 6న ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు గత ఏడాది ఆగస్టు 6న అనుమతించిన శిశి దీనిని సరిగ్గా ఏడాది కాలంలో పూర్తి చేయాలని షరతు విధించారు. ఈ మేరకు నిర్మాణ సంస్థ ఏడాదిలోగా పూర్తి చేసి సరిగ్గా ఆగస్టు 6 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసింది. ఈ కార్యక్రమానికి ప్రపంచంలోని 120 దేశాలకు చెందిన దాదాపు 800 మంది నేతలు, అధికారులు హాజరయ్యారు.

## మహిళల అపహరణ, హత్యలు

ఇరాక్‌లోని మోసుల్ ప్రాంతంలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు 19 మంది మహిళల్ని హత్య చేశారు. మహిళల చేత వ్యభిచారం చేయించేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించడంతో ఉగ్రవాదులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇరాక్‌లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులు మహిళల్ని బలవంతంగా వ్యభిచారంలోకి దింపుతున్నారని కుర్దీశ్ డెమోక్రటిక్ పార్టీ మీడియా ప్రతినిధి ఒకరు ఐక్యరాజ్య సమితికి వివరాలు అందజేశారు. అలాగే, సిరియాలోని హోమ్స్ ప్రావిన్స్‌లో ఐఎస్ తీవ్రవాదులు 230 మందిని అపహరించారు. పామీరా నగరానికి సమీపంలోని అల్‌క్వారియాటైన్ పట్టణంలో ఈ సంఘటన జరిగింది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు.

## అఫ్ఘనిస్తాన్‌లో వరుస దాడులు

అఫ్ఘనిస్తాన్‌లో వరుస బాంబు దాడులతో దేశం అతలాకుతలం అవుతోంది. ఆగస్టు 6న తూర్పు లాగర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల దగ్గర జరిగిన ఆత్మాహుతి దాడిలో ఎనిమిది మంది మరణించారు. పన్నెండు మంది గాయపడ్డారు. ఆగస్టు 7న రాజధాని కాబూల్‌లో జరిగిన కారు బాంబు దాడిలో యాభై మంది మరణించారు. దాదాపు నాలుగు వందల మందికి పైగా గాయపడ్డారు. ఆగస్టు 8న కుందుజ్ ప్రావిన్స్ ఖాన్ అబాద్ జిల్లాలో కారు బాంబు పేలి 22 మంది మరణించారు. మరో సంఘటనలో నంగార్‌హర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వ దళాలు జరిపిన డ్రోన్ దాడుల్లో ఇరవై ఐదు మంది తాలిబ న్లు మరణించారు. ఆగస్టు 10న రాజధాని కాబూల్‌లోని విమానాశ్రయం ప్రవేశద్వారం వద్ద కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, పదిహేడు మంది గాయపడ్డారు.

## బంగ్లాదేశ్‌లో బ్లాగర్ హత్య

బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ తీవ్రవాదులు మరో బ్లాగర్‌ను హత్య చేశారు. ఆగస్టు 7న రాజధాని ఢాకాలోని ఒక బిల్డింగ్‌లోని ఐదవ అందస్తులో నివసించే నీలోయ్ నీల్ అనే సెక్యులర్ బ్లాగర్‌ను ఇస్లామిక్ తీవ్రవాదులు మారణాయుధాలతో దాడి చేసి చంపేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఇస్లామిక్ తీవ్రవాదులు నలుగురు బ్లాగర్‌లను హతమార్చారు.

## మాలిలో దాడి

మాలీ రాజధాని బొమాకోలోని బైబ్లాన్ హోటల్‌పై ఉగ్రవాదులు దాడి చేశారు. ఆగస్టు 7న జరిగిన ఈ దాడిలో పన్నెండు మంది మరణించారు. మృతుల్లో ఐక్యరాజ్య సమితి ప్రతినిధి ఒకరు ఉన్నారు. ఉగ్రవాదులు కొంతమందిని బందీలుగా పట్టుకున్నారు.

## ఇరాక్‌లో దాడులు

ఇరాక్‌లో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) తీవ్రవాదుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. ఆగస్టు 9న మోసుల్ నగరంలో 300 మంది ప్రభుత్వ ఉద్యోగుల్ని ఐఎస్ తీవ్రవాదులు కాల్చి చంపారు. వీరంతా ఆ దేశ ఎన్నికల కమిషన్‌లో ఉద్యోగులు కాగా, వారిలో యాభై మంది మహిళలు ఉన్నారు. మరో సంఘటనలో ఆగస్టు 11న డియాలా ప్రావిన్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడుల్లో నలభై మంది మరణించారు. వంది మంది వరకు గాయపడ్డారు.

## ఫెర్గూసన్‌లో మళ్లీ ఎమర్జెన్సీ

అమెరికాలోని ఫెర్గూసన్ నగరంలో జాతి వివక్షకు వ్యతిరేకంగా ఆగస్టు 9న నల్లజాతీయుల నిరసన ప్రదర్శలు చేపట్టారు. ప్రదర్శన అనంతరం జరిగిన పరిణామాలు హింసాత్మకంగా మారడంతో కౌంటీ అధికారులు ఎమర్జెన్సీ విధించారు. ఏడాది క్రితం ఫెర్గూసన్ ప్రాంతంలో మైఖేల్ బ్రౌన్ అనే 18 ఏళ్ల నల్లజాతి యువకుడిని డేరెన్ విల్సన్ అనే తెల్ల పోలీస్ అధికారి కాల్చి చంపిన సందర్భంగా ఈ నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నల్ల జాతీయుడొకరు కాల్పులు జరపగా పోలీసుల ఎదురు కాల్పుల్లో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన అనంతరం ఆగస్టు 10న పలుచోట్ల నిరసన ప్రదర్శలు హింసాత్మకంగా మారాయి. దాంతో ఫెర్గూసన్‌తో పాటు సెయింట్ లూయిస్ శివారు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు.

## మయన్మార్‌లో వరదలు

మయన్మార్‌లో ఆగస్టు మొదటి వారంలో వచ్చిన భారీ వరదలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. భారీ వర్షాలు, వరదల తాకిడికి వంద మంది మరణించారు. దాదాపు ఒక మిలియన్ ప్రజలు వరదల బారిన పడ్డారు. కొన్ని వేల మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు.

## నైజీరియాలో బాంబు పేలుడు

నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో సబోన్‌గారి పట్టణంలో ఆగస్టు 11న జరిగిన బాంబు దాడిలో యాభై మంది చనిపోయారు. మరో యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. బొకోహారం తీవ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లుగా అధికార వర్గాలు తెలిపాయి. రద్దీగా ఉండే మార్కెట్ ప్రదేశంలో ఈ దాడి జరగడంతో మృతుల సంఖ్య భారీగా నమోదయింది.

## చైనా పారిశ్రామిక వాడలో ప్రమాదం

ఉత్తర చైనాలోని షియాజిన్ రేవు పట్టణ సమీపంలోని పారిశ్రామిక వాడలో ఆగస్టు 12న రాత్రి రెండు భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో ఎనభై ఐదు మంది మరణించారు. ఏడు వందల మందికి పైగా గాయపడ్డారు. విషపూరితమైన రసాయనాలు, గ్యాస్‌ను నిల్వచేసే షిప్పింగ్ యార్డ్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పేలుళ్ల తర్వాత విషపూరితమైన పొగ వెలువడడంతో సహాయక సిబ్బందికి తీవ్ర విఘాతం కలిగింది. మంటలను ఆర్పే ప్రయత్నంలో 21 మంది అగ్నిమాపక సిబ్బంది కూడా మరణించారు.

## గ్రీస్ ప్రధాని రాజీనామా

మూడో బెయిలవుట్ ప్రణాళికను గ్రీస్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బెయిలవుట్ ప్యాకేజీతో 13 బిలియన్ యూరోలు గ్రీస్‌కు అందుతాయి. 300 మంది సభ్యులు గల పార్లమెంట్‌లో ఈ ఉద్దీపనకు అనుకూలంగా 222 మంది ఎంపిలు ఓటేయగా, 64 మంది వ్యతిరేకించారు. వ్యతిరేకించిన వారిలో ప్రధాని సిప్రాస్ సొంత పార్టీ వారే 40 మంది ఉన్నారు. సొంత పార్టీ నుంచే వ్యతిరేకత రావడంతో ప్రధాని అలెక్సీ సిప్రాస్ ఆగస్టు 20న గ్రీస్ అధ్యక్షుడు ప్రోకోపిస్ పావ్‌లోపౌలోస్‌కు తన రాజీనామాను అందజేశారు. సాధ్యమైనంత త్వరలో ఎన్నికలు జరపవలసిందిగా కోరారు.

## శ్రీలంక ప్రధానిగా విక్రమసింఘే

శ్రీలంక పార్లమెంట్‌కు ఆగస్టు 17న జరిగిన ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 70 శాతం పోలింగ్ జరిగింది. ఫలితాల్లో యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) మిత్ర పక్షాలు ఆధిక్యం సాధించడంతో ప్రస్తుత ప్రధాని రణిల్ విక్రమ సింఘే ఆగస్టు 21న మరోసారి బాధ్యతలు స్వీకరించారు. 196 స్థానాలకు జరిగిన పోటీ ఫలితాలు ఆగస్టు 18న వెలువడ్డాయి. ఇందులో యుఎన్‌పి 93 స్థానాలు, యుపిఎఫ్ఎ 83 స్థానాలు సాధించాయి. దీంతో యుఎన్‌పికే మరోసారి అధికారం దక్కింది. వీ

# అసహజ మరణాల సూచి


సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

**(ఆగస్టు 1 నుండి ఆగస్టు 31, 2015 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (985), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (1150) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 2135)**

| జిల్లా | ఆకలి | ఆత్మహత్యలు | | | | చికిత్స అందక, అనారోగ్యం | | | గుర్తు తెలియని | | హత్యలు | | ప్రమాదాలు | | | | పోలీసు కాల్పుల్లో | | పోలీసులు, సైన్యం | మిస్సింగ్/ లాకప్ మరణాలు | ప్రకృతి వైపరీత్యాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | వ్యవసాయ రంగం | చేనేత రంగం | ఇతరాలు | | | | | | | | | పనిచేసే స్థలంలో | కరెంట్ | రహదారి | ఇతరాలు | ఉద్యమ కారులు | ఇతరులు | | | |
| | | | | స్త్రీ | పు. | స్త్రీ | పు. | పి. | స్త్రీ | పు. | స్త్రీ | పు. | | | | | | | | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) | (13) | (14) | (15) | (16) | (17) | (18) | (19) | (20) | (21) | (22) |
| ఆదిలాబాద్ | 1 | 4 | – | 17 | 19 | 12 | 9 | 12 | 3 | 3 | 4 | 2 | – | 1 | 32 | 30 | – | – | – | 2 | 3 |
| హైదరాబాద్ | – | – | – | 7 | 6 | – | – | – | – | 3 | 1 | 11 | – | 1 | 26 | 7 | – | – | – | 6 | – |
| కరీంనగర్ | – | 3 | 2 | 8 | 5 | 3 | 6 | – | 1 | 1 | 4 | 3 | – | 5 | 25 | 14 | – | – | – | – | 2 |
| ఖమ్మం | – | – | – | 9 | 9 | 11 | 13 | – | – | 1 | – | – | – | 3 | 21 | 31 | – | – | – | – | – |
| మహబూబ్‌నగర్ | 3 | 5 | 7 | 18 | 11 | 1 | 2 | – | 1 | 1 | 9 | 23 | 14 | 18 | 59 | 4 | – | – | – | – | 14 |
| మెదక్ | 5 | 4 | 5 | 13 | 13 | 4 | 2 | 12 | 2 | 2 | 2 | 4 | 5 | 2 | 19 | 32 | – | – | – | 2 | 3 |
| నల్గొండ | – | – | – | 10 | 8 | 3 | 7 | 3 | 1 | 4 | 2 | 5 | 2 | 3 | 27 | 11 | – | – | – | – | – |
| నిజామాబాద్ | – | – | – | 3 | 4 | 2 | 2 | – | – | 2 | 3 | 4 | 1 | 3 | 24 | 5 | – | – | – | – | 2 |
| వరంగల్ | – | 2 | – | 5 | 13 | 2 | 5 | – | – | – | – | 1 | – | 4 | 24 | 5 | – | – | – | – | 6 |
| రంగారెడ్డి | – | 3 | – | 5 | 2 | 4 | 3 | – | – | 4 | 2 | 1 | – | – | 18 | 9 | – | – | – | – | 3 |
| **తెలంగాణ** | **9** | **21** | **14** | **95** | **90** | **42** | **49** | **27** | **8** | **21** | **27** | **54** | **22** | **40** | **275** | **148** | **-** | **-** | **-** | **10** | **33** |
| అనంతపురం | – | 11 | 1 | 16 | 14 | 3 | 4 | 5 | 2 | 3 | 4 | 12 | 3 | 4 | 26 | 3 | – | – | – | – | – |
| చిత్తూరు | – | – | – | 2 | 4 | 2 | 5 | 6 | – | – | 1 | 3 | – | 4 | 22 | 11 | – | – | – | – | – |
| కడప | – | – | – | 4 | 7 | – | – | 4 | 4 | 1 | – | 3 | – | 4 | 30 | 3 | – | – | – | – | 6 |
| గుంటూరు | – | 2 | – | 7 | 4 | – | 2 | 1 | – | 1 | 7 | 2 | 1 | 5 | 56 | 15 | – | – | – | – | – |
| కృష్ణా | – | 1 | – | 4 | 3 | – | 5 | – | – | 3 | 4 | 6 | – | 4 | 31 | 13 | – | – | – | – | – |
| కర్నూలు | – | 5 | 1 | 7 | 4 | 7 | 5 | 5 | 3 | 2 | 3 | 5 | 9 | 7 | 21 | 18 | – | – | – | – | 2 |
| తూర్పు గోదావరి | – | 1 | – | 6 | 6 | 7 | 6 | 2 | – | 1 | – | 5 | 1 | 4 | 67 | 66 | – | – | – | – | – |
| ప్రకాశం | – | – | – | 2 | 4 | – | 3 | – | – | 2 | – | 3 | – | 5 | 12 | 16 | – | – | – | – | – |
| శ్రీకాకుళం | – | 1 | – | 3 | 5 | 6 | 6 | 1 | – | 10 | 3 | 2 | 5 | 1 | 13 | 10 | – | – | 1 | – | 18 |
| పశ్చిమ గోదావరి | – | – | – | 4 | 3 | 3 | 5 | – | 2 | 4 | 1 | 5 | 1 | 6 | 29 | 16 | – | – | – | – | – |
| నెల్లూరు | – | – | – | 5 | 7 | 3 | 6 | – | 2 | 5 | – | 5 | – | 9 | 18 | 21 | – | – | – | – | 7 |
| విజయనగరం | – | – | – | 2 | 7 | 1 | 5 | – | – | – | 2 | 1 | 1 | 4 | 11 | 9 | – | – | – | – | – |
| విశాఖపట్నం | – | – | – | 2 | 7 | 2 | 4 | – | 1 | 4 | – | 2 | 4 | 7 | 40 | 26 | – | – | – | 12 | 7 |
| **ఆంధ్రప్రదేశ్** | **-** | **21** | **2** | **64** | **75** | **34** | **56** | **24** | **14** | **36** | **25** | **54** | **25** | **64** | **376** | **227** | **-** | **-** | **1** | **12** | **40** |

# నెరవేరిన వాగ్దానాలు
# వెల్లడైన ఫలితాలు



### ప్రధానమంత్రి జనధన్ యోజన

**వాగ్దానం**

'దేశంలోని అత్యంత పేద పౌరులకు బ్యాంకు ఖాతా సౌకర్యం ఉండాలని నా కోరిక'

**కార్యరూపం**

2014 ఆగస్టు 28న ప్రధానమంత్రి జనధన్ యోజన ప్రారంభం. 17 కోట్ల పైన బ్యాంక్ ఖాతాలు తెరవడం. జూలై 29, 2015 నాటికి రు. 20,000 కోట్ల పైన జమ.

### మేక్ ఇన్ ఇండియా

**వాగ్దానం**

'రండి, భారత్‌లో నిర్మించండి', 'రండి, భారత్‌లో తయారు చేయండి' అని 'ప్రపంచ ప్రజలకు నా విన్నపం'.

**కార్యరూపం**

2014 సెప్టెంబర్ 25న మేక్ ఇండియా కార్యక్రమం ప్రారంభం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 48 శాతం పెరుగుదల. పెట్టుబడుల గమ్యంగా భారత్‌కు మొదటిస్థానం ఇచ్చిన బేస్‌లైన్ ప్రాఫిటబిలిటీ సూచి 2015

### స్వచ్ఛ భారత్

**వాగ్దానం**

'పేదవారిని గౌరవించాలి. అది స్వచ్ఛత నుంచి మొదలవుతుంది. నేను అక్టోబర్ 2 నుంచి నాలుగు సంవత్సరాల పాటు 'క్లీన్ ఇండియా' క్యాంపెయిన్ మొదలు పెట్టబోతున్నాను.'

**కార్యరూపం**

అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ ప్రారంభమయింది. 2019 నాటికి భారత దేశం శుభ్రపడుతుంది. దేశ వ్యాప్తంగా పాఠశాలలన్నిట్లో మరుగు దొడ్ల నిర్మించే మహత్తర లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకోబోతోంది.

### డిజిటల్ ఇండియా

**వాగ్దానం**

'దేశంలోని ప్రతి ఒక్క పౌరుడిని ఒకరితో ఒకరికి అనుసంధానం చేసే శక్తి ఇన్ఫర్మేషన్ టెక్నాలజికి ఉంది. డిజిటల్ ఇండియా సహాయంతో ఈ ఐక్యతా మంత్రాన్ని సఫలం చేస్తాం.'

**కార్యరూపం**

2015 జూలై 1న డిజిటల్ ఇండియా కార్యక్రమం ప్రారంభమయింది. ఇది జాతి యావత్తుకు డిజిటల్ అనుసంధానాన్ని పెంచుతుంది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను పెంచి దిగుమతులను తగ్గిస్తుంది.

### స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్

**వాగ్దానం**

'నైపుణ్యాల అభివృద్ధి', 'నైపుణ్య వంతమైన భారతదేశం' అనేదే మన కర్తవ్యం కావాలి. లక్షలాది భారతీయ యువత నైపుణ్యాలను సాధించేందుకు ముందుకు కదలాలి.

**కార్యరూపం**

2015 జూలై 15న స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ ప్రారంభమయింది. రానున్న ఏడు సంవత్సరాలల్లో 40 కోట్ల భారతీయులకు నైపుణ్యంలో శిక్షణ దొరుకుతుంది.

davp 22202/13/0034/1516

69 వ స్వాతంత్ర్య దినోత్సవం

15 ఆగస్టు, 2015

ప్రధానితో సంభాషణకు — Narendra Modi, Prime Minister of India — www.pmindia.gov.in

ప్రధానితో అనుసంధానానికి — /Narendramodi

వార్తలకు, అభిప్రాయాలకు — www.narendramodi.in

భావాలు పంచుకోవడానికి — myGOV — www.mygov.in

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ

భారత ప్రభుత్వం

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 170 - September 2015 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/8/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16


Date of Posting : 29th, 30th

# ‘వీక్షణం’ను ఆదుకుందాం
# ‘వీక్షణం’ నాలుగు కాలాల పాటు నిలిచేందుకు చేయూతనిద్దాం

తెలుగులో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రిక ఉండాలనే ఆలోచనతో, సీనియర్ పాత్రికేయులు వి. హనుమంతరావు సంపాదకులుగా 2003లో ప్రారంభమై, 2005 నుంచి ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో నడుస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక ‘వీక్షణం’ తెలుగు సమాజానికి అవసరమైన చర్చావేదికగా పనిచేస్తున్నదని, మనందరితో పాటు ఎందరో పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నదని మనకు తెలుసు. పదమూడు సంవత్సరాలుగా నిరంతరాయంగా నడుస్తున్న ఈ పత్రిక ఆర్థిక పరిస్థితి ఇప్పటికీ దినదిన గండంగానే ఉంటున్నది. ఎప్పుడు ఆగిపోతుందో తెలియదని దాదాపు ప్రతినెలా పత్రికలో అచ్చవుతున్న ఆందోళనాకరమైన ప్రకటన, ఈ పత్రికను నిలబెట్టడానికి తోడ్పడమనే అభ్యర్థనలు మా ఈ బహిరంగ ప్రకటనకు కారణం. ఇంతకాలంగా నిర్వాహకులు కష్టనష్టాలు భరిస్తూ సాగించిన కృషికి ఇప్పుడు మన సహకారం అవసరమని చెప్పడానికే ఈ ప్రకటన.

‘వీక్షణం’ ఈ పదమూడు సంవత్సరాలలో మూడువేలకు పైగా వ్యాసాలను ప్రచురించి ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ అంశాలెన్నిటి పైననో తెలుగు సమాజానికి అత్యవసరమైన సమాచారాన్నీ, వివరణలనూ, విశ్లేషణలనూ అందించింది. సంపాదకుడి అభిప్రాయాలే వైనప్పటికీ, తెలుగు సమాజంలో ఉన్న ప్రగతిశీల భావాలకూ, ధోరణులకూ అన్నిటికీ ప్రజాస్వామిక స్ఫూర్తితో వేదిక కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు సంపాదించి పరిశోధక విద్యార్థులకు, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు అవకాశాలు కల్పించింది. ప్రతి సంవత్సరం రచయితల సమావేశాలు, సంభాషణలు ఏర్పాటు చేసి తెలుగు సమాజంలో సామాజిక శాస్త్ర రచనను ప్రోత్సహించింది. వ్యాసరచనా అధ్యయన తరగతులు నిర్వహించి వ్యాసప్రక్రియ ప్రమాణాలు పెంచడానికి తన వంతు కృషి చేసింది. పత్రికలో లబ్ధప్రతిష్ఠుల రచనలు ప్రచురించడంతో పాటు, విషయమే ప్రధానంగా ఐదారు వందలమంది కొత్త వ్యాసకర్తలకు అవకాశం కల్పించింది. ‘ఒక దళారీ పశ్చాత్తాపం’ వంటి విస్తృత ప్రచారం పొందిన పుస్తకంతో సహా దాదాపు డజను పుస్తకాలు ప్రచురించింది.

తెలుగు సమాజానికీ, మేధో ప్రపంచానికీ, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణకూ ఇంత దోహదం చేసిన ‘వీక్షణం’ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఆ దీపం కొడిగట్టిపోకుండా కాపాడడం సమాజం బాధ్యత. ఇతోధిక పాఠకులను తయారు చేయడం, విరివిగా చందాలు చేర్పించడం, వ్యాపార ప్రకటనలు సేకరించిపెట్టడం, విరాళాలు అందించడం మన కనీస కర్తవ్యం. ‘వీక్షణం’ శ్రేయోభిలాషి, చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ‘వీక్షణం’ రచయితల సమావేశాల్లో సూచించినట్టుగా ఆర్థిక ఇబ్బందుల నుంచి సుస్థిరమైన పద్ధతిలో గట్టెక్కాలంటే ‘వీక్షణం’కు ఒక మూలనిధి కూడ ఏర్పాటు చేయవలసి ఉంది. మనంతట మనం మన శక్తి మేరకు గాని, విరాళాలు ఇవ్వగలిగిన మిత్రుల ద్వారా గాని ఈ మూలనిధి విరాళాలు సేకరించి మనందరికీ, మొత్తంగా సమాజానికీ అవసరమైన ‘వీక్షణం’ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికను కాపాడుకుందాం. ఈ చైతన్యజ్వాల ఆరిపోకుండా మన రెండు చేతులూ అడ్డుపెట్టి వెలుగు నిరంతరం ప్రసరించనిద్దాం.



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao